# శిఖామణి సాహిత్యం-దళిత దృక్పథం

పిహెచ్.డి. పట్టా కొరకు హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత వ్యాసం


పరిశోధన

**గుర్రం మాధవరావు**

పర్యవేక్షణ

**ఆచార్య జి. అరుణకుమారి**

**తెలుగు శాఖ**

**మానవీయశాస్త్ర విభాగం**

**హైదరాబాద్ విశ్వవిద్యాలయం**

**హైదరాబాద్**



**జూన్ 2014**

# SIKHAMANI SĀHITYAM-
# DALITA DRUKPATHAM

A Dissertation submitted to the University of Hyderabad
in Partial Fulfilment of the Degree of

DOCTOR OF PHILOSOPHY
IN
TELUGU


RESEARCH BY
**GURRAM MADHAVARAO**

SUPERVISOR
**Prof. G. ARUNA KUMARI**

Department of Telugu
School of Humanities
University of Hyderabad
Hyderabad - 500 046


JUNE - 2014

# CERTIFICATE

This is to certify that dissertation entitled 'SIKHAMANI SĀHITYAM-DALITA DRUKPATHAM' submitted by GURRAM MADHAVARAO bearing Reg. No. 09HTPH16 in fulfilment of the requirements for the award of Doctor of philosophy in Telugu is a bonafide work carried out by this under my our supervision and guidance.

This dissertation has not been sumbmitted previously is part or in full to this or any other university or Institution for the award of any degree or diploma.

Signature of the Supervisor

// Counter Signed //

Head of the Department

Dean of the School

# DECLARATION

I GURRAM MADHAVARAO hereby declare that this dissertation entitled 'SIKHAMANI SĀHITYAM-DALITA DRUKPATHAM' submitted by me under the guidance and Supervision of Prof. G. ARUNA KUMARI is a bonafide research work. I also declare that it has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma.

Name : Gurram Madhava Rao

Date : Signature of the Student

Reg. No: 09HTPH16

# కృతజ్ఞతలు

జన్మనిచ్చి, నా చదువులోనే తమ జీవితాన్ని చూసుకున్న నా తల్లిదండ్రులు శ్రీమతి గుర్రం సుబ్బమ్మ శ్రీ కోటయ్యలకు ప్రత్యేకంగా...

విశ్వవిద్యాలయ స్థాయిలో పరిశోధన చేసే అవకాశం కల్పించిన ప్రధాన కారకులు దళితుల ఆశాజ్యోతి, భారతరత్న డా.బి.ఆర్.అంబేద్కర్‌కు...

పరిశోధనకు అవకాశం కల్పించిన హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి, తెలుగు శాఖ వారందరికీ కృతజ్ఞతలు.

ఈ పరిశోధనకు పర్యవేక్షణ వహించిన మాతృమూర్తి, సహనశీలి నన్ను తన సొంత బిడ్డలాగా ఆదరించిన ఆచార్య జి.అరుణకుమారి గారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

తెలుగు శాఖ ప్రస్తుత అధ్యక్షులు మాతృమూర్తి ఆచార్య శరత్‌జ్యోత్స్నారాణిగారికి, ఆచార్య బేతవోలు రామబ్రహ్మంగారికి, ఆచార్య ఎన్.ఎస్.రాజుగారికి, ఆచార్య తుమ్మల రామకృష్ణ గారికి, ఆచార్య రేమిల్ల వెంకటరామకృష్ణశాస్త్రిగారికి, డా.పిల్లలమర్రి రాములుగారికి, డా. దార్ల వెంకటేశ్వరరావుగారికి, డా. విజయలక్ష్మిగారికి, డా. పమ్మి పవన్‌కుమార్‌గారికి, డా.భుజంగరెడ్డిగారికి, డా.విజయకుమారి గారికి, డా. రాజశేఖర్‌గారికి...

నా పరిశోధనకు అవసరమైన గ్రంథాలను అందించడమే కాకుండా కనిపించిన ప్రతిసారి ఎంతో ఓపికతో విలువైన సూచనలు, సలహాలు అందించిన సాహితీమూర్తి ఆచార్య శిఖామణిగారికి...

నా ఆప్తమిత్రులు కృష్ణారావు, కొండలరావు, హరిబాబు, సుబ్బారావు, మాణిక్యాలరావు, త్రినాథ్, ధనరాజు, నాగేశ్వరరావులకు ...

నా స్నేహితులు రమేష్, ప్రభాకర్, రమణ, ఉమ, అశోక్, భానునాయక్, హరిబాబు, రాజీవ్‌బాబు, విజయ్, రవి, ధాక్కన్న, సిద్ధార్థ్, సింగారావు, రామకృష్ణ, బాలకృష్ణ, ప్రకాష్, భాస్కర్, రాజశేఖర్, హనుమంతు, బాలకోటేష్, శంకర్, సోమయ్య, శ్రీను, నాగరాజు, సాంబ, మధు, బాలకృష్ణ, మల్లి, గౌరి, అంజి, హనుమంతు, మాల్యాద్రి, సలోమన్, గోపి, నరసింహం, భాషా, మాధవరావు, శ్యామ్, బాబ్జి, ప్రకాష్, వెంకటేశ్వర్లు, శ్రీహరి, కిట్టన్న, ప్రతాప్, సరస్వతి, వెంకటరావు, నారాయణ, బ్రహ్మయ్య, శ్రీకాంత్, యాసిన్ సురేష్, రాఘవరావు, శ్రీను, దత్తు, వేణు, కొండయ్య, గోవిందబాబు, రాంబాబు, మా అన్నయ్యలు గోవిందయ్య, యలమంద...

శ్రీనివాసరావు, అన్కిరెడ్డి, హెచ్.ఎన్.శర్మ, అన్సార్‌బేగం, సాబీర్, గురవారెడ్డి గార్లకు...

మా అక్కలు– లచ్చుమ్మ, అంకమ్మ, శింగమ్మ, వరమ్మ, లక్ష్మీకాంతం, అంజమ్మ, చెల్లెళ్ళు: నారాయణ, వరదమ్మ, మాధవి, వరలక్ష్మి, సుభాషిణి, వదినలు శివ, ఆదిలక్ష్మి, లక్ష్మీకాంతం; బావలు వెంకటేశ్వర్లు, ప్రసాద్, అంకయ్య, నరసింహం, శ్రీను, శంకర్, విజయ్.. మరదళ్లు పద్మ, ఉమ, కోటి, సౌజన్య, రేణుకలకు...

నా ఊపిరికి ప్రాణం పోసే నా ప్రాణసఖి నా సహధర్మచారిణి డా.తిరుపతికి ప్రత్యేకంగా నా వారసులు చిరంజీవి మైథిలీ దిమహి అలియాస్ అరుణశ్రీలకు, నా వారసుడు చి॥శ్రీశశాంక్ మాధవ్, అజయ్, అపర్ణ, అఖిల్, శ్రీదేవి, జ్యోతిలకు...

సోదర సమానులు యలమందారెడ్డిగారు, కృష్ణమోహన్, సుబ్బయ్య, జానీబాషా, మస్తాన్‌బాషా, పిచ్చయ్య, శ్రీనివాసరావు, సందానిబాషా, పార్థు, రమేష్, దుర్గాప్రసాద్ గార్లకు...

నన్ను ఆప్యాయంగా పలకరించే నూర్జహాన్, స్వర్ణలత, రియాజ్ ఉన్నీసా, దుర్గమ్మ, ఎ.వి.కె.వల్లీదేవి, భాను గార్లకు...

భవానీశంకర్, రాంబాబు, కిషన్‌లకు....

డి.టి.పి.చేసిన భాస్కర్ (మను గ్రాఫిక్స్)గారికి కృతజ్ఞతలు.

# ముందుమాట

హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో ఎం.ఎ. తెలుగు చదివేటప్పుడు సాహిత్యంలోని వివిధ అంశాలపట్ల సంఘర్షణ కలిగేది. భారత దేశంలో కులం దాని ఆధారంగా చేసుకొని జరుగుతున్న సంఘర్షణలే యూనివర్సిటీలో చూడగలిగాను. నా జీవితంలో కూడా అనేకమైన అనుభవాలు దళిత సాహిత్యాన్ని అధ్యయనం చేసేటట్లు ప్రేరేపించాయి. ఒకవైపు సంప్రదాయ సాహిత్యం, దానిలోని భావజాలాన్ని వ్యతిరేకిస్తూ కొన్నివాదాలు వచ్చాయి. ఆ వాదాలలో దళిత సాహిత్యం ఒకటి. చిన్నప్పటి నుండి అంబేద్కర్ భావజాలాన్ని చదువుకోవటం వలన దళిత సాహిత్యంపట్ల ఆకర్షితుడైనాను. దళిత సాహిత్యంలో కృషిచేస్తున్న వారిలో శిఖామణి ఒకరు. వీరి సాహిత్యాన్ని అధ్యయనం చేస్తే బాగుంటుందని ఆలోచించి Ph.D.లో చేరాను. నా అభిప్రాయాలకు సూపర్‌వైజర్ ఆమోదాన్ని తెలిపారు. ఈ అంశాన్ని హైదరాబాద్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ వారు కూడా అంగీకరించారు.

నా పరిశోధనను 'శిఖామణి సాహిత్యం–దళిత దృక్పథం'నకు పరిమితం చేసుకున్నాను. పరిశోధన సౌలభ్యంకోసం ఐదు అధ్యాయాలుగా విభజించాను.

మొదటి అధ్యాయం 'శిఖామణి జీవితం–రచనల పరిచయం'లో వీరి పుట్టుక, బాల్యం, విద్యాభ్యాసం, ఉద్యోగం, నిర్వహించిన పదవులు, పొందిన అవార్డులు, వచన కవిత్వం, విమర్శ వ్యాసాలు, పీఠికలను పరిశీలించాను.

రెండవ అధ్యాయం 'శిఖామణి సాహిత్యం–సమీక్ష'లో వీరి కవిత్వ గ్రంథాలైన మువ్వల చేతికర్ర, హోరుగాలి, చిలక్కొయ్య, కిర్రుచెప్పుల భాష, నల్లగేటూ నందివర్ధనం చెట్టు, తవ్వకం, గిజిగాడు. ఇంకా విమర్శనాగ్రంథాలైన దళిత సాహిత్య తత్వం, వివిధ, సమాంతర గ్రంథాలను పరిశీలించాను.

మూడవ అధ్యాయం 'దళిత సాహిత్యం–దృక్పథం, పరిణామం'లో దళిత శబ్దం, దళిత సాహిత్యం అంటే ఏమిటి? దళితులంటే ఎవరు? దళిత సాహిత్యం ఎప్పుడు ఆవిర్భవించింది? చారిత్రక నేపథ్యం, ఎలా పరిణామం చెందింది? దళిత సాహిత్య ప్రక్రియల పరిచయం, దళిత సాహిత్యానికి కృషి చేసిన వివిధ కవులు, రచయితలు మొదలైన విషయాలను పరిశీలించాను.

నాల్గవ అధ్యాయం 'శిఖామణి సాహిత్యం–దళిత దృక్పథం'లో కవిత్వం, విమర్శ, పీఠికల నందు దళిత దృక్పథం, దళిత ఉద్యమ చైతన్యం మొదలైన విషయాలు సమగ్రంగా పరిశీలించాను.

ఐదవ అధ్యాయం 'శిఖామణి సాహిత్యం–విమర్శకుల అభిప్రాయాలు'లో దళిత సాహిత్యానికి శిఖామణి ఎన్నో సంవత్సరాల నుండి చేస్తున్న కృషికి అనేకమంది మేధావుల, విమర్శకుల అభిప్రాయాలను పరిశీలించాను.

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| ముందుమాట | | i-ii |
| విషయ సూచిక | | iii-viii |
| **అధ్యాయం - 1** | | |
| **శిఖామణి జీవితం - రచనల పరిచయం** | | **1-15** |
| 1.1 | పరిచయం | 1-2 |
| 1.2 | పుట్టుక - విద్యాభ్యాసం | 2-3 |
| 1.3 | ఉద్యోగం - జీవితం | 3-4 |
| 1.4 | సాహిత్య పరిచయం | 4 |
| 1.4.1 | కవిత్వం | 4-7 |
| 1.4.2 | విమర్శ | 7-9 |
| 1.4.3 | పీఠికలు | 9 |
| 1.5 | అనువాదాలు | 9 |
| 1.6 | సంపాదకత్వం | 10 |
| 1.7 | పరిశోధన పర్యవేక్షణ | 10 |
| 1.8 | సాహిత్య గౌరవాలు - పురస్కారాలు | 10-12 |
| 1.9 | వ్యక్తిత్వం | 12-14 |
| | పాదసూచికలు | 15 |
| **అధ్యాయం - 2** | | |
| **శిఖామణి సాహిత్యం-సమీక్ష** | | **16-46** |
| 2.1 | కవిత్వం | 16 |
| 2.1.1 | మువ్వల చేతికర్ర | 16-20 |

| | | |
|---|---|---|
| 2.1.2 | హోరుగాలి | 20-22 |
| 2.1.3 | చిలక్కొయ్య | 22-24 |
| 2.1.4 | కిర్రుచెప్పుల భాష | 24-28 |
| 2.1.5 | నల్లగేటూ నందివర్ధనం చెట్టు | 28-32 |
| 2.1.6 | తవ్వకం | 32-35 |
| 2.1.7 | గిజిగాడు | 35-38 |
| 2.2 | విమర్శ | 39 |
| 2.2.1 | దళిత సాహిత్య తత్వం | 39-40 |
| 2.2.2 | వివిధ | 40-42 |
| 2.2.3 | సమాంతర | 42-45 |
| | పాదసూచికలు | 46 |

**అధ్యాయం - 3**

| | | |
|---|---|---|
| **దళిత సాహిత్యం-దృక్పథం, పరిణామం** | | **47-83** |
| 3.1 | దళిత శబ్దం | 47 |
| 3.1.1 | తెలుగు సాహిత్యంలో 'దళిత' ప్రస్తావన | 47 |
| 3.2. | దళితులంటే ఎవరు | 48 |
| 3.2.1 | దళిత సాహిత్య నిర్వచనం | 48-49 |
| 3.3 | దళిత సాహిత్యం - దృక్పథం | 50-52 |
| 3.4 | దళిత సాహిత్యం -పరిణామం | 52 |
| 3.4.1 | పూర్వరంగం | 52 |
| 3.4.2 | తెలుగు సాహిత్యంలో కుల ప్రస్థావన | 52-53 |
| 3.4.3 | ఉద్ధరణ చైతన్యం | 53-56 |
| 3.4.4 | సామాజిక నిరసన చైతన్యం | 57-59 |
| 3.4.5 | సైద్ధాంతిక ప్రతిఘటనా చైతన్యం | 59-61 |

| | | |
|---|---|---|
| 3.4.6 | దళిత ఉద్యమ చైతన్యం | 61-64 |
| 3.5 | దళిత సాహిత్యం - ప్రక్రియల పరిచయం | 64 |
| 3.5.1 | కావ్యం | 64-66 |
| 3.5.2 | శతకం | 66-68 |
| 3.5.3 | కవిత్వం | 68 |
| 3.5.3.1 | గేయ కవిత్వం | 68-69 |
| 3.5.3.2 | వచన కవిత్వం | 69-70 |
| 3.5.4 | నాటకం | 70-71 |
| 3.5.5 | నవల | 72-75 |
| 3.5.6 | విమర్శ | 75-80 |
| | పాదసూచికలు | 81-83 |
| **అధ్యాయం - 4** | | |
| **శిఖామణి సాహిత్యం - దళిత దృక్పథం** | | **84-147** |
| 4.1 | **కవిత్వం** | 85 |
| 4.1.1 | సామాజిక అవమానాల్ని నిరసించటం | 85-90 |
| 4.1.2 | ఆత్మాభిమానాన్ని ప్రకటించు కోవడం | 90-92 |
| 4.1.3 | వర్ణాధిపత్యాన్ని ప్రశ్నించటం | 92-95 |
| 4.1.4 | ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడం | 95-102 |
| 4.1.5 | దళిత కళాతత్త్వం | 102-108 |
| 4.1.6 | దళిత సాంస్కృతిక చిహ్నాం | 108-110 |
| 4.1.7 | దళిత స్మృతి | 111-114 |
| 4.1.8 | దళిత స్త్రీ చైతన్యం | 114-121 |
| 4.1.9 | దళితుల దాడులపై నిరసన | 121-122 |
| 4.1.10 | దళితుల స్థానం | 122-123 |

| | | |
|---|---|---|
| 4.1.11 | దళితీకరణం | 123-125 |
| 4.1.12 | పశ్చాత్తాప నివేదన | 125-128 |
| 4.2 | **విమర్శ - దళిత దృక్పథం** | 128-129 |
| 4.2.1 | దళిత ఉద్యమ చైతన్యం | 129 |
| 4.2.1.1 | తెలుగులో దళిత దీర్ఘ కవితలు | 129-130 |
| 4.2.1.2 | దళిత కవిత్వం - భాష | 130-133 |
| 4.2.1.3 | దళిత కథ | 133-135 |
| 4.2.1.4 | దళిత సాహిత్యం - పాట | 135-136 |
| 4.2.1.5 | దళిత సాహిత్య వైతాళికుడు కుసుమ ధర్మన్న కవి | 136-139 |
| 4.2.1.6 | తొలి దళిత స్త్రీవాద కవిత్వం | 139-141 |
| 4.3. | **పీఠికలు** | 141 |
| 4.3.1 | దళిత సంస్కృతి | 141 |
| 4.3.2 | సామాజిక నిరసన చైతన్యం | 141-142 |
| 4.3.3 | ప్రతిఘటనా చైతన్యం | 142 |
| 4.3.4 | ఉద్యమ చైతన్యం | 142-143 |
| 4.3.5 | ఉద్ధరణ చైతన్యం | 143 |
| | పాదసూచికలు | 144-147 |
| **అధ్యాయం - 5** | | |
| **శిఖామణి సాహిత్యం-విమర్శకుల అభిప్రాయాలు** | | **148-158** |
| 5.1 | డా. సి.నారాయణరెడ్డి | 148 |
| 5.2. | ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం | 148 |
| 5.3. | చేకూరి రామారావు | 148 |
| 5.4. | ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య | 148 |
| 5.5. | ఆచార్య కొలకలూరి ఇనాక్ | 149 |

| | | |
|---|---|---|
| 5.6. | డా. కత్తిపద్మారావు | 149 |
| 5.7. | డా. ఎండ్లూరి సుధాకర్ | 149 |
| 5.8. | డా. కడియాల రామమోహనరాయ్ | 149 |
| 5.9. | డా. నాగభైరవ కోటేశ్వరరావు | 149 |
| 5.10. | ఆర్.ఎస్. సుదర్శనం | 150 |
| 5.11. | డా. ఆవంత్స సోమసుందర్ | 150 |
| 5.12. | డా. అద్దేపల్లి రామమోహనరావు | 150 |
| 5.13. | ఇస్మాయిల్ | 150 |
| 5.14. | వేగుంట మోహనప్రసాద్ | 151 |
| 5.15. | శివసాగర్ | 151 |
| 5.16. | ఆచార్య సి.సుబ్బారావు | 151 |
| 5.17. | డా. సంజీవ్‌దేవ్ | 151 |
| 5.18. | ఆచార్య తుమ్మల వేణుగోపాలరావు | 151–152 |
| 5.19. | చలసాని ప్రసాద్ | 152 |
| 5.20. | బాలబంధు బి.వి.నరసింహారావు | 152 |
| 5.21. | ఇంద్రగంటి శ్రీకాంతశర్మ | 152 |
| 5.22. | అత్తలూరి నరసింహారావు | 152 |
| 5.23. | ఆచార్య జయధీర్ తిరుమలరావు | 152 |
| 5.24. | డా. తల్లావఝుల పతంజలి శాస్త్రి | 153 |
| 5.25. | డా. సీతారాం | 153 |
| 5.26. | వడలి మందేశ్వరరావు | 153 |
| 5.27. | జి.లక్ష్మీనరసయ్య | 153 |
| 5.28. | డా. అఫ్సర్ | 154 |
| 5.29. | డా. ప్రసాదమూర్తి | 154 |

| | | |
|---|---|---|
| 5.30. | డా. పి.వి.రమణ | 154 |
| 5.31. | దాట్ల దేవదానం రాజు | 154-155 |
| 5.32. | కలేకూరి ప్రసాద్ | 155 |
| 5.33. | మద్దూరి నగేష్‌బాబు | 155 |
| 5.34. | ఖాజా | 155 |
| 5.35. | వరవరరావు | 155 |
| 5.36. | పడాల జోగారావు | 155 |
| 5.37. | జి.ఆర్.కుర్మే | 156 |
| 5.38. | డా. ఉదారి నారాయణ | 156 |
| 5.39. | గుర్రం శ్రీరాములు | 156 |
| 5.40. | వి.వి.సుబ్బరాజు(రతన్‌బాబు) | 156 |
| 5.41. | డా. చప్ప సూర్యనారాయణ | 156 |
| 5.42. | సి హెచ్.రాం | 157 |
| 5.43. | డా. పిల్లి శాంసన్ | 157 |
| 5.44. | ఆప్త చైతన్య | 157 |
| 5.45. | డా. ఎల్.కె.సుధాకర్ | 157 |
| | పాదసూచికలు | 158 |
| | **ఉపసంహారం** | 159-160 |
| | **ఉపయుక్త గ్రంథసూచి** | 161-167 |
| | **అనుబంధం :** | **168-193** |
| | **1. ఇంటర్వ్యూలు** | 168-170 |
| | **2. కవితలు** | 171-193 |

అధ్యాయం - 1

# శిఖామణి జీవితం-
# రచనల పరిచయం

## అధ్యాయం - 2

# శిఖామణి సాహిత్యం- సమీక్ష

అధ్యాయం - 3

# దళిత సాహిత్యం- దృక్పథం, పరిణామం

అధ్యాయం - 4

# శిఖామణి సాహిత్యం-
# దళిత దృక్పథం

అధ్యాయం - 5

# శిఖామణి సాహిత్యం-
# విమర్శకుల అభిప్రాయాలు

# ఉపసంహారం

# ఉపయుక్త గ్రంథ సూచి

# అనుబంధం

## 1.1 పరిచయం

**వ్య**క్తి సమాజంలో ఒక భాగం. వ్యక్తికి సమాజానికి అవినాభావ సంబంధం ఉన్నది. అరిస్టాటిల్ చెప్పినట్లు సమాజంతో సంబంధం లేనటువంటి వ్యక్తి దేవుడైనా అయ్యి ఉండాలి లేక దెయ్యమైనా (జంతువు)అయ్యి ఉండాలి అన్న వాక్యాలు పై సంబంధాన్ని తెలియజేస్తాయి. సాహిత్యాన్ని సృష్టించేవాడు సమాజంలో ఒక భాగం మాత్రమే. పుట్టిన ప్రతి మనిషి పైన సమాజంలోని అనేక అంశాల ప్రభావం ఉంటుంది. అవి పరిసరాలు, తల్లిదండ్రులు, మిత్రులు, పుస్తకాలు మొ॥నవి కావచ్చు. మనిషి భౌతికంగా ఎదగడానికి ఆహారం ఎంత అవసరమో అలాగే మానసిక ఎదుగుదలకు పైవన్ని అవసరమవుతాయి. సాహిత్యం అనేది మానసిక స్థితికి సంబంధించినది. ప్రత్యేకమైన మానసికస్థితి ఉన్నప్పుడే రచయిత రచన చేయగల్గుతాడు. సమాజంలో తాను చూచిన ఇతివృత్తాలను, తన జీవితంలో జరిగిన సంఘటనలను, అనుభవాలను ఇతివృత్తంగా తీసుకొని తన ప్రతిభ ద్వారా రచయిత రచనలు చేస్తాడు. సాహిత్యాన్ని సమాజం నుండి వేరుచేసి చూడలేము. అలాగే సమాజానికి సాహిత్యం వల్ల ప్రయోజనం ఉంది.

**"ఏ కవికైనా సరే అతని చుట్టూ ఒక సమాజం ఆ సమాజానికొక చరిత్రా, ఆ చరిత్రకొక పరిణామం ఉంటాయి. సామాజిక చారిత్రక పరిణామం గమనంలో కవి యొక్క సాహిత్యస్థానం నిర్ణీత మౌతుంది. కవి ప్రగతిశీల, ప్రతిభాశాలీ అయితే ఆ గమనాన్ని అతడు మరింత వేగవంతం చేస్తాడు. అందువలన తప్పకుండా రచయిత రచనలను సంపూర్ణంగా పరిశీలించాలంటే తన పుట్టిన కుటుంబ స్థితిగతులు, పెరిగిన సామాజిక పరిస్థితుల అవగాహన తప్పనిసరి."**[1]

అందువలన రచయితల రచనలను అధ్యయనం చేయాలంటే అతని జీవిత విషయాలను కొంతవరకైనా తెలుసుకోవలసిన ఆవశ్యకత ఉన్నది. కావున శిఖామణిగారి

రచనలు పరిశీలించడానికి ముందు స్థూలంగా ఆయన జీవిత విశేషాలను తెలుసుకోవాలి.

శిఖామణి సాహిత్యంలో వస్తున్న ప్రతి మంచి మార్పుకు స్పందిస్తున్నారు. ఈక్రమంలో చాలా రచనలు చేసారు. ఒక కవిగా, రచయితగా, విమర్శకుడిగా, పరిశోధకుడిగా సమర్ధవంతంగా అనేక రచనలు చేశారు. వీరు దళిత రచయితగా గుర్తింపు ఉన్నప్పటికీ సమాజానికి సంబంధించిన అనేక అంశాలతో రచనలు చేశారు. కళ్ళముందు జరుగుతున్న వాస్తవిక జీవిత విషయాలే వీరి రచనల యందు కనబడతాయి. చెప్పదలచుకున్న అంశం సూటిగా చెప్పడం వీరి ప్రత్యేకత.

## 1.2 పుట్టుక - విద్యాభ్యాసం

శిఖామణి అసలు పేరు కర్రి సంజీవరావు. కలం పేరు శిఖామణి. ఈయన ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా యానాంలో 1957 అక్టోబర్ 30వ తేదీన ఆదిలక్ష్మి, సూర్యనారాయణ దంపతులకు చివరిబిడ్డగా జన్మించారు. వీరికి ఒక అక్క పార్వతి, ఇద్దరు అన్నయ్యలు శివాజీరావు, దుర్గారావు ఉన్నారు.

బాల్యం కొందరికి ఎంత ఆనందంగా జరుగుతుందో అంత విషాదంగా కూడా నడుస్తుంది. ఆ కొందరిలో సంజీవరావుగారు ఒకరు. ఈయన పుట్టిన మూడునెలలకే అమ్మ ఆదిలక్ష్మిగారు చనిపోయారు. ఆ బిడ్డ తల్లిప్రేమకు దూరమై ప్రేమానురాగాలను పంచుకోలేకపోయిన దురదృష్టవంతుడు. అప్పుడు తండ్రి తన కష్టాలను తన కడుపులోనే దాచుకొని బొంబాయిలో ఉద్యోగం చేస్తూ బిడ్డల ఆలనాపాలనా చూసుకోవడానికి తన స్నేహితుడైన శిఖామణిగారికి అప్పగించి బిడ్డలందరిని ఉన్నత చదువులు చదివించారు.

శిఖామణి గారి బాల్యం అంతా యానాంలో గడిచింది. వీరు ఐదవతరగతి వరకు యానాంలోని ప్రాథమిక పాఠశాలలో చదివారు. హైస్కూల్ విద్య కూడా యానాంలోని మహాత్మాగాంధీ ప్రభుత్వ పాఠశాలనందు చదివారు. ఇంటర్మీడియట్ కూడా యానాంలో పూర్తిచేశారు. పిఠాపురం రాజావారి కళాశాల, కాకినాడ నుంచి బి.ఎ (1977-80) పట్టభద్రులయ్యారు. బి.ఏలో ఉన్నప్పుడే చిన్న చిన్న కథలు, కవితలు రాయటం

ప్రారంభించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఎ. (1980–82) తెలుగు పూర్తి చేశారు. 1985 నుండి 1991 వరకు 'ప్రయోగవాది పఠాభి' అనే అంశంపై పరిశోధన చేసి ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పొందారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయం నుండి 2007లో "తెలుగు మరాఠి దళిత కవిత్వం–తులనాత్మక పరిశీలన' అనే అంశంపై రెండవ డాక్టరేట్ అందుకున్నారు.

## 1.3 ఉద్యోగం - జీవితం

శిఖామణిగారు పిహెచ్.డి. పూర్తిచేసిన వెంటనే శ్రీ పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు నందు తులనాత్మక అధ్యయన కేంద్రంలో 1991లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. ప్రస్తుతం ఇదే విశ్వవిద్యాలయం నందు ఆచార్యులుగా, కేంద్రాధిపతిగా పనిచేయుచున్నారు. కాలేజీ రోజుల నుంచి ప్రారంభమైన సాహిత్య వ్యాసాంగాన్ని నేటికీ కొనసాగిస్తున్నారు.

చిన్నప్పటినుండి ఎన్నో కష్టాలు ఎదురైన అధైర్యపడకుండా వాటిని ధైర్యంగా ఎదుర్కొంటూ ఉన్నత విద్యను అభ్యసించారు. ఉద్యోగం వచ్చిన తరువాత 1994 ఏప్రిల్‌లో శిఖామణిగారు కృష్ణవేణిని వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు సంతానం. ఒక కుమార్తె, ఒక కుమారుడు. వీరి సంతానమైన దుర్గేశనందిని, సూర్యతేజలు. ఇద్దరు ఉన్నతవిద్యను అభ్యసిస్తున్నారు.

దళిత కుటుంబంలో పుట్టి అనేక కష్టాలను ఎదుర్కొని ఇన్ని పురస్కారాలను పొందిన వీరి వ్యక్తిత్వం, ప్రవర్తన ఉన్నతమైనదని సౌభాగ్య మాటలే దీనికి ఉదాహరణ.

**"శిఖామణి ఒళ్ళంతా కళ్ళున్న కవి. అణువులతో అనుభూతుల్ని ఫోటోలు తీసి ఎన్‌లార్జ్ చేసి చూపి మనల్ని ఆశ్చర్యపరుస్తాడు. అతని కవితలు చదివి కన్నీళ్ళు పెట్టని వాడెవడయినా వుంటే వాడు కఠినాత్ముడయివుంటాడు.**

**'మో' అన్నట్లు అతను 'దీనదయాళుడు'.**

**పైకి అంత సౌమ్యుడుగా, నిరహంకారుడుగా కనిపించే శిఖామణి ఒక విషయంలో**

**తప్ప అంతరంగంలోనూ అలాంటి వాడే. ఆ ఒక్క విషయం అతని కవిత్వం. అతని కవిత్వం పట్ల అతనికి అంతులేని విశ్వాసం. కానీ, ఆ సంగతి ఎక్కడా ఎప్పుడూ ప్రదర్శించుకోడు. తన నమ్మకాన్ని ఇతరుల మీదా రుద్దడు. కానీ తన నమ్మకం కోట గోడల్ని ఎవర్నీ తాకనియ్యడు. ఇంత అనుభవ సాంద్రత కలిగి ఉన్న కవి అయినా తను వచ్చిన మూలాన్ని ఎన్నడూ మరచిపోలేదు."[2]**

## 1.4 సాహిత్య పరిచయం

శిఖామణి గారికి ప్రాచీన, ఆధునిక సాహిత్యాలపై అవగాహన ఉన్నది. కానీ వీరికి ఆధునిక సాహిత్యంపైనే మక్కువ ఎక్కువ ఉన్నట్లు తెలుస్తుంది. అందువలన వివిధ సాహిత్య ప్రక్రియలలో రచనలు చేశారు.

సమాజంలో తను నిత్యంచూస్తున్న అంటరానితనం, వర్గ సంఘర్షణలు మొదలైన సమస్యలను ఎప్పటికప్పుడు ఎదుర్కొంటూ ముందుకు నడిచిన వ్యక్తి కాబట్టే తన రచనలలో ఆ విషయాలను అంత బలంగా చిత్రీకరణ చేశాడని చెప్పవచ్చు.

వీరి రచనలు చాలావరకు తన జీవితానుభవాలనుంచి పుట్టినవే. అందువల్లే వీరి రచనలు వాస్తవికతకు దగ్గరగా ఉన్నాయి. వస్తువులో ఎక్కడా అభూత కల్పనలు కనపడవు. పాత్రలన్నీ నేటి సమాజ మూలాలనుంచి పుట్టినవే. వీరు ఏ రచన చేసినా సామాజిక దృక్పథమే.

### 1.4.1 కవిత్వం

శిఖామణిగారు 1970 నుండి కవిత్వం రాస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు 10 కవితా సంపుటాలు ప్రచురించారు. ఇందులో కొన్ని అనువాదాలు కూడా ఉన్నాయి.

### మువ్వల చేతికర్ర

ఈ కవితా సంపుటి శిఖామణి గారి మొట్టమొదటి కవితా సంపుటి ఈ సంపుటి రెండవ ముద్రణ కూడా పొందింది. ఇందులో నలభై నాలుగు కవితలున్నాయి. 1987 అక్టోబర్ 18న ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగుశాఖ నందు 'మువ్వల చేతికర్ర' కవితా

సంపుటి ఆవిష్కరించారు. ఈ గ్రంథాన్ని శ్రీమతి కందర్ప వెంకటనర్సమ్మగారికి అంకితం ఇచ్చారు. మొదటి ముద్రణకు ముందుమాట గురువర్యులు ఇస్మాయిల్‌గారు రాసారు. రెండవ ముద్రణకు ముందుమాట ఇంద్రగంటి శ్రీకాంత్‌శర్మగారు రాసారు.

## హోరుగాలి

ఈ కవితా సంపుటి 1988 జూలై నెలలో ఆవిష్కరించారు. ఈ హోరుగాలి కవిత ఆంధ్రజ్యోతి పత్రికలో వచ్చింది. ఈ కవితా సంపుటిని కర్రి సూర్యనారాయణగారికి అంకితం ఇచ్చారు. ఈ సంపుటికి 'గాలిహోరు' అనే పేరుతో ముందుమాట రాసినవారు డా. సంజీవ్‌దేవ్. ఎన్నో ఆలోచనలు, అనుభూతులు, కోరికలు, ప్రేమలు, ద్వేషాలు ఇందులో సృష్టించాడు.

## చిలక్కొయ్య

ఈ కవితా సంపుటి శిఖామణిగారి మూడవ సంపుటి. ముప్పైమూడు కవితలున్నాయి. 1987 నుండి 1993 వరకు రాసిన కవితలను ఇందులో పొందుపరిచారు. తన గురువైన శ్రీ అత్తలూరి నరసింహరావుగారికి ఈ కవితా సంపుటిని అంకితం ఇచ్చారు. ఈ సంపుటికి "మనవరాహ్వానం' పేరుతో చే.రా 'మాట-డైనమైట్' పేరుతో ఆర్.ఎస్.సుదర్శనం 'దీపశిఖ' పేరుతో సీతారం మొదలైనవారు ముందుమాటలు రాసారు. "చిలక్కొయ్య" కవితలో మానవత, అభ్యుదయం, తల్లిప్రేమ, దళిత దృక్పథం మొదలగు వస్తువైవిధ్యం కనబడుతుంది. దిసమొల, పూలకుర్రాడు, ప్రమిదకింద చీకటి, మానకూడని గాయంలాంటి మానవీయ కోణంగా ఉన్న కవితలు. విమానం కూల్చేపక్షి, నినాదం మొదలగు అభ్యుదయ వాదాన్ని తెలియజేసే కవితలు. దృశ్యం, ధ్వంసమైన వేళ, స్త్రీవాద మొదలైన కవితలు ఇందులో ఉన్నాయి.

## కిర్రుచెప్పుల భాష

శిఖామణి కవితా ప్రస్థానంలో కిర్రుచెప్పుల భాష కవితా సంపుటి ఒక ప్రత్యేక స్థానం సంతరించుకుంది. 1993 నుండి 2000 వరకు సమకూర్చిన 26 కవితలు ఈ సంపుటిలో

ఉన్నాయి. ఈ సంపుటిని దాట్ల దేవదానం రాజుగారికి ఈ గ్రంథాన్ని అంకితం ఇచ్చారు. "తుమ్మపువ్వు సౌందర్యం" అంటూ శివసాగర్, 'బహువచన భాష'గా ఆచార్య సి.సుబ్బారావు ముందుమాటలు రాసారు. ఈ కవితా సంపుటిలో కొంత దళిత కవిత్వం, మిగిలింది వ్యక్తిగత, సామాజిక కవిత్వం.

"కిర్రుచెప్పుల భాష" కవితా సంపుటిలో అవర్ణవం, క్షమాపణ రంగుల పిడకలు, నేత్రదానం, ఇనపపాళీలు మొలుచుకొస్తున్నాయి, చెలమ మొదలైన కవితలు దళిత కవిత్వం కోవకు చెందినవి. లాలస, నాయన, పిల్లలకోడి, తేనెపిట్ట, హాస్టల్ గది, ఆరిందా మొదలగునవి వ్యక్తిగత, సామాజిక కవిత్వంనకు చెందినవి.

ఈ కవితలో దళితులు అస్థిత్వాన్ని కోరుతూ, ప్రాచీన సాహిత్యాన్ని, ప్రాచీన కవితా ప్రతీకల్ని ప్రశ్నిస్తూ తీవ్రంగా విమర్శించారు. దళితుల అభివృద్ధిని కోరుతూ ప్రతిపాదనలు చేస్తూ బహుజనవర్గాల వాణిని బలంగా వినిపించారు.

## నల్లగేటూ నందివర్ధనం చెట్టు

ఈ కవితా సంపుటిలో 2000 నుండి 2005 వరకు రాసిన 45 కవితలు అచ్చయ్యాయి. అమ్మ ఆదిలక్ష్మిగారికి, తండ్రి కర్రి సూర్యనారాయణగారికి, శిఖామణి అంకులు గారికి అంటే తల్లిదండ్రులుగా పెంచిన అంకుల్‌కి ఈ కవితా సంపుటి అంకితం ఇచ్చారు. ఇందులో ఆత్మీయుల గురించి, పిల్లల గురించి అద్భుతమైన కవితలున్నాయి.

## తవ్వకం

ఈ కవితా సంపుటిలో 2005 నుండి 2009 వరకు రాసిన కవితల్ని పొందుపరిచారు. ముప్పై ఆరు కవితలున్నాయి. పద్మభూషణ్ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డిగారికి ఈ కవితా సంపుటిని అంకితం ఇచ్చారు.

స్పందన సాహిత్య విమర్శ వ్యాసాలు సంపుటి 2007లోని డా॥ వడలి మందేశ్వరరావు గారి వ్యాసం "మిసమిసలాడే శిఖామణి కవిత్వం"ను ఈ కవితా సంపుటి ముందు మాటగా వేశారు. ముప్పై మూడవ కవిత "తవ్వకం"ఈ సంపుటికి శీర్షికగా ఉంది.

### గిజిగాడు

గిజిగాడులో మొత్తం 35 కవితా ఖండికలున్నాయి. 2012లో ప్రచురించారు. వేగుంట మోహనప్రసాద్‌కు అంకితమిచ్చారు. 'గిజిగాడి పద్యంగూడు' పేరుతో కె.శ్రీనివాస్ ముందుమాట రాశారు.

### The Black Rainbow

కవితా సంపుటి శిఖామణి తెలుగులో రాసిన కవితలు. వీటిని కిరణ్మయి, డి.కేశవరావు, ఎం.శ్రీధర్, అల్లాడి ఉమ ఇంగ్లీషులోకి అనువదించారు. డా. బి.ఆర్.అంబేద్కర్‌కు ఈ కవితా సంపుటిని అంకితమిచ్చారు. ఇందులో 11 కవితలున్నాయి.

### 'ఘుంఘరూవాలీచడీ'

కవితా సంపుటి శిఖామణి తెలుగులో రాసిన కవితలు. వీటిని డా. ఎం.రంగయ్య హిందీలోకి అనువదించారు. దీనిని డా. సి.నారాయణరెడ్డికి అంకితమిచ్చారు.

## 1.4.2 విమర్శ

శిఖామణి 1987 నుండే కవిత్వం రాస్తున్నా విమర్శపై వ్యాసాలు మాత్రం కొంత ఆలస్యంగానే వచ్చాయి. మువ్వల చేతికర్ర, హోరుగాలి, చిలక్కొయ్య కవితా సంపుటాలు వెలువడి తెలుగు కవితా ప్రస్థానంలో తన దైనస్థానాన్ని సంపాదించుకున్నాక విమర్శపై దృష్టి సారించారు.

### దళిత సాహిత్య తత్త్వం

'దళిత సాహిత్యతత్త్వం' అనే మొదటి విమర్శ గ్రంథాన్ని 1998లో వెలువరించారు. దళిత సాహిత్యంలో వాదవివాదాల గురించి కొన్ని వ్యాసాలు రచించారు. దళిత సాహిత్యం దిశానిర్దేశాన్ని కోల్పోతున్న దశలో ఈ పుస్తకాన్ని వెలువరించారు.

తెలుగులో దళిత సాహిత్యంపై వెలువడిన వాదాలను లోతుగా పరిశీలించారు. కుల వివక్షపై సాగుతున్న అణచివేతలను కొత్త దృష్టికోణం నుంచి చూశారు. వీటిపై ప్రభావం చూపే తాత్వికతను గురించి విశదీకరించారు.

'ఒరే లంజకొడకా' తను రాసిన కవితను బట్టి దళిత కవిత్వ భాషలోను కొన్ని సమయాలలో శృతిమించిన వ్యాఖ్యలను వీరు సమర్థించారు. మనువులాంటి వారిపై విరుచుకుపడ్డారు.

వస్తువును దాటి రూపంపై దృష్టి పెట్టారు. దళిత కవిత్వం ప్రాచీన ప్రతీకలు, భాష, వ్యాకరణాలను, కళాతత్త్వాలను విశ్లేషించారు. ప్రాచీన భారత సౌందర్య శాస్త్రాన్ని భగ్నంచేసి దాని స్థానంలో దళిత సౌందర్య శాస్త్రాన్ని ప్రతిపాదించి దళిత కళాతత్త్వాన్ని పొందుపరచాలనేది వీరి ఆకాంక్ష.

దళిత కవిత్వంలో కన్పించిన స్వీయ ప్రతీకల్లో ఉండే సౌందర్యాత్మకతను వివరించారు. విప్లవ కవి శివసాగర్ ఉదయిస్తున్న సూర్యుడిని, మాదిగ దప్పుతో పోల్చిన తీరును కవి విశ్లేషించారు. దళిత కవి ఎండ్లూరి సుధాకర్ 'నీలిక', 'దాసుని చూడాలి' కవితల్ని పరామర్శించారు. దళిత కవికి నల్లరంగు సంకేతమని ప్రతిపాదించారు. వేముల ఎల్లయ్య కవితల్లో కన్పించిన దళిత క్రీడావర్ణనలోని కళాతత్త్వాన్ని వివరించారు.

## వివిధ

శిఖామణి గారి రెండవ విమర్శ గ్రంథం 'వివిధ'. ఈ గ్రంథం 1998లో ముద్రించబడింది. డా॥ఎన్.గోపిగారికి ఈ విమర్శ గ్రంథాన్ని అంకితం ఇచ్చారు. "శిఖామణికి చేరా స్వాగతం" అనే పేరుతో చేకూరి రామారావు గారు ముందుమాట రాశారు.

ఇస్మాయిల్ గారి మీద రెండు వ్యాసాలు రాశారు. ఒకటి ఆయన కవిత్వం మీద, మరొకటి ఆయన విమర్శమీద. వచన కవిగా చలం నేపథ్యంలో కవిత్వం గురించి చలం అభిప్రాయాలను క్రోడీకరించారు. ఇంకా రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ గారి కవిత్వం మీద ఈ రెండు వ్యాసాలలో వారి కవిత్వాలను పరిచయం చేశారు. పెద్దల కవిత్వంలో పిల్లలు, తెలుగులో హైకూ ప్రస్తావనలు మొదలైన అంశాలున్నాయి.

## సమాంతర

నవంబర్ 26, 2006న యానాంలో జరిగిన రజతోత్సవాల ప్రారంభ సభ సందర్భంగా 'మువ్వల చేతికర్ర' కవితా సంపుటి పునర్ముద్రణలో ఆధునిక కవిత్వ వ్యాసాల సంపుటి

'సమాంతర' వెలువరించారు. ఈ విమర్శ గ్రంథానికి కె.శ్రీనివాస్ సంపాదకులు. దీనిని యానాం పేద ప్రజల ఆశాజ్యోతి మరియు దళిత బహుజనులకు కొండంత అండగా ఉన్న మాజీ పౌర విమానయాన పర్యాటక శాఖామాత్యులు మాన్యశ్రీ మల్లాడి కృష్ణారావు గారికి అంకితం చేశారు. 'సమాంతర సందర్భం' అనే పేరుతో శిఖామణి మా మాటగా సాహితీ రజతోత్సవ ప్రచురణ కమిటీ, వివరణను కృతజ్ఞతలను తెలియజేశాడు. కె.శ్రీనివాస్ సంపాదకీయంలో 'మధురవిమర్శ' పేరుతో ముందుమాట రాశారు.

'ఇటీవలి తెలుగు కవిత్వం' మొదలుకొని "కుల వాస్తవికతను గుర్తించి శంబుకవిత్వం వరకు పదిహేను వ్యాసాలున్నాయి. ఆరు వ్యాసాలు దళిత వాదానికి చెందినవి. ఆరు వ్యాసాలు ఆయా కవుల గురించి ఉన్నాయి. ఈ వ్యాసాలు సుమారు దశాబ్దకాలంగా వివిధ సందర్భాలలో రాస్తూ వచ్చినవి. కొన్ని సాహిత్య సదస్సుల కోసం రాసినవి. మరికొన్ని ప్రత్యేక సందర్భాలకోసం, సంచికల కోసం రాసినవి. మరికొన్ని సాహిత్య సదస్సులకోసం రాసినవి. ప్రత్యేక సందర్భాలకోసం, సంచికల కోసం రాసినవి. ఇంకొన్ని ఆయా కవుల గురించి రాసినవి. శిఖామణి ప్రాథమికంగా కవి అయినప్పటికీ, విమర్శనారంగంలో కూడా ఎంతో కృషి చేశారు.

### 1.4.3 పీఠికలు

శిఖామణి దాదాపు 50 పీఠికలు వరకు రాశారు. వీటిలో కొన్ని దళిత దృక్పథానికి సంబంధించినవి ఉన్నాయి.

## 1.5 అనువాదాలు

కొన్ని కవితా సంపుటాలు హిందీ, ఇంగ్లీషు, తమిళం, కన్నడం, మలయాళం లోకి అనువాదమయ్యాయి. వీటి వివరాలు

1. మువ్వల చేతికర్ర
2. చిలక్కొయ్య
3. కొర్రు చెప్పుల భాష
4. ది బ్లాక్ రైన్ బో

## 1.6 సంపాదకత్వం

శిఖామణిగారు అనేక రచనలతో పాటు కొన్ని గ్రంథాలకు సంపాదకత్వం వహించారు. వాటి వివరాలు క్రింద ఇవ్వబడుతున్నాయి.

1. అమ్మ (కవితా సంకలనం)
2. తులనాత్మక సాహిత్యవ్యాసాలు (వ్యాస సంకలనం)
3. అర్థ శతాబ్దపు ఆంధ్ర కవిత్వం (విమర్శ)
4. తెలుగు ఏకాంక నాటక పరిచయం (విమర్శ)

## 1.7 పరిశోధన పర్యవేక్షణ

వీరి పర్యవేక్షణలో 15 మంది పిహెచ్.డి. 30 మంది ఎం.ఫిల్ పట్టా పొందారు.

## 1.8 సాహిత్య గౌరవాలు - పురస్కారాలు

## నిర్వహించిన పదవులు

1. 1996లో పి.ఎస్. తెలుగు యూనివర్సిటీ లిటరరీ అవార్డ్స్ పానెల్ మెంబర్.
2. 1996 నుండి 2000 వరకు పబ్లికేషన్ డివిజన్‌లో అడ్వైజరీ మెంబర్
3. 1999 నుండి 2000 వరకు యూనివర్సిటీ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ కమిటీ మెంబర్.
4. 1998లో నేషన్ కాంపిటీషన్ ఆఫ్ తెలుగు రైటింగ్స్ ఆన్ చిల్డ్రన్ లిటరేషన్ కన్‌డెక్టెడ్ బై ఎన్.సి.ఈ.ఆర్.టి.కి హైదరాబాద్‌లో మెంబర్
5. 2000లో యూనివర్సిటీ లైబ్రరీ అడ్వైజరీ మెంబర్
6. డైరెక్టర్ ఐ/సిగా
7. కన్వీనర్ బి.వి.ఎస్.పిగా
8. ఎస్సీ, ఎస్టీసెల్ సభ్యునిగా పదవులు అలంకరించారు.

## అవార్డులు

వీరి మొదటి కవితా సంపుటి 'మువ్వల చేతికర్ర' విశేషాదరణ పొందింది. ఈ కావ్య సంపుటి ద్వారా ఆరు అవార్డులను అందుకున్నారు.

1. మొదటిది 1987లో సమతా రచయితల సంఘం అవార్డు, అమలాపురం వారిచే.
2. రెండవది 1987 ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డు, హైదరాబాద్ వారిచే.
3. మూడవది 1989 ఉమ్మడిశెట్టి సాహితీ పురస్కారం, కడప వారించే.
4. నాల్గవది 1989 తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారం, హైదరాబాద్ వారిచే.
5. ఐదవది 1991 బులుసు సీతారామశాస్త్రి సాహితీ పురస్కారం, రాజమండ్రి వారిచే
6. ఆరవది 1996 గరికపాటి సాహితీ పురస్కారం, కాకినాడ వారిచే పొందారు.

   నల్లగేటు నందివర్ధనం చెట్టు' తన ఐదవ కవితా సంపుటి ద్వారా రెండు అవార్డులు అందుకున్నారు.

7. ఒకటవది 2007 సి.నా.రె. సాహితీ పురస్కారం, కరీంనగర్ వారిచే.
8. రెండవది 2007 నూతలపాటి గంగాధరం సాహితీ పురస్కారం, తిరుపతి వారిచే పొందారు.
9. 1997 రీజెన్సీ కళావాహిని యానాం, పురస్కారం యానాం వారిచే.
10. 2004 అధికార భాషా సంఘం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి భాషా పురస్కారం, హైదరాబాద్ వారిచే.
11. 2008 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సర్వధారి ఉగాది విశిష్ట పురస్కారం, హైదరాబాద్ వారిచే.

12. దేశంలోని విశిష్ట పురస్కారం కెనడా కేంద్రంగా పనిచేస్తున్న అంబేద్కర్ ఇంటర్నేషనల్ లిటరరీ అవార్డ్ 2009, న్యూఢిల్లీ వారిచే.

**'తవ్వకం'** కవితా సంపుటికి ఒక అవార్డ్ వచ్చింది.

13. దుర్గానంద్ అవార్డు 2009, హైదరాబాద్ వారిచే పొందారు.

ఇంకా వీరు విదేశీ పర్యటనలో భాగంగా లండన్ పర్యటన చేసారు.

## 1.9 వ్యక్తిత్వం

**"శిఖామణి పెరిగిన సమాజంలో ఒక ప్రక్క అంటరానితనం, మరొక ప్రక్క పేదరికం. ఇలాంటి సమస్యలతో సతమతమయిన కష్టాలను ధైర్యంగా ఎదుర్కొని ఉన్నత విద్యను అభ్యసించి గొప్ప కవిగా పేరు పొందారు. ఈయన రచనలు చదువుతున్నప్పుడు వీరు సమస్యలను దళిత, ఆర్థిక మూలాల నుండి అవగాహన చేసుకున్నట్లు తెలుస్తుంది. వీరి వ్యక్తిత్వం తెలుసుకునేందుకు ఇతని జీవిత సంఘటనలు తప్పక అవసరమవుతాయి. అమ్మా అని పిలిపించుకోకుండానే అమ్మయిన ఆదిలక్ష్మిగార్కి ఆయుష్షు తీరిపోయింది. పుట్టగానే బంగారం లాంటి తల్లిని చంపాడని ఇరుగూ పొరుగూ నిందలేస్తే, తను చచ్చిపోయి అమ్మబతికినా బాగుండును అని అమాయకంగా అనుకున్నారు సంజీవరావుగారు. అమ్మలేని ఒక కూతురు, ముగ్గురు కొడుకులకి చీకటే మిగిలింది. తన ఆత్మీయ స్నేహితుడైన శిఖామణిగార్కి తనకు ఏ ఒప్పుదలలు జరిగాయో పూర్తిగా తెలియదుగాని నాన్నగారైన సూర్యనారాయణగారు ఉద్యోగం కోసం బొంబాయి వెళ్ళారు. ఒంటరి వాడైన శిఖామణిగారు స్నేహితుని పిల్లల సంరక్షణ కోసం యానాం వెళ్ళారు. అక్కడనుంచి బొంబాయి డబ్బు యానాంకి నెలనెలా దిగుమతి అవుతూ ఉండేది. ఇక్కడ శిఖామణిగారని ప్రేమలో ఎదుగుతూ ఉన్నారు. అప్పుడప్పుడు అతిథి తండ్రి వచ్చి పర్యవేక్షిస్తూ వున్నారు. అమ్మస్థానం పొందిన శిఖామణి గార్ని చిన్నప్పుడు సంజీవరావుగారు నిజంగానే అమ్మ అని పిలిచేవారు.[3]**

ఇలాంటి సంజీవరావుగారు మొదట 'లావణ్య' పేరుతో రచనలు చేసేవారు. అమ్మలా పెంచినా శిఖామణిగారు మరణించినప్పుడు ఆయన జ్ఞాపకార్థం 'లావణ్య' పేరును వదిలేసి శిఖామణి పేరుతో రచనలు చేయటం ప్రారంభించారు.

**"యానాంలో తెలుగు లెక్చరరయిన నరసమ్మగారితో, ఇంటరు చదువుతున్న సంజీవరావుగార్కి పరిచయమయింది. రాసిన కవితలు నరసమ్మగారు దగ్గరకు వెళ్తూ వుండేవి. ఇచ్చిన సలహాలు సంజీవరావుగారి దగ్గరకు వస్తూ వుండేవి. నరసమ్మగారి తిట్లు, దీవెనలు, ప్రోత్సాహాలు, ఆప్యాయతలు సంజీవరావు గార్కి తెలుగు చదివే పట్టుదల కలిగించాయి. నరసమ్మగారి ఇంట్లో బిడ్డగా పెరిగిన సంజీవరావుగాక్కి సమస్యల్లోను ఆవిడే పెద్ద దిక్కు. అన్ని విషయాల్లోను ఆవిడే లైట్‌హవుస్.**[4]

చదువుకునే రోజులలో అమ్మలాగ ఆదరించిన కందరప్ప వెంకట నరసమ్మగార్కి 'మువ్వల చేతికర్ర' కవితా సంపుటిని అంకితం ఇచ్చి ఆమె రుణాన్ని కొంతవరకు తీర్చుకున్నారు. తన కవితా జీవిత యాత్రలో దారి చూపిన దీపాలు అయిన కందర్ప వెంకటనరసమ్మ, ప్రొ॥అత్తలూరి నరసింహారావు, డా॥సి.నారాయణరెడ్డిగార్లును ఎప్పుడూ తమ జీవితంలో స్మరిస్తూ ఉన్నారు. సహాయం చేసిన వారిని ఎన్నటికీ మర్చిపోని గొప్ప హృదయం వీరిది. ఎంత ఎదిగిన ఒదిగి ఉండే గుణం వీరిది. ఈవిధంగా వీరి జీవితంలోని అనేక సంఘటనలు వీరి వ్యక్తిత్వాన్ని తెలియజేస్తాయి.

ఇలాంటి సంఘటనలే ఈయన రచనలో కనిపిస్తాయి. శిఖామణి ఉపాధ్యాయ వృత్తిలో చాలా సంవత్సరాలుగా పనిచేయుచున్నారు. వీరిపై విద్యార్థులకు గౌరవము, భక్తి. ఆయనకు విద్యార్థుల పట్ల అపారమైన ప్రేమ, వాత్సల్యం. ఇది ఉపాధ్యాయునిగా ఆయన వ్యక్తిత్వాన్ని తెలియజేస్తాయి. ఈయన మానవతావాది.

దళిత సాహిత్యం వెలువడకముందే కవిగా సాహిత్యరచన ప్రారంభించి మానవతావాద, స్త్రీ,మైనారిటీ వాద సాహిత్యాలను ఆహ్వానిస్తున్న కవిగా, రచయితగా శిఖామణి గారిని

చెప్పవచ్చు. మారుతున్న కాలంతో పాటు మారుతున్న సాహిత్య భావజాలానికి  అనుగుణంగా తనూ మారుతూ తనకంటూ  ఒక ప్రత్యేక సాహితీ వ్యక్తిత్వాన్ని రూపొందించుకున్నారు.

శిఖామణి జీవితం రచనల పరిచయం తెలుసుకున్న తర్వాత శిఖామణి సాహిత్యంను సమీక్ష చేయటం అవసరం. అందువలనే తర్వాతి అధ్యాయంలో శిఖామణి సాహిత్యాన్ని సమీక్షించాను.

## పాద సూచికలు

1. రవీంద్రబాబు.ఎ, కొలకలూరి ఇనాక్ రచనలు–వస్తురూప పరిశీలన, పుట: 5,6
2. సౌభాగ్య, శిఖామణి కవిత్వం–తాత్విక సౌందర్యం, పుట: vi
3. శిఖామణి, మువ్వల చేతికర్ర, పుట: xxix
4. శిఖామణి, మువ్వల చేతికర్ర, పుట: xxx

**ఆ**ధునిక తెలుగు కవిత్వంలో స్థానం సంపాదించుకున్న వారిలో శిఖామణి ఒకరు. తెలుగు వచన కవిత్వంలో 'చిక్కని అంశాల్ని అనుభవాల్ని కవిత్వీకరించిన కొత్త కవుల్లో శిఖామణి గట్టి కవి' అని చేకూరి రామారావు గారు ప్రశంసించారు. ఈ కవి రాసిన కవితా సంపుటాలు, విమర్శ గ్రంథాలనున సమీక్షించాల్సి అవసరం ఉంది.

## 2.1 కవిత్వం

### 2.1.1 మువ్వల చేతి కర్ర

తెలుగు సాహిత్యానికి పరిచయం చేసి, తనకు పేరు తెచ్చిపెట్టిన మొదటి కవితా సంపుటి మువ్వల చేతికర్ర. చుట్టూ ఉన్న పరిసరాలతోనే కవిత్వం రాసారు. ఈయన కవిత్వంలో ముందుగా అమ్మ కనబడుతుంది. శిఖామణి అమ్మ చిన్నతనంలోనే మరణించింది. తన తల్లిని ఎరగడు, చూడని అమ్మని తలచుకుంటూ మనస్సుతో దృశ్య చిత్రీకరణ చేసిన కవిత అమ్మ.

కవి స్వగ్రామం యానాం. యానాం చుట్టూ సముద్రం. అందుచేతనే సముద్రం తన కవితలో అక్కడక్కడ కనిపిస్తుంది. చుట్టూ ఉన్న ప్రకృతిని భావించిన పద్ధతి మనల్ని ఆకర్షిస్తుంది. 'కొయ్యకాలు' అనే ఖండికలో నగరం రద్దీలో ఈ రోడ్డుమీద నేను, నా కొయ్య కాలుంది, కాలు పోగొట్టుకోక మునుపే ఏ అడవో ఈ చెట్టును పోగొట్టుకుందంటాడు. అడవుల్లోని కలపంతా జైళ్లకోసం, తుపాకీల కోసం ఖర్చయి పోతున్న నా దేశంలో కనీసం కొయ్యకాలైన నాలాంటి కాళ్లులేని వాళ్ల కోసం కొయ్యను ఉత్పత్తి చేయమని నా కొయ్యకాలును ప్రార్థిస్తాను అంటాడు.

'బాధలచెట్టు' కవితలో కవి చెట్టు గురించి తెలుపుతూ, దాని వేళ్లు ఎంత బలంగా ఉంటాయో దాని బిగుళ్లు, కొమ్మలు అంతే బలంగా ఉంటాయని చెబుతూ, ఇక్కడ చెట్టుకు, మాట్లడటం, పాడడం, నవ్వడం, ఏడ్వడం అన్నీ వచ్చి అది జీవితాన్ని ఊపేస్తుందంటాడు.

'నేను మానవున్ని' కవితలో నాగరికత నేర్చిన మానవున్ని అనుమానం పెనుభూతంగా పీడిస్తుందంటాడు. నా జ్ఞానేంద్రియాలు సాక్ష్యం పలుకుతున్న వాటి మీద నమ్మకం కుదరటం లేదు. పరిచయస్తుడు ఎదురుబడితే, సంచిలో నుండి ఒక నవ్వును తీసి పెదాలకు అతికించుకొని నవ్వుతారు. అవతలి వ్యక్తి హాయిగా నవ్వేసాడని అన్నారు.

'తప్పిపోయిన పాట' ఖండికలో లోకం నాకెందుకని చూస్తూ దాని దారిలో అదే వెళ్లిపోతున్నప్పుడు తప్పిపోతాడు. 'చిట్టి నా బాల్యం' కవితలో తగలబడిపోతున్న అడవి నుండి పక్షులు పారిపోతున్నట్లు, కుళ్లుతున్న సమాజం నుండి బాలలు మురుగు కాల్వల వెంట, పెంటకుప్పల వెంట పారిపోతున్నారని, ఈ ఇరుకు వ్యవస్థలో బాలలు ఇమడలేక పోతున్నారన్నారు. 'మహాశూన్యం' ఖండికలో నాకు నేను కనిపిస్తున్నట్టే కనిపించి నాకు నేనే అదృశ్యమై పోతున్నాను అంటూ, నన్ను నేను తెలుసుకున్నట్టే భ్రమించి నన్ను నేను కోల్పోతుంటానంటున్నారు. ఒక్కోసారి మహానదిగా మారుతూ అప్పుడప్పుడు ఒకటీ అరా కలల నౌకలు నిశ్శబ్ధంగా నా మది నుండి జారుకుంటూ నన్ను రెండుగా చీల్చుకుంటూ, ఆ వెనకనే నేను మళ్లీ ఒక్కటై పారుతుంటాను అంటారు.

'వొంగిన ఆకాశం' కవితలో ఎక్కడ ఏ వనంలో ఏ కోయిల ఎలుగెత్తి కూసిందో, ఇక్కడ నా కుటీరంలో ద్వారాలు, కిటికీలు చిగురుస్తున్నాయని, ఎక్కడ ఏ అరణ్యంలో ఏ వెదురుపొద గాలికి తలూపిందో ఇక్కడ ఏమీ రాయకుండానే నా కాగితాలు పులకించి పాడుతున్నాయన్నారు. 'కుట్ర' కవితలో అర్థరాత్రి ఆకాశం చీకటిగా వుంది. ఉన్నట్టుండీ చెట్లన్నీ నిశ్శబ్దంగా నడుస్తున్నాయి. పండుటాకులు కూడా శబ్దం చేయకుండా ఇష్టం లేక రాలకుండా కొమ్మలను అంటిపెట్టుకునే ఉన్నాయి. గాలి కూడా ఊపిరి బిగబట్టుకొని చూస్తూ వుండిపోయింది అని కవి భావన.

'చివరికి నెత్తుటి బొట్టు కూడా' అనే కవితలో నువ్వెందుకయ్యా బాధపడతావు. ఇక్కడ ఏదీ వృథాగా పుట్టలేదు. చివరికి కన్నీరు కూడా అని ప్రారంభించి యుద్ధంలో ఒక తల్లి కొడుకును పోగొట్టుకున్నంత మాత్రాన యుద్ధం ఆగలేదు. విజయాన్ని ఆపలేదు అంటూ

బ్రతికున్న ప్రతి వీరుడూ తన కొడుకే అన్నారు. 'ఇంకిన సరస్సు' ఖండికలో సరస్సు ఒడ్డునే ఇన్నాళ్లూ విలాసంగా కూర్చుని బాల్యపు గులకరాళ్లను విసిరాను. గుండ్రాతి గుండ్రంగా వలయం వెనుక వలయంగా అలలు ఒకదాని నొకటి తీసుకుంటూ యవ్వనపు ఒడ్డును తాకినప్పుడు ఎక్కడో మనసులో లోతుపొరను కన్నీటితెర మృదువుగా తడమడం చూసానని కవి యవ్వనదశను తెలియజేసాడు.

'కడుపుతో వున్న గాడిద' లో ఎప్పుడో ఒక రోజు ఈ గాడిద పెద్ద గుడ్డు పెడుతుంది. అది నేల మీద పడగానే ఈ విశ్వమంతా గుప్పెడు బూడిదైపోయిందని, శాంతి వైద్యులూ కదలిరండి ఈ గాడిదకు గర్భస్రావం చేయండి అంటాడు కవి. గర్భస్రావం చేయించండని, సమాజంలోని రుగ్మతలను నిర్మూలించమని కోరుతున్నారు.

'నిర్వికారం' కవితలో ఎంత వాస్తవికవాది కూడా తన నగ్నదేహాన్ని నిర్భయంగా చూసుకోలేడని, శరీరం తన సొంతమే అయినా ఏదో భయం, ఏదో పిరికి, ఏదో బెరుకు వున్నటువంటి ఒక్క ఆత్మ శరీరాన్ని కప్పుకుంది అంటారు. గంగిరెద్దు వారు ఎద్లకు మూపురాన్ని తగిలించి రంగురంగుల వలుముతో అలంకరించినట్లు ఆచ్ఛాదనలతో నింపుకుంటాడు మనిషి. భిక్షాటన పూర్తికాగానే ఎద్దును ఆరుబయటే వదిలేసి పెట్టుడు మూపురాన్ని, రంగుల వలువల్నీ తీసుకుని లోపలికి వెళ్లిపోతారు. స్వేచ్ఛ దొరికిన ఎద్దు కొంచెంసేపు విహారం చేసి వస్తుంది. ఆ రోజు కోరికలు ఆరోజే తీరిపోతాయని అన్నారు.

'ఒక స్పటికంలాంటి నవ్వు ఒక రంగుల కల' ఖండికలో తన జీవితం నుండి పెద్ద ఎక్కువేం ఆశించలేదు. ఒక స్పటికంలాంటి నవ్వు, ఒక రంగులకల తప్ప అని అంటారు. నేను చచ్చిపోగానే నన్ను చూడ్డానికి వచ్చిన వారంతా నా మొహం నవ్వుతూనే వున్నట్టు వుందన్నారు. నా మొహం ప్రశాంతంగా నిద్రపోతున్నట్టు వుందన్నారు. నిజమే మరి బ్రతికిన రోజుల్లో ఏ క్షణంలోనూ నవ్వడానికి అవకాశం, ఆస్కారం లేని వాణ్ణి అంటారు.

'ప్రవహిస్తున్న పాదాలు' కవితలో అవును ప్రవహిస్తేనే నువ్వైనా నేనైనా బ్రతికినట్టు అంటారు. అవును ఈ దేశంలో నదులన్నీ స్త్రీల కళ్ళలోకి ప్రవహిస్తున్నాయి. అడవుల్లోని

అగ్ని అంతా కూలివాని కడుపులోకి ప్రవహిస్తుంది. అరణ్యాలు ప్రవహిస్తాయి. ఉద్యమాల కెరటాలతో అంటూ, ఇక్కడ నీరూ, నిప్పూ ప్రవహిస్తుంది. ఒక్క మనిషి తప్ప అంటారు 'గది' ఖండికలో. రోజూ ఉదయం పదిగంటల సమయానికి ఆ నాలుగు ముచ్చటించు కుంటాయి. తాను ఏ అడవులనుండి వచ్చిందో ఎన్ని వసంతాలను చూసిందో, ఏఏ పక్షులకు ఆశ్రయమిచ్చిందో, అన్నీ చెప్తుంది మేజాబల్ల. తాను ఏ తోటలో పండిందో తనను ఎలా మెలిపెట్టి నూలుపోగులుగా లాగి ఎలా నేసారో వివరిస్తుంది టేబల్‌క్లాత్.

'రాత్రి నా మనోనేత్రం' కవితలో పైకి సర్వసామాన్యమైన పదంలాగే తోస్తుందని, చిక్కుపడిన దారపు కండెలా ఎంతసేపు లాగినా విడవడదని, కనబడటానికి మాత్రం రెండు కొసలూ కనబడతాయి. ఆ కొసలాగితే ఇటూ, ఈ కొసలాగితే అటూ బిగుస్తుంది. బొమ్మలతో ఆడి ఆడి అలసిపోయి ఆదమరచి నిద్రపోయే పిల్లాడిలా రాత్రితో ఆడి ఆడి తనకు తెలియకుండానే నిద్రపోయానంటాడు.

'బావి' కవితలో పడిపోయినంత సులభం కాదేమో లేవడం అంటారు. 'బ్రతికిన అక్షరాలు' కవితలో కవి నా కంటే ముందు, నా కంటే గొప్పగా ఎవరో చెప్పేసిన ఆ చచ్చు పద్యంకంటే ఆ మాటలే గొప్పవని చెప్పాడు. 'కీర్తి శేషులు' ఖండికలో మనిషి మీద మనిషికి నమ్మకం పోగొట్టినందుకు ఇక్కడ బ్రతికివున్న మనుషులు కూడా కీర్తిశేషులేనని కవి హేళనగా అన్నారు. 'నాలుగ్గదులు' కవితలో నాలుగో గదిని మాత్రం కాస్త కనిపెట్టి వుండమని హెచ్చరిక కనిపిస్తుంది.

'శాంతికోసం' కవితలో లోకం ఇంటి నుండి శాంతి అనే అమ్మాయి తప్పిపోయిందంటారు. 'హంస' కవితలో పాలను, నీరును వేరుచేసి హంస ఎటో ఎగిరిపోతుంది అన్నారు. 'అసలైనచెట్టు' ఖండికలో మనిషికి అక్షరజ్ఞానం వుంటే చెట్టొక తెరచిన పుస్తకం అంటాడు. నీ బొమ్మ నీవు నిర్భయంగా చూసుకోగలిగితే చెట్టొక నిలువుటద్దమని, చెట్టు మనిషికి ప్రతిరూపంగా చెబుతారు. నీలో స్పందన వుంటే చెట్టొక

పోటెత్తిన సముద్రమని, కేవలం కాండమూ కొమ్మలూ రెమ్మలూ పూలూ పండ్లూ ఇవే కనబడితే నీవు తప్పక సుయోధనుడవే అంటారు.

'తిరగబడ్డ రోడ్డు' కవితలో రోడ్డు నాకు తల్లియని, నా మానవ పాదాలను తన శిరస్సున మోస్తుందంటూ, సముద్రం నా స్నేహితుడని, అలలు నా ఆప్తబంధువులనీ అవి నాకు జీవితాన్ని నేర్పుతాయని, అలలు ద్వారా అలజడుల్ని నేర్పుతుందని, ఉప్పెనలా ఉప్పొంగడం నేర్పుతుందని అన్నారు. 'పురుగు' కవితలో నేడు గొంగళి పురుగులా నన్ను భయపెడుతున్న ఆ పురుగే రేపు సీతాకోకచిలుకై నన్ను తూనీగలు పట్టుకునే, చిన్న కుర్రాడిని చేసి, చెట్టు చెట్టుకూ తోట తోటకూ తన వెంట తిప్పుతుందంటారు. 'వాన' కవితలో కాలంలా ఇంద్రజాలంలా నింగి నుండి నేలకు వెండి దారాల తెర వేలాడదీసినట్టుగా వాన ఉంటుందని చెబుతూ ఎంతకీ తరగక ఎప్పటికీ ముగియక అదే పనిగ కురుస్తుంటే అంతా నా కోసమేనని సంబరపడటం కనిపిస్తుంది.

'వసంతం' కవితలో వసంతం అంటే ప్రతి చెట్టూ పూయడం, ప్రతి పక్షీ పాడడం అంటారు. వసంతం అంటే తుపాను నాటి సముద్రంలా మనస్సు ఉద్వేగంతో ఉరకలు వేయడం. వసంతం అంటే పేదరైతు కొత్త చొక్కా అంచులకు పసుపు పూలు పూయడమని, వసంతం అంటే నదికి వరద రావడం అన్నారు.

## 2.1.2 హోరుగాలి

'హోరుగాలి' కవితా సంపుటి శిఖామణి గారి రెండవ సంపుటి. శిఖామణి గారికి ఈ సంపుటి విడదీయరాని సంబంధమున్నది. అంతేకాకుండా అచ్చయిన తన మొదటి కవిత 'హోరుగాలి' కావడం ఒక విశేషం. తన అక్షరాన్ని ప్రప్రథమంగా అచ్చులో చూసుకున్న ఆనందాన్ని నేటికి పదిలపరిచిన కవిత ఇది.

'శ్రీశ్రీ' మినీ కవితలో చిన్నప్పుడు అక్షరం శ్రీకారం చేయించేటప్పుడు చిన్న పిల్లలకు తల్లిదండ్రులు పండితుని వద్దకు వెళ్లి 'శ్రీ' అని అక్షరాన్ని దిద్దిస్తూ వుంటారు. కానీ శిఖామణి మాత్రం రెండు శ్రీలు దిద్దించవలసిన అవసరాన్ని తెలియజేశారు.

'హోరుగాలి' ఖండికలో పసితనంలో ఆకలేసి తల్లిపాలిండ్లపై ఎగబడుతున్న బిడ్డను చందమామతో పోల్చాడు. 'తలలు' కవితలో ఆకలిగొన్న వ్యక్తికి ఎంతటి శక్తి కూడా నిలబడలేదని అల్పశక్తులు కూడా అగ్నిలా ఎగిసిపడాలని కోరటం కనిపిస్తుంది. 'హత్య' కవితలో ప్రభుత్వం శాంతి కాముకులుగా చెప్పుకుంటూ సరదాగా పావురాల్ని వేటాడుతుంటారని, ప్రభుత్వ బలగాలు గ్రామాలల్లో పడి పావురాల్లా ప్రజలను కాల్చి చంపుతున్నారని ఆవేదన చెందారు.

'తిరుగుబాటు' ఖండికలో ఈ డబ్బున్న వారందరూ కలువపూలుగా అందంగా వుంటారని వారి అందమంతా తమ స్వప్రయోజకత్వమే అనుకుంటారు. కానీ అది కేవలం పేదప్రజలు పెట్టిన భిక్షేనంటూ ప్రశ్నించారు. 'పరబ్రహ్మ' కవితలో ఎన్నో తరాల నుండి పేదవారి శ్రమకు ఫలితం లేకుండా పోతుందని బాధను తెలుపుతూ కొందరు ఏ తపస్సు చేయకుండానే అన్నాన్ని పొందుతున్నారని ఆవేదన చెందారు. 'ఒకే చెట్టు' కవితలో జనమంతా చెట్లను, పుట్లను నైవేద్యాలతో పూజలు నిర్వహిస్తూ గర్భగుడిలో పగుళ్లు తీసిన చెట్టును పట్టించుకోరని బాధను వ్యక్తపరిచారు. నేడు మంచితనము వాడిన కలువలా, మానవత్వం మేకులు కొట్టిన శిలువగా ఉందని చెప్పారు. 'చిత్రం' ఖండికలో మనస్సు ఒకటే అయినా ప్రతిదానిని రెండుగా చూస్తున్నాడంటారు. పండిన పండులా, నిండుగా వున్న ఈ వ్యవస్థ నెమ్మదిగా పగుళ్లు తీస్తుందని 'దానిమ్మ' కవితలో అన్నారు.

'వెఱ్ఱూ' కవితలో ఏ పునాదిరాళ్ల మీద ఈ వ్యవస్థ సౌధం నిర్మితమైందో ఆ రాళ్లే చలనం నేర్చుకుని అంగుళం మేర కదిలితే వేయి వక్కలవక తప్పదు అన్నారు. 'సంఘం' కవితలో కొవ్వొత్తిలాగా నీవు ఉంటే ఈ సమాజం హోరుగాలై ఆర్పేస్తుందని అందుకే కాగడలా వెలగాలని చెప్పారు.

'నా అక్షరాలు' కవితలో కట్నాల దొంగ- పోలీసు ఆటలో ఎప్పుడూ దొంగలుగానే మిగిలిపోతున్న ముప్పైఏళ్ల బాలకుమారులు సామాన్య స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాలను,

హత్యలను ఖండించారు. 'చీమ' కవితలో జీవించడము గొప్పకాదని జీవించినందుకు తన ఉనికిని తెలియజేయాలని కోరారు.

'కొత్త పాఠం' కవితలో అంబేద్కర్ చెప్పినట్టుగా గొర్రెలను, మేకలను మాత్రమే బలి ఇస్తారు. పులులు, సింహాలను కాదు అన్న నానుడిని ఈ కవితలో తెలియజేసారు. 'మధుజ్వాల' కవితలో జ్వరాన్ని జ్వరమానిని కొలిచినట్లు ప్రణయ జ్వరాన్ని ప్రేయసి పెదవులు తప్ప మరేం కొలవలేవంటారు.

'హోరుగాలి' మినీకవిత సంపుటిలో 'లత' చివరి కవిత. ఈ కవితలో కవి ఆమె పుట్టగానే గంధర్వులు గాబరాపడ్డారని, ఆమె మాటలు నేర్చినప్పుడు మైనా తడబడిందని, ఆమె గొంతు సవరించుకోగానే కోయిల ఈ దేశం నుండి వలస వెళ్లిపోయిందని, ఒక పాపను ఉద్దేశించి చెప్పారు.

## 2.1.3 చిలక్కొయ్య

శిఖామణి మూడవ కవితా సంపుటి. ఇందులో మొదటి కవిత 'చిలక్కొయ్య'. చివరి కవిత 'మూసుకున్న పద్యం' అనుభూతి కవిత్వం, స్త్రీ చైతన్య కవిత్వం, మానవీయ కవిత్వం, దళిత కవిత్వం ఉన్నాయి.

ఆదియాంధ్రపేట తన ఇంటిలో గమనించిన వస్తువే ఇక్కడ కవితగా మారింది. చద్ది దాచిపెట్టిందిగా, పసుపు పుస్తెలతాడుని తెల్లవార్లు భద్రపరిచేదిగా, పిచ్చుకల సంతతికి స్థావరంగా 'చిలక్కొయ్య'ను పోల్చాడు. రావూరి భరద్వాజ గారి కోసం రాసిన 'ముసలాడు' కవితలో ఆయన ముసలాడు ఇప్పటికీ పెదవుల మీద చెరగని చిరునవ్వు. కాకపోతే చూపే కరువైపోయిన లోకంలో తడిచూపు చూడటానికి ఎంత ధైర్యశాలి అని భావించారు. 'దిసమెల' కవితలో ఆదిమ మానవుని నుండే మనిషి ఆకులతో తన ఒంటిని కప్పుకుంటూ తన సిగ్గునూ కాపాడుకుంటూ వస్తున్నాడు. నేటి నాగరిక ప్రపంచంలో అనేక వస్త్రాలతో అపురూపంగా మారినాడు. అయినప్పటికీ ఈ సమాజంలో కూడా దిసమొలతో తిరుగుతూ అందరి సిగ్గునూ, లజ్జనూ ఒకడే భరిస్తున్నాడనీ వాపోతాడు. 'మండేలా ఓ మండేలా'

కవితలో దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు, నల్లజాతి సూర్యుడు నెల్సన్‌మండేలా గురించి చెబుతూ నువ్వు సమస్త మానవజాతికి మిగిలిన ఒకే ఒక విశ్వాసానివని అంటారు.

'ప్రమిదకింద చీకటి' కవితలో వెలుతురు ప్రకాశించే ప్రమిద లాంటి జీవితంలో చీకటి ఘట్టాలను గురించి రాశారు. ఈ దీపం నిశ్శబ్ద సామ్రాజ్యపు మహారాజ్ఞిలా గోడను సింహాసనం చేసుకొని స్వాగతం పలుకుతుందని, దీపాన్ని హాస్పిటల్‌లో సేవ చేసే సిస్టర్‌తో పోల్చాడు.

"ఒక శీతాకాలపు సమావేశానికి ముందు" ఖండికలో రాజకీయనాయకులపై విరుచుకుపడతాడు. అసెంబ్లీ ముందున్న ఒక అభాగ్యున్ని గురించి చెబుతారు. అసెంబ్లీ ముందు నువ్వు పడుకున్నావో లేక అసెంబ్లీయే నీ ముందు మోకరిల్లిందో తెలియదు గానీ, తాగుతున్న టీ కప్పులో చప్పున ఈగై పుడుతుంది నీ స్మృతి అంటారు. జ్ఞాపకాన్ని తింటున్న అన్నంలో పటుక్కున పంటికింద రాయై పగులుతుందని అంటారు.

'మేఘన' ఒక పాప గురించి కవిత. ఆకాశంలో స్వేచ్ఛగా తిరుగాడే మేఘానికి స్థలం నిర్ధేశం చేసినట్టు నీకొక అమ్మేమిటి, నాన్నేమిటి, పత్తి పువ్వువు కదా నీవు అని మేఘన గూర్చి చెబుతూ తన ఆత్మీయ మిత్రుడైన దాట్ల దేవదానం రాజుగారి కోసం రాశాడు. 'వెన్నెల దుప్పటి' కవితలో మానవీయ దృష్టికోణం నుండి రాసిన కవిత. నగరంలో ఓ అభాగ్యురాలు జీవనచిత్రణ ఎన్నడో పారేసుకున్న ఏపూర్వ స్మృతుల అన్వేషణలోనో ఆమె రోడ్డును నివాసగృహంగా మార్చేసుకుంది. జానపదగాథల్లో ఎండలో పడుకున్న పసికందుకు పాము పడగతో నీడ పుట్టినట్టు రోడ్డు ప్రక్క ఏపుగా ఎదిగిన వృక్షం ఒక కొమ్మను చేయిలా ముందుకు చాచి ఆమెకు నీడనిస్తుందని అంతటా వర్షం కురుస్తున్న వేళ కూడా ఆకాశంలో ఒక మేఘం ఆమె శిరస్సుపై గొడుగుగా నిలిచి ఆమె కూచున్న నేలను పొడిగా వుంచుతుందంటారు.

'కక్కుళ్ళు' ఖండికలో అభ్యుదయ భావాలు ఉన్నాయి. ఇక ఇప్పుడు దుఃఖించి కన్నీళ్ళు పెట్టుకుని లాభం లేదంటారు. చేజేతులా చేసుకున్నది మనమే అంటూ మనం తాగే ఏ

నీటి చుక్కలోనూ మనమొహాలు ప్రతిబింబం కావటం లేదని, మనం తినే ఏ అన్నపు మెతుకు మీదా మన పేరు రాసి లేనేలేదని, చెరువులు, కాల్వలు తవ్వింది మనమే. లోతైన నూతులు తవ్వ స్వేదాన్ని జలంగా పుట్టించింది మనమే. డామ్‌లు కట్టింది మనమే అంటున్నారు. ధాన్యాన్ని రాశులు పోసింది మనమే. గుప్పెడు గింజలు మనల్ని గుర్తు పట్టలేనప్పుడు ఎండ కళ్లను అరచేతులు అడ్డుపెట్టుకొని ఆకుపచ్చకార్డులు పట్టుకుని క్యూలో నిలబడుతున్నదీ మనమే అని కవి ఆవేదన చెందారు. ఇంకా అజేయమైన శ్రమను అమ్ముకున్నాం. మనం అచంచలమైన నమ్మకాన్ని అమ్ముకున్నాం. అంకురితమైన ఐక్యతను అమ్ముకున్నాం. కట్నండబ్బు పేరుతో పుంసత్వాన్ని అమ్ముకున్నాం. సంసారం పేరుతో స్త్రీత్వాన్ని అమ్ముకున్నాం. మన సర్వసాన్ని అమ్ముకున్నామంటారు శిఖామణి. బతకడం కోసమే బతుకును అమ్ముకున్నాం. పేదరికం వంశపారంపర్యం కాదని చాటుదామంటారు.

'ఇహ ఇప్పుడు' కవితలో రోగులమని ఈ మురికి శరీరాలను ప్రేమగా చూసుకోవడం, మనమంటే మనమని చెబుతూ ఓ గుప్పెడు మట్టికీ ఓరవ్వ నిప్పుకీ వొట్టి దేహాన్ని వొప్పజెప్పి నిర్లజ్జగా ఆత్మను వ్యభిచారంలోకి దింపుతామంటారు. 'కలల నెమలి' ఖండికలో కవికి కల వస్తుంది. ఆ కలలో నెమలి వచ్చి తన పింఛపు ఈ కనుతురాయిగా తురిమి కిసుక్కున వెళ్లి పోతుందంటారు. కవికి కలలు కనడం అలవాటు అందుకే కలల నెమలి కనబడింది నిజమే అని ధృవీకరించారు.

## 2.1.4 కిర్రు చెప్పుల భాష

శిఖామణి కవిత్వంలో 'కిర్రు చెప్పుల భాష' కావ్యం ఒక అరుదైన కావ్యం  కిర్రు చెప్పుల భాష అని పేరు పెట్టడం కూడా ఒక విలక్షణం. ఈ కావ్యం దళితపిల్లలు అమ్మానాన్నలు మొదలగు వస్తువులుగా ఇమిడియున్న కూడలి. ఏ కవి అయినా తనను తాను నిందించుకోడు. క్షమించమని అడగరు. సాహిత్యకారుల తరపున, శిఖామణి తప్పును ఎంతో ఆత్మవిశ్వాసంతో ఒప్పుకున్నారు, క్షమాపణ అడిగారు.

కలానికి కులం లేదని భావించిన కవి కొందరు ప్రముఖులు దళిత సాహిత్యం రాయమని ప్రోత్సహించినా, వద్దని వారించినా కొంత కాలం దళిత సాహిత్యానికి దూరంగా వున్నా, దళిత సాహిత్యానికి పెద్దపీట వేశారు. శిఖామణి పుట్టుక దళిత పుట్టుక. అమ్మా నాన్నపై ఉన్నంత ప్రేమ దళిత జాతిపై వుంది.

'కిర్రు చెప్పుల భాష' లో పసిపాప భాష వుంది. ఒక తేనెపట్టు మృదువైన మాటలు, ఒక దొంగపిల్ల చిలిపి చేష్టలు, ఒక చిరుమొలక చిరునవ్వు. వీరందరూ శిఖామణి రంగుల జుబ్బాలు వేసుకున్న చందమామలు. తన పాప నందిని పుట్టిన రోజు జరుపుకున్నందుకు 'నందిని' పేరుతో కవితాసంపుటిని ప్రచురించారు. ఆ కవితలు 'కిర్రు చెప్పుల భాష' కవితా సంపుటిలో కూడా ఉన్నాయి. శిఖామణి కవిత్వంలో ఇది నాల్గవ కవితాసంపుటి అయినా తన అనుభవం, తన జీవితంలోని సంఘటనలు, తను అనుభవించిన వివక్షకు ప్రతిబింబం.

'డెబ్బయ్ నాలుగో నెంబరు గది' కవితలో ఆంధ్రా యూనివర్సిటీ స్కాలర్ హాస్టల్‌లోని డెబ్బయ్ నాలుగు నెంబర్ రూం గురించి రాసారు. శిఖామణి బహుశా అక్కడే కవిత్వం రాయడం మొదలు పెట్టి ఉంటారు. అందుకే డెబ్బయ్ నాలుగో నెంబర్ గది కవిత్వం ఎలా రాయాలో కాస్త చెప్పవే అంటారు. కేవలం కలమూ కాగితాలూ కులమూ గోత్రమూ కవిత్వాన్ని ఇవ్వలేవని అంటారు. నీకు మాత్రం తెలియదటే అని డెబ్బయ్ నాలుగో నెంబర్ గదినంటారు. ఇటుకలూ సిమెంటుతో కట్టిన మామూలు గదినైతే నిన్ను నేనెందుకు ప్రేమిస్తాను అని అంటూ నీ గోడలు కట్టిన ఇటుకల్లో బహుశా ఒక కవి అస్థికలు కలిసి ఉండాలి అని ఆ గది గోడలకు విలక్షణమైన లక్షణమేదో ఉన్నట్టు భావిస్తారు. లేకపోతే చెక్కలను నునుపు చేసే గరుకు ఇసుక కాగితం లాంటి నేను సెలయేటి పరుగులో దొర్లి వచ్చిన నున్నటి గులకరాయిలా ఎలా మారగలిగానంటారు.

'తేనె పిట్ట' కవితలో గచ్చు పొదలాంటి నన్ను సంపెంగ తోటను చేసి నాచేతి మునివేళ్ల మీద అటూ ఇటూ గెంటి నాలోని మనిషిని మళ్లీ నాకు గుర్తు చేసింది. తేనే పట్టేనంటారు,

చడీచప్పుడు లేకుండా ఎటునుండి ఎలా వచ్చిందో తెలియనే లేదు కవికి. పిడికెడు లలిత దేహంతో పుంజెడు రంగు రంగుల తూలికలతో కోటి స్వరాల కువకువలతో నాలో నుంచే వచ్చినట్టు, నా ఆత్మకు రెక్కలు మొలిచినట్టు అని కవి తన పాప గురించి తెలుపుతున్నట్లన్నారు. ఇంతకు ముందు దీన్ని చూసిన జ్ఞాపకం లేదు. ఇది వరకు ఇది నా అనుభవంలోనిది కాదని, నా నుండి ఏం తీసుకుందో నాకు తెలియదు. కానీ ఈ పిట్ట మాత్రం నాకు చాలా ఇచ్చిందని  సంతోషించారు.

'ఇల్లు మారాలి' కవితలో బట్టలు మార్చుకున్నంత తేలిక కాదు ఇల్లు మారడమంటే అని బాధను వ్యక్తం చేసారు. శిఖామణి మనుషులను మాత్రమే కాదు ఇంటిని, ఇంటి పరిసరాలను ఎంత గాఢంగా ప్రేమించారో తెలిపారు. ఈ కవిత అంతా ప్రేమమయం. అభిప్రాయాలు మార్చుకున్నంత సుళువుగా మనసు మార్చుకున్నంత సునాయాసంగా ఇల్లు కూడా మారాలి అంటారు. ఇల్లు మారడం ఆర్థికమే కాదు సామాజికం కూడా అంటారు.

'సముద్రం పక్క ఇల్లు' కవితలో సముద్రమంటేనే కెరటాలు జూలు విదిలిస్తూ ఉంటుంది. నిర్విరామంగా గర్జిస్తూనే వుంటుంది. పగలు కన్న రాత్రి హోరు ఎక్కువ వినబడుతుందని, రోజంతా నాలోని కుక్క ఎముక కోసం గరగరలాడటం వలన దీని పగటిపూట గర్జనను వినలేకపోయానని, తోటలో కలియ తిరుగుతున్న పూలనూ పిట్టలనూ పలకరించలేనట్లూ సముద్రం పక్కింట్లో వున్నా ఎన్నడూ కెరటాల వైపు కన్నెత్తి చూడలేదంటారు. ఇప్పుడిప్పుడే మాటలు నేరుస్తున్న పాపాయిలా సముద్రం ఏవేవో చెబుతుందని, కవి పుట్టుమూగలా సంజ్ఞలు చేయడం తప్ప నేనేం బదులివ్వగలను అన్నారు. 'మట్టికి నమస్కరిస్తున్నాను' ఖండికలో మట్టి అంటే రసాయనశాలలో విశ్లేషణకు పనికి వచ్చే చిటికెడు మట్టి కాదంటారు. విత్తనమే కాదు మనిషి మొలకెత్తాల్సింది మట్టిలోనే అని తాత్వికత బోధిస్తారు. ఈ మట్టికి అన్నీ తెలుసని భరోసాగా చెబుతూ, మట్టి స్నేహపూరితమైన హస్తమని చెప్పారు. 'చిరుమొలక' కవితలో తండ్రిని కావడం గొప్ప విశేషమేమికాదంటూ,

ఒక మొలకకు భూమినయ్యానని, ఒక పడవకు నదినయ్యానని, ఒక చిరుదివ్వెకు వెలుగు నయ్యానని, ఒక శ్వాసకు కదిలికనయ్యానని, ఒక పక్షికి ఆకాశాన్నయ్యా నంటారు. ఒక బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత తండ్రి హృదయం ఆరుబయట రంగస్థలం మౌతుందని చెప్పడం కవి అంతులేని ఆనందానికి తార్కాణం 'రెండు చేపలు' కవితలో రెండు చేపల మధ్య దూరాన్ని కొలుస్తూ కవి ఈ విధంగా అన్నారు. ఒక చేప అలవోకగా తోక విసిరితే నీటిబొట్టునై ఎగిరి తామరాకు మీద పడ్డానని, అదృష్టాన్ని తెలియజేస్తూ అలలు చేసిన అల్లరికి గాలి చేసిన సందడికి ఆ ఆకే లోకమని అంటారు. ఇప్పుడు రెండవ చేప తోక విసిరింది. ఇప్పుడు కవి మళ్లీ జీవన జాలంలో ప్రాణబిందువు అయ్యి మునకలేస్తానంటారు.

'నాయన' గురించి కవి నీవు జ్ఞాపకాని కొచ్చినప్పుడల్లా నాకు దొరికినంత మంచి తండ్రి నా పిల్లలకు దొరకనందుకు దిగులు పడతానంటారు. అంతటితో ఆగక నువ్వు మంచి తండ్రివే కాదు గొప్ప అల్లుడివి కూడా అంటారు. పెద్ద పండక్కి పేద అత్తగారింటికి సంచిలో కొత్త పంచె తీసుకెళ్లి తిరుగు ప్రయాణంలో దానికి అత్తవారి పసుపు పూలు పూయించుకొచ్చిన ఔదార్యం నీది అని తండ్రి ఔన్నత్యాన్ని పొగుడుతారు.

'ఆరిందా' కవితలో చిన్నపిల్ల గురించి తెలుపుతూ, మోజుపడ్డ మాటను కవిత్వంలో వుంచలేకా తీసెయ్యలేకా సతమతమవుతున్నట్లుగా మధ్యలో ఈ పిల్లొకత్తె అంటారు. నాలోంచి నెమ్మదిగా నెమ్మదిగా వాళ్లమ్మ చెట్టుకు అంటుకట్టి తీగ సాగినట్టు సాగి నిన్నటి నా ప్రణయపు పందిరిని మొత్తం తానై అల్లుకుపోయిందంటారు. దొండపాదులో కాయలను వెతికి పట్టుకున్నట్టు ఇప్పుడు ఆమెను వెతుక్కుంటున్నానంటారు.

'సహస్రాబ్ది దళిత సూర్యుడు' కవితలో మనిషి నడిచిన పాదముద్రలు నాగరికలకు ఆనవాళ్లు కావల్సింది పోయి పులి అడుగులై భయపెడుతున్న భీభత్సాన్ని తెలుపుతారు. మనిషంటే ఉన్నతమూ విశాలమూ లోతుగా అనుకుంటున్నానని అంటారు. మనసంటే పిడికెడు దేహంతో అంతరంగ విహంగం అని స్వేచ్ఛగా గిరికీలు కొట్టే తుది మొదలూ లేని అనంతాకాశం అని భావించారు. నాలుగు మాటలు మాట్లాడితే పూల నుండి పరిమళం

వీచినట్లూ చెట్ల మీద పక్షులు ఎగిరినట్లు, హాయిగా వుండాల్సింది పోయి, అరికాలులో కసుక్కున తుమ్మముల్లు దిగినట్టు, తవ్వుతున్న బావిలో అకస్మాత్తుగా బండపడినట్లు, ఊపిరాడనట్లు లోలోన వుక్కబోసినట్లుగా ఉందంటారు. మనిషి తన సంకుచిత మానవ నైజంతో విస్తరించేందుకు అడ్డంకులను నిర్మిస్తున్నారని, కవి తన కవిత్వపు ప్రొక్లైనర్‌తో సహస్రాబ్ది అంచున దళిత సూర్యుణ్ణి ఉదయిస్తానని అంటూ తన కవిత్వంలో వేయి సంవత్సరాల భూమి పుత్రుల చరిత్రను ప్రొక్లైనర్‌తో తవ్వి తీస్తానంటారు.

## 2.1.5 నల్లగేటూ నందివర్ధనం చెట్టు

ఈ సంపుటిలో పద్దెనిమిదవ కవిత 'నల్లగేటు నందివర్ధం చెట్టు' అదే ఈ సంపుటి పేరయింది. ఈ కవితా సంపుటిలో అనుభూతి కవి, పిల్లలు కవితలు, దళిత కవితలు ఉన్నాయి. ఇందులో స్మృతి గీతాలు కూడా ఉన్నాయి.

'పద్య సమాధి' కవిత కవి మిత్రుడు మద్దూరి నగేష్‌బాబు స్మృతి ఖండిక. మద్దూరి నగేష్‌బాబు తన సాహిత్యంతో దళిత సాహిత్యాన్ని ముందుకు నడిపించారు. అలాంటి కవి కొద్ది రోజులకే మరణించడం వీరికి బాధ కలిగించింది. 'నిప్పు దొంగ' ఖండికలో మనము రహదారిపై నడుస్తున్నప్పుడు ప్లాట్‌ఫారంపై ఎన్నో సంఘటనలు జరుగుతాయి. ఏవేవో వస్తువులు, తినుబండారాలు అమ్మతుంటారు. ఓ మొక్క జొన్న పొత్తులు కాల్చే ముసలివాణ్ణి గమనించారు. అతడు ఎండకు, వానకు నిప్పును కాపాడుకోవడం చూసారు. ఆ నిప్పు ముసలి జీవితంలో భాగమని గుర్తించారు.

'నల్లనిదానను' కవితలో దళిత ఆవేదన కనిపిస్తుంది. ఆర్యుల మధ్య అస్థిత్వాన్ని పోగొట్టుకున్న దస్సుల్లా, నవధాన్యాల్లో నేను ఆ నల్లని దానని, హంసల మధ్య పిరికి పిట్టలా వికృతంగా వున్నా కల కూజిత కంఠస్వరం సొంతం చేసుకున్న కోయిల పిట్టనని దళిత నాయకుల విశిష్టతను తెలిపారు. నా స్థానం పంచమ వేదం సరసన గలదని నవధాన్యాలలో శక్తివంతమైన మినుమును అంటారు. నవధాన్యాల్లో నేను నల్లని దానని చెపుతూ, తిరగలి మధ్య బియ్యపు గింజల్లా కొట్టుకుంటున్న దళిత జీవితాన్ని చిత్రించారు.

నలుపు సౌందర్యాత్మకతే కాదు జాత్యాంహకారపు అభిజాత్యాలను నిట్టనిలువునా దగ్ధం చేసే నీలి మంటల ధిక్కారపు అగ్నిశిఖనని, నాధాతు శిలాజం ఆఫ్రికా చీకటి ఖండం నుండి హరప్పా మొహంజోదారో నాగరికతల చారిత్రక విభాత సంధ్యల వరకూ నిక్షిప్తమై వుందని దళిత చరిత్రను గుర్తు చేసారు.

'నీటి మంట' కవితలో నీరు దాహం తీరుస్తుందని మంటలు ఆర్పేస్తుందని నీరు పల్లం వైపు పయనిస్తుందని, సముద్రం ఉప్పును పండిస్తుందనే మనకు తెలుసుకానీ ఆ నీరు ఎత్తులకు ఎగురుతుందని కొంపలు ముంచుతుందని నీటి మంటల కొరడాలను ఝుళిపిస్తుందని పండించిన పంటలను ప్రళయనేల సముద్రంలో కలుపుతుందని చెబుతూ కవి సునామి గూర్చి తెలుపుతారు. పంచభూతాలలో ఒక్కటైన ప్రాణప్రదమైన నీరు పెనుభూతమూ విరుచుకు పడిందేమిటని విస్తుబోయాడు. మానవ వికృతి నైజాన్ని చూసి ఈ నిబిడీకృత బడబాగ్ని భళ్లున బద్దలైందేమోనని, ఇంకా ఈ భూమి మీద నీటికి అంటు పాటిస్తున్నందుకే సముద్రం నీటి మంటల కొరడాలను ఝుళిపించిందేమో ననుకుంటారు కవి.

'నల్లగేటూ నందివర్ధనం చెట్టు' కవిత కవి ఆత్మాశ్రయ కవిత్వం. రాజమండ్రి నుండి హైదరాబాద్‌కు బదిలీ అయి వస్తున్నప్పుడు మిత్రుడొకరు ఆప్యాయంగా బహూకరించిన వేలెడంత నంది వర్ధనం మొక్కను గురించి ఈ కవిత. చెట్టు జ్ఞానానికి ప్రతీక అన్న సొదీ మహాకవి, మాటల్ని గుర్తు చేసుకుంటూ బయపడుతూ వెంట తెచ్చుకుంటాడు కవి. హైదరాబాద్ నగరంలో మొక్కలు పెంచడానికి అనుకూలమైన ఇల్లు దొరికింది కవికి. ఇచ్చిన వాడి అభిమాన బలమో, నాటిన కవిగారి భార్య చేతి చలవో లేక భూసారమో గానీ పాతిన మూడు రోజులకే పసిపిల్లాడు ఎత్తుకోమని చేతులు చాచినట్లు కొమ్మల చేతులు పైకెత్తి నిగనినిగలాడుతూ నవ్విందని మొక్క ఎదుగుదలను శిఖామణి తెలిపినారు.

భూమి లోతుల్లోకి పాకిన దానివేళ్లు బహుశా మా ఊరి మట్టిని పలకరించే వుంటాయని తన మూలాన్ని గుర్తు చేసుకున్నారు. వీధిలో అన్ని గేట్లు 'కుక్కలున్నాయి జాగ్రత్తా' అని

హెచ్చరిస్తుందంటారు. వీధిలో ప్రహరీ గోడలన్నీ గాజులపెంకుల గొగ్గిళ్లను బయటపెట్టి భయపెడుతుంటే మా గోడమాత్రం నందివర్ధనం పూల నవ్వులతో స్వాగతిస్తుందంటారు. అన్ని గడపలు పండగకో, పబ్బానికో నాలుగు పచ్చనాకులు తురుముకుంటే మా ఇంటి గడపకు నిత్యకళ్యాణం– పచ్చతోరణం మా నందివర్ధనమని మురిసిపోతాడు కవి. ఆకాశంలో చుక్కలనైనా లెక్కించవచ్చుగానీ, మా చెట్టు పూలను లెక్కించడం ఎవరితరం కాదని, రాత్రిళ్లు అందరికి ఒకే ఆకాశం అయితే మాకు రెండు ఆకాశాలంటూ ఇలా పూల పందిరిలాంటి చెట్టును నక్షత్రాలు కల్గిన ఆకాశాన్ని పోల్చుతాడు శిఖామణి.

'మానవశ్వాస' కవితలో మనుష్యుల మధ్య గల తారతమ్యాలను, అసమానతను చెపుతూ మానవులంతా కలసి ఉండాలని భేదాభిప్రాయాలను మానుకోవాలని హితవు పలుకుతాడు. విరగకాసిన మామిడి చెట్టు వొంగి నేలను పలకరించినట్లు మనిషిని మనిషి ధన, పేద భేదం లేక ప్రేమగా పలకరించుకొని ఎన్నాళ్ళయిందని వాపోతారు. మనం పేద వాళ్ళుగా ధనవంతులుగా, స్త్రీలుగా, పురుషులుగా, అగ్రకులాలుగా, దళిత కులాలుగా, ఆంధ్రోళ్ళుగా, తెలంగాణోళ్ళుగా విడిపోయి ఉన్నామని మనుషుల్ని రెల్లు పూలవనాల్ని చేసుకొని తనవి తీరా కౌగిలించుకొని ఎన్నాళ్ళయిందని కవి ప్రశ్నించుకున్నారు. 'జ్వరం' కవితలో కవికి కవిత్వపు జ్వరం పట్టుకుంది. ఈ కవిత అంతా చదివేదాక నిజంగా జ్వరం వచ్చినప్పుడు పడే అవస్థే కనబడుతుంది.

'జీవితాన్ని ముట్టించుకునే అగ్ని' కవితలో కవి అక్షరం గురించి చెబుతూ ఏది అంత సుళువుగా పోదని, నాని ఉబ్బిన విత్తనం ఎక్కువ కాలం భూమిలో ఉండలేనట్టు. నేరస్తుడు అట్టే కాలం దాక్కోలేడంటారు. చిన్నప్పుడు స్కూలు ప్రహరిగోడ మీద మామిడిటెంక జీడుతో ఫలానా వాడు దొంగని రాసినంత మాత్రాన వాడు దొంగైపోడని, రేకు డబ్బాల్లోంచి చిల్లర నాణాలు సృష్టించేవాడు. మేజిక్‌టో పిల్లోంచి తెల్లపావురాలు తీసి ఎగురువేసేవాడు. గాంధీభవన్ ముందు ఏనుగు పెట్టి తీసి మాయం చేసేవాడు. లిబర్టీ విగ్రహాన్ని అదృశ్యం చేసేవాడు. అందరూ మంత్రజాలికులేనని, అందరూ మన కంటిరెటీనా మీద క్షణకాలం

మాయ పొరను కప్పి కనికట్టు చేసిన మహామాయగాళ్ళేనని చెపుతూ సర్వ ప్రపంచానికి శ్వేత మహామాయగాడు ఒక్కడున్నాడని, వాని ముందు వీళ్లంతా మరుగుజ్జులే దిగదుడుపేనని అంటారు. ఇంకా ఈ అక్షరం శవ ప్రాయమైన జాతికి కవి అందించే అమృత సంజీవనియని, అక్షరాన్ని గోడ మీద పేరును చెరిపేసినంత సుళువుకాదంటాడు. అక్షరాన్ని సహజ మండలాలుగా ధరించిన కవిని మాయం చెయ్యడం అంత సుళువుకాదని, ఒకసారి అక్షరమంటే ఏమిటని నిఘంటువుల కెక్కనివాడని పదంలా ఊరి బయటే నిలబడిపోయిన మా గోరటి వెంకన్న నడగమంటాడు కవి. అక్షరం జీవితాన్ని ముట్టిచ్చుకొనే అగ్గి అని ఛాతీ మీద చెళ్లున కొట్టుకుని మరి చెప్తాడని అంటారు. మతంతోనో, జాతిపేరుతోనో ప్రపంచదేశాలపై ఆధిపత్యాన్ని సాగించడానికో అక్షరాన్ని మాయం చేయడం ఎవడివల్లకాదని, అక్షరానికి సంకెళ్ళు ఎవరు వేయలేరని కవి భావించారు.

'రాజగృహం' ఆచార్య బన్న అయిలయ్య గారి ఇంటిపై రాసిన కవిత. 'రాజగృహం' అనే పేరు బి.ఆర్. అంబేద్కర్ గారి గృహనామం. రాజ్యాంగ నిర్మాత స్ఫూర్తితో 'రాజగృహం' అని పెట్టుకున్న బన్న అయిలయ్య గారిని రాజ్యాధికారానికి పోరుబాటపై ఆలోచించాలని ఉద్బోధిస్తాడు. ఎన్నాళ్ళుగానో కవిత్వం రాయకపోయినా కవి మీద గొప్ప ప్రేమతో తెల్లకాగితం మెరుపు తెలుపును నిలుపుకున్నట్టుగా ఆ ఇల్లు ఉందంటారు. సప్తవర్ణాల ఇంద్రధనస్సుగా విస్తరించే సూర్యకిరణం ఇకపై గాజు పట్టకాన్ని బదులు ఈ గాజు మేడను ముద్దాడదలచిందని అంటారు.

వచనానికి, కవిత్వానికి మధ్య నున్న వ్యత్యాసంలా బతకడానికీ, జీవించడానికీ మధ్యగల తేడాను గుర్తు చేస్తుందని చెప్తాడు. 'మనం మనలాగే జీవిద్దాం' ఖండికలో మనిషి ఎంసెట్ కత్తులబోను నుండీ రియల్ ఎస్టేట్ వాయిదాల నుండీ రిలయన్స్ మొబైళ్ల నుండీ నిశ్శబ్దాలను చేధించడం నుండీ, వయాగ్రాల నుండీ బయటకు రావాలి. మన జీవితం కాని జీవితం నుండి బయటకు రావాలంటారు. రావడం వెళ్ళడంలోనే కష్టాలు ఇబ్బందులుంటాయి. ఆటుపోట్లుంటేనే నది అవుతుందని, రాకపోకలుంటేనే జీవితం అవుతుందంటారు. మనిషి

తను మనిషిగా బయటకు రావడం పెద్ద సమస్యేమి కాదని, పొట్టకూటి ఉద్యోగాల నుండీ, ప్రమోషన్ల నుండీ, సరీసృపాల్లాంటి పై అధికారుల వేధింపుల నుండీ, మన నీడల్ని సైతం భయపెట్టే మన అహంకారుల నుండీ, ఎంతకూ తెగని పే రివిజన్ లెక్కల నుండీ బయటకు రావాలంటారు. ఎలాగైనా, ఎప్పటికైనా, మనం మనలాగే జీవిద్దామని ఈ ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ సమాజం నుండీ మనిషి బయటకి రావాలని ఈ యాంత్రిక జీవనం నుండీ బయటకి రావాలని మనిషి మనిషిగా జీవించడం చూడాలని ఆకాంక్షిస్తున్నారు.

## 2.1.6 తవ్వకం

ఇందులో 'కోరికతోనే వచ్చాను' అనే ఖండిక మొదటిది. ఈ సంపుటికి పెట్టిన పేరు 'తవ్వకం' ముప్పైమూడవ కవిత 'తవ్వకం'. చివరి కవిత 'ఈ రాత్రికి హాయిగా నిద్రపోతాను' తన ఆత్మీయ మిత్రుడు శిల్పాజగదీష్ కొరకు రాసిన కవిత ఇది. ఇందులో కవులు, పాఠకులు అందరు కలసి అక్షరాన్ని నమస్కరిస్తారు. సంగీత సామ్రాజ్ఞి శ్రీమతి ఎం.ఎస్. సుబ్బులక్ష్మి స్మృతిపై 'పాటల పాలవెల్లి' ఖండికలో ఆమె సన్నని గొంతు సవరిస్తే చాలు ఆకాశం మేఘాల చెవులు రిక్కించి వింటుంది. 'కోరికతోనే వచ్చాను' కవితలో మానవుడికి పుట్టుకతోనే కోరికలుంటాయని, ఆ కోరికల వల్ల మనిషి అనేక బాధలకు లోనౌతాడని, బుద్ధుడు చెప్పినట్లుగా కోరికలే దుఃఖానికి కారణమని చెప్పారు. అందుచేతనే కవి కోరికలు లేని జీవితాన్ని కోరుకున్నాడు.

'గుప్పెడు మట్టిని కలగంటున్నాను' కవితలో ఎప్పుడో ఎవరి కోసమో కాకుండా తనకే ఎప్పటికైనా అవసరముంటుందని కవి గుప్పెడు మట్టిని గుట్టుగా గుప్పెట్లోనే దాచిపెట్టుకుంటాడు. ఈ మట్టిలో తన మూలాలను కొన్నింటిని భద్రపరచుకున్నారు. కవికి పెద్ద పెద్ద కలలు వచ్చేవి కావు. పెద్ద పెద్ద కలలుకనే వాడు కాదు. కానీ బంగారం లాంటి గుప్పెడు మట్టిని మాత్రం కలగంటాడు. మట్టి పాదాలూ, మట్టి చేతులూ, మట్టి ఊహల మనిషిని కదా అని తాత్వికత బోధించారు. నాగరికత పేరుతో వచ్చిన సంస్కృతిలో

భాగంగా మట్టి చూడటానికి కూడా కనబడని స్థితిలో ఈ రోజు నగరాలున్నాయి. ఈ పరిస్థితిలో కవి మట్టిని కలగా చెప్పుకోవలసి వచ్చింది.

'చిరునవ్వు చిరునామా' ఖండిక తన మిత్రుడు కె. మురళీకృష్ణ జ్ఞాపకార్థం రాశారు. ఆ నవ్వు ఆవేదనతో కూడిన నవ్వు. పొద్దు పొడవగానే ఆకాశంలో చుక్కలు మాయమైనట్లు చూస్తుండగానే మిత్రుని నవ్వు మాయమైందని కవి బాధ చెందాడు. 'వెతుకులాట' ఖండికలో కవి పుస్తకాన్ని వెతకడం గురించి చెబుతాడు. పుస్తకాన్ని వెతకడం మామూలేమి కాదంటూ అది ఒక రకంగా జీవితాన్ని వెతుక్కోవడమే అంటారు. నిత్యం, నిరంతరం అదే పనిగా వెతకడం అంటే ముందే నవ్వుదేన్నో ఒకదాన్ని పోగొట్టుకోవాలని గొప్ప సూక్తి తెలుపుతూ మాటనో పదాన్నో వాక్యాన్నో పద్యాన్నో మనస్సునో మనస్సు దోచిన కాంక్ష పరిమాళాన్నో దేన్నో ఒక దాన్ని ముందుగా నవ్వు పారేసుకోవాలంటారు. ఒకటి కావాలంటే ఒకటి వదిలేయాలనే ప్రజాసూక్తి వుంది కదా! 'ఎండుటాకు' కవిత సంతాలీ మూలంలో జాదుమణి బెస్రానే కవి రాసిన కవిత దీనిని ఆంగ్లానువాదం చేసినది సుబోధ్ హన్స్‌ద అనే కవి 'ఎండుటాకు' పేరుతో తెలుగులోకి అనువాదం చేశారు కవి. ఈ కవితలో కాలచక్ర గమనంలో నిత్యం పునరావృతమయ్యే సత్యాల గురించి తెలుపుతాడు. నీటి వాలులో కొట్టుకుపోయి చివరికి ఒడ్డున పడ్డ చేపపిల్లలా ఏ నది ఒడ్డుకో చేరుకుంటుందంటారు. ఎప్పుడన్నా ఇంత నిప్పు రవ్వ తోడైతే క్షణాల్లో చిటికెడు బూడిదై పోతుందని అయినా ఎండుటాకు ఏనాడు పిడికెడు సానుభూతికి నోచుకోలేదంటాడు. ఇంకా బహుశా నిర్లక్ష్యపు నీడలో బ్రతికే వృద్ధులూ ఎండుటాకులే అని ధృవీకరించారు. 'మట్టి బంధం' ఈ ఖండిక గుజరాతీ మూలంలో అశోక్ చావ్‌డా. ఆంగ్లానువాదం బ్రిజేష్ భట్ రాసినాడు. మట్టిలోంచి మొలకెత్తిన విత్తనం కొమ్మలు రెమ్మలతో శాఖోపశాఖలుగా విస్తరించి చివరికి మట్టిలోనే కలసిపోయినట్లు మనిషి నుంచి పుట్టిన మనిషి మట్టిలోనే కలసిపోతాడంటాడు కవి.

'జీవితం జీవించడానికే' కవితలో నమ్మకాలు పోయినా, ఎలాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా జీవితం జీవించడానికేనన్న విషయాన్ని చెబుతూ, వున్నట్టుండి తాడిచెట్టు

ఎత్తున ఉప్పెన కెరటం విరుచుకుపడనీ ఏడుతాళ్ళు లోతున మనస్సు సుడిగుండం రివ్వురివ్వున గింగిరాలు తిప్పనీ జీవితం జీవించడానికే అని బ్రతుకు యొక్క గొప్పతనాన్ని చెప్పాడు.

ప్రజాగాయకుడు గద్దర్ గాయపడ్డ విషయాన్ని 'ఒక గాయం పది వసంతాలు' కవితలో వివరించారు. ఒక గాయం పది వసంతాలు గాయపడిందని, నెత్తురోడుతున్న గాయాలకు గేయాల గాజుగుడ్డ చుట్టి ప్రజలకు గొంతిచ్చిన పాటల వసంతమని చెప్పాడు. గద్దర్ గాయపడిన దగ్గర నుండి పెచ్చుకట్టింది లేదని మానుకట్టిందిలేదనీ, ఒకటే పాటల అసిధారాపాతమంటూ గాయం నిరంతరం మాట్లాడుతూనే ఉందని, నిర్విరామంగా పాటపాడుతూనే ఉందని, గాయం అలుపుసొలుపు లేకుండా ఆడుతూనే ఉందని. గద్దర్‌పై కాల్పులు జరిగినా, అతని శరీరంలో ఇంకా బుల్లెట్స్ ఉన్నా ఆ యుద్ధనౌక ఇంకా ప్రజాగేయాలను ఆలపిస్తూనే ఉందని కవి భావన. 'ఈ రాత్రికి హాయిగా నిద్రపోతాను' ఖండికలో తన ఆత్మీయకవి మిత్రుడు శిల్పాజగదీష్‌పై రాస్తూ ఇన్నాళ్ళుగా ఎన్ని రాత్రులు ఎంతగా నిద్రకాచానో ఎంత వగచి మరెంతగా పరితపించానోననీ, చలిచీమ పంచదార పలుకులను మోసికొట్టినట్టు, తేనెటీగ పువ్వు పువ్వుకూ తిరిగి ఒక్కో తేనెబొట్టును కూడబెట్టినట్టు, జోరీగ బంకమన్నును తెచ్చీ తెచ్చీ మట్టిగూడు కట్టుకున్నట్టు, తేనెపిట్ట సిరంజి సూదిలాంటి ముక్కును పువ్వులో గుచ్చి గాల్లోనే రెక్కలల్లాడిస్తూ లాఘవంగా తేనెను లాగినట్టు, ఒక్కో అక్షరం ఒక్కోమాట ఒక్కో వాక్యం. వాక్యనిర్మాణం గురించి తెలుపుతూ గడ్డివాముల నుండి గుప్పెడు పరకలు లాగుతూ జోడిస్తూ మెలిపెడుతూ జోడిస్తూ ఎంటును పేనినట్టు ఒక వాక్యం తీగ సాగాలంటే లోపం ఎన్ని నాడుల్ని మెలి తిప్పుకోవాలో తెలుపుతాడు. కవిని అక్షరం నిద్రపోనీయదు. కవిని వాక్యం నిద్రపోనీయదు. కవిని పాఠకుల ఆత్మీయమైన అభినందనలే నిద్రపుచ్చుతాయని కవి భావన.

'తవ్వకం' కవిత మానవీయదృష్టి కోణం నుంచి వచ్చింది. మనిషిని మనిషిగా గుర్తించలేని సమాజం కొడుకుగా భర్తగా తండ్రిగా మిత్రుడిగా శత్రువుగా ఆంధ్రోడుగా,

దళితునిగా మాలోడిగా గుర్తింపు లభిస్తుంది గానీ మానవుడు తోటి మానవుల్ని మనిషిగా గుర్తించడం లేదని కవి భావిస్తున్నాడు. 'ఎరుక' ఖండికలో మనిషి తెలుసుకోవడానికి అనేక పద్ధతులున్నాయని, తెలియని దానిని తెలుసుకోవడానికి వినడం కూడా ఒక పద్ధతి అని అంటూ గత కొన్నేళ్ళుగా ఆమె గలగల మాట్లాడుతూనే వుందని, అన్నేళ్ళు తను మౌనంగా వింటూనే వున్నాను అంటారు. కొన్నిసార్లు మొద్దురాచ్చిప్పల్లా మాట్లడవేం అంటుందని, మౌనం కూడా భాషేనని ఆమెకు తెలియదంటాడు. వినడం వల్ల ఎన్నో విషయాలు తెలుసుకోగలమని, పుస్తకాలు చదవడం ద్వారా మనుషుల గురించి మనస్సుల గూర్చి తెలుస్తుందని కవి భావించారు. 'తెలియడం గురించి' కవితలో తెలియనిదాన్ని తెలుసుకునే ప్రయత్నమే జీవితం, కవిత్వం అంటారు కవి. 'నేను మా అబ్బాయీ' కవితలో తండ్రి తరానికి, కొడుకు తరానికి మధ్య ఉన్న సంస్కృతిని చూపుతాడు కవి. నిన్న అనాగరనికమైనది నేడు నవనాగరికమై భాసిల్లుతున్నదంటాడు. చిన్నప్పుడు చొక్కా కురచదైపోయిందని వీధిలోకి వెళ్ళనని రోజంతా మారాం చేసిన వీడే ఇప్పుడ షార్ట్‌లెంగ్త్ పేరుతో బొడ్డుపైకి పొట్టి పొట్టి చొక్కాలేసుకుంటున్నాడని, ఏదో క్లాసులో కాస్త రంగు వెలిసిన చొక్కాను వేసుకోమంటే మోకాలు దగ్గర చిరిగిన పొడుగు ప్యాంట్లకు వాళ్ళమ్మ నాలుగు కుట్లువేస్తే స్కూలుకు వెళ్ళడానికి సిగ్గుతో చితికిపోయిన వాడిప్పుడు స్టోన్‌వాష్ పేరుతో చిరుగుల జీను ఫేంట్ వేసుకొని ఊరేగుతున్నాడు. ఈ విధంగా ఏది నాగరికతో ఏది అనాగరికతో తెలియకుండా మనిషి అయోమయంలో పడేసిన మన ప్రపంచీకరణ సంస్కృతీ ప్రభావం నేటి యువతపై ఎలా పడిందో వివరించారు.

## 2.1.7 గిజిగాడు

'గిజిగాడు' కవితా సంపుటిలో మొత్తం 35 కవితా ఖండికలు ఉన్నాయి. కొన్ని దళిత దృక్పథానికి సంబంధించినవి. మరికొన్ని సామాజిక సంబంధాలకు సంబంధించినవి. మొదట రంగును సన్నెకట్ల కవితతో ప్రారంభమై గిజిగాడు కవితతో ముగింపు పలికారు. ఈ సంపుటికి చివరి కవితైన 'గిజిగాడు'ను శీర్షికగా నిర్ణయించారు.

'రంగూను సన్నెకల్లు' ఖండికలో తమ తాతల కాలంనుండి సన్నెకల్లు (రోలు) మాఇంట్లో ఉన్నదని కవి భావిస్తున్నాడు. ఈ సన్నెకల్లు ఎక్కువ పొడుగు ఉండేదని, కవిగారి ఇంట్లో ఏ శుభకార్యము జరిగిన దీంట్లోనే నూరేవారని చెప్పారు. కొన్నిరోజులకు సన్నెకల్లు రెండుగా ముక్కలయిందని ఆవేదన చెందారు.

'కొత్తింట్లో' కవితలో కవిగారు పాత ఇంటి నుండి కొత్తింటికి మారినపుడు ఆ కొత్త ఇంటి విషయాలలో పడగ్గది కిటికీ రెక్కల్లో ఒక దానికి అద్దం లేదని, లేకపోయినా ఎదురుగా ఉన్న సంపెంగ చెట్టును పూలగుత్తులుగా పటం గట్టి గోడకు వేలాడదీసిందని, ఇంక రెండో అంతస్థుకు మెట్లెక్కబోతుంటే మొదటి అంతస్తు బాల్కనీ నుండి దండెం మీద వేలాడదీసిన నూలు దారాల్లా తీగలు సాగాయని చెప్పారు. కొత్తింటికొచ్చాక వేకువజామున సెల్‌ఫోన్ అలారాలతో నిద్రలేకుండా సంపెంగ పొదల నుండి వచ్చే పిట్టల కిచకిచలకు నిద్రలేస్తున్నానని చెప్పారు. ఇలా కొత్తింటి గొప్పదనాన్ని విలక్షణంగా వివరించారు.

'అడ్డసరం కట్టవ' ఖండికలో శిఖామణి ఇంటికి ఒకరకమైన ఔషధమొక్కలతో ఏర్పాటుచేసిన కంచె గురించి ఆయన మాటల్లో ఇప్పుడైతే గాజుపెంకుల ప్రహరీగోడలు, ఇనుపముళ్ళ కంచెల ఫెన్సింగులు వచ్చాయని, ఆ రోజుల్లో ఉప్పుటేరు వొడ్డునే వెలసిన మా కాలనీకి కర్ణుని కవచ కుండలాల వలే రక్షణగా ఉన్నదని, చివరకు కబడ్డీ ఆటతో మోకాలి చిప్పకు దెబ్బ తగిలితే నూనెరాసిన నాలుకు ఆకులను నిప్పుమీద వెచ్చజేసి గాయానికి కట్టు కట్టిందీ ఈ ఆకులతోనేనని చెప్పారు. కట్టవ కంచెకు, వైద్యానికి రెండింటికి సంబందించినదని వివరించారు. 'మాయమైపోయిన నెమలిక' ఖండికలో తెలంగాణ దళితకవి, శిఖామణి మిత్రుడు దొడ్డి రామ్మూర్తి కూతురు 'లిపి' అకాలమరణానికి గుర్తుగాఈ కవిత. ఇందులో ఇప్పుడా తండ్రి బిడ్డలేని ఒట్టి గుడ్డివుయల్లా వూరకనే గాలికి వూగుతున్నాడని, నోరున్న వాళ్ళమాటలతో చెవులు గింగుర్లు పెట్టేలా గొంతులు బొంగురులు పోయేలా భోరుభోరున ఏడ్చాం అని, బిడ్డ కడసారి పయనమైన దిక్కును చూపిస్తూ నెత్తీనోరూ బాదుకుంటూ, ఆకాశానికి రెండు చేతులు ఎత్తి నమస్కరించింది.

'మావూరి మరిడమ్మ' ఖండికలో శిఖామణి గ్రామంలోని నాటువైద్యురాల గురించి వివరించారు. ఈ కవితలో పెళ్ళయి సంవత్సరాలు గడుస్తున్నా గుళ్ళూ గోపురాలెన్ని తిరిగినా ఎంతకీ ఎప్పటికీ రాని గర్భానికీ గుర్తుకొచ్చేది ఈ మరిడమ్మే. మనువాడతానని నమ్మిస్తే సర్వం మరిచిపోయి పెళ్ళి కాకుండా నెలతప్పిన తప్పిదాన్ని తప్పించుకోవడానికి ఎదురుచూసేది మరిడమ్మ కోసమేనని పళ్ళూడిపోయిన బోసి పెదవుల్ని పైకి కిందకీ తాటిస్తున్న, చింత చచ్చినా పులుపు చావని తాతయ్యకి ఊరపిచ్చుక లేహ్యం కోసం గుర్తొచ్చేదీ ఈ మరిడమ్మే అని అన్నారు.

'దిగులు పద్యం' కవిత వేగుంట మోహనప్రసాద్ మరణించిన సంఘటనకు కవి దిగులుగా ఈ పద్యం రాసారు. ఈ కవితలో శిఖామణి ఏ కవిత రాసినా గురువుగారికి చూపించి లోపాలను సవరించికొని కవితను సాహిత్యలోకానికి పరిచయం చేసేవారు. గురువుగారు మరణం తర్వాత నాకు కొత్త విషయాలు చెప్పేవారు ఎవరని శిఖామణి దిగులుపడ్డట్టు ఇక్కడ కనిపిస్తుంది. 'చలివేంద్రం' ఖండిక దాట్ల దేవదానం రాజుగారి ఇల్లు ఉదయిని కోసం రాసారు. ఈ కవితలో శిఖామణి యానాం నుండి కాకినాడకు వెళ్తుంటే నాళం వారి చలివేంద్రం చూశానని, ఆ ఇల్లు విశాఖపట్నంలో తుమ్మల వేణుగోపాలరావుగారి ఉండే 5/37 ఆంధ్రయూనివర్శిటీ క్వార్టర్సులా హైదరాబాదులో శివారెడ్డిగారి పాత ఖైరతాబాద్ ఇంటిలా యానాంలో మా దేవదానం రాజుగారిల్లు బహుశా భువనవిజయాలూ శారదాధ్వజాలే ఇంతకంటే గొప్పగా ఉండి ఉండవు. చవులూరించే కథనైనా కవిత్వమైనా గేయమైనా హృద్యమైన పద్యమైనా గద్యమైనా పడుగూ పేకల్లా పెనవేసుకుపోవలసిందేనని అన్నారు. ఇంకా పల్లెల్లో ఇంటికి వెళితే అమ్మ నీళ్ళచెంబుతో ఎదురొచ్చినట్టు, ఎప్పుడు ఊరెళ్ళినా కొత్త కవితలేమున్నాయంటూ రారమ్మని సాదరంగా ఆదరించి అక్కున చేర్చుకునే ఇల్లు మా ఊరి సాహితీ చలివేంద్రం అని అన్నారు.

'ఒకటే ధ్యాస' ఖండికలో నిలుచున్నా కూచున్నా, ఉదయపు నడక నడుస్తున్నా పుస్తకం చదువుతున్నా పాఠం చెబుతున్నా ఫోను మాట్లాడుతున్నా సమూహంలో ఉన్నా ఏకాంతంలో

ఉన్నా ప్రియురాలితో సంభాషిస్తున్నా తింటున్నా తాగుతున్నా ప్రయాణంలో వున్నా మనసు లోపలి గదిలో హఠం వేసుక్కూచున్నా ధ్యానంలో ఉన్నా యోగంలో ఉన్నా మహాభోగంలో ఉన్నా మెలకువలో ఉన్నా నిద్రలో ఉన్నా మెలకువ నిద్రాకాని సుప్తచేతనలో ఉన్నా చిక్కుపడ్డ దారపు ఉండలాంటి జీవితంలో కవిత్వపు కొసను వెతికి పట్టుకోవడం ఎలా? అన్న ప్రశ్నలతో ఉన్నానని కవి భావన. 'అంటు' కవితలో అంటంటే మనిషి ఎదురుపడితే అశుద్ధాన్నుండి పక్కకు జరిగినట్టు మనిషినుండి మనిషి వైదొలగడమే, మనిషి ఎదురుపడితే పులోసింహమో ఎదురుపడ్డట్టు, గుంభనంగా ప్రవహిస్తున్న నది అడుగున సమతలంగా వున్న నేల ఉన్నట్టుండి ఒక్కసారిగా గుండాలు గుండాలుగా లోపలికి లాగేయడమే అని అన్నారు. ఇంకా అంటంటే దగ్గరకు తీసుకోవడం, ఆలింగనం చేసుకోవడం అనే కొత్త అర్థాన్ని ఇవ్వడం కనిపిస్తుంది.

'విగ్రహాలు మాట్లాడతాయి' ఖండికలో రాష్ట్రంలో జరుగుతున్న అంబేద్కర్ విగ్రహాల విధ్వంసాలకు నిరసనగా రాశారు. ఇందులో అతనెవరో ఢిల్లీ పార్లమెంటు భవనాన్ని అడగమని, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌ని అడగమని, కొలంబియా యూనివర్శిటీని అడగమనిచెప్పారు. ఇంకా నువ్వు పిలిచి చూడు విగ్రహాలు నడిచి వస్తాయని, నువ్వు పలకరించి చూడు విగ్రహాలు మాట్లాడతాయని, దేశాన్ని పహారా కాస్తున్న జవానుల్లా, మమ్మల్ని మా వాడల్ని ఆ మాటకొస్తే మనందరిని తన చూపుడు వేలితో ముందుకు నడిపిస్తున్న యోధుడు అంబేద్కర్ అని అన్నారు.

'గిజిగాడు' ఖండిక వేగుంట మోహన్ ప్రసాద్ గురించి రాశారు. ఈ కవితలో ఒక్కడవే ఒక్కడవు నువ్వే కదా చెట్టు చెట్టుకూ తిరిగి, సనసన్నని ఈనెలు తెచ్చి, తోట తోటకూ తిరిగి, మృదువైన దూదిపింజెలు తెచ్చి రహస్యద్వారపు నాజూకు గూడల్లిన గిజిగాడివి అని అన్నారు. ఇంకా నెలవు తప్పిన పక్షుల్లా మేం ద్వారం ఎక్కడో తెలుసుకోలేక టపటపా రెక్కలల్లాడిస్తూ గూడు చుట్టూ పదేపదే తిరుగుతుంటాం నువ్వే నువ్వే నువ్వే కదా! గూడ్సురైలు గార్డులాంటి కవివని, తమ కవిత్వానికి నీవే మార్గదర్శకుడివని గిజిగాడివని కవి భావన.

## 2.2 విమర్శ

### 2.2.1 దళిత సాహిత్య తత్వం

'దళిత సాహిత్య తత్వం' అన్న విమర్శ గ్రంథంలో తాను ఎన్నుకున్న కొన్ని దళిత సాహిత్యాంశాల మీద దృష్టి సారించారు. పత్రికల్లో నలుగుతూ వచ్చిన అనేక సాహిత్యాంశాల్లో కొన్నిటి గురించి వ్యాఖ్యానం చేశారు. 'దళిత కవిత్వంలో పురాణ ప్రతీకలు' వ్యాసంలో శంబూకుడు, ఏకలవ్యుడు ఏలా చరిత్రలో నష్టపోయారు అనే విషయాలను ఈ వ్యాసంలో పొందుపరిచారు.

'దళిత కవిత్వం– భాష' వ్యాసంలో దళిత కవిత్వంలో 'భాషకు కులమానాలుంటాయా'? అన్న ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఇలాంటి విషయాలు ఈ వ్యాసంలో ఉన్నాయి. 'దళిత స్త్రీవాద కవిత్వం' వ్యాసంలో దళిత కవిత్వం వచ్చిన తొలిరోజుల్లో దళిత స్త్రీల సమస్యలపై కవిత్వం రాసింది దళిత కవులే. ఆ తర్వాత కాలంలో అనేకమంది కవయిత్రులు దళిత స్త్రీవాద కవిత్వం రాసారు. 'దళిత కవిత్వంలో దళిత కళాతత్వం' వ్యాసంలో 'దళిత కళాతత్వం' అనగానే దళిత కవిత్వానికి ప్రత్యేకంగా ఒక కళాతత్వం వుందా! అనే సందేహం కలగవచ్చు. అసలు సాహిత్యమంతటికీ ఒకే సౌందర్యశాస్త్రం వర్తిస్తుంది కదా! దళిత కవిత్వానిక విడిగా కళాతత్వం ఉందా! అలాంటి ఒకదాని అవసరం వుందా అనే ప్రశ్నలూ తలెత్తవచ్చు.

శివసాగర్, నల్లటి సూర్యుడు. 'మండే మాదిగడప్పు', ఎండ్లూరి సుధాకర్ నీలిన్ దాసుని చూడాలి, వేముల ఎల్లయ్య 'ఒద్దులు తిరుక్కుంటూ' (బహువచనం). కత్తి పద్మారావు అవర్ణం (నల్లకలువ) మొదలైన కవితల్లో దళిత కళాతత్వం అద్భుతంగా ఉంది.

'దళిత ప్రతీకలు గబ్బిలం - కాకి– కోడి' వ్యాసంలో గుర్రం జాషువా గబ్బిలాన్ని ప్రతీకగా తీసుకొని 'గబ్బిలం' కావ్యాన్ని రాశారు. కత్తిపద్మారావు (నల్లకలువ, నల్లరంగు గురించి చెప్తూ చివరలో 'కాకి' సామ్రాజ్యాధినేత అవుతుందని అంటాడు. సుంకర రమేష్ 'తల్లికోడి హెచ్చరిక' దీర్ఘకవితలో కోడిని ప్రతీకగా తీసుకున్నారు.

'దళిత కథ' వ్యాసంలో 1935లో చుండూరు సంఘటన తర్వాత ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ ఏర్పడటం ఆ తర్వాత దళితశబ్దం సామాజిక రంగంలోనూ, సాహిత్యంలోనూ విస్తృత ప్రచారంలోకి రావడమే కాకుండా దళితోద్యమం స్పష్టమైన కార్యాచరణ రూపం తీసుకొచ్చిన విధానం కనిపిస్తుంది. ఆ పరంపరలో అనేక దళిత కథలు వచ్చాయి. ముఖ్యంగా ఇనాక్‌గారి ఊరబావి, జి.భాను 'పాపానికి జీతం' కాట్రగడ్డ దయానంద్ 'చెలమ' కాలువమల్లయ్య 'అడవిగాచిన వెన్నెల', జంగయ్య తోడేళ్ళు కథలు మొదలైన కథలు పరిశీలించటం జరిగింది. 'దళిత సాహిత్యం – పాట' వ్యాసంలో ఆధునిక సాహిత్యంలో 1910 ప్రాంతం నుండీ దళిత గీతాలు వెలువడినట్లు చరిత్ర చెబుతుంది. తొలినాళ్ళలో దళిత సమస్యల మీద దళితేతర రచయితలే ఎక్కువ గీతాలు రచించినట్లు తెలిపారు. దళిత సాహిత్యోద్యమానికి ప్రాతినిధ్యం వహించే పాటలను కొన్నింటిని మాత్రమే పరిశీలించారు. వాటిలో అజ్ఞాత కర్తృత్వ రచన అయిన 'మాలవాంధ్ర పాట' తొలి దళిత గీతంగా గుర్తింపు పొందింది. ఇంకా కొండపల్లి జగన్నాధరావు 'మేలుకొలుపు' గీతం, జాలారంగస్వామి 'అంటరాని వారెవరు', 'మాలశుద్ధి' అనే రెండు గీతాలు, కుసుమధర్మన్న 'మా కొద్దీ నల్లదొరతనము', గీతం, సుద్దాల హన్మంతు 'పల్లెటూరి పిలగాడా' పాట, గూడ అంజయ్య 'ఊరు మనదిరా పాట', మాష్టార్జీ నీలి, +లాల్ పాట, గోరటి వెంకన్న 'అందుకో గుతపందుకో' పాట, వంగపండు ప్రసాదరావు 'జ్ఞానమొక్కడి సొత్తు కాదన్నా' పాట, శివసాగర్ 'నల్లటి సూర్యుడు' పాట, మాష్టార్జీ అంబేద్కర్‌ను స్తుతిస్తూ 'అందుకో దండాలు బాబా అంబేద్కర్' పాట ఇంకా అనేకమంది దళిత కవులు, రచయితల పాటలను శిఖామణి ఈ వ్యాసంలో వివరించారు.

### 2.2.2 వివిధ

ఈ విమర్శ గ్రంథంలో 9 ఆధునిక సాహిత్యవ్యాసాలు ఉన్నాయి. 'కవితలు వాలిన చెట్టు – ఇస్మాయిల్' వ్యాసంలో ఆధునిక వచన కవిత్వంలో ఇస్మాయిల్‌ది మృదువైన పేరు అని, ఆయన కవిత్వంలో సున్నితత్వం, మృదుత్వం కొట్టొచ్చినట్లు ఉందని చెప్పారు.

ఈయన కవిత్వంలో శబ్దాడంబరం వుండదని, గుక్క తిప్పుకోనివ్వని సమాస బాహుళ్యం, అర్థం లేని అయోమయపు శబ్దచిత్రాలూ మచ్చుకైనా కనపడవని శిఖామణి భావించారు. పదబందాల నిర్మాణంలో, భావచిత్రాల రూపకల్పనలో ఇస్మాయిల్ ప్రతిభ అపురూపమైనది. సామాన్యమైన వస్తువును, విషయాన్ని అసమాన, ఉపమాన వైచిత్రితో రంగుల హరివిల్లులా ప్రదర్శిస్తారని రచయిత భావించారు. ఉదాహరణగా కొన్ని పదబందాలు: చీకటి చర్మం, ఉరుము మెమోలు, మెరుపు సంతకాలు, పచ్చటి గడ్డికత్తులు, చీకటిజీపు, జడివానల వేళ్ళ కొసలు, మొలక చనుమొనలు, మచ్చుదష్టరు, మెరిసే వాన సుద్దముక్క, బావి పిల్లలగోవి, నిదరబాల్చీ, పురుగుమబ్బులు, వేసవిక్రయము మొదలైనవి.

వచన కవిగా చలం – నేపథ్యం' వ్యాసంలో– తెలుగు కవిత్వాన్ని ఖండించి, దీవించి, ఊగించి, శాసించి, రక్షించే అపూర్వ శక్తిగా శ్రీశ్రీ కవిత్వాన్ని వర్ణించారు చలం. సరిగ్గా ఇవే మాటలు చలం సాహిత్యానిక్కూడా మనం అన్వయించుకోవచ్చు. రా.రా.మాటల్లో చెప్పాలంటే సుమారు మూడు దశాబ్దాల పాటు తెలుగు జాతిని తట్టి, తిట్టి, ఊపి, నిద్రలేపి, బాదించి, బోధించి, తనరచనల కొత్త కాంతితో కండ్లు చెదరగొట్టి కొత్త జ్ఞానంతో జీవితపు చీకటి కోణాలను వెలిగించి కొత్త జీవితానంద జ్యోతులతో కొడిగట్టిన హృదయాలను ఉద్దీపింప చేశారు చలం. చలం రాసిన నవలలు, కథలు, నాటకాలు, మ్యూజింగ్స్, ప్రేమలేఖలు, ఉత్తరాలు, కవిత్వం వీటన్నిటా ఒక నూతన సత్యాన్వేషణ ఉన్నదని దీనికోసం పరితపించటం కనిపిస్తుందని చెప్పారు. ఇంకా భాష, శైలి, భావజాలం మూడింటి గురించి కూడా శిఖామణి వివరించారు.

'జాషువా భావుకతకు పరాకాష్ట పిరదౌసి' వ్యాసం రాసారు. జాషువా పిరదౌసి కావ్యాన్ని 1932లో రాశారు. పార్శీ మహాకవి పిరదౌసి ఈ కావ్యానికి ఇతివృత్తం. నాలుగు ఆశ్వాసాల్లో ఈ కావ్యం సాగింది. 'రాళ్ళపల్లి వారి సృజనాత్మక రచనలు' వ్యాసంలో రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ రాసిన వేమన, సారస్వతోపన్యాసములు, సారస్వతాలోకము వంటి విమర్శ గ్రంథాలను, రాయలనాటి రసికత వంటి వ్యాసాల గురించి వివరించారు. 'పెద్దల కవిత్వంలో

పిల్లలు' వ్యాసంలో బాలసాహిత్యం రెండు రకాలుగా ఉంటుంది. పెద్ద కవులు రచయితలూ పిల్లలను దృష్టిలో ఉంచుకుని వారి కోసం రచనలు చేసే పద్ధతి ఒకటి. బాలకవులు రచయితలూ తాము చేసే సృజన రెండోది. 'తెలుగులో హైకూ! ప్రస్తావనలు' వ్యాసంలో జపనీయ భాషకు చెందిన ఈ హైకూ ప్రక్రియను తెలుగులో మొట్టమొదటిసారిగా ప్రస్తావించిన ఘనత ఇస్మాయిల్ గారికే దక్కుతుందని చెప్పారు. ఇంకా గాలినాసరరెడ్డి కవిత్వం 19 కవితలు, పెన్నా శివరామకృష్ణ 'రహస్యద్వారం' పేరుతో హైకూలు ఇంకా కొన్ని హైకూల ప్రస్తావన చేశారు. 'ఒకింత వేకువ కోసం' వ్యాసంలో ప్రధాన కథకుడూ, నవలా కారుడూ అయిన రావూరి భరద్వాజ 'ఒకింత వేకువ కోసం' గ్రంథం రాశారు. ఈ గ్రంథంలో భరద్వాజ కవిగా దర్శనమిస్తాడని రచయిత చెప్పారు. ఇంకా వచనానికీ, కవిత్వానికీ ఉన్న సన్నని సరిహద్దురేఖను చెరిపివేశారని, కవితాత్మ కొన్నిచోట్ల పరదా వెనుక దీపపు వెలుతురులా, వెనుక చంద్రుని దాచుకున్న మేఘపంక్తి కాంతిలా కనిపించిందని, మరికొన్నిచోట్ల చీకటి ఆకాశంలో మెరిసే తటిల్లతలా కళ్ళు మిరిమిట్లు గొలుపుతుందని శిఖామణి భావించారు. 'కళామూల్యాలెరిగిన విమర్శకుడు' వ్యాసంలో ఇస్మాయిల్ 'కవిత్వంలో నిశ్శబ్దం' విమర్శ గ్రంథంతో విమర్శకుడిగా పరిచయమై మంచి విమర్శకుడిగా గుర్తింపు పొందారు. గొప్ప విమర్శకుడిగా శిఖామణి వీరిని ఈ వ్యాసంలో తీర్చిదిద్దారు.

## 2.2.3 సమాంతర

ఈ విమర్శ గ్రంథంలో 15 విమర్శ వ్యాసాలు ఉన్నాయి. కొన్ని దళిత దృక్పథానికి సంబంధించినవి. మరికొన్ని దళితేతరుల కవుల గురించి ఉన్నాయి. 'ఇటీవల తెలుగు కవిత్వం' వ్యాసంలో ఇటీవల తెలుగు కవిత్వంలో దళిత, స్త్రీవాద ఉద్యమాలు కాస్త వెనకబడిన నేపథ్యంలో ముస్లింవాద సాహిత్యం, ప్రపంచీకరణ వ్యతిరేక సాహిత్యం, తెలంగాణ సాహిత్యం రంగం మీదకు వచ్చాయని వివరణ కనిపిస్తుంది. 'దళితకవిత్వ పరిణామం' ప్రాచీన కాలం నుండి భారతీయ సాహిత్యంలో వర్ణవ్యవస్థ నిరసించిన కవుల గురించి ప్రస్తుతం

దళిత సాహిత్యం పరిణామం చెందటానికి కృషి చేస్తున్న దళితకవుల, రచయితల, విమర్శకుల, కళాకారులను గురించి వివరించారు. 'బహుజన కవిత్వం - చారిత్రక దర్శనం' వ్యాసంలో ఎస్.సి. ఎస్.టి. బి.సి. మైనార్టీ కవులు దళిత సాహిత్య ఆవిర్భావ కాలంలో ఒక విశాల ప్రాతిపదికన సంఘటితమైనారని, ఆ తర్వాత కాలంలో నిర్దిష్టతల వైపు విడిపోయి సొంత చైతన్యాలవైపు అస్తిత్వాల వైపు ప్రయాణించారని తెలిపారు. చిక్కనవుతున్న పాట, పదునెక్కిన పాట,చిత్తరువు వంటి సంకలనాలు దళిత కవిత్వం పేరుతోనే వెలువడగా, బహువచనం, మేమే, మొగి వంటి సంకలనాలు 'దళిత బహుజన కవిత్వం' పేరుతో వెలువడ్డాయి అంటే అంతవరకూ ఎస్.సిల సమస్యలను తమ గొంతుతో పలికించిన బి.సి.లు, ఎస్.సి.లకే కాదు, తమకు సమస్యలు ఉన్నాయనీ, వాటి గురించి కూడా తాము గానం చెయ్యవలసిన అసవరాన్ని గుర్తించటం మొ॥ విషయాలు చర్చించారు. 'ముస్లింవాద సాహిత్యం - సవాళ్లు' వ్యాసంలో ముస్లిం రచయితలు కేవలం మతానికి మాత్రమే ముస్లింలు. సాహిత్య రచనల్లో మాత్రం కాదు, అంటే వారి సాహిత్యంలో ఇస్లాంకు సంబంధించిగానీ, తమపౌరసత్వాల సమస్యగానీ లేదా మతపరమైన ఏ అంశము ప్రతిబింబించదు. వీరు ప్రధాన సాహిత్య స్రవంతికి చెందిన రచనలు చేస్తూనే మరో పక్క తమ మతానికి చెందిన స్పందనలను, ఈ దేశంలో ముస్లింలు ద్వితీయశ్రేణి పౌరులుగా చూడబడటం, ఒక అభద్రతా వాతావరణం నుండి తమ అస్తిత్వాన్ని నిలుపుకోవడం కోసం రచనలు చేస్తున్నారని, ఇలాంటి సవాళ్ళు ముస్లింవాద సాహిత్యంలో ఉన్నాయని రచయిత భావించారు. 'తెలుగులో దళిత దీర్ఘ కవితలు' వ్యాసంలో జాషువా గబ్బిలం కావ్యం, అనాదఖండకావ్యం, బొజ్జాతారకం 'నది పుట్టిన గొంతుక'లోని 'నేను అస్పృశ్యుణ్ణి' వచన కవిత, మద్దూరి నగేష్‌బాబు : రచ్చబండ, లోయ, పుట్ట, పైడి తెరేష్‌బాబు హిందూమహాసముద్రం (క్యాసెట్) జూలూరి గౌరీశంకర్ : పాదముద్ర, సతీష్‌చందర్ - నాన్న సైకిలు, ఎండ్లూరి సుధాకర్ కొత్త గబ్బిలం, బన్న ఐలయ్య 'నిప్పుకణిక' మొ॥న దళిత దీర్ఘకవితల వివరణ ఉంది. 'వచన కవితా విమర్శ - చే.రా. మార్గం' వ్యాసంలో భాషాశాస్త్రం, ఛందశ్శాస్త్రం, కవిత్వం అభిమాన విషయాలని

వివరించారు. ఆధునిక కవిత్వం పట్ల మరీ ముఖ్యంగా వచన కవిత్వం పట్ల గొప్ప అభిరుచిని కలిగించారని, తనకు నచ్చిన అంతకు ముందటి ఆధునిక పద్య కవుల ఖండికలను వ్యాఖ్యానిస్తూనే వచన కవిత్వంలో సంపుటాల నుండి, ఒక్క ఖండిక సైతం వెలువరించిన వచన కవుల వరకూ చిన్న, పెద్ద తరతమభేదం లేకుండా విశ్లేషణ చేశారని శిఖామణి భావించటం ఈ వ్యాసంలో కనిపిస్తుంది.

'దళితగోడు జంగయ్య కవిత్వం' ఈ వ్యాసంలో  జంగయ్య రాసిన ఎచ్చరిక, గొర్రెలు, చీమల రంగులు కథా సంపుటాలు, నడుస్తున్న చరిత్ర, వెలుతురు, పావురాలు మొదలైన రచనలలో అంటరానితనాన్ని, అసమానాతల్ని, ఆకలినీ, మూఢనమ్మకాల్ని ఖండించడం కనిపిస్తుంది. 'తొలి దళితస్త్రీవాద కవిత్వం' వ్యాసంలో తెలుగు దళిత కవిత్వానికి మొదటిసారి దళితస్త్రీ దృక్కోణం అందించిన కవయిత్రి చల్లపల్లి స్వరూపరాణి ఆమె కవితా సంపుటి 'మంకెనపువ్వు'ను తెలుగులో తొలి దళిత స్త్రీవాద కవిత్వంగా నిరూపించటం కనిపిస్తుంది. 'కుల వాస్తవికతను గుర్తించిన శంబుక కవిత్వం' వ్యాసంలో ఒకే మాట, ఒకే చర్య ఇద్దరు వేర్వేరు కులాలవాళ్ళు చెప్తే, చేస్తే ఎలాంటి విపరీత అర్థాలు తీస్తారో వివరణ కనిపిస్తుంది.

'దళిత సాహిత్య వైతాళికుడు కుసుమధర్మ కవి' వ్యాసంలో కుసుమధర్మన్నకవి అయిదు విషయాలు మీద కృషి చేశారని అవి. 1. వైద్యం, 2. సాహితీ సృజన, 3. కళారంగం 4. పత్రికారచన  5.వ్యక్తృత్వం. వీటి ద్వారా కుసుమధర్మన్న కవిని దళిత సాహిత్య వైతాళికుడుగా నిర్ణయించారు. 'ఉద్యమ పతాక బొజ్జాతారకం' వ్యాసంలో జైలు జీవితం వీరిని కవిగా మలిచింది. 1983 'నది పుట్టిన గొంతుక' కవితా సంపుటిని రాశారు. ఇందులో కవిత్వం మూడు రకాలుగా ఉంది. అనుభూతి ప్రధానంగా సాగిన కవితలు ఒక రకం. హేతువాద, వర్గదృక్పథంతో సాగిన రచనలు రెండోరకం. వర్ణవివక్షను, దళితులపై దాడులను నిరసిస్తూ రాసిన దళిత కవిత్వం మూడోరకం. ఇలాంటి విషయాలు శిఖామణి ఈ వ్యాసంలో పొందుపర్చారు.

శిఖామణి సాహిత్యాన్ని సమీక్షించిన తర్వాత ఈ పరిశోధన వ్యాసానికి శీర్షికగా నిలిచినదే దళిత దృక్పథం. ఈ పరిశోధన దళిత సాహిత్యానికి సంబంధించినది. శిఖామణి సాహిత్యం–దళిత దృక్పథం అధ్యయనం చేయడం పరిశోధనాంశ లక్ష్యం. కనుక దీనిని అధ్యయనం చేసేముందు దళిత శబ్దం, దళిత సాహిత్య నిర్వచనం, దళిత సాహిత్య దృక్పథం, పరిణామం స్థూలంగా వివరించడం అవసరం.

## పాద సూచికలు

1. శిఖామణి, వివిధ, పుట : 9

## 3.1 దళిత శబ్దం

**'దళ్'** అనే ధాతు నిష్పన్న రూపమే దళితశబ్దం. దళిత పదానికి బహుజనపల్లి సీతారామాచార్యులు 'శబ్దరత్నాకరం' నిఘంటువులో 'దళము', 'దళనము', 'దళితము' ఈ పదాలకు భేదించుట, తుంచుట, నరకు, విరచు, ఖండింపబడినది, చీల్చబడినది అనే అర్థాలు కనిపిస్తున్నాయి. బ్రౌన్ నిఘంటువులో 'దళితము' అనే పదానికి Blow, expeneded, split, divided అనే అర్థాలు ఉన్నాయి.

### 3.1.1 తెలుగు సాహిత్యంలో 'దళిత' ప్రస్తావన

14వ శతాబ్దంలో 'దళిత' అనే పదం సాహిత్యంలో ప్రయోగించారు. అయితే ఆ పద ప్రయోగంలో ఈనాటి 'దళిత చైతన్యం' కనిపించదు. బమ్మెరపోతనచే రచింపబడిన శ్రీమహాభాగవతములోని అష్టమస్కంధం గజేంద్రమోక్షములో 'దళిత' అనే పదము ప్రయోగించాడు. (పోతన. బమ్మెర - 2000-100)

**"దళిత పదం ప్రాచీన మరాఠీ భాష నుండి తీసుకోబడింది. దీనికి నేల, ముక్కలుగా పగిలి పోయిన అని అర్థం. జ్యోతిబాపులే మొదటగా 'దళిత' శబ్దాన్ని జాతివాచకంగా విస్తృత ప్రచారంలోకి తీసుకొని వచ్చారు. కాని 1970 సం॥లో దళిత పాంథర్స్ ఉద్యమం వచ్చేంతవరకూ ఈ పదం విస్తృత ప్రాచుర్యానికి నోచుకోలేదని చెప్పుకోవాలి."**[1]

తెలుగు సాహిత్యంలో బలిజేపల్లి లక్ష్మీకాంతకవి 'సత్యహరిశ్చంద్రీయము (1912) అనే నాటకంలో దళిత అనే పదాన్ని ప్రస్తావించారు.

దళిత కావ్యం 'నిరుద్ధ భారతము (1915)ను రచించిన మంగిపూడి వెంకటశర్మ 'దళిత' అనే పదాన్ని వాడాడు. ఈ సందర్భంలో వీరు 'చీల్చబడిన జాతి వలన వారిగా సవర్ణులకు (అగ్రవర్ణాలవారికి) చురకవేశాడు.

సత్యహరిశ్చంద్రుడు స్మశానంలో కాటికాపరి వీరబాహుడి దాసుడిగా కాటిసుంకం గురించి చెప్పే సందర్భంలో (ప్రసాద్. కలేకూరి. 2002:15) దళిత పదం ప్రయోగించారు.

## 3.2 దళితులంటే ఎవరు

**"కులవ్యవస్థ కారణంగా రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అణచివేయబడిన శ్రామికులే దళితులు"**[2] – కె. సత్యనారాయణ

**"మనిషి మనుగడకు కనీస అవసరాలైన కూడు, గుడ్డ, గూడు నోచుకోని నిర్భాగ్యులు. ఊరికి దూరంగా ఉండి ఉనికిని కోల్పోయినవాళ్ళు, సభ్య ప్రపంచంలో సరైన సంబంధాలు లేని వాళ్ళు, నిత్యపీడితులు, నిత్యతాడితులు, అవమానాలకు, అత్యాచారాలకు గురవుతున్నవాళ్ళు"**[3] – ఎండ్లూరి సుధాకర్

**"తరతరాలుగా అస్పృశ్యతకు గురై, మతం పేరిట, సాంస్కృతికంగా హీనంగా చూడబడి విద్యాసౌకర్యాలు కరువై సమాజంలో ఉంటూ కూడా ప్రధాన జీవన స్రవంతికి దూరమై ఆర్థికమైన అణచివేతకు, శ్రమదోపిడీకి గురైనవాళ్ళు"**[4] – కె.కె. రంగనాథచార్యులు

**"దళితులంటే సాంఘిక దోపిడికి గురి అవుతున్నవాళ్ళు, అస్పృశ్యులుగా పరిగణింపబడుతున్నవారు, నీచవృత్తులుగా భావింపబడుతున్న వృత్తులు చేసుకుంటున్నవారు, శారీరక శ్రమపై ఆధారపడి బతుకుతున్నవారు"**[5] – ఎస్వీ సత్యనారాయణ

శిఖామణి ప్రకారం – **"అస్పృశ్యత ఉన్న కులాలనే దళితులుగా గుర్తించవచ్చు."**[6] **"దళితులంటే ఎస్.సి. ఎస్.టి. బి.సి మైనారిటీ మతస్తులు. అంతా కలిపి దళితులే"**[7] – జి. లక్ష్మినరసయ్య.

ఇలా దళితులంటే ఎవరు అనే విషయం దళిత సాహిత్యం రాస్తున్నవాళ్ళలో ఎక్కువమంది ఏదో ఒక సందర్భంలో ప్రస్తావించారు. మొదట్లో శ్రామిక దృక్పథంతో దళితులను గుర్తించారు. తర్వాత కేవలం అస్పృశ్యతకు గురైనవాళ్ళే దళితులన్నారు. ప్రస్తుతం శ్రామిక, అస్పృశ్య స్త్రీలందరిని దళితులుగా అంగీకరిస్తున్నాను.

### 3.2.1 దళిత సాహిత్య నిర్వచనం

1958లో దళిత రచయితల మొదటి మహాసభ బొంబాయిలో జరిగింది. ఆ సభలో దళిత సాహిత్యాన్ని నిర్వచించారు.

1. దళితులు తమ ఆవేదనను, తమ ఆర్తిని యుగయుగాలుగా అనుభవించిన వివక్షతలను తామే స్వానుభవంతో ఆ అనుభవాలను అక్షరీకరించుకోవడం దళిత సాహిత్యం.

2. దళితుల ద్వారా దళితుల కోసం రాయబడే సాహిత్యమే దళిత సాహిత్యమని ఒక వర్గం

3. ప్రగాఢమైన సంవేదన, తిరుగుబాటుతత్వం, మార్పుకోసం పోరాట నిర్దేశం చేసేదే దళిత సాహిత్యమని వేరొక వర్గం

4. దళితుల ప్రయోజనాల కోసం ఎవరు రాసినా, అది దళిత సాహిత్యమేనని మరొక వర్గం

5. **"దళితులంటే అంటరానితనం, మాల, మాదిగ కోవకు చెందినవారని వీరి సాహిత్యమే దళిత సాహిత్యం"**[8] – శివసాగర్

**"దళిత చైతన్యంతో రాసిన సాహిత్యమే దళిత సాహిత్యం. ఇది శాస్త్రీయమైనదని నా భావం. అస్తిత్వమే చైతన్యమయినపుడు సాహిత్యమే దళిత సాహిత్యమవుతుంది"**[9] – శివసాగర్

**"సాహిత్యంలో అగ్రకుల స్వభావం లేకుండా అట్టడుగు వర్గాలవారి ఆలోచనలను ప్రతిబింబించేదే దళిత సాహిత్యం"**[10]

**"మరాఠీ కవి యోగీంద్ర "దళిత జీవితాన్ని చిత్రించేది దళిత సాహిత్యం"**[11]

**"దేశంలో సామాజిక మార్పును సహజంగానే వేగవంతం చేసే నూతన విలువలు, నూతన ఆలోచనలతో నిండిన సాహిత్యమే దళిత సాహిత్యం"**[12]

**"ఒక విప్లవాత్మక సంఘటన ఫలితంగా జన్మించిన తీవ్రమైన తిరుగుబాటు యొక్క వ్యక్తీకరణ రూపమే దళిత సాహిత్యం"**[13]– మరాఠీ రచయిత వాఖండే

**"ప్రాథమికంగా దళితుల కోసం రాసినది దళిత సాహిత్యం"**[14] – కమలాకర్

దళితులు తమ ఆవేదనను, ఆర్తిని యుగయుగాలుగా అనుభవించిన వివక్షతల్ని, వెలివేతను స్వానుభవంతో అక్షరబద్ధం చేసుకోవడమే దళిత సాహిత్యమని చెప్పారు.

## 3.3 దళిత సాహిత్యం – దృక్పథం

దళిత సాహిత్యం ప్రాచీనమైన, సాంప్రదాయక స్వభావం కలిగిన సామాజిక నిర్మాణాన్ని తిరస్కరిస్తుంది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం వంటి విలువలు ప్రాతిపదికగా నిర్మించబడే సమాజం పట్ల విధేయత కలిగి ఉంటుంది. మనువాద సాహిత్యానికి ఇది వ్యతిరేకమైనది. దళిత సాహిత్యం హేతువాద దృష్టిని కలిగి ఉండి పురాణ భావనలు, మత సిద్ధాంతాలు అశాస్త్రీయమైన భావనలు మొ॥వాటిని తిరస్కరిస్తుంది. హేతువుకు అందని అతీంద్రియ భావనలను నిరసిస్తుంది.

సమాజంలో సంస్కరణ భావాలు రేకెత్తించేందుకు సాహిత్యం ఒక సాధనం కావాలని దళిత సాహిత్యం భావిస్తుంది. సాహిత్యం కేవలం వినోదం కోసం కాకుండా, సామాజిక చైతన్యం కల్గించాలని భావిస్తుంది. అందుకే 'కళ కళ కోసమే' సిద్ధాంతాన్ని నిర్ద్వంద్వంగా ఖండిస్తూ 'కళ సమాజం కోసమే' అనే దృక్పథం నుండి మాత్రమే సాహిత్యాన్ని మూల్యాంకనం చేయాలని ఈ సాహిత్యం అభిప్రాయపడుతుంది.

దళిత సాహిత్యం అనుభూతి విశిష్టమైనది. జీవితాన్ని యథాతథంగా ప్రతిబింబించడం దీని లక్షణం. ఇది కుల, మత, వర్గ, ఆర్థిక, రాజకీయ, సామాజిక ఆధిపత్య స్వభావం నుంచి మనిషికి స్వేచ్ఛను కలిగించే దిశగా కొనసాగుతుంది. దళిత దృక్పథంలో జీవితమే సాహిత్యం కాబట్టి సాహిత్యానికి, ప్రజలకు మధ్యగల ఖాళీని పూరించే దిశగా ఇది కృషి చేస్తుంది.

**"మానవతా వాదాన్ని వ్యతిరేకించే సాహితీ సంస్కృతులపై దళిత సాహిత్యం నిర్విరామ పోరాటం చేస్తుంది. మానవతావాదం తన ప్రధాన ఇతివృత్తంగా దళిత సాహిత్యం ప్రకటిస్తుంది. అందుచేతనే మానవుడు కేంద్రంగా ఈ సాహిత్య సృజన జరుగుతున్నది"** [15] మానవుని కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ అతనిలో చైతన్యం నింపుతుంది. దీనికోసం దళిత సాహిత్యం పీడితుల ఆశలు, ఆశయాలు, అనుభవాలు, అనుభూతులను చిత్రిస్తుంది.

అణచివేత, దోపిడీలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి, సామాజిక, ఆర్థిక న్యాయం కోసం పోరాడటం దీని ప్రధాన లక్షణం.

స్వీయత్వం కోసం అన్వేషించటం దళిత సాహిత్య మరో లక్షణం. అందువలనే దళితుల ఐక్యత అవసరాన్ని ఇది గుర్తించింది. ఈ గుర్తింపే దళితుల సామాజిక చైతన్యానికి స్ఫూర్తి నిచ్చింది.

**"దళిత సాహిత్యం 'సత్యం, శివం, సుందరం' అనే మూల భావనలను నిరసిస్తుంది."**[16]

దళిత సాహిత్యంలో రెండు విభిన్న చైతన్య సమితులను విమర్శకులు గుర్తించారు.

1. మితవాద స్రవంతిలో దళిత అనుభవాల వ్యక్తీకరణతో పాటు, కులవ్యవస్థలోని అమానవీయత, దురభిమానాలను వర్ణిస్తూ నూతన సామాజిక, సాంస్కృతిక చైతన్యాన్ని ఆశించటం కనిపిస్తుంది. దళితుల యొక్క కష్టాలు, ఆర్తిని వర్ణించటం దీనిలో ప్రధానం. ఇలాంటి వాటిలో తిరుగుబాటు ధోరణి కనబడదు.

2. అతివాద స్రవంతిలో వ్యవస్థపై తిరుగుబాటు, హిందూమతతత్వం విధించిన పరిమితులను ధిక్కరించే ధోరణి కనపడుతుంది. హిందూమతం మౌలికతత్వాన్ని, అది ప్రచారం చేసే కర్మసిద్ధాంతాన్ని పరమాత్మ, పునర్జన్మ మొదలైన వాటిని ఇది తీవ్రంగా నిరసిస్తుంది. ఈ పరంపరలో కవులు తమ కవిత్వంలో ఉపయోగించే ప్రతీకలు, అలంకారాలలో సమాజ స్వభావం పట్ల వ్యక్తం చేసే అసహనం, నిరసన స్పష్టంగా కనిపిస్తుంది.

ఉన్నతవర్గాలు కూడా దళితుల గురించి ఆలోచించేటట్లు చేసింది. దళితుల మానసిక దాస్య విమోచన కోసం ప్రయత్నించటం మరో ప్రధాన లక్షణం. తామంతా ఒక జాతి అని గుర్తించేందుకు, తమవ్యక్తిత్వాన్ని అవగాహన చేసుకోవటానికి గల చైతన్యాన్ని కల్గించేందుకు దళిత సాహిత్యం కృషి చేస్తుంది. నిజాయితీ, విమర్శనాత్మక ధోరణి ఉన్న దళిత సాహిత్యం దళితులలో ఉన్న ఆత్మన్యూనతాభావాలను తొలగించి వీరిని బానిస మనస్తత్వం నుండి విముక్తి చెందేందుకు సహకరిస్తుంది. దళిత సాహిత్యంలోని మౌలికాంశాలలో ఇది చాలా ముఖ్యమైనది. ఈ దృక్పథాన్ని అర్థం చేసుకోకపోతే దళిత సాహిత్యాన్ని అర్థం చేసుకోలేం.

అంబేద్కర్, ఫూలే, మార్క్స్ రచనలను అర్థం చేసుకోవాలి. భారతదేశంలో కులాన్ని, దాని వికృత స్వభావాన్ని సహృదయంతో అర్థం చేసుకోవాలి.

## 3.4 దళిత సాహిత్యం -పరిణామం

దళిత సాహిత్యానికి ఫూలే, అంబేద్కర్‌ల సాహిత్యాన్ని భూమికగా పేర్కొని 1990 వ దశకంలోనే దళిత సాహిత్యం ప్రధాన సాహితీ స్రవంతిగా రూపొందింది. కారంచేడు, చుండూరు వంటి చోట్ల దళితులపై జరిగిన అమానవీయ సంఘటనలు తెలుగులో దళిత చైతన్యానికి, దళిత సాహిత్యం ప్రధాన స్రవంతిగా రూపొందటానికి కారణమైంది.

### 3.4.1 పూర్వరంగం

ఆధునిక భారత పునరుజ్జీవనం రాజారామమోహన్‌రాయ్ (1772-1833) వంటి సంఘసంస్కర్తలతో ప్రారంభమైనదని చరిత్రకారులు భావిస్తున్నారు. దీనికి ముందు మధ్యయుగంలో భక్తి ఉద్యమరూపంలో కులవ్యవస్థపైన, మతదురాచారాలపైన, ఆడంబరాలపైన తిరుగుబాటు మొదలైందని చెప్పవచ్చు. కబీర్, నామ్‌దేవ్, తుకారామ్, రామదాసు, పెన్నా, దన్నా మొ॥న వారు మహారాష్ట్రలో భక్తి ఉద్యమాన్ని నడిపి కులవిభేదాలకు, మత మౌఢ్యానికి వ్యతిరేకంగా కింది కులాలవారిని చైతన్యవంతులను చేశారు. అలాగే బెంగాల్‌లో విద్యావతి, రాజస్థాన్‌లో మీరాబాయి, పంజాబ్‌లో గురునానక్‌లు కులవిభేదాలను నిరసించారు. ఈ భక్తి ఉద్యమానికి ముందే 'తెలుగుదేశం'లో బ్రహ్మనాయుడు 'చాపకూడు'ను అమలు చేయటం ద్వారా కుల నిర్మూలనా చైతన్యానికి దోహదం చేసినట్లుగా తెలుస్తుంది.

### 3.4.2 తెలుగు సాహిత్యంలో కుల ప్రస్థావన

**"సామాజిక ప్రభావం సాహిత్యంలోనూ కనిపిస్తుంది. 15వ శతాబ్దంలో గౌరన రాసిన హరిశ్చంద్రనలోపాఖ్యానంలో కులప్రసక్తి కనబడుతుంది. చండాలుడైన వీరబాహుడు హరిశ్చంద్రుని కొనటానికి సిద్ధపడగా, రాజునరేంద్రుడు 'మాలవాడవు నేవేమి కొనగలుగుదువు' అని నిందించగా, వీరబాహుడు ఆ రాజును నిలదీసి మాట మాటికి నన్ను మాలవాడంచు నీకురోయగనేల నీ తండ్రి కులము నా కులంబును నొక్క నాణెమై**

**యుందు నిప్పుడే నెటుంటినేమి"**[17] అని ప్రశ్నిస్తాడు. ఇలా కుల వైరుధ్యాలను గురించిన చర్చ తెలుగు సాహిత్యంలో మొదటి సారిగా మనకు కనబడుతుంది.

ఉత్తర భారతదేశంలో మాదిరిగా తెలుగు దేశంలో కూడా ఒక ప్రత్యేక స్రవంతిగా భక్తి సాహిత్యం కొనసాగింది. కబీరులాగా కృష్ణమాచార్య, అన్నమయ్య, తాళ్ళపాక తిమ్మక్క, త్యాగయ్య, క్షేత్రయ్య మొ॥న కవులు భక్తి కవులుగా పేరు పొందారు. ఈ కవుల భక్తిని ప్రచారం చేస్తూ ఆనాటి సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా సాహిత్యాన్ని సృజనీకరించారు. కర్మకాండలు, ఆడంబరాలను నిరసించటం, కులభేదాలను వ్యతిరేకించటం భక్తి సాహిత్యంలో సహజలక్షణాలుగా కనిపిస్తుంది. ఈపరంపరంలోనే వీరబ్రహ్మం తన సాహిత్యం ద్వారా నిమ్నవర్గాలను, వృత్తికారులను సాంస్కృతికంగా చైతన్యపరిచారు. సమాజంలో పాతుకుపోయిన కులవ్యవస్థను ఖండించటం ద్వారా మానవతావాదానికి బీజాలు వేసినదిగా ఇది నిలిచింది.

## 3.4.3 ఉద్ధరణ చైతన్యం

ఈకాలంలో వచ్చిన సాహిత్యం అధికంగా విజ్ఞప్తి ఉద్ధరణ వాద చైతన్యాన్ని ప్రతిఫలించిందని భావించవచ్చు. దళితులు తమ స్థితిగతుల్లో మార్పు కోరుతూ విజ్ఞప్తి చేయటం, దళితేతరులు సామాజిక నిర్మాణ క్రమంలో అట్టడుగున ఉన్న దళితులను ఉద్ధరించాలనే ఉద్దేశ్యంతో వర్ణవ్యవస్థను నిరసించటం ఈ కాలపు సాహిత్యంలో అధికంగా కనిపిస్తుంది. అగ్రవర్ణ దృక్పథం నుంచే దళిత జీవిత చిత్రణ జరిగిందని దళిత సాహితీ వేత్తలు భావిస్తున్నారు. సంఘాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించటం ఈ కాలంలోనే ప్రారంభమైంది. ఇలా గొప్ప ఆలోచనలతో సంఘ విమర్శకు బీజాలు వేసిన వ్యక్తిగా వేమన కనిపిస్తారు. సమాజంలో పెరిగిపోతున్న హింస, మూఢనమ్మకాలు, మత విశ్వాసాలపై వేమన తన సాహిత్యం ద్వారా తిరుగుబాటు చేసారు. మూడు శతాబ్దాల క్రితమే కులవ్యవస్థ, అస్పృశ్యతలపై వేమన చేసిన తిరుగుబాటు తెలుగువారి సామాజిక విముక్తి పోరాటానికి, సాంఘిక పునరుజ్జీవనోద్యమానికి స్ఫూర్తి నిచ్చింది.

సమాజంలో హెచ్చుతగ్గులు కల్పించిన మతాన్ని నిరసిస్తూ, కులభేదాల వెనకగల ఔచిత్యాన్ని ప్రశ్నిస్తూ

**"మాలవాని నేల మరి మరి నిందింప**

**నొడల రక్తమాంస మొకటి గాదె**

**వానిలోన మెలగు వాని కులంబేది"**[18] అని అంటాడు ఇలాంటి కులభేదాలను సమూలంగా నిర్మూలించాలన్నది వేమన భావన. అందుకే

"కులములేనివాడు కలిమిచేవెలయును

కలిమి లేనివాడు కులముదిగును

కులము కన్న మిగుల కలిమి ప్రధానంబు" అంటాడు.

సామాజిక, ఆర్థిక వ్యవస్థల పరస్పర సంబంధాన్ని పరిశీలించటం ద్వారా వేమన కులంతో పాటుగా వర్గం యొక్క ప్రాధాన్యతను సైతం గుర్తించాడు.

**"సంఘ సంస్కరణోద్యమ కాలంలో కందుకూరి వీరేశలింగం వంటి సంస్కర్తలు ఆనాడు ఉనికిలో ఉన్న సామాజిక నిర్మాణంలో రాజీ పడటంతో భక్తి ఉద్యమ సంప్రదాయం కొనసాగలేదని కొందరు విమర్శకుల భావన**"[19]. వేమన తరువాత కుల, మత, వర్ణ వ్యవస్థలను విమర్శిస్తూ సాహిత్య రచన చేసిన వ్యక్తిగా గురజాడ అప్పారావు కనిపిస్తారు. ఈయన 'లవణరాజు కల' గేయంలో వర్ణ ధర్మాన్ని ఇలా నిరసించాడు.

**"మలిన వృత్తులవారని**

**కులము వేర్చిన బలియురొక, దే**

**శమున కొందరె వెలికి దోసిరి**

**మలినమే మాల!**

**మలిన దేహుల మాలలనుచును**

**మలిన చిత్తుల కధిక కులముల**

**నెలవొసంగిన వర్ణధర్మము**

**ధర్మమధర్మంబే?"**[20]

అంటూ మంచి ప్రధానం కానీ కులం కాదనీ మలిన చిత్తులైతే అగ్రకులాల వారైనా, హీనులేనని, మలిన దేహులైనంత మాత్రాన మాలలను అంటరాని వారుగా చూడటం పట్ల నిరసన వ్యక్తం చేశారు.

అంతేకాక మంచి, చెడు అనేవి రెండే కులాలుగా గురజాడ పేర్కొన్నాడు.

**"మంచి చెడ్డలు మనుజులందున**

**యెంచి చూడగ, రెండు కులములు**

**మంచియన్నది, మాలయైతే**

**మాలనే, అగుదున్!"** [21]

ఆ తరువాత జాతీయోద్యమంలో భాగంగా సాగిన వందేమాతరం ఉద్యమకాలం నుండి వెలువడిన సాహిత్యంలో దళితుల సమస్యలు కొంతవరకు ప్రతిఫలించాయని భావించవచ్చు.

1909లో ఆంధ్రభారతి పత్రికలో అస్పృశ్యతకు వ్యతిరేకంగా వచ్చిన మాలవాంఛ్ర పాటను మొదటిదిగా భావిస్తున్నారు.

**"అందారు పుట్టిరి హిందమ్మతల్లికి**

**అందారు ఒక్కటై ఉందారి సక్కంగ**

**కష్టమ్ములొచ్చిన నిష్టూర మొచ్చీన**

**ఇష్టముగా నుండి కట్టూగ నుందాము"**[22]

అయితే ఈ కాలంలో దళితులు తమరచనల్లో విజ్ఞాపనలు చేయటం అధికంగా కనిపిస్తుంది.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి రాసిన 'సాగరసంగం' (1931) తెలుగులో దళిత జీవితాన్నిచిత్రించిన మొదటి కథగా గుర్తింపు పొందింది. తరువాత బందా కనకలింగేశ్వరరావు, వేలూరి శివరామశాస్త్రి, కరుణకుమార, అనిశెట్టి సుబ్బారావు, అడవిబాపిరాజు, గోపీచంద్ లాంటి వారు దళితుల జీవితాలను వీరి రచనల్లో పేర్కొన్నారు.

శ్రీపాదవారి 'ఇలాంటి తవ్వాయి వస్తే....? బందా కనకలింగేశ్వరరావు 'గుక్కెడునీళ్ళు' కథల్లో అంటరానితనం ప్రధానంగా కనిపిస్తుంది. కరుణకుమార రాసిన పోలయ్య 'కొత్తచెప్పులు' వంటి కథల్లో దళితుల సమస్యల వాస్తవిక చిత్రణ కనిపిస్తుంది. గోపీచంద్ 'చెప్పులు కుట్టేవాడు' కథలో వారి జీవితాలను చిత్రించటం చూడవచ్చు.

సమకాలీన సమాజాన్ని ఉన్నది ఉన్నట్లుగా చిత్రించిన సాంఘిక నవల 'శ్రీరంగరాజ చరిత్రము (1872). ఇతివృత్త పరంగా వర్ణవ్యవస్థ పరిధులను అతిక్రమించినట్లుగా కనిపిస్తున్నది. అస్పృశ్యత ప్రధానాంశంగా వచ్చినది తల్లాప్రగడ సూర్యనారాయణరావుగారి హేలవతి (1913). పేడలోని గింజలను ఏరుకొని వండుకుతినే దళితుల దయనీయస్థితిని వర్ణిస్తూ దళితుల పట్ల అగ్రకులాల ధోరణిలో మార్పు రావాలని రచయిత భావించాడు. వేంకట పార్వతీశకవుల 'మాతృమందిరం' (1919), ఉన్నవలక్ష్మీనారాయణ 'మాలపల్లి' (1922) అస్పృశ్యత ఇతివృత్తం గల ప్రధాన నవలలు.

ఇంకా ఆచార్య ఎన్.జి.రంగా (హరిజన నాయకుడు), వట్టికోట ఆళ్వారుస్వామి (ప్రజలమనిషి) ముప్పాళ్ళ రంగనాయకమ్మ (బలిపీఠం), దాశరథి రంగాచార్య (చిల్లరదేవుళ్ళు) డా॥కేశవరడ్డి (బానిసలు, స్మశానం దున్నేరు) వంటివారు తమ రచనలో కులసమస్యలను, కులసంబంధాలను విభిన్న కోణాల్లో పరిశీలించారు.

దళితుల మౌలిక సమస్యలైన అస్పృశ్యత, కులవివక్ష దళితేతరుల రచనలలో మౌలిక సమస్యలుగా ఆవిష్కరించబడలేదని, దళితేతరులు తమ రచనల ద్వారా సంస్కరణలు, సవరణలు సూచించినా సామాజిక నిర్మాణాన్ని ప్రశ్నించే ప్రయత్నం చేయలేదని దళిత విమర్శకులు భావిస్తున్నారు. అయితే వీరు సామాజిక నిర్మాణాన్ని ప్రశ్నించకపోయినా ఈ కాలంలో అస్పృశ్యత ప్రధాన సమస్యగా ఎక్కువగా సాహిత్యం వెలువడటం సంతోషకరం. 1920వ దశకంలో వచ్చిన జాతీయోద్యమ సాహిత్యం దళిత సమస్యను కొంతమేరకు ప్రతిబింబించింది. దళిత అనుభూతులతో నిండిన దళిత సాహిత్యం రాలేదని దళిత సాహిత్యకారుల అభిప్రాయం.

### 3.4.4 సామాజిక నిరసన చైతన్యం

ఆంధ్రలో సామాజిక అణచివేతల నుండి దళితులను విముక్తి చేసి, వారిని చైతన్యవంతులుగా చేసే ఉద్దేశ్యంతో 'ఆది – ఆంధ్ర మహాసభ' స్థాపించారు. మొదటిసారిగా సమావేశం 1917 నవంబర్ 4,6 తేదీలలో బెజవాడలో భాగ్యరెడ్డివర్మ అధ్యక్షతన జరిగింది. ఆత్మగౌరవం, సామాజిక సమానత్వం కోరుతూ దళితులు చేసిన మొదటి ప్రయత్నంగా చెప్పవచ్చు. ఇలా జరిగిన ఆది – ఆంధ్ర మహాసభ సమావేశాల ద్వారా దళితులు చైతన్యవంతులైనారు. ఉద్యమానికి నాయకత్వం వహించిన భాగ్యరెడ్డివర్మ, సుందు వెంకయ్య, కుసుమధర్మన్న ప్రముఖులుగా గుర్తింపుపొందారు. క్రిస్టియన్ మిషనరీల కృషి ఫలితంగా పాశ్చాత్య విద్య కొంత వరకు దళితులలో సైతం వ్యాపించింది. దీని వలన కృష్ణా, గోదావరి, గుంటూరు జిల్లాలో ఆది – ఆంధ్ర మహాసభలు విస్తృతంగా జరిగాయి. దళిత రచయితలు, కవులు తమ రచనలో నిరసన భావనను వ్యక్తం చేసారు.

జాలారంగస్వామి రాసిన 'అంటరాని వారెవరు?' (1930) గేయంలో మొదటిసారి సామాజిక నిరసన కనపడుతుంది.

**"ధాన్యపురాసుల దంపుటలోను దప్పులేదటయ్యా**
**కాటికి ఇంటికి కాపలియున్న కాన్పడదేయంటు**
**కాయకూరలు తెచ్చి యిచ్చిన కావాలంటారు**
**పాలను పండ్లను ప్రేమతోనివ్వగ పట్టుకుపోతారు**
**ఉప్పునిప్పును ముట్టగ మమ్ము తప్పునియంచేరు**
**నీటికి గాలికి అంటే యంచు నీల్గుచు నుండేరు"**[23]

అని నిలదీయటం చూడవచ్చు. గరిమెళ్ళ సత్యనారాయణ రాసిన అస్పృశ్యత సిద్ధాంత నిరసనము' అనే గేయంలో

"అంటరాని వాడని నన్నంటే ఇక ఒప్పుకోను
ఒంటరి! నీకిష్టము. లేకుంటే అటు తొలగిపొమ్ము"అంటూ నిరసన వ్యక్తం చేసారు.

ఇంకా నక్కా చినవెంకయ్య (హరిజన కీర్తనలు, అంటుదోషం, జీవహింస) తన గేయాల్లో అస్పృశ్యతను ఇతివృత్తంగా తీసుకున్నారు. కుసుమధర్మన్నకవి నల్లదొరతనాన్ని ప్రశ్నించినతీరును, తిరస్కరించిన విధానము 'నల్లదొర తనము' (1933) అనే గేయంలో చూడవచ్చు.

**"మాకొద్దీ నల్లదొరతనము – దైవమాకొద్దీ నల్లదొరతనము**

**మాకు పది మందితోపాటు – పరువుగలుకకయున్న ॥మాకొద్ది॥**

**మాలలంటిన దాన్ని మేమంటుకోమని – హెచ్చుగ బహుచెప్పుతారుఏ**

**ఆసపత్రి మందూలడుతారు –మాలమందులక్కడ తాగుతారు**

**పాలు పితికిస్తే పుచ్చుకుంటారు – దేవమందూ మాట మరచి**

**మాల, మాలంటారు దేవ॥"**[24]

తెలుగు సాహిత్యంలో సామాజిక అసమానతలపైన తిరుగుబాటు చేసిన ప్రముఖ దళితకవిగా 'గుర్రం జాషువా'ను గుర్తించవచ్చు. ఈయన రాసిన కావ్యం 'గబ్బిలం' (1914)లో సామాజిక నిరసన ప్రధాన వస్తువుగా కనిపిస్తుంది. వర్ణవ్యవస్థలో దళితుని స్థానాన్ని నిరసిస్తూ, హిందూమతాన్ని నాలుగు పడగల నాగరాజుతో పోల్చటం గబ్బిలంలో చూడవచ్చు.

**"ఆయభాగ్యుని రక్తమునాహరించి**

**యినుపగజ్జల తల్లి జీవనము సేయు**

**గసరి బుసకొట్టు నాతని గాలిసోక**

**నాల్గు పడగల హైందవ నాగరాజు"**[25]

భారతదేశంలో దళితుల స్థితిని, మనిషిని జంతువుకన్నా హీనంగా చూచే సంస్కృతిని జాషువా ఇలా నిరసించారు.

**"కనపడలేదు దైవతముగాని పదార్థము భారతంబునన్**

**గనుపడలేదు వర్ణనము కన్న మహాకళ భారతంబునన్**

**కనుపడలేదు సత్కులము కన్న పిశాచము భారతంబునన్**

**గనుపడలేదు పంచముని కన్నను నీచపు జంతువేదియున్"**[26]

వీరు రాసిన 'అనాధ'లో కూడా ఇలాంటి నిరసన కనపడుతుంది.

కొలకలూరి ఇనాక్ 'ఊరబావి కథలు' దళిత వేదనను వాస్తవికంగా కనిపిస్తున్న కథలుగా పేరు వచ్చింది. ఇవి అస్తిత్వం కోసం దళితుడు పడే తపనకు ప్రతిబింబాలుగా నిలుస్తాయి. రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, కె.లక్ష్మీనారాయణల సంపాదకత్వంలో వచ్చిన 'దళితకథలు' కథా సంకలనం, బి.యస్.రాములుగారి 'పాలు' కథల సంపుటి దళిత సమస్యలు చిత్రించిన రచనలుగా ఖ్యాతి వచ్చింది.

బోయజంగయ్య రాసిన 'జాతర' బి.ఎస్.రాములు రాసిన 'బతుకుపోరు' నవలలో సామాజిక నిరసన ప్రధానంగా కనిపిస్తుంది. అయితే కవిత్వం, కథ, గేయ ప్రక్రియలలో కనిపించిన నిరసన చైతన్యం నవలల్లో లేదు. బోయి భీమన్న రాసిన 'రాగవాశిష్టం', వేదవ్యాసుడు, ధర్మవ్యాధుడులలో మనువాదంపై నిరసన వ్యక్తం చేయడం ప్రధానంగా కనిపిస్తుంది. పత్రికారంగంలో కూడా భాగ్యరెడ్డివర్మ (భాగ్యనగర్), కుసుమధర్మన్న (జయభేరి) మొ॥వారు దళిత సమస్యలపై ఎక్కువగానే కృషి చేసినట్లుగా తెలుస్తుంది.

## 3.4.5 సైద్ధాంతిక ప్రతిఘటనా చైతన్యం

దళిత సాహిత్యం జ్యోతిబాపులే, సాహుమహరాజ్, డా॥అంబేద్కర్, కారల్‌మార్క్స్, మహోల సిద్ధాంతాలు, నల్లజాతి సాహిత్యంలోని తిరుగుబాటు దృక్పథం తన తాత్త్విక భూమికగా నిర్మించుకొని 1960–70ల మధ్య సైద్ధాంతికంగా పునాదిని ఏర్పరచుకొన్నది. ఈ నేపథ్యంలో 1987 అక్టోబరు 8 నుండి 10 వరకు అఖిలభారత దళిత రచయితల ప్రథమమహాసభలు హైదరాబాద్ నుందు జరిగాయి. దీనివలన మంచి సృజన రచనలకు స్ఫూర్తి కల్గింది. ఈ సమావేశంలోనే 'అఖిలభారత దళిత రచయితల సంఘం' ఏర్పడింది

దళిత గీతాల పరంగా మంచి పేరున్న మాష్టార్జీ రాసిన 'అందుకో దండాలు' వింటివా మల్లన్న' వంటి గేయాలు బహుళ ప్రచారం పొంది దళిత చైతన్యానికి కారణమైనాయి.

'అందుకో దండాలు' గేయం దళిత మహాసభలల్లో ప్రార్థనా గీతమైంది. ఈ గేయంలో

**"అందుకో దండాలు - బాబా అంబేద్కరా**
**అంబరాన ఉన్నట్టి - సుక్కేలు గురవంగో**
**ముందుగా నినుదలచె - పాటలు పాడేము**
**చీకటి మా బ్రతుకుల్లో - సూర్యుడు పొడవంగో"**[27]

వాస్తవికమైన ప్రతిభను గురించిన చర్చ 'వింటివా మల్లన్న' గేయంలో కనపడుతుంది.

**"ఆదికవి వాల్మీకితో - మొదలైననమాప్రతిభ**
**ఆగలేదు ఏనాడూ - అంబేద్కరు వరకు నేడు**
**కవికోకిల జాషువా - మహాకవి భీమన్న**
**విప్లవకవి శివసాగర్ - ప్రజాకవి గద్దర్‌లో**
**ప్రతిభ లేదనే దమ్ము - ఎవడికైన ఉందారా"**[28] అని ప్రశ్నించారు.

ఏటుకూరి ప్రసాద్, విజయలక్ష్మి, సుంకం ఒడ్డయ్య, ప్రసాద్ మొ॥ కవులు ఇలాంటి ప్రతిఘటనా స్ఫూర్తిని కలిగించే అనేక గేయాలు రాశారు.

విప్లవపోరాటం నేపథ్యంగా, వర్గపోరాటస్పృహతో దళిత జీవితాలకు స్ఫూర్తి నిచ్చిన గేయ రచయితలుగా సుబ్బారావు పాణిగ్రాహి, గద్దర్ వంటివారు పేరు పొందారు. దళిత జీవితాన్ని చిత్రించి, విముక్తిమార్గాన్ని సూచించటం గద్దర్ గేయాలలో కనిపిస్తుంది. అందుకే

**"యాలరో ఈ మాదిగ బతుకు**
**మొత్తుకుంటే దొరకదురా మెతుకు"**[29]
**"దళిత జీవుల విముక్తి పోరు**
**భూమి పోరులో ముడిపడి ఉంది"**[30]

అంటూ గద్దర్ దళితులలో పోరాటస్ఫూర్తిని నింపాడు. ఇంకా శివసాగర్, చెరబండరాజు, సాంబశివరావు, మల్లిక్, వంగపండు మొ॥గు వారిలో కూడా ఇలాంటి

పోరాటస్ఫూర్తే కనపడుతుంది. మాష్టార్జీ వంటి కవులు గేయంతోపాటు వచన కవిత ద్వారా దళితచైతన్యాన్ని చిత్రించారు.

సైద్ధాంతిక ప్రతిఘటనను ప్రతిబింబించే కవిత్వంలో సలంద్ర 'దళిత మేనిఫెస్టో' (1981)ను పేర్కొనవచ్చు.

**"నన్ను**
**చచ్చిన శవాల**
**దహన సంస్కారాలే చూచుకొమన్నావు**
**సరే, ఎలాగయితేనేం**
**మీ ప్రాణాలని కూడా**
**ఎలా పాతేయాలో**
**నాకు తెలవడమే బాగయింది"**[31]

ఇటువంటి ప్రతిఘటన చైతన్యంతోనే వచ్చిన కవితా బొజ్జాతారకం నదిపుట్టిన గొంతుక. దీనిలో దళితజీవిత చిత్రణతో పాటుగా భవిష్యత్ చైతన్యరూపురేఖలను గూర్చిన వ్యక్తీకరణ కనిపిస్తుంది. సాంఘిక అసమానతలకు వ్యతిరేకంగా ప్రతిఘటనా చైతన్యాన్ని వ్యక్తం చేస్తూ వచ్చిన నాటకంగా బోయిభీమన్న 'పాలేరు' నాటకం పేరు పొందింది. భీమన్న మరో నాటకం 'కూలిరాజు' దళితసమస్యలను వర్గదృక్పథంతో విశ్లేషిస్తుంది.

## 3.4.6 దళిత ఉద్యమ చైతన్యం

20వ శతాబ్దం చివర దశాబ్దంలో దళిత సాహిత్యం విస్తృతంగా రావటం, ఒక ప్రత్యేక స్రవంతిగా రూపొందటంతో దళిత సాహిత్యంలో ఉద్యమ చైతన్యం ప్రవేశించింది. దళిత కవిత్వంలో కులపరంగా జరుగుతున్న అణచివేత, కులవైరుధ్యాలు, కులనిర్మూలన వంటి ప్రధాన దళిత సమస్యలు, వాటి పరిష్కారమార్గాలు చోటు చేసుకున్నాయి. విభిన్న ప్రక్రియలలో దళిత సాహిత్యం ఎక్కువగా రావటం మొదలైంది.

జయధీర్ తిరుమలరావు సంపాదకత్వంలో 'దళిత గీతాలు' బి.యస్.రాములు సంపాదకత్వంలో 'ప్రవహించే పాట' –దళిత చైతన్యాన్ని ప్రతిఫలించే గేయాలన్నింటిని కూర్చి చెప్పిన గేయ సంకలనాలు. గద్దర్, మాష్టార్జీ, గూడ అంజయ్య వంటివారు దళిత చైతన్యాన్ని వ్యక్తీకరించే పాటలు రాసి స్వయంగా పాడుతున్నారు.

**"1990వ దశకంలో దళిత సాహిత్యంలో 'వచనకవిత్వం' ప్రధాన సాహితీ ప్రక్రియగా సాగింది. చిక్కనవుతున్న పాట (1995) కవితా సంకలనం దళిత సాహిత్యంలో ఒక సంచలనం కలిగించింది. దీనికి సంపాదకులుగా జి.లక్ష్మీనరసయ్య, త్రిపురనేని శ్రీనివాస్‌లు వ్యవహరించారు. భిన్నస్వరాలు, విభిన్నధోరణులు వ్యక్తమయిన ఈ కవిత్వం దేశీయ మార్మిజాన్ని తన ఎజెండా ప్రకటించింది. అభ్యుదయ, విప్లవ కవిత్వాల ప్రభావం, అమెరికన్ నల్లజాతి సాహిత్య ప్రభావం ఈ కవిత్వంపై ఉన్నదని భావిస్తున్నారు"**[32] ఇది వెలువడిన అనంతరం అనేక దళిత కవితాసంకలనాలు వెలువడ్డాయి.

సి.నా.రె సంపాదకత్వంలో వచ్చిన "బహువచనం" కులంతోపాటు వర్గపరంగా దళితులపై జరుగుతున్న అణచివేతను చర్చించింది. ఈ పరంపరలో వచ్చిన మరికొన్ని సంకలనాలు "దళిత మేనిఫెస్టో" 'గుండెడప్పు'ల్లో కులపరమైన అణచివేత ప్రధానాంశంగా కనిపిస్తుంది. 'మేమే' కవితాసంకలనం ప్రత్యేకించి దళితభాషను వివరించింది. 'పదునెక్కినపాట' కవితా సంకలనంలో విభిన్న సామాజిక సమస్యలు విస్తృతంగా చోటు చేసుకున్నాయి.

సతీష్‌చందర్ (పంచమవేదం), ఎండ్లూరి సుధాకర్ (వర్తమానం), మద్దూరి నగేష్‌బాబు (వెలివాడ, రచ్చబండ), జూలూరు గౌరీశంకర్ (పాదముద్ర, పొలికట్టె, మాలకాకి), పైడి తిరేష్‌బాబు (అల్పపీడనం), కత్తి పద్మారావు (నల్లకలువు), చిన్ని (ఒల్లు కడుక్కుందాం రండి)వంటి కవులు తమ కవిత్వంలో దళిత జీవితాన్ని, దళిత అనుభవాలను, దళిత సమస్యలను విభిన్న కోణాలలో చిత్రించారు.

అల్లం రాజయ్య, బోయ జంగయ్య, శాంతినారాయణ, చిలుకూరి దేవపుత్ర, బి.యస్.రాములు, పైడి తెరేష్‌బాబు, మద్దూరి నగేష్‌బాబు, దారాగోపి, కె.కె.మీనన్ వంటి కథారచయితలు దళిత చైతన్యంతో కథలు రాస్తున్నారు.

**"కులం పేరు చెప్పుకొనగలగటం నీలికథలో (కొత్తతరం) చిత్రించటం చూడవచ్చు. దారాగోపి రాసిన 'గుడిసో ఏసోబు' కథలో కులంలో వర్గపరంగా జరుగుతున్న దోపిడినీ చిత్రించాడు. కాసుల ప్రతాపరెడ్డి 'వెంటాడిన అనుమానం' కథలో "దళితులే ఆత్మగౌరవ పోరాటాలు చేస్తారు. తలకిందుల సమాజాన్ని సరిచేసి తమ హక్కులను తామే సాధించుకుంటారు"**[33] అనే సందేశాన్నిస్తాడు.

కె.కె.మీనన్ 'త్రికాలవాంఛ'లో దళితులపై దోపిడీకి అధికారులే కారణమని చెప్పారు. బి.యస్.రాములు 'మార్పు' కథలో ఈనాడు జరుగుతున్న జాతివిముక్తి పోరాటాలు వస్తువులైనాయి. 'బతుకుభయం' కథలో ఒక దళితుడు మరొక దళితున్ని దోపిడీ చేసే విధానం కనపడుతుంది. తాగుడుకు బానిసైన దళితుని వలన కలిగే ప్రమాదాన్ని 'గోదావరి కల్లు తెరిచింది' కథలో కె.సీతారాములు చిత్రించారు.

కేశవరెడ్డి రాసిన 'చివరిగుడిసె' నవలలో యానాదుల యొక్క జీవిత వాస్తవిక చిత్రణను చూడవచ్చు. సాధన రాసిన 'రాగో' నవలలోను, అరుణ రాసిన 'ఎల్లి' నవలలోను దళిత జీవిత చిత్రణ కనపడుతుంది. సమాజంలో అణచివేతను ఎదుర్కొనే దళితులు కూడా దళిత స్త్రీలను హింసకు గురి చేయటం 'ఎల్లి' నవలలో సజీవంగా చిత్రీకరణ జరిగింది. వి.ఆర్. రాసాని రాసిన 'మట్టి మనుషులు' నవలలో రాయలసీమ దళిత జీవితాలను చిత్రించారు. అయితే నవలాపరంగా దళిత సాహిత్యంలో మరెంతో కృషి జరగాల్సిన ఆవశ్యకత ఉంది. కారంచేడు, చుండూరు సంఘటనల అనంతరం తెలుగునాట దళిత ఉద్యమం రూపొందించిన చైతన్యానికి కావలసిన రీతిలో కథలు, నవలలు రాలేదు. కథ, నవలారంగాలలో సాధించే పట్టుపైననే సాహిత్యరంగంలో దళితవాదం సాధించే విజయం ఆధారపడి ఉంటున్నదని విమర్శకుల అభిప్రాయం.

విమర్శ పరంగా దళిత దృక్పథంతో సాహిత్యవిమర్శ చేస్తున్న వారిగా కత్తిపద్మారావు, శిఖామణి, కలేకూరి ప్రసాద్, జి.లక్ష్మీనరసయ్య, బి.యస్.రాములు, శివసాగర్, కె.శ్రీనివాస్, సాంబశివరావు, జయధీర్ తిరుమలరావు మొ॥నవారు గుర్తింపు పొందారు. కత్తి పద్మారావు దళిత సాహిత్యవాదం – జాషువా, చార్వాకదర్శనం, సాంఘిక విప్లవ రచయితలు, దళితుల చరిత్ర, కులసంఘర్షణలు, భారతీయ సంస్కృతిలో స్త్రీ మొ॥గు రచనలు చేశారు. ఇంకా కలేకూరి ప్రసాద్ దళిత కిరణాలు, బొజ్జాతారకం కులం–వర్గం మొదలైనవారు దళిత ఉద్యమం పైన విస్తృతంగా రచనలు చేస్తున్నారు.

## 3.5 దళిత సాహిత్యం – ప్రక్రియల పరిచయం

### 3.5.1 కావ్యం

'కన్నీటి కబురు' (1966) ను జి.జోసఫ్ రచించారు. ఇక్కడ చదువుకోవలన్న హరిజనుల కాంక్ష కనిపిస్తుంది. విశ్వనాథ సత్యనారాయణ, దుర్భాక రాజశేఖర శతావధాని, కట్టమంచి రామలింగారెడ్డి మొదలగు సుప్రసిద్ధులు ఈ కావ్యంపై అభిప్రాయాలు ప్రకటించడం ద్వారా ఈ కావ్య విశిష్టత తెలుస్తుంది. 'పూలవాడ' అనే గ్రామంలో జన్మించిన ఒక పేద మాదిగవాని కథ దీనిలోని వస్తువు. 'దిబ్బడు' అనే మాదిగ కులస్థుడు కుమారుడైన రాములను చదివించాలనే ఆశతో బ్రాహ్మణుని అర్థిస్తాడు. బ్రాహ్మణుడు విద్య నేర్పించక కోప్పడతాడు.

'ధర్మచక్రము'ను కె.జి.జాను రచించారు. ఇక్కడ దళితుల కడగండ్లకు దుఃఖిస్తూ నిద్రించిన కవికి కల వస్తుంది. ఆ కలల సారాంశమే కావ్యంగా రూపొందింది. రామమూర్తి అనే ప్రజాసేవకుడు ఎక్కడా కనిపించని ధర్మం కోసం వెతుకులాడుతూ దేశమంతా తిరుగుతూ కవిని కలుసుకుంటాడు. వాళ్ళిద్దరికి ధర్మచక్ర సాహిత్యస్త్రీమూర్తి దర్శనం ఇస్తుంది. అప్పుడు కవి పేదలపై అగ్రవర్ణాల దౌర్జన్యాలను తమ ప్రయాణ సమయంలో వివరిస్తాడు. హరిజనుల కష్టాలను కళ్ళకు కట్టినట్లు, స్వీయానుభవంతో కవి వివరిస్తాడు.

**"నంబూరి దుర్వాస మహర్షి 'నిరుపేద' కావ్యాన్ని రచించారు. అందరిని కోల్పోయిన ఒక పేద హరిజనుడు వృద్ధాప్యంలో తోడునీడలేక పడినపాట్లు వ్యక్తపరచిన ఆవేదన చిత్రించారు. "ఇందులో అనుసరించిన మార్గము సవ్యము. గత సాంప్రదాయాలైన కావ్య లక్షణాలను నేనందు పాటింపలేదు"** [34] అని కవి ముందుమాటలో సవినయంగా చెప్పుకున్నారు. **"హరిజనులు భారతదేశంలో అనుభవిస్తున్న నిర్బంధ బానిసత్వాన్ని తలచి వ్యథ చెంది, కావ్య, నాటక, కథ ఇత్యాది కళల యొక్క పరమార్థం కేవలం రసానందమే గాక, కర్తవ్యతా ప్రబోధకమైన యదార్థ విషయచిత్రణగా కూడా భావించి, దారి తొలగిన సమాజానికి కనువిప్పు కలిగించాలనే ఆకాంక్షతో వ్రాసానని దుర్వాసమహర్షి చెప్పుకున్నారు."** [35]

**"కె.సి.జాను 'బహిష్కారము' అనే కావ్యాన్ని రచించారు. "సాంఘికంగా నేను, నా జాతివారును బడు హింస బ్రత్యక్షముగా జూపబడినది"** [36] అని చెప్పటంలో ధ్వని విధానం తెలుస్తుంది. అంటరానితనం వల్ల, పేదరికం వల్ల చదువుకూ, వైద్యానికి దూరమైన అన్నదమ్ముల కథ ఇది.

పినపాటి జెర్మెయా 'హతాశుడు' (1991) కావ్యాన్ని రచించారు. ఒక నిరుపేద దళితుని జీవనస్థితి వర్ణన ఇందులోని ఇతివృత్తం. దళిత నాయకునికి ఆస్తిపాస్తులు లేవు. బంధువులు లేరు. అందుచేత అతడు భార్యాబిడ్డలను పోషించలేనని అవివాహితుడుగా మిగిలిపోతాడు. రోడ్డు ప్రక్కన ఒక చిన్న గుడిసె వేసుకొని జీవనం గడుపుతుంటాడు. అతని శ్రమతో అనేకులు భాగ్యవంతులౌతారే తప్ప అతని బ్రతుకు మారదు. చివరికి అతనికి వృద్ధాప్యం రావడంతో పనిచేయు శక్తిలేక ఎవరులేని అనాథగా మిగిలిపోతాడు. ఈ కావ్యంలో ఆ నిరుపేద మంచి గుణములను, అతని జీవనస్థితిని కూడా చక్కగా తెలియజేశారు.

'హరిజనాభ్యుదయము' (1969) దీనిని బీర్నీడి మోషేకవి రచించారు. ఇందులో 'చీకటికేక' 'వెలుగువాక' అను రెండు శీర్షికలున్నాయి. ఈ కావ్యానికి విశ్వనాథ

సత్యనారాయణ, దివాకర్ల వెంకటావధాని మొ॥గువారు పరిచయ వాక్యాలు రాసి మోషేకవి రచనలోని ఉత్తమ గుణాలను ప్రకటించారు. హరిజనులను ఉద్ధరించటానికి మహాత్ముడు జన్మిస్తాడన్న ప్రధానాంశంగా ఉన్నది దీనిలోని ఇతివృత్తం.

## 3.5.2 శతకం

పండితులను, పామరులను పరవశింపజేసే శక్తి దీనికి ఉంది. ఆత్మాశ్రయ రీతిలో సాగటం వలన తన భావాలను స్వేచ్ఛగా చెప్పటానికి అవకాశం ఎక్కువ. సంఖ్యానియమం, మకుట నియమం, ఛందోనియమం మొ॥నవి శతక లక్షణాలు. సర్వజనాదరణ పొందిన ఈ ప్రక్రియను దళితరచయితలు కూడా చేపట్టారు.

'చైతన్యసారథి' (1985) దీనిని పాటిబండ్ల డేనియల్ రచించారు. ఈయన తన సోదరులైన దళితులను ప్రబోధిస్తూ ఈ శతకం రాశారు. 100 ఆటవెలదులతో ఉన్న ఈ శతకంలో మకుట నియమం పాటించలేదు. ఈ శతకమును అంటరానితనం, పూర్వస్థితి, ప్రస్తుతం, కళ్ళు తెరిచిచూడు, ప్రబోధం అనే శీర్షికల క్రింద విభజించారు. 'జాగృతి' (1970) శతకాన్ని దమ్ముతానయ్య రచించారు. 'చెన్ను' అనునది వారి కలము పేరు. మేలకొనుడాది మాంధ్రులు! మేలుకొనుడు!' అనే మకుటంతో 111 తేటగీతులతో సాగింది. **"నంబూరి దుర్వాసమహర్షి 27.3.1969న హైదరాబాదు నందలి గాంధీభవనంలో హరిజనకవుల సమావేశం ఏర్పాటుచేశారు. ఆసమావేశానికి హాజరైన దమ్ముతానయ్యగారను ఇంకా తమ జాతిలో గల ఉపకులాల భేదాన్ని (మాల మాదిగ తేడా) గమనించి బాధ చెందానని, వీరిని నిద్రలేపి ఏకం చేయాలనే ఉద్దేశ్యంతో ఒక పద్యకావ్యం వ్రాసి ఉచితంగా పంచి పెట్టదలచితినని అదే ఈ జాగృతి శతకం అని పీఠికలో చెప్పారు."**[37]

'శ్రీనివాస పద్యమంజరి' (1967) (అస్పృశ్యతా నివారణ ప్రబోధాత్మకం) దీనిని నంబూరి శ్రీనివాసరావు రచించారు. 'చిత్తగించుమయ్య శ్రీనివాస' అనునది మకుటం కేంద్రమంత్రి సంజీవయ్యగారు జరుగుమల్లి ఫైలు గురించి మాట్లాడు సందర్భంలో **"చిత్తగించుమయ్య శ్రీనివాస' అను పదం వచ్చిందని తెల్పి, తనను శ్రీవేదాల**

**రామానుజస్వామి శతావధానిగారు 'చిత్తగించుమయ్య శ్రీనివాస' మకుటంపై పద్యాలు రాయమన్నారని తెలియజేసారు.**"[38] మొదట దీనిని 118 ఆటవెలదులలో ముద్రించారు. పునర్ముద్రణలో ఆ 118 పద్యాలతో పాటు మరి 100 పద్యాలను రచించి రెండు భాగాలుగా విభజించారు. ప్రథమభాగం నందు అస్పృశ్యులను ప్రబోధించటం కనిపిస్తుంది. అక్కడక్క నీతులు కూడా చెప్పారు. రెండవభాగంలో ఉదాత్తములైన భావాలను, సూక్తులను చిన్నపిల్లలకు అర్థమయ్యే రీతిలో రచించారు.

కుసుమధర్మన్న రచించిన శతకం 'హరిజన శతకం' (1933) **"ఆలకింపుమయ్య హరిజనుడ' అనే మకుటంతో 108 ఆటవెలదులలో రచించారు. కావ్య సంప్రదాయాన్ని పాటించి అవతారిక, దైవస్తుతి మొదట చేశారు. దైవస్తుతిలో నేను రాజరాజ్యమును గోరుటలేదు. సర్వమునభిలషించుట లేదు. జన్మరాహిత్యమును వహించుట లేదు. సర్వదా దుఃఖితులను దీనులను అగు ప్రాణులయొక్క ఆర్తిని మాన్పకోరుచున్నాను."**[39] అని ఒక శ్లోకంతో తెలియజేసారు. శ్రీకారంతో ప్రారంభించి శ్రీహరిని వేడుకున్నారు. దీనిని తన ప్రజలకు అంకితం ఇచ్చారు. శతకము పూర్తి అయిన తరువాత దీనిని చదివినను, విన్నను మాలమాదిగలను హీనముగా చూసే వారికి నీతిమార్గము దొరుకుతుందని ఒక కంద పద్యంలో చెప్పారు.

కృతయుగంలో ప్రజలు కరువు కాటకములు, వ్యాధులు లేక పాడిపంటలతో ప్రశాంతంగా జీవించారని, ఆనాడు హక్కులు, అధికారాలు ద్రవ్యకాంక్షలు, మోసాలు చేయటం లేవని, ప్రజలందరు అన్నదమ్ములవలే జీవించారని తెలిపారు. కలియుగంలో ధర్మచింతన చచ్చి, ధనకాంక్ష హెచ్చిందని, గుణము అంతరించి, కులము ఘనతగాంచిందని, పెట్టుబడిపెట్టి ధనికుడు బీదల కష్టమును దోచుకుంటున్నాడని తెలియజేసారు. దళితులు మొదట హిందూదేశాన్ని ఏలారని తెలియజేశారు. తరువాత ఆర్యులనెడి బ్రాహ్మణులు ఆసియా నుండి వలసవచ్చి, మనలను అణగద్రొక్కి అడవుల పాల్జేసి, తినటానికి తిండిలేక బిచ్చమెత్తువారిని నీచ కులజులుగా చిత్రించి, జాతి భేదమెంచి ఊరు వాడలలో ఉంచనీయక,

దూరాన గెంటి అంటరానివారుగా అవమానపరచారని, వెలివేసి బానిసత్వంలోకి దించారని ఇది స్వార్థపరులు చేసిన చర్యగా భావించారు.

## 3.5.3 కవిత్వం

### 3.5.3.1 గేయ కవిత్వం

సమాజాన్ని పట్టి పీడిస్తున్న రుగ్మతలలో కుల సమస్య ప్రధానమైనది. దీని కారణంగానే సమాజంలో ఒక వర్గం అధికంగాను, ఒకవర్గం అల్పంగాను విభజించబడింది. దానిని ఆసరాగా తీసుకొని సమాజంలో కొంతమంది మరికొందరిని అంటరానివారుగాను, బానిసలుగాను చూశారు. తరతరాల నుంచి అంటరానివారుగా చూడబడ్డ దళితులు దీనిని వ్యతిరేకిస్తూ తమ జాతిని చైతన్యవంతులను చేయటానికి ప్రయత్నిస్తూ గేయాలు రాశారు.

అజ్ఞాతకవి రాసిన 'మాలవాంద్రపాట' అనే గేయం

**"ఎట్టాగూ యెక్కువ బ్యామ్మర్లు మాకంటె**

**ఎట్టాగూ యెక్కువ యెవరైన మాకంటె"**[40]

అంటూ అగ్రజాతుల కులాధిక్యాన్ని తొలిసారిగా నిలదీశారు. దీనిలో అన్ని వర్ణాలు సమానమనీ ప్రబోధం ఉంది. 'అంటరానివారెవరు? (1930) మేలుకొలుపు, మాలశుద్ధి (1930) మొదలగు దీర్ఘ గేయాలను జాలా రంగస్వామి రాశారు. నక్కా చినవెంకయ్య 'హరిజన కీర్తనలు' కీర్తన అంటుదోషము మొదలగు గేయాలలో అగ్రజాతులు దళితులను శ్రమదోపిడీ చేసి, వారిని హీనంగా చూస్తున్నారని ఆవేదన చెందారు.

కుసుమధర్మన్న రచించిన 'నల్లదొరతనం' అనే శీర్షికలున్న రెండు గేయాలలో సానుల సరసన, కుష్టురోగుల పక్కన కూర్చునే భారతీయ అగ్రజాతులు, దళితులను కుక్కలు, నక్కలు కంటే నీచంగా చూస్తున్నారని ఆవేదన చెందారు. భూపతి రాజారావు 'సమగ్ర చైతన్య గేయమాల', 'ఈ దళితుడెవరు' గేయాలలో దళితుడను, ఆది భారతీయుడు, తొలి భారతమాత బిడ్డగా కీర్తించారు. దొండపాటి రామారావు 'అన్నలేవరా లేవరా! లేవరా!

గేయాలలో అగ్రజాతులు దళితులకు పనికిరాని నీతులు చెప్పి వారిని అణగతొక్కారని వారు అభివృద్ధిలోకి వస్తుంటే అగ్రజాతులు సహించలేరని తెలియజేసారు. గోరటి వెంకన్న అగ్రజాతి భూస్వాములు దళితుల శ్రమఫలితాన్ని దోచుకుంటూ వారిపై దాడులు చేయటాన్ని ఖండించాడు. ఇంకా దళితులను అగ్రజాతుల భూస్వాములపై పోరాటానికి తిరుగుబాటుకు ప్రోత్సహించారు. ముళ్ళపూడి యేసురత్నం 'హరిజనోద్ధరణ', 'హరిజనవీరా' గేయాలలో భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి రెండు దశాబ్దాలు దాటినా హరిజనుల దుస్థితి మారలేదని ప్రభుత్వం కల్పించే పథకాలు నామమాత్రంగానే ఉన్నాయని, ఆవేదన చెందుతూ, వారిని తాగుడు, నీచవృత్తులుమాని అభివృద్ధిలోకి రమ్మని ప్రబోధించారు.

ఇలా దళిత రచయితలు అగ్రజాతుల కులతత్వాన్ని దోపిడినీ, నిరసిస్తూ, తమజాతి ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలని గేయాలని రాయటం గమనించవచ్చు.

### 3.5.3.2 వచన కవిత్వం

20వ శతాబ్దంలో అధికంగా వచ్చిన కవిత్వం ఆధునిక కవిత్వంగా ప్రచారంలోకి వచ్చింది. ఈనాడు ప్రక్రియాపరంగా వచన కవిత్వమే ఆధునిక కవిత్వంగా చలామణి అవుతున్నది. దళిత రచయితలు తమ అనుభవాలను, అనుభూతులను వెల్లడించడానికి వచన కవిత్వ ప్రక్రియను చేపట్టారు.

దళితులు తమ అనుభవాలను, బాధలను కవిత్వీకరించటాన్ని దళిత సాహిత్యంగా పేర్కొనడం ఇటీవల కాలంలో వచ్చిన పరిణామం. ఈ గుర్తింపు కలగటానికి పూర్వమే దళితులు తమ బాధలను అనుభవాలను కవిత్వీకరించటం కన్పిస్తుంది.

బొజ్జాతారకం 'నేను అస్పృశ్యుణ్ణి' కవితలో తరతరాల నుండి దళితులు సమాజంలో ఎలా అణగదొక్కబడ్డారో చిత్రించారు.

**"నేను అస్పృశ్యుణ్ణి**
**నా ఒళ్ళంతా మట్టివాసన**
**నా బ్రతుకు నిండా వెట్టి వేదన**

**చెరిపేస్తాను తెంచేస్తాను**

**కూల్చేస్తాను కాల్చేస్తాను"**[41]

తరతరాలుగా వస్తున్న శ్రమైక వర్గాన్ని ధిక్కరించే విప్లవ దృక్పథాన్ని ప్రకటించారు. ఎండ్లూరి సుధాకర్ 'పాదముద్రలు' కవితలో దళిత చైతన్యం ప్రతి పంక్తిలో తొంగిచూసింది. దళిత వర్గంలో సహజంగా ప్రతిభ ఉంటుందని, దానిని ఇంతవరకు అణగతొక్కారని, ఇకపై అది విజృంభించటం నిజం అని చిత్రీకరణ చేసారు. బొనిగల రామారావు 'ఆవేదన' కవితలో రామాయణం నుంచి రాజ్యాంగం వరకు దళితుడు లేకుండా ఏమిలేదని, అసలు ఈ దేశానికి ఆయువుపట్టు దళితుడేనని అంటారు. మద్దూరి నగేష్‌బాబు 'సహారా' కవితలో అస్పృశ్యతా భావం అర్థం లేనిదని, అణగత్రొక్కబడినా ప్రతిభ లేనివాళ్ళు కాదని చిత్రించారు. 'శరత్‌జ్యోత్స్నారాణి' 'జ్వలితుడు' కవితలో కూలీనాలి చేసుకుని జీవించే దళితులను అగ్రవర్ణాలు అణగత్రొక్కారని ఆవేదన చెందారు. ముళ్ళపూడి యేసురత్నం 'ప్రబోధగీతం'లో దళితుల శ్రమతో ఉత్పత్తి పెరిగి ధనం వచ్చినా వారి జీవితాల్లో మార్పు రాలేదని ఆవేదన పడ్డారు.

**"పైడితిరేష్‌బాబు 'నూరవ గొర్రె' కవితలో దళితులు శ్రమకు తగిన సంపదను పొందటంలోను ఇతర వర్ణాలతో సమానత్వం పొందటంలోను ఎలా మోసపోయిన విధానం కనపడుతుంది. సతీష్‌చందర్ పంచమవేదం కవితలో గురువుల కులపిచ్చిని నిరసించారు. తరతరాల నుండి ప్రతిభలేదని, చదువురాదని దళితులను అవమానించి చదువుకు దూరం చేశారని ఆవేదన చెందారు".**[42] ఇంకా మద్దూరి నగేష్‌బాబు రాసిన 'వెలివాడ' పైడి తిరేష్‌బాబు రాసిన 'అల్పపీడనం' మొదలగునవి పేర్కొనవచ్చు.

## 3.5.4 నాటకం

పాశ్చాత్య సాహిత్య ప్రభావంతోను, సంస్కృత సాహిత్య అవగాహనతోను 19వ శతాబ్దం నుంచి తెలుగులో నాటక రచనలు వచ్చాయి. ఆ పరంపరలో దళిత సాహిత్యంలో కూడా నాటకాలు వచ్చాయి. నందనార్ (1937) నాటకమును జాలారంగస్వామి

రచించారు. అయిదు అంకాలు గల ఈ నాటకం గద్య పద్యాలతో పాటు పాటలతో కూడుకొని ఉంది. ఇందులో పూర్వకాలం నుండి అడుగున పడియున్న ఆదిమ వాసులగు దళితుల దురవస్థ చిత్రించబడింది. 'అనాథ' (1947) అనే నాటకాన్ని కూడా జాలారంగస్వామి రచించారు. ఇది అయిదు అంకాల నాటకం. కష్టపడి చదువుకొని నానా అగచాట్లు పడిన దళితస్త్రీ ఇతివృత్తం కలది. ఇందులో ఇంకా సమకాలీన కాంగ్రెసు నాయకుల దురాగతాలు కూడా ఉన్నాయి. కొప్పుల వసంతరావు 'చైతన్యకిరణం' (1980) అనే నాటకం రాశారు. మతం పేరిట జరిగే మోసాలు సాంఘిక అసమానత్వాన్ని తెలియపరిచి, స్వచ్ఛమైన మానవత్వమే యదార్థమైన దైవత్వమని ఈ నాటకంలో తెలియజేశారు. తొలిపొద్దు (1984) నాటకాన్ని కళ్యాణరావు రచించారు. ఆరురంగాలుగా విభజించారు. బంజరు భూమికోసం పేదరైతులు చేసిన పోరాటం ఇందులోని వస్తువు. రచయిత దీనిలో సందర్భానుకూలంగా పాటలు రచించారు. నక్కా చినవెంకయ్య పాలేరు (1938) నాటకాన్ని రచించారు. అయిదు రంగాలుగా విభజన చేశారు.

దాసుబాబు 'శవం పలికే సత్యం' (1979) నాటకం రాసారు. దీనిలో నాలుగు రంగాలున్నాయి. బడిపంతులు అమాయకులైన గూడెం ప్రజలలో చైతన్యం తీసుకొచ్చి జమీందారు, కరణం చేసే ఆగడాలను అరికట్టించటం దీనిలో ఉన్నది. **"సమాజం మారాలి (1973) బండారు మృత్యుంజయబాబు రచించారు. ఆరు రంగాలుగా ఉన్న ఈ నాటకంగా సమసమాజ నిర్మాణం వర్ణాంతర వివాహాలు అనే సమస్యలు అనుసరణ యోగ్యంగా చిత్రించారు."**[43] తాటిపర్తి శామ్యూల్ స్వతంత్రభారతి (1951) అనే నాటకాన్ని రాశారు. మూడు అంకాలు గల ఈ నాటకం గద్య పద్యాత్మకంగా ఉంది. అస్పృశ్యత సమస్యను తీసుకొని అందరూ సమానమనే భావనతో ఈ నాటకాన్ని చిత్రించారు. స్వాతంత్ర్యానంతరం ఆచారాల స్థితి, కులతత్వం, కాంగ్రెస్ పరిపాలన మనకు ప్రతిపాదించిన చట్టాలు, సంఘ దౌష్ట్యాలకు గురైన అభాగ్యులు, ఆర్థికంగా చితికిపోయిన వ్యక్తులు సతీసహగమనం, కమ్యూనిస్టులు మొ॥న విషయాల గురించి ఇందులో చర్చించబడినవి.

### 3.5.5 నవల

20వ శతాబ్దంలో వాఙ్మయానికి పేరు తెచ్చిన నూతన ప్రక్రియ నవల. ఇది కొన్ని దశాబ్దాలుగా సాహిత్యరంగంలో తన ముద్రను గాఢంగా వేసి కవిత్వాన్ని ప్రక్కకు నెట్టి, మొదటిస్థానాన్ని ఆక్రమించుకున్నది. నవల జీవితానికి ప్రతిబింబం. నవలా రచయితలలో దళిత రచయితలు కూడా ఉన్నారు. వీరి నవలలో ప్రత్యేకంగా దళిత చైతన్యం, మత సంబంధం మానవ స్వభావచిత్రణ, సామాజిక చిత్రణ కనపడతాయి.

రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, కె.లక్ష్మీనారాయణ సంపాదకత్వంలో తెలుగు దళిత నవల (వ్యాస సంకలనం) ద్వారా దళిత నవలాసాహిత్యాన్ని సంక్షిప్తంగా పరిచయం చేశారు. నరహరి గోపాలకృష్ణమశెట్టి రాసిన 'శ్రీరంగరాజచరిత్ర' యందు దళిత జీవన ప్రస్థావన ఉంది. కందుకూరి వీరేశలింగంగారి 'రాజశేఖరచరిత్ర'లో దళిత సమస్యమీద చర్చ ఉంది. 'మాతృమందిరం', 'హేలావతి' నవలల్లో అస్పృశ్య జీవితం ఎంత భయంకరమైనదో వివరించబడింది. ఉన్నవ లక్ష్మీనారాయణ రాసిన మాలపల్లి (1922)లో మాలవాళ్ళ జీవితం రాజకీయశక్తిగా ఎదగడం కనపడుతుంది. పై నవలలన్నీ స్వాతంత్ర్యానికి ముందు వచ్చాయి.

**"స్వాతంత్ర్యానంతరం దళిత సాహిత్యం విస్తృతంగా వచ్చింది. ఇది ఒక తాత్త్విక నేపథ్యం కలిగి వెలువడుతుంది. ఈ చారిత్రక భూమికతో అక్కినేని కుటుంబరావు రాసిన 'సొరాజ్జెం (1981) స్వాతంత్ర్యానంతర గ్రామీణ మాలమాదిగల బతుకులు వీరిని గాంధీజీ హరిజనులని పిలవడం, దళితులు అని రాజ్యాంగం చట్టరీత్యా వ్యవహరించడం తప్ప వాళ్ళ జీవన ప్రమాణాల్లో గానీ, ప్రయాణంలోగానీ మార్పు శూన్యమనేది దీని అంతరార్థం"**[44] ఈ నవల్లో గ్రామీణ దళిత జీవనాన్ని, మారని జీవితాల అసలు రూపాలను కూడా విశ్లేషించింది. స్పార్టకస్ రాసిన 'ఖాకీబ్రతుకులు' పోలీస్ వ్యవస్థలోని లోపాలను విశ్లేషించిన నవల. వామపక్ష భావాలుగల దళిత పోలీసులు తమ ఆత్మగౌరవ పోరాట నేపథ్యంలో భాగంగా అనుభవించే కష్టాలను విశ్లేషించింది. చిలుకూరి దేవపుత్ర 'అద్దంలో చందమామ'

నవలను (1988) రాశారు. దీంట్లో దళితోద్ధరణ కోసం అగ్రవర్ణాలు, ప్రభుత్వం కలిసి తలపెట్టే పథకాలలోని డొల్లతనాన్ని, ఆచరణ శూన్యమైన సంస్కరణలలోని బండారాన్ని విశ్లేషించింది. తరాలు మారినా నేటికి గ్రామీణ దళితులు ఎలాంటి ఉపాధి అవకాశాలు లేక అణగారి పోతున్నారనే సత్యాన్ని, దళితులను యదార్థ స్థానంలో నియంత్రించే పరిస్థితులను ప్రభుత్వ వైఫల్యాలను ఈ నవల విశ్లేషించింది. **"ఓల్గా రాసిన నవల 'ఆకాశంలో సగం' (1990) భిన్న పార్టీలలో ఉన్న అగ్రవర్ణ భూస్వాముల పెత్తనం కింద నలిగిపోతున్న దళితులను సమీకరించి ఎదిరించి గ్రామాల్లో మహిళా ఉద్యమాన్ని నడిపి అగ్రవర్ణ పురుషుల అహంకారానికి బలైపోయిన దళితస్త్రీ చిత్రణ"**[45] ఉన్నది. సదానంద శారద రాసిన 'మంచినీళ్ళ బావి' (1992) దళితులు, అగ్రవర్ణాల మధ్య త్రాగునీటి కోసం జరిగిన తగాదా కారణంగా వచ్చిన రాజకీయాలను చిత్రించిన నవల. దళితుల నీటి సమస్యను ప్రధానం చేసుకొని అగ్రవర్ణాలలోని రెండువర్గాలు తమ రాజకీయ లబ్దికోసం సృష్టించే సంఘర్షణలను తెలంగాణాలో సాగే నక్సలైట్ పోరాటాలు, తెలంగాణా గ్రామీణ సంస్కృతి, దళితుల జీవన స్థితిగతులు వంటి అంశాలు నేపథ్యంగా ఉన్నాయి. గద్దలాడుతుండాయి (డిశంబర్ 1991) నవల రాసినది స్వామి. మాదిగ జీవితాన్ని చిత్రించారు. కరువు కాటకాలు, కులాధిపత్యాల మధ్య దళారీ వ్యవస్థలో రాయలసీమ దళితుల జీవనాన్ని చిత్రించటం జరిగింది. సీమజీవనంలో రెడ్డి కులస్థులు రాజకీయాల్లో పట్టు సాధించాలని ప్రయత్నించడం, బహుజనులు రైతులు కావాలని, మాదిగలు ప్రభుత్వ సహకారంతో పైకి రావాలని చేసే ప్రయత్నాలు అగ్రవర్ణాల బారినపడి విఫలమయి చెడు అలవాట్లకు బానిసలు కావడం వంటి పరిణామాలు ఈ నవలలో మనకు కనబడుతుంది. నీబాంచెన్ కాల్మొక్తా(1997) అముద్రిత నవల దీనిని డా.కాలువ మల్లయ్య రచించారు. గత యాభైఏళ్ళలో తెలంగాణాలో వచ్చిన సామాజిక పరిణామాలను తెలంగాణా మాండలికంలో విశ్లేషించారు.

దళితుల బానిసత్వ వ్యతిరేక చైతన్యాన్ని పొందడం, పెత్తందార్ల అరాచకాలు, నక్సలైట్లు పేదల పక్షాన చేరడం, నక్సలైట్లలో దళితులు ఎన్‌కౌంటర్ కావడం వంటి పరిణామాలు ఈ నవలలో కన్పిస్తాయి. 'పంచమం' (1998) నవలను రాసినది చిలుకూరి దేవపుత్ర. ఈ నవల 1975-1998 వరకు ఆంధ్రప్రదేశ్‌లో దళిత ఉద్యమాల చారిత్రక నేపథ్యంగా వచ్చింది. గత శతాబ్ది ఎనిమిదో దశకానికి ముందు భూసంస్కరణలు మొదలుకొని కొత్త ఉత్పత్తి సంబంధాలు, చుండూరు, కారంచేడు సంఘటనలు, నక్సలిజం విజృంభణ, దళిత యువత ఉద్యమించడం, దళితులు సంపన్నవర్గాల కుల వివక్షకు గురై అగ్రవర్ణాల చేతుల్లో కీలుబొమ్మలు కావడం, దండోరా, మాలమహానాడు, రిజర్వేషన్ల వర్గీకరణ లాంటి రెండు దశాబ్దాల చారిత్రక సంఘటనలను రికార్డు చేసిన నవల 'కాడి' (1998) దీనిని సన్నపురెడ్డి వెంకట రామిరెడ్డి రాశాడు. గ్రామీణ జీవన పరిణామక్రమంలో దళితుల స్థితిగతులు, వారిపై అగ్రవర్ణాల పెత్తనం, దళిత వర్గాల మధ్య అంతరాలు, వీటి కేంద్రంగా మారుతున్న రాజకీయం, అనాదిగా వస్తున్న కులవృత్తులు, కులాతీతంగా వ్యాపార సంస్కృతికిలోనై పరస్పర మార్పిడులకు గురౌతుండడం, మతాంతరీకరణ. ఇలా ఒక అర్థశతాబ్దపు గ్రామీణ ప్రాంత జీవన సంఘర్షణకు ఈ నవల దర్పణం. 'మాదిగ పల్లె' (డిశెంబర్ 1995) దీనిని పి.నాసరయ్య రచించారు. కోస్తా ప్రాంతంలోని దళితుల జీవనస్థితిగతులు, వారిపై అగ్రవర్ణాల పెత్తనం, భూస్వాముల దౌర్జన్యాలు, అత్యాచారాలు, దళిత మహాసభ ఏర్పడటం, దళితుల విద్యావిధానం, రిజర్వేషన్ల విభజన, మాదిగల ఆశయాలు, అగ్రవర్ణ భావజాలం, వాటిపై సాగాల్సిన పోరాటం వంటి అంశాలను ఈ నవల విశ్లేషించింది. దండోరా నేపథ్యంలో మాలల దృష్టికోణం నుండి మాదిగ చైతన్యాన్ని వివరించింది.

**"అంటరాని వసంతం' (2000) నవలను జి.కళ్యాణరావుగారు రాశారు. ఒకటిన్నర దశాబ్ద దళిత జీవితాన్ని చిత్రించిన నవల. ఈ దేశ చరిత్ర పుటలలో దళితుని రక్తం తడవని పుటలేదని, దళితుడు భూమికోసం, భుక్తికోసం, ఆత్మగౌరవం కోసం పోరాడాడని వర్తమాన దళిత జీవనం కూడా ఇలాంటిదేననే అంతఃస్సారాన్ని అందించిన నవల"**[46]

'కక్క' (2000) వేముల ఎల్లయ్య రాశారు. తెలంగాణా మాదిగల జీవన విధానం, సంస్కృతి, శ్రమదోపిడి, లైంగికహింస, దళితుల్లోని అనైక్యత, కులపంచాయితీలు, ఆచార వ్యవహారాలు, మాదిగల పూజారులు, డక్కలవాళ్ళ జీవనం, వీధి బాగోతాలు, వెరసి తెలంగాణా దళితుల ఆత్మగౌరవ పోరాటంలో భాగంగా పురివిప్పిన మాదిగ చైతన్యం లాంటి అంశాలు ఇందులో ఉన్నాయి.

"నిప్పులవాగు" (2001) పినాకపాణి రచించారు. రాయలసీమ ముఠాకక్షల నేపథ్యంలో జరిగిన వేంపేట సంఘటన ఆధారంగా వెలువడింది. సామాజిక సంబంధాలు, అగ్రకులాల దాడులు, హత్యలు, అత్యాచారాలు, ఉత్పత్తి సంబంధాలు, దళిత, బలహీనవర్గాలు ముఠానాయకుల వంచన చేరడం, ప్రజా ఉద్యమాలను క్రూరంగా అణచివేయడం, ఫ్యూడలిజం, అభివృద్ధి నిరోధక ధోరణులు వంటి అంశాలు ఇందులో ఉన్నాయి." దండెం మీది చాలుకలు(2001) ఇది మార్క్సిస్టు దృక్పథం నుండి రాయబడింది. బడుగు వర్గాల్లో వస్తున్న మానసిక చైతన్యాన్ని, సమైక్య పోరాటాన్ని, దాని శక్తి సామర్థ్యాలనూ, వాటి ఫలితాలనూ విడమర్చి చెప్పినది. కోస్తాలో వచ్చిన దళిత చైతన్యం, దాని వెనక సాగిన పోరాటాలు, దోపిడీదారుల ఎత్తుగడలు దండోరా ఉద్యమ ఆవశ్యకతను వివరించింది. తమ సంపదనూ, సమానత్వాన్నీ కాపాడుకోవాలంటే వర్గాల ఒకటే మార్గమని చెప్పినది.

## 3.5.6 విమర్శ

తెలుగుభాషా సాహిత్యంలో చాలాకాలం నుండి దళిత సాహిత్యం, దళిత సాహిత్యవిమర్శ కొనసాగుతూ వస్తున్నది. కులవివక్ష పుట్టినప్పటి నుండి దాన్ని వ్యతిరేకిస్తూ సాహిత్యం, సాహిత్యవిమర్శ వెలువడింది. కంచికచెర్ల కోటేసును సజీవదహనం చేయటం, చుండూరు, కారంచేడు మొ॥న సంఘటనల వలన తెలుగులో దళిత సాహిత్యం విస్తృతరూపాన్ని పొందింది. దళితుల యొక్క సమస్యలకోసం, వీరి యొక్క ఔన్నత్యాన్ని కాపాడుకోవడం కోసం గుర్రం జాషువా, కుసుమధర్మన్న, ఉన్నవలక్ష్మీనారాయణ, శ్రీపాద, బొజ్జాతారకం, కొలకలూరి ఇనాక్, బోయజంగయ్య, కత్తిపద్మారావు, బి.యస్.రాములు, శిఖామణి మొ॥గు

కవులు రచనలు చేశారు. అంటే దళిత సాహిత్యం ఏకకాలంలో దళిత సాహిత్యవిమర్శగా కూడా కొనసాగుతున్నది. జాషువా - గబ్బిలం, కుసుమధర్మన్న- మాకొద్దీతెల్లదొరతనం, ఉన్నవ లక్ష్మీనారాయణ - మాలపల్లి నవలల్లో రాసిన పాట -అందరూ పుట్టిరి హిందమ్మ తల్లికి మొదలైనవి ఏకకాలంలో దళిత సాహిత్యం దళిత సాహిత్య విమర్శ కూడా అవుతుంది. ఇలా దళిత సాహిత్యం తన స్వభావరీత్యానే దళిత సాహిత్యవిమర్శ కూడా. దళిత సాహిత్య విమర్శ అంటే **"ఈ ప్రపంచాన్ని సామాజిక, రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక పరిణామాన్ని దళితుల దృష్టికోణంలో, దళితుల అలంకార శాస్త్రాల కోణంలో, దళితుల అభ్యున్నతి కోణంలో పరిశీలించటం, విశ్లేషించటం, వ్యాఖ్యానించడం అనే భావనను అర్థం చేసుకోవాలి."**[47] రాజకీయాల్లో బి.ఆర్.అంబేద్కర్, భాగ్యరెడ్డివర్మ, దామోదరం సంజీవయ్య తమ కులాల తాలూకు ప్రాతినిధ్యం, ఆత్మగౌరవం, స్థానం సంపాదించే క్రమంలో మొదట భావజాలరంగంగా, సాహిత్యవిమర్శ ఆరంభమైంది. తరువాత పాటలు, పద్యాల్లో ప్రసంగాల్లో విస్తరించింది. అటు తర్వాత కథలు, నవలలు, సాహిత్యవిమర్శలోకి వచ్చినవి.

**"దళిత సాహిత్యం - జాషువా" కత్తి పద్మారావు (1994)న రాశారు. 'ఆధునిక సాహిత్యం- దళితస్పృహ' యువభారతి (1994) ప్రచురించింది. మాలపల్లి మీద మనువు విశేషవిమర్శ, పరిశోధన జరిగింది."**[48]

తెలుగు సాహిత్యంలో ఆధునిక యుగంలో వచ్చిన పరిణామాలు చాలావరకు దళిత సాహిత్యంలో ప్రతిబింబించాయి. స్త్రీలు దళితులు శారీరకంగా, మానసికంగా సంఘంలో హింస పొందుచున్నారు. **"కులం వల్ల వచ్చే హింస, హైన్యం, అంటరానితనం, పీడన, దోపిడి ఇక్కడ ప్రస్తుతాలు అంటరానితనం సాంఘిక సమస్యగానే కనబడుతుంది."**[49] దళితుల్లో అభ్యుదయగమనం, ఇతరుల్లో ఆహ్వాన స్థైర్యం తీసుకొని రావటం దళిత సాహిత్య ముఖ్య ఉద్దేశ్యం. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమానత్వాలను, దళిత సాహిత్యం ఆకాంక్షిస్తుంది. దళితులు తమకు విముక్తి కావాలని, స్వేచ్ఛ లభించాలని, పంచభూతాలు, భూమి తమకు కావాలని కోరారు. భారతీయులకు ఆంగ్లేయుల నుంచి స్వాతంత్ర్యం లభించింది కానీ,

భారతీయులు నుంచి దళితులకు స్వాతంత్ర్యం లభించలేదని గుర్తించారు. అందరితో సమానంగా జీవించే అవకాశాన్ని అన్ని రంగాలలో కోరుతున్నారు.

దళిత సాహిత్యానికి పూర్వ నియమనిబంధనలు అన్నీ అంతమవుతాయి. ఇక్కడ అభివ్యక్తి, ఆత్మావిష్కరణ, అనుభవాత్మ పతాకం తప్ప, పరాయి సాహిత్య సూత్రాల పరిగణన ఉండనే ఉండదు. ఎక్కడయినా ఉంటే అది విమర్శకుల అదృష్టం. **"సంఘంలోని శిథిల జీవిత నియమాలు ఛేదించుకొన్నట్లే సాహిత్య నియమాలు ఛేదిస్తారు దళితులు."**[50] ఛేదించడం అనివార్యం ఎక్కడయినా ఆ నియమాలు ఉన్నట్లు అనిపిస్తే అవి అలవాటు వల్ల ఉండటమే. వస్తు పరిణామక్రమంలో, భావజాలంలో, భాషలో, వ్యాకరణంలో, అలంకారంలో, అభివ్యక్తిలో మార్పు వస్తుంది. వచ్చి తీరుతుంది.

**"ప్రజలలాగే భాష కూడా నిరంతరం పరిణామం చెందుతూ వుంటుంది. ఒక కాలంలోని భాషకు ఆ కాలం వ్యాకరణం ఉంటుందనీ, ఇంకొక కాలంలోని భాషకు మరో వ్యాకరణం రూపొందుతుంది. భాష గ్రాంథికంగా, వ్యవహారికంగా, మాండలికంగా మారుతూ సాహిత్య సృష్టికి దోహదం చేస్తున్నట్లే వృత్తి, కుల తరగతుల మాండలికం సహాయం చేస్తుంది. మాండలికంలో సాహిత్యం వచ్చినప్పుడు సహజభాష వస్తుంది. సహజభాషలో పదాలు కొన్ని కొందరికి బూతులుగా అనిపిస్తాయి. నీతిమంతులకు బూతు వినిపించదు, కనిపించదు. బూతు ప్రధానంగా మనస్సంబంది, దళితసాహిత్యంలో దాగుడుమూతలభాష ఉండదు. సహజమయిన భాష ఉంటుంది."**[51]

**"కోపంలో కవి బూతు వాడినా వాడవచ్చు. అక్కడ హృదయం ముఖ్యం. బూతు బూతుకోసం వాడకపోతే ఇతర సాహిత్య ప్రయోజనం వాంఛిస్తే, దాన్ని బూతులుగా గ్రహింపనక్కరలేదు. బూతు బుద్ధిపూర్వకంగా వాడితే దాని హేతువును చూడాలి."**[52]

**"అన్నీ తీరినవాడికి నోరు మెదిపే అవసరం ఉండదు. ఆకలి అయినవాడు అమ్మా అంటాడు. అమ్మ అయినా అడగందే పెట్టదు. ఆలస్యం అయితే కేకపెడతాడు. చస్తున్నవాడు గావుకేక పెడతాడు. వేల సంవత్సరాలు తరబడి ఆకలి ఆత్మహననం అవుతున్న జాతి**

**ఎంత పెడబొబ్బలు పెట్టాలి? అరవద్దు అంటే సాధ్యం కాదు. దళితుడి స్థితి అర్థం చేసుకోకుండా ఎవడైనా మాట్లాడితే అది వాడి ఆత్మహత్యా సదృశ్యం కాక మనిషి జన్మహక్కు. ఈ కేకలు దళితుల ఆజన్మహక్కులు. ఈ కేకలు సుందరంగా వినసొంపుగా సంగీతాత్మకంగా ఉండాలంటే కష్టము. అవి క్రమంగా ఉండవు. నెమ్మదిగా ఉండవు. తక్షణంగా ఉంటాయి"**[53] పవిత్రతను నుదుట దిద్దుకొని తిరుగుతున్న మనుషులకే ఆ కేకలు బూతులుగా అశ్లీలంగా వినిపిస్తాయి.

ప్రేమ, ఆప్యాయత, వాత్సల్యం, కరుణ, సానుభూతి పుష్కలంగా ఉన్నవాడు దళితుడు. ఆవేదనకు గురి అయినవాడు, ఇతరుల ఆవేదనను చక్కగా అర్థం చేసుకోగలడన్నది వాస్తవంగా దర్శింపబడితే ప్రపంచ బాధను దళితుడు అర్థంచేసుకొన్నంత బాగా మరెవరూ అర్థం చేసుకోలేడు. విప్లవ సాహిత్యంలో ఉన్న పాటను విమర్శకులు దళిత సాహిత్యంలో చూస్తున్నారు.

కలయినపుడు ఏడ్చిన శిశువుపాలు తాగిన తర్వాత నవ్వినట్లు, పాట స్త్రీవాదంలో పుట్టితీరుతుందని దళితవాదం ఋజువు చేస్తుంది.

**"దళితసాహిత్యంలో ఒక అపోహకు అవకాశం ఉంది. ఏదో కులం, మతం, వర్గం, వర్ణం పేరు ప్రస్తావించినపుడు వాటిని నిందిస్తున్నట్లో, నిరసిస్తున్నట్లో అనిపించవచ్చు, తిట్టినట్టూ అనిపించవచ్చు. దళితుడే తిట్టడం ముఖ్యంకాదు. తిట్టు ఉద్దిష్టప్రయోజనం కాదు. తన అస్తిత్వం, అభ్యుదయం, విముక్తి ముఖ్యం. అయినా వ్యవస్థను, వ్యక్తుల్ని సంస్థల్ని, సాహిత్యాన్ని నిరసించటం, నిందించడం, విమర్శించడం ముఖ్యమే**

**సంకెళ్ళు తెంచందే, జైలుగోడలు కూల్చందే, నోటి తాళాలు తీయందే, సంప్రదాయాలు బద్దలుకొట్టందే, చేతులు పనిచేయవు. కాళ్ళు నడవ్వు, నోళ్ళు తెరుచుకోవు, బుద్ధి వికసించదు. మనిషి విముక్తి కావటానికి బంధనాలు బద్దలు కావలసిందే. అది హింసకాదు, విద్రోహం కాదు, వినాశనం కాదు, జీవపరిణామంలోని నూత్నసృష్టికి అవసరమైన విస్ఫోటనమే 'తల్లివాదనలను తన్నుకులాడందే తల్లి తనూ రక్తం మానవ మస్తిష్కపాఠంలో సూర్యోదయం**

**కానిదే తల్లి తనువు ఉల్లిపొరలాగా గాలికి అల్లాడకపోతే బిడ్డ జన్మించదు. సృష్టి జరగదు, భవిష్యత్తు ఉండదు. ప్రపంచం పరిణమించదు, బిడ్డ పుట్టడం శుభం. ఇది హింస కాదు. అలాగే "దళితుల విముక్తి ప్రయత్నాలు పలికే మాటలు బూతులు కావు, ద్రోహబుద్ధిలేదు. అవి మానవ వికాసాన్ని ప్రకటిస్తాయి."**[54] దళితుడు సంఘంలో కోరేది తన అస్తిత్వానికి అర్థం. వ్యక్తిత్వానికి, ఆత్మకు గౌరవం. లోకం ప్రదర్శించే నీచత్వం, నలుగురితో సమానంగా, స్వతంత్రుడుగా, స్వేచ్ఛాజీవిగా, ఆర్థిక, రాజకీయ, సాంఘిక, చైతన్యశక్తిగా జీవించటం. ఈ దృష్టితోడి సాహిత్యం అందించే సంఘ పరిణామం విమర్శనంలో పరిశీలించటం సమంజసం. ఒక మనిషి బలహీనుడైతే, ఆ మనిషి పని మరొకడు చేయవలసి వస్తుంది. అది సంఘానికి నష్టం. దళితున్ని బలవంతున్ని కానిస్తే బలహీనులు తగ్గిపోయి బలవంతులు అవుతారు. దేశ వర్తమానం, భవిష్యత్తు బంగారు బాటలవుతాయి. బలవంతులు – బలహీనులు మధ్య సమానత్వం, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఉండవు.

దళితుడు బలవంతుడు, సమర్థుడు అవటం చాలా అవసరం. దేశంయొక్క అభివృద్ధికి పాటుపడే దళితుడు అభివృద్ధి చెందడం హర్షించదగ్గ విషయం. దళిత సాహిత్య విమర్శకుడు విమర్శ పూర్వరంగం గ్రహించి, ఈ వాదంలోని విలువల్ని గుణాల్ని నియమాలను విశదం చేసుకొని దళిత విజయం ప్రస్తావించటానికి కృషి చేయాలి.

దళిత సాహిత్యంలోని వివిధ అంశాలను విమర్శించడం సంప్రదాయ సాహితీ విమర్శకుల దృక్పథంగా కనిపిస్తున్నది. 1995 నుండి ఈ విమర్శధోరణి ఎక్కువగా కనిపిస్తుంది. దళిత సాహిత్యంలో వస్తువు, అభివ్యక్తి భాషలపట్ల సంప్రదాయ సాహితీ విమర్శకులు తమవాదనలను వినిపించారు. ఈ దళిత కవులు, రచయితలు తమసృజనాత్మక రచనల్లోనే సమాధానం చెప్పే ప్రయత్నం చేశారు. మరికొంతమంది విమర్శ వ్యాసాలద్వారా సమాధానం చెప్పారు. కొలకలూరి ఇనాక్, గుజ్జర్లమూడి కృపాచారి, బన్న అయిలయ్య, కత్తి పద్మారావు, ఎండ్లూరి సుధాకర్, శిఖామణి, బి.ఎస్.రాములు, కొండపల్లి సుదర్శన్‌రాజు మొ॥గువారు దళిత సాహిత్య విమర్శకు ఓ రూపాన్ని తీసుకొని వచ్చారు.

దళితుల్ని పశువు కంటే నీచాతినీచంగా చూసే విధానాన్ని నుంచి విముక్తి చేసే రాజ్యాధికారం వైపు పయనించే దిశగా దళిత సాహిత్య దృక్పథం కనిపిస్తుంది. ఈ పరంపరలోనే శిఖామణి సాహిత్యం– దళిత దృక్పథం పరిశీలించవలసిన ఆవశ్యకత ఉంది. తరువాత వచ్చే అధ్యాయంలో సమగ్రంగా 'శిఖామణి సాహిత్యం– దళిత దృక్పథం' పరిశీలించాను.

# పాద సూచికలు


1. ఆప్ట్. వి.ఎస్, 1985, 493
2. కె.సత్యనారాయణ (వ్యాసం), పుట: 98, దళితవాద వివాదాలు, ఎస్వీ. సత్యనారాయణ
3. దళిత సాహిత్యం–సామాజిక తాత్త్విక భూమిక (వ్యాసం), డా॥ఎండ్లూరి సుధాకర్, పుట: 111, ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రక్రియలు, ధోరణులు, తెలుగు అకాడమి
4. తెలుగులో కవిత్వోద్యమాలు, పుట: 209.
5. తెలుగులో కవిత్వోద్యమాలు, పుట: 209.
6. తెలుగులో కవిత్వోద్యమాలు, పుట: 209.
7. దళితవాద వివాదాలు–సంపాదకుడు, ఎస్వీ. సత్యనారాయణ, పుట:2
8. దళితవాద వివాదాలు–విరసం మరణించింది వ్యాసం, శివసాగర్, పుట: 133
9. దళితవాద వివాదాలు (సం) ఎస్వీ. సత్యనారాయణ విరసం మరణించింది (వ్యాసం), శివసాగర్ పుట: 104
10. జయధీర్ తిరుమలరావు, దళిత గీతాలు, 1993
11. Xogerda Mesham, Dalit Literature, testhetic sence and craftsman ship, FAI DWC, 1994:33
12. Kshitsagar, Dalit Literature, the process of social change, FaiDWC, 1994, 70
13. M.N.Wankhade, Friends, The day of irresponsible writers is one poisoned bread, 1994, 314
14. గుర్రం మాధవరావు, దళిత సాహిత్యంలో వాద ప్రతివాద విమర్శ, పుట: 61
15. గుర్రం మాధవరావు, దళిత సాహిత్యంలో వాద ప్రతివాద విమర్శ, పుట: 67

16. తెలుగులో దళిత కవిత్వం రూపం-వస్తువు పి.మల్లికార్జున్, పుట: 22.

17. పి.మల్లికార్జున్, తెలుగులో దళిత కవిత్వం రూపం-వస్తువు, పుట: 91.

18. పి.మల్లికార్జున్, తెలుగులో దళిత కవిత్వం రూపం-వస్తువు, పుట: 93

19. పి.మల్లికార్జున్, తెలుగులో దళిత కవిత్వం రూపం-వస్తువు, పుట: 93

20. గుర్రం మాధవరావు, దళిత సాహిత్యంలో వాద ప్రతివాద విమర్శ, పుట: 19

21. జయధీర్ తిరుమలరావు (సం) దళిత గీతాలు, 1993, 4

22. జయధీర్ తిరుమలరావు (సం) దళిత గీతాలు, 1993, 3

23. పి.మల్లికార్జున్, తెలుగులో దళిత కవిత్వం రూపం-వస్తువు, పుట: 101

24. జయధీర్ తిరుమలరావు (సం), దళిత గీతాలు, 1993, పుట: 22

25. గుర్రం జాషువా, గబ్బిలం, 1994, పుట: 10

26. గుర్రం జాషువా, గబ్బిలం, 1994, పుట: 71

27. మాష్టార్జీ, మాష్టార్జీ దళితగీతాలు, 1994, పుట: 3

28. మాష్టార్జీ, మాష్టార్జీ దళితగీతాలు, 1994, పుట: 18

29. పి. మల్లికార్జున్, తెలుగులో దళిత కవిత్వం రూపం-వస్తువు, పుట: 109

30. పి. మల్లికార్జున్, తెలుగులో దళిత కవిత్వం రూపం-వస్తువు, పుట: 110

31. పి. మల్లికార్జున్, తెలుగులో దళిత కవిత్వం రూపం-వస్తువు, పుట: 112

32. కె.జి.సత్యమూర్తి (సం) ఈనాటి ఏకలవ్య, జనవరి-ఫిబ్రవరి, 1997, పుట: 59

33. తెలుగు సాహిత్యంలో హరిజన రచయితల సేవ, వై.విజయానందరాజు, పుట: 42.

34. " పైదే " పుట: 43.

35. " పైదే " పుట: 45.

36. " పైదే " పుట: 47.

37. " పైదే " పుట: 121.

38. " పైదే " పుట: 124.

39. చూడు: తిరుమలరావు, జయధీర్ (సం), 1993, పుట: 3

40. తెలుగు సాహిత్యంలో హరిజన రచయితల సేవ, వై.విజయానందరాజు, పుట: 245.

41. గుర్రం మాధవరావు, దళిత సాహిత్యంలో వాద ప్రతివాద విమర్శ, పుట: 32

42. ” పైదే ” పుట: 33

43. తెలుగు దళిత నవల–రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, కె.లక్ష్మీనారాయణ, పుట: 74, 84

44. తెలుగు దళిత నవల (సం), రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, కె.లక్ష్మీనారాయణ, పుట: v

45. తెలుగు దళిత నవల (సం), రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, కె.లక్ష్మీనారాయణ, పుట: iv

46. జి.మాధవరావ్, దళిత సాహిత్యంలో వాద ప్రతివాద విమర్శ, పుట: 37

47. ఆధునిక సాహిత్య విమర్శ సూత్రం, కొలకలూరి ఇనాక్, 1996, పుట: 167

48. ఆధునిక సాహిత్య విమర్శ సూత్రం, కొలకలూరి ఇనాక్, 1996, పుట: 171

49. ఆధునిక సాహిత్య విమర్శ సూత్రం, కొలకలూరి ఇనాక్, 1996, పుట: 172

50. గుర్రం మాధవరావు, దళిత సాహిత్యంలో వాద ప్రతివాద విమర్శ, పుట: 42

51. ఆధునిక సాహిత్య విమర్శ సూత్రం, కొలకలూరి ఇనాక్, 1996, పుట: 172

52. ఆధునిక సాహిత్య విమర్శ సూత్రం, కొలకలూరి ఇనాక్, పుట: 172

53. ఆధునిక సాహిత్య విమర్శ సూత్రం, కొలకలూరి ఇనాక్, పుట: 174

54. దళిత సాహిత్యంలో వాద ప్రతివాద విమర్శ, జి.మాధవరావు, పుట: 44

"జీవితం ఆగదు. విజయాలు, వైఫల్యాలు వస్తూ వుంటాయి. పోతూ ఉంటాయి. కవుల అనుభవాలకు ప్రతిస్పందిస్తూ వుంటారు. కవుల అనుభవాలకు ప్రతిస్పందిస్తూ వుంటారు. కొందరు అభిప్రాయాల దగ్గర ఆగిపోతారు. మరికొందరు సిద్ధాంతాలు పట్టుకొని వేళ్ళాడుతారు. కొందరికి గతం, మరికొందరికి భవిష్యత్తు ఆధారం.

వీటిలో ఏ కేటగిరికీ చెందని కవి శిఖామణి. చిన్నతనపు అనుభూతుల్ని స్ఫటిక స్వచ్ఛంగా  దాచుకున్న కవి. వాటికి అనుభవాల కల్మషాన్ని అంటనివ్వడు. మానవ సంబంధాల మాధుర్యాన్ని తియ్యతియ్యగా  ఆలపిస్తాడు. అతని దగ్గర అమ్ములపొదిలో బాణాల్లా కవితా సామగ్రి, ప్రకృతి సిద్ధమయిన కవితా సామగ్రి ఉంది. ఒక్కో బాణం తీసి వదుల్తాడు. అది ఒక వ్యక్తిని తాకి వెలుగుతుంది. ఒక సంఘటనని మెరిపిస్తుంది.

అతని కవిత్వం పిల్ల తెమ్మెర. అతనో తేనెపిట్ట. జ్ఞాపకాల తేనె బిందువును మన మనసులో వదుల్తాడు. మనసంతా తియ్యటి తీపితో తిమ్మిరెక్కుతుంది. రవీంద్రనాథ్ ఠాగూర్ మేఘసందేశం గురించి చెబుతూ సాహిత్యంలో కొన్నిచోట్ల అనవసర రచనలుంటాయి. కానీ వాటిలో అధిక ప్రసంగం ఉండదు.  సంస్కృత సాహిత్యంలో మేఘసందేశం అందుకు ఉదాహరణ. అది ధర్మాన్ని బోధించదు. కర్మవిషయం కాదు. పురాణం కాదు. ఇతిహాస వస్తువు లేదు. అది ఏ విషయంలోనూ  ప్రయోజనం ప్రసక్తి లేంది. మనిషి చేతనా చేతన విచారం ఎప్పుడు లోపిస్తుందో ఆ సందర్భంలో జరిగే ప్రలాపం. అది స్వచ్ఛమయినముత్యం అన్నాడు.

శిఖామణి  కవిత్వం తెలుగులో అలాంటిది

'స్వస్థాన వేషభాషాభిమాతాఃసతః రసప్రలబ్ధి దయంః' అన్నాడు నన్నయ. శిఖామణిలో సాంద్రంగా ఆ నేటివిటీ వుంది. సునామీలు, కత్రీనాలు తాకలేని సెంటిమెంటు వుంది."[1]అని సౌభాగ్య అన్నారు.

ఈ కవిగారు తెలుగు సాహిత్యంలో మొదట అనుభూతి కవిత్వం రాసారు. ఆ తదనంతరం ఎక్కువగా దళితకవిత్వం రాస్తూ దళిత కవిగా గుర్తింపు పొందారు. వీరు కవిత్వం, విమర్శ, పీఠికలు, సంపాదకత్వం, పరిశోధన గ్రంథాలు వంటి విషయాలతో గుర్తింపు పొందారు. ముందుగా వీరు రాసిన కవిత్వం పరిశీలిద్దాం.

## 4.1 కవిత్వం

లలితకళలు అయిన 1. కవిత్వం 2. చిత్రలేఖనం 3. నాట్యం 4. శిల్పం 5. సంగీతం. వీటివలన అనిర్వచనీయమైన ఆనందాన్ని పొందుతారు. ఈ కళలు వలన ఆనందము ఇలా వుందని చెప్పటం సాధ్యంకాని పని. లలితకళలలో ఒకటైన కవిత్వం పైన దృష్టి సారించారు. తను జీవితంలో అనుభవించిన కష్టసుఖాలను సమాజంలో చూసిన విషయాలను అనుభవపూర్వంగా, సందర్భానుకూలంగా తన కలం నుంచి కవిత్వం ద్వారా సాహిత్యలోకానికి పరిచయం అయ్యారు. వీరి కవిత్వంలో ఎక్కువగా దళితుల యొక్క ఆర్తి, ఆవేదనలు కనిపిస్తాయి.

### 4.1.1 సామాజిక అవమానాలను నిరసించటం

1999 సంవత్సరంలో కర్ణాటకలో దేవాలయ ప్రవేశం చేసిన హరిజనుడిచేత మలం తినిపించారన్న వార్త చదివి, తీవ్రంగా స్పందించి, శిఖామణివాడే అశుద్ధ మానవుడు' అనే కవితను 'జనరచన' పత్రికలో ప్రచురించారు. ఈ కవిత 'రేయ్ లంజాకొడకా' అని ఆరంభమౌతుంది. ఆ పద ప్రయోగం గురించి వాగ్వివాదాలు జరిగాయి. ఆ కవితను చూసి జయప్రభ దానిని మెచ్చుకుంటూనే ప్రగతిశీల భావాలు గల కవులు, రచయితలు స్త్రీలను కించపరిచే పదజాలాన్ని ఉపయోగించకూడదన్నారు. 'భాషకు కులమానా లుంటాయా?' అని సంపత్కుమార వ్యాసం రాసారు. దానిని ఖండిస్తూ బొజ్జా తారకం, చలసాని ప్రసాద్ వ్యాసాలు రాసారు. ఆ ఆరంభమే ఈ కవియొక్క తీవ్ర మనోవేదనను తెలుపుతుంది. ఇక కవితలో-

“రేయ్ లంజాకొడకా అనే పదం
చాలా చిన్నదే అవుతుంది
చచ్చిన కుక్కమాంసం తినబోయాడని
పురాణాలు ఘోషిస్తున్నాయి
ఇంకా ఈ భూగోళం మీద
అనేక దేశాల అనేక జాతులు
ఆవుల్ని మేకల్ని తింటున్నాయి
పందుల్ని, పాముల్ని
కప్పల్ని, కుక్కల్ని కూడా తింటున్నాయి
కానీ ఈ భూగోళం మీద మొట్టమొదటిసారిగా
ఈ దేశంలో
మనిషి మరొక మనిషి మలాన్ని తిన్నాడు
ఏం సిగ్గుగా ఉందా? .....
ఒరే! నిన్ను లంజాకొడకా అనడానిక్కూడా
నాకు సిగ్గుగా ఉంది
ఈ లోకంలో మనిషి రక్తం తాగిన
నరరూప రాక్షసులున్నారు
మనిషి మాంసం తినే ‘మేన్ ఈటర్స్’ ఉన్నారు.
కానీ మనిషి మలాన్ని
మరొక మనిషిచేత తినిపించిన
మనుషులు మాత్రం లేరు
నీకు చదువూ సంస్కారమూ
నీ సాహిత్య భాషా అశ్లీలమూ

**అన్ని అడ్డొస్తున్నాయవునా?**

**చదవడానికే ఇబ్బందిగా వుందవునా?**

**ఒరే నీకు చదవడానికే అంత యిబ్బందిగా ఉంటే**

**రెండు కళ్లు-రెండు కాళ్లు**

**రెండు చెవులు-రెండు చేతులు**

**ఒక ముక్కు-మనసూ కలిగిన**

**అచ్చం నీలాగా-నాలాగా**

**ఒక అమ్మాబాబుకి పుట్టిన మనిషిని**

**అక్షరాలా మనిషేరా**

**వాడు మలం తిన్నాడు**

**ఒరేయ్ నీ ఇరవై ఒకటో శతాబ్దం**

**ఆదిమ యుగంనాటి**

**అజ్ఞాతపు గుహలో దాక్కుందా?**

**చేతులెత్తి మొక్కే**

**నీ దేవుడికి ఎయిడ్స్ సోకిందా?**

**ఇప్పుడు చెప్పరా**

**మళ్ళీ మళ్ళీ అడుగుతున్నాను."** [2] (చిలక్కొయ్య, 1993:28)

అని ప్రశ్నించాడు. ప్రపంచంలో అనేక జాతులవారు అనేకరకాల మాంసాలు తింటున్నారు. మనిషి మాంసం తినే నరమాంస భక్షకులూ ఉన్నారు. కానీ ఈ దేశంలో ఒక మనిషి మరొక మనిషి మలాన్ని తిన్నాడు. కాదు తినిపించారు. సాటి మనిషిగా, దళితునిగా ఎంతైనా స్పందించడం సహజం. దళిత కవిగా, సామాజిక బాధ్యత గలవాడుగా వీరు స్పందించారు. వేదన పడ్డారు. ఆవేదనలోనుండి క్రోధం వచ్చింది. ఒక మనిషి

ఇంకో మనిషిపై అనైతికంగా, అమానుషంగా, దౌర్జన్యంగా, నీచాతినీచంగా ప్రవర్తించడాన్ని కవి ప్రశ్నించాడు. సభ్యత మరచిన అగ్రవర్ణాల వారి దుశ్చర్యకు సభ్యత మరచే దూషించాడు.

ఇంత జరిగితే నీ ఇరవై ఒకటో శతాబ్దం ఆదిమగుహలో దాక్కోకుండా నీ అణుబాంబుగాలి తీసిన బెలూన్‌లా తుస్సుమనకుండా, నీ దేవుడికి ఎయిడ్స్ సోకకుండా ఎలా ఉంటుందని శిఖామణి జాషువాలా ధర్మాగ్రహాన్ని ప్రకటించాడని విమర్శకులు భావిస్తున్నారు. ఈ ధర్మాగ్రహం తరువాత ఎంత సుకుమార మనస్సున్నవాడో సామాజిక దౌష్టికాలు జరిగినప్పుడు తన అసలు రూపాన్ని కవిత్వంలో ప్రదర్శిస్తాడు. తర్వాతి కాలంలో మద్దూరి నగేష్‌బాబు వంటి మరికొందరు కవులకు స్ఫూర్తినిచ్చింది.

ఇంత తీవ్రమైన అభివ్యక్తి ప్రాచీన సాహిత్యం చౌడప్పలోనూ, వేమనలోనూ కనిపిస్తుంది. ఆధునిక తెలుగు కవిత్వంలో శ్రీశ్రీ తర్వాత దిగంబర కవుల తర్వాత మళ్ళీ తీవ్రమైన అభివ్యక్తి ఈ కవితలో స్పష్టంగా కనిపిస్తుంది.

శిఖామణి ఈ సమాజంలో మనిషిని జంతువుకంటే నీచాతి నీచంగా చూస్తున్న విధానాన్ని 'అంటు' కవితలో ఆవిష్కరించాడు.

**"అంటంటే**
**మనిషి ఎదురుపడితే**
**అశుద్ధాన్నుండి**
**పక్కకు జరిగినట్టు**
**మనిషి నుండి**
**మనిషి వైదొలగడమే**
**అంటంటే**
**మనిషి ఎదురుపడితే**
**పులో సింహమో ఎదురుపడ్డట్టు"**[3] (గిజుగాడు, 2012:95)

సమాజంలో మనిషిని మనిషిగా గుర్తించకుండా దళితులను పశువుకంటే నీచంగా

చూస్తున్న విధానాన్ని తోటి మనిషి క్రూరజంతువులాగా చూస్తున్న అగ్రవర్ణాలను ఖండించిన విధానం ఈ కవితలో కనిపిస్తుంది.

ఇంకా ఈ కవితలో

**"పూల మొక్కలు అమ్ముకునే అతను**
**ఎదురు పడతే**
**ముచ్చటపడి ఓగున్నమావి మొక్కను**
**బేరమాడాను**
**ఇది అలాంటిలాంటి**
**మామిడికాదు**
**అంటుమామిడి మొక్క అన్నాడు**
**నేను ఉలిక్కిపడి**
**అంటంటే అన్నాను**
**కొమ్మకు కొమ్మను అంటుకట్టిన మామిడి**
**ఆరునెలల్లో కాపుకొస్తుందన్నాడు**
**అంటంటే వెలివేతలూ దూరం జరగడాలు కాదు**
**అంటంటే దగ్గరకు తీసుకోవడం**
**ఆలింగనం చేసుకోవడం**
**అనే కొత్త అర్థాన్ని ఇచ్చాడతను"** [4] (గిజుగాడు, 2012:97)

పెత్తందారీ సమాజం దళితులను అంటరానివారిగా తీర్చిదిద్ది, వీళ్ళను సమాజానికి దూరంగా ఉంచింది. అందరితో సమానమైన వారు కాదని నిషేధించింది. ఇక్కడ అంటంటే ఆలింగనం చేసుకోవటం, ప్రేమ ఆప్యాయతలతో దగ్గరికి తీసుకోవటం అనే కొత్త అర్థాన్ని ఇచ్చాడు. తర్వాత కాలంలో సమాజంలో అంటరానితనం అంతరించిపోదని అందరూ సమానంగా స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలతో జీవిస్తున్నారన్న కవి భవిష్యత్ సూచన కనపడుతుంది.

భారతీయ సమాజంలో కులవ్యవస్థ మరింత లోతుకు పాతుకు పోతున్నది. మనిషికీ మనిషికీ మధ్య ఉన్న దూరాన్ని 'కులంబద్ద'తో కొలుచుకుంటున్న మనుషులం మనం.

### 4.1.2 ఆత్మాభిమానాన్ని ప్రకటించు కోవడం

శిఖామణి కవితల్లో దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడుకోవటానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ప్యాపిలిలో జరిగిన అనాగరిక చర్యకు నిరసనగా 'సవర్ణాంధ్ర' ఇందులో దళితులను పశువులకంటే హీనంగా చూసిన వైనాన్ని చిత్రీకరించారు.

**"ఆ రాచవీధిలో అంతకుముందు**

**ఆరడుగుల కోడెత్రాచు**

**జరజరా పాక్కుంటూ వెళ్ళింది**

**జనులంతా పక్కకు జరిగి**

**నాగదేవత అని చేతుల జోడించారు"**[5] (నల్లగేటూ నందివర్ధనం చెట్టు 2005:114)అంటూ ప్రారంభమవుతుంది ఈ కవిత.

ఈ సవర్ణాంధ్రలో విషనాగులను చూసిన జనులు భక్తితో పూజిస్తారు. దళితుడు దర్శనమిస్తే దూషిస్తారు. ఊరకుక్క ఊరంతా తిరిగినా దాన్ని భైరవుడని భక్తితో చూస్తారు. కాని దళితుల్ని భయభ్రాంతుల్ని చేసి వారి జీవితాలతో ఆడుకుంటారు. ఏ గొందిలో నల్లపంది గురగురలాడి వెళ్ళినా వరహావతారమని దండాలు పెడతారు. కోతిని చూసిన రామభక్తులంతా అంజనీపుత్రుడని చేతులు జోడించిరి. కానీ దళితుడి నీడ కూడా భరించలేరు.

**"ఆ రాచనగరిలో**

**అహంకారపు మూపురంలో**

**ఒక పనిదొంగ ఆంబోతు**

**రాచఠీవితో నడయాడింది**

**ఆధ్యాత్మిక పరులంతా నందికేశుడని**

**అలౌకికానందంతో**

**హారతులు పట్టారు"**[6] (నల్లగేటూ నందివర్ధనం చెట్టు 2005:115)

నడివీధిలో బలిసిన ఆంబోతు రంకెలేసి తిరిగితే నందీశ్వరుడని హారతులు పట్టారు. కాని సాటి మనిషైన దళితున్ని ఏ మాత్రం మనిషిగా అంగీకరించలేదు. ఇన్ని జంతువులు స్వతంత్రంగా తిరిగినా మైలపడని ఊరు ఎలా మైల పడిందో చూస్తే

"ఆ వీధిలోనే ఒకరోజు

కొందరు మనుషులు

రక్తమాంసాలున్న మనుషులు కూడా

నడవబోయారు

మాదిగలు మాదిగలని

భూమి బద్దలైపోతున్నట్టు

ఆకాశం నేలకూలుతున్నట్టు

ఉప్పెన ముంచుకొస్తున్నట్టు

ఊరు తగలబడి పోతున్నట్టు

ఊరు ఏకమై

అడ్డు నిల్చింది" (నల్లగేటూ నందివర్ధనం చెట్టు, 2005:116)

అంటే ఈ సవర్ణాంధ్రలో పాములకు, కుక్కలకు, దున్నలకు, పందులకు ఉన్న విలువ దళితులకు లేదు. కేవలం వారు మాదిగలు కావడమే నేరం. మృగాలకు చోటిచ్చి, తోటి మనిషిని నీచాతినీచంగా చూడడం ఆ పశువులకే చెల్లింది. మనిషి మృగమైనచోట అధర్మం నాలుగు పాదాల నడిచినట్లే గదా! అందుకే కవి దళితుల్ని తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకొమ్మని హెచ్చరిస్తున్నాడు.

**"ఓ నా చండాలుడా!**

**తొలగవలసింది మనో మాలిన్యమే కానీ**

**శరీరాలు కాదని**

**ఈ శంకరాచార్య సంతతికి**

**ఈసారి గూటం దెబ్బతో అయినా**

**చెబుదాం"**[7] (నల్లగేటూ నందివర్ధనం చెట్టు, 2005:116,117)

ఓ దళిత సోదరులారా! మారాల్సింది, శుద్ధి చేయాల్సింది శరీరాలు కాదు. మనుషుల్లో ఉన్న మాలిన్యాన్ని తొలగించాలి. అందుకే ఈ సవర్ణులకు గూటం దెబ్బతో బుద్ధి చెబుదాం రండి, మన ఆత్మగౌరవాన్ని కాపాడుకుందాం రండని పిలుపునిచ్చాడు.

చివరిగా ఎవడురా! ఆంధ్రదేశాన్ని కాదని ఆఫ్రికాను చీకటిఖండం అన్నది అని ప్రశ్నిస్తున్నాడు.

**"ఎవడురా! పొరలు కమ్మిన ఈ**

**సవర్ణాంధ్రను**

**స్వర్ణాంధ్ర అన్నవాడు"** [8] (నల్లగేటూ నందివర్ధనం చెట్టు, 2005:116)

ఈ కవితలో దళితులపై జరిగే దాడులను తీవ్రంగా ఖండించాడు కవి.

### 4.1.3 వర్ణాధిపత్యాన్ని ప్రశ్నించటం

ప్రముఖ చిత్రకారుడు JNTU లో చిత్రకళ అధ్యాపకుడు స్టాన్లీ సురేష్ పై జరిగిన అగ్రవర్ణాల హత్యా ప్రయత్న నేపథ్యంలోనిదే 'రంగుల పీడకల' కవితలో దళితులపై అగ్రవర్ణపు వారు చేసిన దాడిని ఓ రంగుల పీడకలగా రూపొందించాడు.

'రక్తానికే కాదు రంగులకీ పాకింది

కలాలకే కాదు కుంచెలకీ సోకింది విషక్రిమి

కంప్యూటర్ డిస్క్‌లకే కాదు

గాయకుడి గొంతుల్లోకీ

నాట్యకారుడి గజ్జెకీ

వాద్యకారుడి వాయిద్యాలకీ సోకిందీ వైరస్' (కిర్రుచెప్పుల భాష, 2000:42)

రక్తానికి మాత్రమేకాదు, రంగులకు, కులాలకు, కుంచెలకు సోకింది విషక్రిమి అంటున్నాడు కవి. ఇక్కడ విషక్రిమి అంటే కులం అనే విషక్రిమి. కంప్యూటర్ డిస్క్‌లకే పరిమితమైనది అనుకున్న వైరస్ గాయకుడి గొంతుల్లోకీ, నాట్యకారుడి గజ్జెకీ సోకింది. అంతటితో ఆగలేదు వాయిద్యకారుడి వాయిద్యాలకీ సోకింది కులమనే వైరస్ అంటున్నాడు. ఇంకా ఇలా ప్రశ్నిస్తున్నాడు.

**"ప్రతిభ ఎవడబ్బ గండపెండేరం?**

**కళంటే వాడు సుష్టుగా భోంచేసి**

**పళ్ళ సందుల్లో ఇరుక్కున్న మాంసం ముక్కల అవశేషాల్ని కెలుక్కునే**

**టూత్‌స్టిక్ అనుకుంటాడు**

**ఇన్నాళ్ళూ మోసపోయాం**

**కలర్ బ్లైండ్‌నెస్ సోకిన రంగులకు**

**కళ్లు తెరిపించే కాలం వచ్చింది"** [9] (కిర్రుచెప్పుల భాష, 2000:43)

ప్రతిభ ఎవడిచ్చిన గండపెండేరం? కాదని ప్రశ్నిస్తున్నాడు. అగ్రవర్ణాల వారిలో మాత్రమే ప్రతిభ వుందా? కళంటే వాడు భోంచేసినప్పుడు పళ్ళ సందుల్లో ఇరుక్కున్న మాంసపు ముక్కల అవశేషాల్ని తినే నోటిపుల్ల కాదంటాడు.

ఈ కులం రంగులతోనే ఇన్నాళ్ళూ మోసపోయాం. ఇంకానా? ఇకపై సాగదు. రంగుల గుడ్డితనానికి కళ్ళు తెరిపించే కాలం వచ్చింది. వీటిని కడిగేసే సమయం వచ్చిందని భవిష్యత్ సూచన చేస్తున్నాడు.

**"స్టాన్లీ!**

**నీ ఒలికిన రక్తం వృధాకాదు**

**మా గుండెలను రంగుసీసాలుగా తెరిచాం**

**మా కనురెప్పలు వెంట్రుకలను కుంచెలుగా మలిచాం**

**రా!**

**ఈనాటి ఆకాశపు కాన్వాసుమీద**

**రేపటి కొత్త సూర్యుణ్ణి చిత్రించు”** [10] (కిర్రుచెప్పుల భాష, 2000:44)

వర్ణాధిక్యతను ప్రశ్నించినందుకు నీపై దాడిచేసినపుడు చిందించిన నీ రక్తం వృథా కాదు మిత్రమా! మా గుండెలను రంగు సీసాలుగా తెరిచాం. మా కనురెప్పలనే కుంచెలుగా మలిచాం. రా ఈనాటి ఆకాశమనే కాన్వాసుమీద రేపటి కొత్త సూర్యున్ని చిత్రించు. కళాకారున్ని, కళలను ధ్వంసంచేయ ప్రయత్నించిన కులంపై ఎదురు దాడికి సిద్ధం కమ్మంటున్నాడు. కులం రంగులను కడిగేయమంటున్నాడు. కులరహిత సమాజాన్ని చిత్రించమని కోరుతున్నాడు.

ఈ రోజుల్లో కూడా కులవివక్ష ఎక్కడుంది అంటూ ఉంటారు. కానీ ఎక్కడలేదు? వివక్ష అన్ని సందర్భాలలో అన్ని సమయాలలో సదా సజీవమైనది. శిఖామణి తండ్రి పొందిన అవమానాలను 'నాయన కవిత్వం'లో

**“ఊరి హోటల్లో ఎప్పుడైనా**

**కొబ్బరి చిప్పల్లో టీనీళ్ళు తాగారేమో**

**ఇస్త్రీ బట్టల్ని దొంగచాటుగా తీసుకెళ్ళి**

**వూరి పొలిమేర దాటిం తర్వాతే**

**ఎప్పుడైనా కట్టుకున్నారేమో**

**గల్లా పట్టుకొని ప్రశ్నిద్దాం రానాయనా!”**[11] (కిర్రుచెప్పుల భాష, 2000:45)

అంటూ ప్రశ్నించటానికి వర్ణాధిపత్యాన్ని ఎదుర్కొనడానికి సన్నద్ధమైనాడు కవి. ఈ దేశంలో దళిత జీవితం లేదంటున్నారు కొందరు. వస్త్రాలను తప్ప ఆత్మలను అందుకోలేని అవిటివిమర్శకులు వాళ్ళు అని తేల్చేశాడు. తన తండ్రి ఊరి హోటల్లో గాజు గ్లాసులకు బదులు కొబ్బరి చిప్పల్లో టీనీళ్ళు తాగిన వైనం చెబుతున్నాడు.

బట్టలు సంచిలో పెట్టుకొని అగ్రవర్ణాల గ్రామం దాటిన తర్వాత ఆ బట్టలు వేసుకొని, చెప్పులు తొడుక్కుని వెళ్లిన కఠోరమైన జ్ఞాపకాలు అతన్ని కలతపెడతాయి. అందుకే రా!

నాయన మనం తప్ప అగ్రవర్ణాల వాళ్ళెవరైనా ఇలా అవమాన పడ్డారేమో ప్రశ్నిద్దాం రా! అంటూ వర్ణాధిపత్యంపై పోరుకు సిద్ధమైన విధానం కనిపిస్తుంది.

## 4.1.4 ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడం

కంచికచర్ల, కారంచేడు, నీరుకొండ, చుండూరు, పదిరికుప్పం, మొదలైన చోట్ల దళితులపై జరిగిన ఊచకోతలే దళితుల అస్తిత్వాన్ని ప్రశ్నించాయి. ఈ నేపథ్యంలో దళిత కవులు తమ అస్తిత్వం గురించి, ఆత్మగౌరవం గురించి రాయటం మొదలుపెట్టారు. ఆ క్రమంలో శిఖామణి కవిత్వంలో ఆత్మగౌరవం కోసం అనేక కవితలు రాశారు.

'అవర్ణం' కవితలో తన్ను తాను దళిత కవిగా సగర్వంగా ప్రకటించుకున్నాడు. ఇన్ని సంవత్సరాలు సవర్ణులు సృష్టించిన వర్ణలోకంలో భ్రమించి తిరిగిన నేను మీ అసలు రంగు తెలుసుకున్నాను అంటున్నాడు. ఈ కవితలో–

**"సవర్ణులు భ్రమింపజేసిన**
**వర్ణలోకంలో**
**ఇవాళ నేను**
**అవర్ణం గురించి మాట్లాడుతున్నాను'**
**ఏ వర్ణం వలన**
**నేను అవమానింపబడ్డానో**
**ఏ వర్ణం నన్ను**
**అవమానవీకరణకు గురిచేసిందో**
**ఏవర్ణం నా ఆత్మగౌరవాన్ని**
**పత్రహరితాన్ని నాకివేసే ఆకుపురుగులా నాకివేసిందో**
**ఆ వర్ణాన్ని తుడిచేస్తున్నాను"**[12] (కిర్రుచెప్పుల భాష, 2000:35, 36)

ఏ సవర్ణుల చేత అవమానించబడ్డామో, ఆ వర్ణం గురించి మాట్లాడుతున్నాను అంటున్నాడు. తరతరాల అణచివేత పచ్చి పుండులా సలపరిస్తూనే ఉంది. పచ్చగా ఉన్న

ఆకులలో పురుగు చేరి పత్రహరితాన్ని తిని వేసినట్లుగా, సవర్ణులు దళితుల ఆత్మగౌరవాన్ని హరించారు. ఆ వర్ణానే తుడిచివేస్తున్నాను అని సగర్వంగా చెప్తున్నాడు.

**"కవిత్వాన్ని అంటరాని వస్తువుని చేసి**
**కవిత్వాన్ని వైదిక కర్మకాండను చేసిన**
**వెయ్యేళ్ళ సాహిత్యాన్ని**
**నామట్టి చేతుల్లో జప్తు చేస్తున్నాను**
**కవిని నేను**
**వర్ణచాపాన్ని విరగొట్టడానికొచ్చిన**
**దళిత కవిని నేను"**[13] (క్రిరుచెప్పుల భాష, 2000:37) అంటూ కవిత ముగిస్తాడు.

మమ్మల్ని అంటరానివారుగా చిత్రించింది గాక, కవిత్వాన్ని కూడా అంటరాని వస్తువుని చేశారని ఆగ్రహించాడు. ఇంతవరకు కవిత్వం వైదిక కర్మకాండలకే పరిమితం చేసింది సవర్ణ సాహిత్యం. ఈ వేయ్యేళ్ళ సాహిత్యాన్ని నా మట్టి చేతుల్తో జప్తుచేస్తున్నా అంటూ దళిత ఆత్మగౌరవాన్ని ప్రకటించుకున్నాడు. ఈ వర్ణచాపాన్ని విరగగొట్టడానికే కవినై వచ్చాను. దళిత కవిని నేను అంటూ స్పష్టంగా చాటుకున్నాడు శిఖామణి.

ప్రజాహక్కుల కోసం నిత్యం పోరాడే ప్రజాగాయకుడు గద్దర్. వీరిపై జరిగిన హత్యాప్రయత్నం గురించి 'చెలమ' కవిత రాశాడు.

పాటల చెలమని తెలియని రాజ్యం మురికిగుంట్లగా భూమికి తూటాలతో పూడ్చాలని భ్రమించింది.

**"మాటల మంచెమీది నిలబడి**
**పాటను వడిసెల రాయిని చేసి**
**జనం హక్కుల పంటను కాపాడుతున్న వాడా!**
**ఇన్నాళ్ళూ**
**రాజ్యం పాట పాడిన బుల్లెట్**

**నీ రక్తంతో**

**నీ శ్వాసతో శిక్షణ పొంది**

**ఇప్పుడు ప్రజల పాట నేర్చుకుంటోంది"**[14] (కిర్రుచెప్పుల భాష, 2000:45)

జనం కోసం గళం విప్పి గర్జించిన గద్దర్‌పై తూటాలతో గాయపరిచింది రాజ్యం. తన పాటను వడిసెల రాయిగా చేసి ప్రజావ్యతిరేకులపై గురిపెట్టినవాడు. ఆ పాటలతో జనం హక్కులను కాపాడుతున్నవాడు. ఇన్నాళ్లు రాజ్యం పక్షాన నిలిచిన బుల్లెట్ నీ రక్తంతో నీ శ్వాసతో శిక్షణ పొందింది. ప్రజల పక్షాన చేరింది అన్నాడు.

ఆయన పాటకున్న వేగాన్ని చూసి వాయుగుండాలను తేవడం నేర్చుకుందంటాడు. పాట ఓ నివురుగప్పిన నిప్పు. ఆ నిప్పు ఉద్యమానికి ఊపిరి పోస్తుందంటాడు కవి.

**"చిందేసే నీ కాలి గజ్జెల్లో**

**ఒక చిరు మువ్వనవుతాను**

**దొరల గుళ్ళకు గుండె నిచ్చిన ధీరుడా! వీరుడా!**

**నీ ఛాతిమీద చెమట చుక్కనవుతాను**

**నీ విప్పుడు**

**ప్రతిగుండెలోను చెలమై ఉబికి వస్తున్నావని**

**తూటా ఎప్పటికి తెలుసుకుంటుంది?**

**నీ పదం కింద**

**నీ పాదం కింద**

**తుటా శనగ్గింజలా నలిగిపోయింది కదా**

**ఇంక నిన్నేమని తెలుసుకుంటుంది"**[15]

చిందేసే నీ కాలి గజ్జెల్లో ఒక మువ్వనవ్వుతానంటాడు. దొరల గుళ్ళకు గుండెనిచ్చిన వీరుడా నీఛాతి మీద చెమటచుక్కనవుతానంటాడు. గద్దర్‌పై జరిగిన దాడి మొత్తం దళిత సమాజంపై జరిగిన దాడిగా కవి భావించాడు. అందుకే నువ్వు ప్రతిగుండెలోను ఊట

చెలమై వస్తున్నావు అంటున్నాడు. ఆ విషయం గద్దర్ వెన్నులో నిలిచిన తూటా ఎప్పటికీ తెలుసుకోలేదంటాడు. నీ పదం కింద, నీ నర్తించే పాదం కింద ఆ తూటా శనగ్గింజలా ఎప్పుడో నలిగిపోయిందని అది నిన్ను ఏమి చేయలేదన్న ధైర్యాన్నిస్తున్నాడు.

గద్దర్‌పై హత్యాకాండ జరిగి పదేళ్లు పూర్తయిన సందర్భంలో శిఖామణి "ఒక గాయం పది వసంతాలు' అనే కవిత రాసారు. ఈ కవితలో

**"ఒక గాయం పది వసంతాలు**
**గాయపడిందెవరో కాదు**
**నెత్తురోడుతున్న గాయాలకు**
**గేయాల గాజుగుడ్డ చుట్టి**
**ప్రజలకు గొంతెచ్చిన**
**పాటల వసంతం గాయపడింది"** [16]

గద్దర్‌పై జరిగిన దాడి పది సంవత్సరాలు అయిందని, గాయపడింది ఎవరో కాదు ప్రజలకోసం తమ జీవితాన్ని అంకితం చేసిన వారికే అని కవి బాధను వ్యక్తపరిచాడు.

**"పక్షులను బంధిస్తే**
**వసంతం రాకుండా పోతుందా**
**తూనీగల్ని చెరపడితే కురవబోయే వానలు ఆగిపోతాయా?**
**కవి ధూర్జటి అన్నట్లు**
**అగ్గిమంచూ పవి పుష్పమా**
**అయ్యిందో లేదో గానీ గద్దరన్నా!**
**నీ వెన్ను పూసను తాకి**
**తూటా మాత్రం పాటల వెన్నెపూస అయింది"** [17]

భయపెట్టి సమాజంలో విప్లవాన్ని ఆపలేరు. పక్షుల్ని బందిస్తే వసంతం రాకుండా పోతుందా, తూనీగల్ని చెరపడితే కురవబోయే వర్షం ఆగిపోతుందా, ధూర్జటి అన్నట్లు

అగ్గిమంచూ పవి పుష్పమా అయ్యిందో లేదోకానీ గద్దరన్నా నీ వెన్ను పూసను తాకిన తూటా మాత్రం పాటల వెన్నపూస అయిందని వివరించారు. దళితుల ప్రతిభను ఏశక్తి ఆపలేదని కవి హెచ్చరిక చేసాడు.

'ఇనుపపాళీలు మొలుచుకొస్తున్నాయ్' అన్న కవితలో ఆత్మగౌరవం కాపాడుకునే వైనం చక్కగా ఆవిష్కరించాడు.

**"దొడ్డికూర్చునే బహిర్భూమిలో**

**శవాలను తగలేసి స్మశానంలో**

**ఉండాల్సిన ఊరి చివరకు**

**నాయిల్లెలా జరిగిందో**

**ఆచూకీ కావాలిప్పుడు అని ఏలిన వారిని గద్దిస్తున్నాడు**

**నెర్పని విద్యకు**

**గురుదక్షిణ కోరిన**

**మా చోటన వేళ్ళ స్థానంలో**

**ఇనుప పాళీలు**

**మొలుచుకొస్తున్నాయి**

**అవి చరిత్రను తిరగరాస్తాయి"**[18] (కిర్రుచెప్పుల భాష, 2000:59)

ఈ సమసమాజంలో దళితుల నివాసస్థలాలు బహిర్భూముల్లోను, శవాలను తగలేసే స్మశానాల మధ్యన ఉంటూ వచ్చాయి. ప్రస్తుత కాలంలో అభివృద్ధి పేరిట, కాలనీల పేరుతో ఊరి చివరకు నెట్టబడిన దళితుల ఇళ్ళ గురించి ప్రశ్నిస్తున్నాడు. మాకు నేర్పని విద్యకు గురుదక్షిణ కోరిన అగ్రవర్ణ ద్రోణులను ఖండిస్తున్నాడు. మీరు కోరిన మా బొటనవేళ్ళ స్థానంలో ఇనుపపాళీలు మొలుస్తున్నాయి. అవి చరిత్రనే తిరగరాస్తాయి అంటూ హెచ్చరిస్తున్నాడు. ఈ కవితలో దళితులు ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడానికి, వర్ణాధిపత్యాన్ని ప్రశ్నిస్తూ, అంబేద్కర్ భావజాలంతో మనువు గాళ్ల మనుగడ ఇక సాగదని ప్రకటించిన

కవిత. ఈ కవిత ద్వారా దళితవాదాన్ని స్పష్టంగా, గట్టిగా సమర్థించారు. వారి కవితల్లో దళిత ఆత్మగౌరవం నిండుగా కనిపించేది **'నదిదాటాలి'**. కవితలోమనిషికి అవసరమైన వాటిల్లో గాలి, నీరు, భూమి ప్రధానమైనవి. ఈ నీటికి 'అంటును' అంటగట్టి కొందరికి దూరం చేస్తున్నారు. నదిని దాటాలంటే ఆ ప్రాంత దళితులు పడే బాధలను మనం దర్శిస్తాం ఈ కవితలో .

**"ఇన్నాళ్ళకయినా ఇన్నేళ్ళకయినా**

**ఇక యిప్పుడయినా**

**ఈ నదిని దాటాలి**

**తప్పదు"**[19] (నల్లగేటూ నందివర్ధనం చెట్టు, 2005:144) అంటూ ప్రారంభమవుతుంది కవిత. నదిని దాటక తప్పదన్న నిర్ణయానికి వచ్చేశారు వాళ్ళు. మునిగో, తేలో, ఏటివాలుకు కొట్టుకుపోయో, ఎదురీదో నదిని దాటాలి. ఎన్నాళ్ళూ ఈ ఉరవడిని చూసి భయపడతాం? వసుదేవుడు కష్టసమయంలో యమునను దాటినట్లు, మోజెస్ ఎర్రసముద్రాన్ని దాటినట్లు మేం ఈ నదిని దాటాలి. అందుకు మానవ సంబంధాల 'వారధి'ని వాడుకోవాలని తలంచారు. నది అంటే ఎలాంటిదో చెప్తున్నాడు ఇలా!

**"ఈ నది భూమి మీద ఎంత విస్తరించిందో**

**నా లోపలకీ**

**నా ఆయువులోకీ నా స్నాయువుల్లోకి**

**అంతగాను విస్తరించింది**

**వాడలో ఈ నదిపేరు కులం**

**ఊరిలో ఈ నదిపేరు మతం**

**ఊరి బయట ఈ నదిపేరు ప్రాంతం"**[20] (నల్లగేటూ నందివర్ధనం చెట్టు, 2005:145)

ఈ నదికి వేరు వేరు పేర్లున్నాయి. దళితవాడలో అయితే కులం అంటారు. ఊరిలో మతం అంటారు. ఊరి బయట ఈ నదిపేరు ప్రాంతం అని బహునామాలున్నాయి. ఈ

కులం అనే నది ఈ భూమిమీద ఎంత విస్తరించిందో నాలోపల, నా ఆయువుల్లోను విస్తరించింది. ఇప్పుడు దానిని దాటడానికి పడవకావాలి. ఈ పడవలో అడుగు పెట్టాక తెలిసింది బతుకంటే అవమానమని.

**"మనుషులూ దూరమైనట్టే**

**ఒకప్పుడు ఈ నదీ మాకు దూరంగా ఉండేది**

**ఊరి చివర మాకు పల్లెలూ గూడేలు వున్నట్లు**

**బావులూ చెరువులూ వళ్లు కాళ్లూ విడివిడిగా వున్నట్లు**

**ఆ నదిలోని సన్నని ఏలికపాములాంటి ఒక పాయ**

**ఊరు చుట్టూ తిరిగి**

**ఆదియాంధ్ర పేటలోని మా యింటి ప్రక్కగా**

**భయంగా బెరుగ్గా ప్రవహించేది"**[21] (నల్లగేటూ నందివర్ధనం చెట్టు, 2005:145)

మాకు మనుషులు దూరమైనట్లే ఈ నదీ కూడా దూరంగా ఉండేది. ఊరి చివర మా గూడేలున్నట్లు బావులు, చెరువులు, స్మశానాలు విడి విడిగా ఉండేవి, ఉంటున్నాయి. పాపం ఆ నది కూడా మా చెంతకు రావడానికి భయపడేది అంటూ పెత్తనం అలా భయపెట్టేది. ఒక సన్నని పాయ ఊరి చుట్టూ ప్రదక్షిణ చేసి విదిలేని స్థితిలో మా యింటి పక్కగా భయంగా, బెరుగ్గా ప్రవహించేది. ఇక్కడ నదికి ప్రతినిధి కులం, దళిత కులంగా కవి స్వీకరించారు.

నీటికుట్రలు, ఏడవ పన్నాగాలు ఉండవిక, కారణం ఈ నదికి ఓ వంతెన వచ్చింది. బాలయోగి పేరిట వారధి వచ్చింది.

**"ఈ వంతెనను చూస్తుంటే**

**దళితులు రాజ్యాధికారానికి వచ్చినంత సంబరంగా ఉంది**

**ఇప్పుడు ఎలాగైనా ఈ నదిని దాటాల్సిందే**

**ఇన్నాళ్ళూ మీరు శిరస్సుల మీద చిలకరించుకున్న**

**ఆకాశగంగ**

**ఇన్నాళ్ళు మాకు దూరంగా జరిగిన పాతాళగంగ**

**ఇప్పుడు నా కాళ్ళ మధ్య నుండి ప్రవహించాల్సిందే"** [22] (నల్లగేటూ నందివర్ధనం చెట్టు, 2005:147)

అంటూ కవితను ముగిస్తాడు. ఊరికి, వాడకు మధ్యన కులం అనే నది ప్రవహిస్తుంది. ఆ ఊరినుండి వాడకు రావాలంటే నదినీ దాటాల్సిందే, ఇప్పుడొక వారధి ఏర్పడ్డాక దళితులు రాజ్యాధికారానికి వచ్చినంత ఆనందపడ్డారు. ఇన్నేళ్ళు మీరు నెత్తిమీద చిలకరించుకున్న ఆకాశగంగ మాకు మాత్రమే దూరంగా జరిగిన పాతాళగంగ. ఇప్పుడు నా కాళ్ళ మధ్య నుండి ప్రవహించాల్సిందే అంటున్నాడు.

ఈ కవితలో దళిత ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు ఎంత కష్టానికైనా సిద్ధం చేసేదిలా ఈ కవిత సాగింది.

## 4.1.5 దళిత కళాతత్త్వం

శిఖామణి కవిత్వంలో దళిత కళాతాత్విక చింతన బలంగా ఉంది. అటువంటి వాటిలో 'కిర్రుచెప్పుల భాష' ఒకటి. ఈ కవితా సంపుటి శీర్షికగా నిలిచిన **'కిర్రుచెప్పుల భాష'** కవిత శివసాగర్ చెప్పినట్లుగా ఒక దళిత దండయాత్ర. కాదంటే ఒక దళిత జైత్రయాత్ర. ఆ యాత్ర నింపాదిగా ఇలా ప్రారంభమవుతుంది.

**"ఇన్నాళ్ళు**

**నేనొక ధ్వన్యనుకరణ శబ్దాన్ని మాత్రమే**

**అరువు తెచ్చుకున్న అపస్వరాల మధ్య**

**నా అసలు స్వరాన్ని పోగొట్టుకున్నాను"**[23] (కిర్రుచెప్పుల భాష, 2000:21)

ఇన్నాళ్ళు తమది కాని భాషను తమదనే దళితులు భ్రమించారు. అయితే తమకంటూ ఒక ప్రత్యేకభాష ఉందని నేటికి గుర్తించారు. దీనితో దళిత యాత్ర ఊపందుకుంది.

**"ఇప్పుడు అక్షరాన్ని**

**పచ్చితోలుని చేసి లందెలో వూరేస్తున్నాను**

**రాకాసి బొగ్గును చేసి**

**నా చీకటి కొలిమిని ముట్టించుకున్నాను"**[24] (కిర్రుచెప్పుల భాష, 2000:22)

ఓ భాషను, సంస్కృతిని ఏర్పరచుకున్నారు. అక్షరాన్ని వారి వృత్తిపనిముట్లకు రక్షణ కవచంగా వాడుకుంటాం అని కవి భావించారు.

**"ఇప్పుడు అక్షరాన్ని**

**పారదర్శకపు పటికరాయిని చేసి**

**నా మంగలి పొదిలో వూరేగిస్తున్నాను."**[25]

అంటాడు. దళితుల చేతుల్లోకి అక్షరాలు వచ్చాక, వాటికి పటిక రాయంత స్వచ్ఛత కలిగింది. అందుకే –

**"ఇప్పుడు అక్షరాన్ని**

**కంపదడిని చేసి**

**నా గొర్రెల మంద చుట్టూ నిలబెడుతున్నాను**

**అక్షరాన్ని తోలు వొలిచి**

**గుప్పెడు తోలు ముక్కల్ని చేసి**

**నా కిర్రు చెప్పుల్లో కలిపి కుడుతున్నాను"**[26] (కిర్రుచెప్పుల భాష, 2000:23)

అని దళితజాతి పక్షాన శిఖామణి ప్రకటించాడు. అక్షరాన్ని కంపదడిగా చేసుకొని గొర్రెల మందలాంటి నా దళితులకు రక్షణ కవచంగా నిలబెడతానంటున్నాడు. అలాగే అక్షరాన్ని తోలు దీసి గుప్పెడు తోలు ముక్కల్ని చేసి తన కిర్రుచెప్పులతో కలిపి కుడుతున్నాడు. ఇక్కడ కవి అక్షరాన్ని ఎంత కళాత్మకంగా దళితుల జీవితాల్లోకి ఆహ్వానించాడో తెలుస్తుంది.

**"ఇప్పుడు అక్షరాలు పుట్టేవి**

**శివుని చేతి దమరుక శబ్దం నుంచి కాదు**

**వీరబాహుని కిర్రుచెప్పుళ్ల చప్పుళ్ల నుండి**

**ఇప్పుడు వర్ణమాల**

**సవర్ణుని చేతిలో రుద్రాక్షమాల కాదు**

**గూడెం గుడిసె ముందు పచ్చి వొరుగుల దండెం**

**ఇప్పుడు మనువు వొంటిమీది జందెం**

**నా నల్లజాతి చెప్పుకు తెల్లని లేసు అల్లిక"**[27] (కిర్రుచెప్పుల భాష, 2000:24)

శివుడ్ని తొలగించి వీరబాహుని తమ ప్రతినిధిగా ప్రకటించాడు. ఇన్నేళ్ళు బ్రాహ్మణుల చేతిలో రుద్రాక్షమాలగా ఉన్న అక్షరం ఇప్పుడు వారి గూడెం గుడిసె ముందు ఎండబెట్టిన పచ్చి వొరుగుల దండెమైంది. మనువు ఒంటిపై వున్న జందెం పోగు నల్లజాతి చెప్పుకు తెల్లని లేసు అల్లిక అయ్యింది.

**"ఇహ ఇప్పుడు సరస్వతి కూడా**

**పలకా బలపం పట్టుకొని**

**రాత్రి పాఠశాలకు**

**నా అరుంధతి ఇంటికి రావాల్సిందే"**[28] (కిర్రుచెప్పుల భాష, 2000:24)

అని తరతరాల సాంస్కృతిక దోపిడికి కవి భరతవాక్యం పలికాడు. ఇప్పుడు దళిత జాతి కూడా విద్యావంతమైంది. ఎంతగా అయిందంటే సాక్షాత్తు చదువులతల్లి సరస్వతి కూడా ఇప్పుడు పలకా బలపం పట్టుకొని విద్య నేర్చుకోవడానికి రాత్రి పాఠశాలకు అరుంధతి వాడకు వెళ్ళి రావలసిందే.

"చిన్నయసూరి

తన బాల వ్యాకరణాన్ని

దళిత వ్యవహారంబు దృష్టంబు గ్రాహ్యంబుగా

తిరగ రాస్తున్నాడు" (కిర్రుచెప్పుల భాష, 2000:24)

దళితకవుల భాష ప్రామాణికత్వాన్ని అంగీకరించాడు. చిన్నయసూరి సైతం తను

బాలవ్యాకరణాన్ని తిరగరాయవలసిందే అని శిఖామణి ప్రకటించాడు. ఇక్కడ దళితులంటే వృత్తి పనివారంతా ఒకే వర్గంగా భావించాడు కవి. వృత్తి తరువాత వృత్తికి విముక్తిని ప్రసాదించేది అక్షరమంటూ విముక్తి గీతం వినిపించాడు. దళితుల విముక్తి కోసం పోరాటం ప్రకటించాడు. దళిత భాషను, సంస్కృతిని అగ్రవర్ణాల చేత ఆమోదింప చేయడమే ఈ కవి యొక్క దళిత కళా తాత్విక చింతన. ఈ 'కిర్రుచెప్పుల భాష' కవిత ద్వారా అది రుజువు చేశాడు. ఈ కిర్రుచెప్పుల భాష కవితా సంపుటి కవితా మహాప్రస్థానంలో ఒక చౌరస్తా. ఇందులో దళిత కళా తాత్త్వికత బలంగా ఉంది.

జీవితంలో ఏనాడూ ఆనందమెరుగని అభాగ్య దళితుల ఆవేదనకు వీరి కవితలన్నీ ఉదాహరణలే! ఉన్నత కులాలవాళ్ళు జీవితంలోనూ సాహిత్యంలోనూ ప్రత్యక్షంగానో పరోక్షంగానో తక్కువ చేయడాన్ని అనుభవించాడు.

'ఇనుప పాళీలు మొలుచుకొస్తున్నాయ్' కవిత ఒక రకంగా శిఖామణి దళిత అనుభవాలను ఆవిష్కరించే ఆత్మ కథనాత్మక కవిత.

**"ఇంటర్మీడియట్ ఇంటర్వ్యూలో**
**చయనలుగారు రిజర్వేషను గాడికి**
**ఫారిన్‌చొక్కా పైలెట్ పెన్నూ**
**బాటా చెప్పులా అని ప్రశ్నించినప్పుడే**
**అనుమానం వచ్చింది "**
**"సాహిత్య చర్చల్లో తలదూర్చబోతే**
**అరసికాయ కవిత్వ నివేదనమ్**
**అని నాకు అర్థం కాని భాషలో**
**నా బ్రాహ్మణ మిత్రద్వయం**
**ఎగతాళిగా ముసి ముసి నవ్వులు**
**నవ్వుకున్నప్పుడా అనుమానం వచ్చింది"**[29] (కిర్రుచెప్పుల భాష, 2000:59)

పాఠాలు చెప్పవలసిన గురువులు, ఇటు స్నేహాన్ని పంచవలసిన సహాధ్యాయులు ఎగతాళి చేశారు. ఆ అనుభవాలు తర్వాతి కాలంలో శక్తివంతమైన దళిత కవిగా ఆవిర్భవించడానికి దోహదం చేశాయి. ఒకే ప్రపంచంలో ఉంటూ వేరే ప్రపంచంలో జీవించాడు. ఇవన్నీ వారి  దళిత తాత్త్విక చింతనకు పునాదులు.

'కిర్రుచెప్పుల భాష' కవితా సంపుటిలో దళిత కళాతత్వం నిండుగున్న కవిత సహస్రాబ్ది దళిత సూర్యుడు. శిఖామణి కవిత్వంలో సందర్భం వచ్చిన ప్రతిసారీ ఆ వస్తువును దళిత కవిత్వంలో ఇమడ్చకుండా ఉండడు.

**"నాలుగు మాటలు మాట్లాడితే**
**విత్తనాలు జల్లిన ఆకుమడిలో నల్లని మట్టిమీద**
**నవనవలాడుతూ పచ్చని తివాచీ మొలకెత్తినట్లుండాల్సింది పోయి**
**నాలుగు మాటలు మాట్లాడితే**
**పూల నుండి పరిమళం వీచినట్లు**
**చెట్ల మీంచి పక్షులు ఎగిరినట్లూ**
**హాయిగా ఉండాల్సింది పోయి**
**అరికాలులో కసుక్కున తుమ్మముల్లు దిగినట్లు**
**తవ్వుతున్న బావిలో అకస్మాత్తుగా బండపడినట్టు**
**ఊపిరాడనట్టు లోలోన వుక్కబోసినట్లు"** [30] (కిర్రుచెప్పుల భాష, 2000:100) ఉందంటాడు కవి.

మనిషి నాలుగు మాటలు మాట్లాడితే ఆకు మడిలో సారవంతమైన మట్టిమీద చల్లిన విత్తనాలుగా ఫలించాలంటాడు. ఆ ఫలితం కూడా పచ్చని తివాచీ మొలకెత్తినట్టుండా లంటాడు. మాటలోని మాధుర్యాన్ని కాంక్షిస్తున్నాడు.

కాని నేటి మనుషుల మాటలు అరికాలిలో కసుక్కున దిగిన తుమ్మముల్లులా ఉన్నాయి. తుమ్మముల్లు కాలిలో విరిగితే సలుపుతూ వుంటుంది. అలానే నేటిమనిషి సాటి మనిషిని

ముఖ్యంగా దళితులను అవమానపరిచే మాటలు మాట్లాడుతున్నారు. ఆ మాటలు మనసులో గుచ్చుకుని నిత్యం బాధిస్తాయి. మనిషి ఊపిరి సలుపుకోనివ్వని, ఉక్కబోసినట్లుంటాయి అంటున్నాడు కవి.

నాగరికతకు ఆనవాళ్లుగా మిగలాల్సింది మాటలు. కాని దళితుల పట్ల అగ్రవర్ణాలవారి మాటలు ఎంతో బాధించేవిగా ఉంటున్నాయి. వాటికి కవి ఎలా ప్రతిస్పందించాడో ఈ కవితలో గమనించవచ్చు.

**"పులి అడుగులై భయపెడుతున్న**

**భీతావహ సంధ్యా భీభత్సం**

**సంకుచిత మానవ మనోవీధుల్ని**

**విస్తరించేందుకు, వెలిగించేందుకు**

**నా కవిత్వపు ప్రొక్లైనర్‌తో**

**సహస్రాబ్ది అంచున దళిత సూర్యుణ్ణై ఉదయిస్తున్నా!"**[31] (కిర్రుచెప్పుల భాష, 2000:100)

నేటి మనిషి మాటలు పులి అడుగులై బయపెడుతున్నాయి. భయానక సంధ్యావేళలు నడుస్తున్నాయి. సంకుచిత మానవుని మానసిక స్థితిని విశాల దృక్పథంతో చీకటి జీవితాన్ని వెలిగించేందుకు వస్తున్నాను. నా కవిత్వంతో ఇరవై ఒకటో శతాబ్దిలో వికసించనున్న దళితప్రభను ప్రదర్శిస్తాను. సహస్రాబ్ది అంచున దళిత సూర్యుడనై ఉదయిస్తున్నానని అంటున్నాడు.

దళిత కళాతత్వాన్ని నిండుగా ప్రదర్శించిన మరో కవిత 'మా బాప్ప'. ఈ కవితలో కవి తన బాప్ప (బాప్ప అంటే తండ్రికి అక్క, మేనత్త) ను బ్రహ్మాండమైన భావనా ప్రపంచంలో ఆవిష్కరిస్తాడు. కష్టమే తప్ప సుఖమెరుగని బాప్ప కాళ్ళకున్న వెండి కడియాల నుండి లక్క బయటకు వచ్చిన సన్నివేశాన్ని మన ముందుంచాడు ఇలా

**"ఊరి దేవుడి కళ్యాణంలోనో**

**బడిపిల్లల మధ్యాహ్న భోజన పథకంలోనో**

**వున్నట్టుండి బయటపడ్డ కులవివక్షలా**

**అరిగిపోయిన మా బాప్ప వెండి కడియాల నుండి**

**లక్క బిక్కు బిక్కుమని తొంగి చూసేది"**[32] (నల్లగేటూ నందివర్ధనం చెట్టు 2005:6)

సమాజంలో ఎంత మార్పులు వచ్చినా, నేటికీ కులవివక్షత బడబాగ్నిలా, బయటపడే సందర్భాలున్నాయి. ఊరి దేవుడి కళ్యాణ సందర్భంలోనో బడి పిల్లలకు వడ్డించే మధ్యాహ్న భోజన పథకంలోనో ఈ కులవివక్షత కురులు విప్పుతుంది. ఇక్కడ ఊరి దేవుడు వేరు, వాడ దేవుడు వేరని గ్రహించాలి. వెండికడియాలు, దళిత స్త్రీలకు అలంకారమే కాదు, మేం దళితులమన్న గుర్తింపు. ఇక్కడ కులవివక్షతను అరిగిన వెండి కడియాల నుండి తొంగి చూసే లక్కతో పోల్చడం విశేషం. ఇంతకంటే గొప్ప దళిత కళాతత్వం ఏం కావాలి?

## 4.1.6 దళిత సాంస్కృతిక చిహ్నం

దళిత తాత్వికతను అంతర్జాతీయంగా గుర్తింపును తెచ్చేది. 'నల్లగేటు నందివర్ధనం చెట్టు' కవితా సంపుటిలోని 'నల్లనిదానను' అనే కవిత.

ఈ కవితలో చీకటి నలుపుకు ప్రతీకగా నిలుస్తుంది. నలుపు మనదేశంలోనే కాదు, విదేశాలలో కూడా జాత్యహంకారపు నిలువుటద్దంగా నిలుస్తుంది.

**"నలుపు సౌందర్యాత్మకమే కాదు**

**జాత్యహంకారపు అభిజాత్యాలను**

**నిట్టనిలువునా దగ్ధం చేసే**

**నీలి మంటల ధిక్కారపు అగ్ని శిఖ.**

**నా ధాతు శిలాజం**

**ఆఫ్రికా చీకటి ఖండం నుండి**

**హరప్పా మొహంజొదారో నాగరికతల**

**చారిత్రక విభాత సంధ్యల వరకూ నిక్షిప్తమై వుంది"**[33] (నల్లగేటూ నందివర్ధనం చెట్టు 2005:20)

జాత్యాహంకారాన్ని నిలువునా దహించే నీలిమంటల ధిక్కారపు అగ్నిశిఖ నలుపు. ఈ నలుపు దాతు శిలాజాలు ఆఫ్రికా చీకటి ఖండం మొదలు హరప్పా మొహంజొదారో నాగరికతల వరకు వ్యాపించి ఉంది. ఇది చారిత్రకమైనది. ఇంకా ఇలా అంటున్నాడు.

**"ఇటు**

**వీరబాహుడు మాలకన్నమనీడూ**

**వీరవల్లడూ చండాలికా**

**అటు**

**మార్టిన్ లూథర్‌కింగ్ సాజర్నర్ ట్రూత్**

**నెల్సన్ మండేలా ఓలే సోయంకా**

**నా నల్ల నెత్తుటి అచ్చుపు వారసులు**

**చీకటి చరిత్ర మీద చెరగని వెలుగు పాదముద్రలు"**[34] (నల్లగేటూ నందివర్ధనం చెట్టు 2005:21)

భారత సమాజంలో వీరబాహుడు, మాలకన్నమనీడు, చండాలికలను నల్లదనానికి ప్రతినిధులుగా నిలిపాడు. దేశమేదైన నలుపు ఒక్కటే, ప్రాంతమేదైనా దళిత జీవితం ఒక్కటే. మార్టిన్ లూథర్‌కింగ్, నెల్సన్‌మండేలా, ఓలే సోయంకా, మైకేల్ జాక్సన్‌లు నా నల్లటి నెత్తురుకు నిజమైన వారసులుగా ప్రకటిస్తున్నాడు కవి.

**"అయినా నా వొంటి నలుపును**

**కడిగినంత సులభం కాదు**

**ఈ జాతి వర్ణ పంకిలాన్ని కడుక్కోవడం"**[35] (నల్లగేటూ నందివర్ధనం చెట్టు 2005:21) అంటాడు.

నా శరీరానికి అంటిన నలుపునైతే కడిగేయవచ్చు కానీ ఈ జాతికి అంటిన వర్ణపంకిలాన్ని కడగడం ఎవరి తరం కాదు అని తేల్చి చెబుతూ కవితను ఇలా ముగిస్తున్నారు.

**"నేను నల్లనిదానను**

**చరిత్ర గర్భాన్ని చీల్చుకొచ్చిన**

**వేయి రేకుల బాకుల నల్ల కలువను**

**వర్తమాన దళిత రణక్షేత్రంలో**

**సమతారథం శిఖరాగ్రంపై**

**రెపరెపలాడే గబ్బిలపు ధ్వజాన్ని"**[36] (నల్లగేటూ నందివర్ధనం చెట్టు 2005:21) అని ప్రకటించాడు.

చరిత్రగర్భం చీల్చుకొని వచ్చిన వేయిరేకుల బాకుల నల్లకలువను నేను – వర్ధమాన దళిత రణభూమిలో సమతారథంపై రెపరెపలాడే గబ్బిలపు ధ్వజాన్ని నేను అంటాడు. ఇక్కడ గబ్బిలం కూడా నలుపుకు ప్రతినిధి. దళిత కవికి జీవితమే ముడిసరకు. కవిత్వ సృజనకు కావలసిన ముడి సరుకునంతా అతడు తన దైనందిన జీవితం నుండే ఏరుకుంటాడు.

ఈ కవితలో మినపగింజలోని నల్లదనాన్ని దళిత ప్రతీకగా తీసుకున్నాడు. తెలుపురంగు పవిత్రతకు, నలుపురంగు విషాదానికి, అశుభానికి ప్రతీకలుగా భావించారు మన ప్రాచీనకవులు. ఆ సంప్రదాయాన్ని నిరసిస్తున్నాడు. దళితకవికి నల్లరంగే కేతనం. కత్తి పద్మారావు, ఎండ్లూరి సుధాకర్ మొదలైన దళిత కవులు నలుపును దాదాపు ఏదో ఒక సందర్భంలో ప్రతీకలుగా వాడారు. దళిత కళాతత్వానికి నల్లరంగు సంకేతంగా నిలుస్తుంది.

మినపగింజలాంటి నల్లదనాన్ని దళిత ప్రతీకగా తీసుకున్నాడు. ఈ కవితలో దళిత కళాతత్త్వానికి అంతర్జాతీయతను ఆపాదించగలిగాడు.

### 4.1.7 దళిత స్మృతి

శిఖామణి దళిత కవిత్వంలో దళిత కళాతాత్వికతే గాక అందులో ఒక భాగంగా దళిత స్మృతి కవితలు కూడా ఉన్నాయి. పద్యసమాధి కవిత దళిత స్మృతి కవితగా చెప్పవచ్చు. ప్రముఖ దళితకవి మద్దూరి నగేష్‌బాబు మీద రాసిన కవిత ఇది. ఆయన గొప్పతనాన్ని, బలహీనతల్ని కళ్ళకు కట్టించాడు. ఈ పద్యసమాధి కవిత గుండెల్ని మెలిపెట్టే మరో ఎలిజీ.

**"కళ్లల్లో మమకారాల మబ్బుదొంతరలు కలవాడా**
**గొంతులో గంధకపు గనులు దట్టించుకున్నవాడా**
**మాటల్లో డైనమెట్ల పొదుగున్నవాడా!**
**విధ్వంసం చేయవలసింది ఎంతో వుంది కదరా**
**ఇంతలోనే ధ్వంసమైపోయావా?"**[37]

కళ్ళల్లో మబ్బుదొంతరలు, గొంతులో గంధకపు గనులు, మాటల్లో డైనమైట్లు పొదుగుకున్న వీరుడు, ప్రియతముడైన కవి మరణిస్తే విధ్వంసం చేయవలసింది చాలా ఉండగా తానే ధ్వంసమైపోయిన వైనాన్ని ప్రశ్నిస్తున్నాడు కవి.

**"నీ నిష్క్రమణతో**
**'వెలివాడలు' దిగుడుబావులై ముడుచుకున్నాయి**
**'రచ్చబండలు' కాకిశోకమై విలపిస్తున్నాయి**
**'నరలోక ప్రార్థనలు' చేస్తున్న పెదవులు**
**ఆమెన్ పలకకుండానే అర్థాంతరంగా ఆగిపోయాయి."**[38]

మిత్రమా! నీవు వెళ్ళిన తరువాత మన వెలివాడలన్నీ దిగుడుబావులై ముడుచుకున్నాయి. ఇక 'రచ్చబండల' శోకాన్ని కాకి శోకంగా చెప్పడం వారికి చెల్లింది. కాకులు మామూలుగా ఒక కాకి మరణిస్తేనే వందకాకులు పోగై తమ దుఃఖంలో కూడా

సంఘీభావాన్ని తెలుపుకుంటాయి. అలాగే దళితుడు మరణిస్తే మిగతా దళితులంతా ఆ బాధను అనుభవిస్తూ సంఘీభావాన్ని ఇవ్వాలన్న గొప్ప సందేశమిచ్చాడు కవి.

ఇంకా సాహసీ! శాంతయ్యా!! కవితను పరిశీలిద్దాం.

**"నీ మరణం**
**సెక్రటేరియట్ ముట్టడిలో**
**మాల మహానాడుపై జరిపిన**
**క్రూర  కరాళ కంకాళ లాటీనృత్యంలో**
**గూడలు తెగిన చెప్పుల జతలా వుంది**
**నీ మరణం**
**విద్యుత్ పోరులో పోలీసు గుర్రాల**
**ఇనుప గిట్టల పద ఘట్టనలో**
**జెండా వూడిపోయి**
**చేతిలో మిగిలిపోయిన**
**వొంటరి వెదురుబద్దలా వుంది"**[39]

ఈ కవితలో మద్దెల శాంతయ్య మరణించటం దళితులకు తీరని నష్టం జరిగిందని, ఈలోటు ఎవరు తీర్చలేనిదని అంటారు. యస్.సి. రిజర్వేషన్‌ను ఎబిసిడిలుగా విభజించవద్దని మాలమహానాడు ఆధ్వర్యంలో జరిగిన సెక్రటేరియట్ ముట్టడిలో ఆనాటి ప్రభుత్వం విచక్షణారహితంగా దాడులు చేసినప్పుడు జరిగిన నష్టంలాగా నీ మరణం ఉందని, దళిత జాతికి మణిపూస లాంటివాడవని కవి భావిస్తున్నాడు. ఇంకా విద్యుత్ ఛార్జీలు పెంచినప్పుడు చేసిన దర్నాలో జెండాఊడిపోయి చేతిలో మిగిలిన వెదురబద్దలా వుందని, జెండా వుంటేనే వెదురుబద్దకు గౌరవం ఉంటుంది. అలాగే నీ మీరణంతో దళిత జాతికి ఒక దళిత నాయకున్ని కోల్పోయిన మరొక ఆవేదన కనిపిస్తుంది.

'యోగులు మరణించరు' కవితలో జి.యం.సి. బాలయోగి దళితుడి గాపుట్టి, దేశంలోనే అత్యున్న పదవైన లోక్‌సభ స్పీకర్ పదవిని అలంకరించారు. కానీ దురదృష్టవశాత్తు బాలయోగి మరణించారు. నిజంగా మరణించిన దళితుల గుండెల్లో స్థిరమైన స్థానం ఉన్నదని తెలియజేస్తూ

**"నీ శిరస్సు పార్లమెంటు ఉన్నతాసనంలో వున్నా**

**పాదాలు పల్లెల్లో వున్నాయని పదేపదే నిరూపించినవాడివి**

**అంబేద్కర్ ఆశయం నీ రూపంలో తిరిగొచ్చిందని**

**ఆశగా ఎదురుచూస్తున్న కోట్లాది దళితుల కళ్ళల్లో**

**వెలుగుదీపాలు ఆర్పేసింది ఎవరయ్యా?**

**నీ కలల వంతెన యానాం – ఎదుర్లంక వారధి ఇంకా పూర్తికానేలేదు.**

**ఇంతలోనే నీ భవిష్యదుజ్వల బంగారు ఆనకట్టను బదాబదలు చేసిందెవ్వరు?**

**నీ చిరకాల కాంక్ష కాకినాడ –కోటిపల్లి రైలుకు నువ్వు పచ్చజెండా వూపనేలేదు**

**ఇంతలోనే నీ బతుకుబండికి ఎర్రలైటు చూపిన క్రూకర్మడెవ్వరయ్యా?"**[40]

నీ శరీరం పార్లమెంట్ భవనంలో ఉన్నా నీ మనస్సు ఎప్పుడూ పల్లెల్లోనూ వున్నాయని నిరూపించిన వాడివి. అంబేద్కర్ ఆశయం దళితులను రాజ్యాధికారం వైపు తీసుకుపోవాలని, ఆశయం నెరవేర్చే నాయకుడివి నీవే అనుకున్న దళితులకు ఇంక దిక్కెవరు అని కవి ప్రశ్నించారు. చేయవలసిన పనుల్లో యానాం–ఎదుర్లంక వారధి ఇంకా పూర్తికాలేదు.

నీ చిరకాల కాంక్ష కాకినాడ – కోటిపల్లి రైలుకు పచ్చజెండా వూపనేలేదు. ఇంతలోనే నీ జీవితం ఆరిపోయింది. దీనికి కారకులు ఎవరని శిఖామణి బాధను వ్యక్తం చేసినారు.

మరోకవిత 'ఎందుకొస్తావే జ్ఞాపకానికి మీరా' కవితలో

**"యానాం ఎంకన్న తీర్థంలో**

**ఆటల వంటసామాను కొనుక్కొని**

**మనం ఆడుకున్న అమ్మానాన్నల ఆటలో**

**అమ్మెవరో నాన్నెవరో గుర్తులేదు గానీ**

**జీవితంలో అమ్మగా చిత్తుగా ఓడిపోయావు మీరా!"**[41]

శిఖామణి గారితో కలసి మీరా చిన్నప్పుడు అమ్మనాన్నల ఆటలు ఆడారు. ఉల్లాసంగా, సంతోషంగా చిన్నప్పుడు గడిచిన 'మీరా' జీవితం వివాహం అయిన తర్వాత దుర్భరమై జీవితాన్ని అనుభవించి చివరికి తనువు చాలించిందని కవి ఆవేదన చెందారు.

**"దొంగా పోలీసు**

**పచ్చాకు బైరాకు**

**దూదూపుల్లా దుక్కుడుపుల్ల ఆటల్లో**

**నువ్వెప్పుడూ దొరసానివి**

**జీవితం పెద్దపులికి ఎలా దొరికిపోయావు మీరా!"**[42]

దొంగా పోలీసు, పచ్చాకు, బైరాకు, దూదూపుల్లా, దుక్కుడుపుల్ల మొదలైన ఆటలలో ఎప్పుడూ నువ్వే గెలుస్తావు. కానీ జీవితపు ఆటలో ఎందుకు ఓడిపోయావు మీరా అని కవి ఆవేదనను కనబరిచారు.

## 4.1.8 దళిత స్త్రీ చైతన్యం

మొదట్లో దళిత కవులే దళిత స్త్రీ చైతన్యం మీద కవితలు రాశారు. దానికి కారణం దళిత స్త్రీలలో చదువుకున్న వాళ్ళు తక్కువ. అందులో సాహిత్యంపట్ల ముఖ్యంగా కవిత్వం పట్ల ఆసక్తి, పరిచయం వున్న స్త్రీలు మరీ తక్కువగా ఉండటమే ప్రధానకారణం. దళిత స్త్రీ చైతన్యంమీద శిఖామణి రచించిన మా బాప్ప కవితలో గమనించవచ్చు. (బాప్ప బాప్ప అంటే తండ్రికి అక్క, మేనత్త) ను బ్రహ్మాండమైన భావనా ప్రపంచంలో ఆవిష్కరించారు. తన బాప్ప రూపురేఖలను ఇలా మన ముందుంచారు.

**"వాడ తప్ప వూరు లేని**

**కులంతప్ప పేరులేని**

**శ్రమతప్ప సుఖంలేని**

**మా బాప్ప కథ వింటారా?**

**బాప్పంటే మాటలా**

**పొడుగాటి బొప్పాయి చెట్టులా**

**వెనక్కి తిరిగి చూడని యేరులా**

**ఆకాశాన్ని సవాలు చేసే**

**సన్నని సర్వే చెట్టులా**

**చేయెత్తు మనిషి**

**కచ్చా బిగించి**

**భుజాన కొడవలితో పొలానికి వెళ్తుంటే**

**తోకమీద నిలబడిన**

**ఆరడుగుల నల్లతాచులా**

**అగుపించేది మా బాప్ప"**[43] (నల్లగేటూ నందివర్ధనం చెట్టు, 2005:4)

ఆరడుగుల ఎత్తు, నల్లని రూపం, ఎటువంటి కష్టానికైనా ఎదురు నిలబడగల ధైర్యంతో ఉన్న బాప్ప తన శ్రమతో ఈ దేశానికి కావలసిన పంటలను పండించడానికి కృషిచేస్తుంది. అయినా ఎటువంటి గౌరవ మర్యాదలు, సుఖంలేని బాప్ప జీవితాన్ని గురించి కవి ఆవేదన చెందాడు.

ఇంకా కవి బాప్పను ఆదిమకాలంలో పనిముట్ల గొప్పతనంతో పోల్చాడు.

**"అప్పుడే కోసి ఆరబోసిన**

**మిరపకళ్లంలా**

**ఆ నల్లని నుదుటి మీద ఎర్రని బొట్టు**

**రూపుకు నల్లనేకాని**

**మా బాప్ప మనసు**

**పుచ్చపువ్వు తెల్లన**

**బూరుగు దూది మెత్తన**

**చలిగెంజి చల్లన**

**మా బాప్ప ముందు పుట్టి**

**ఆ వెనక పని పుట్టింది**

**మా మనిషి రూపెత్తిన**

**ఒక ఆదిమ పనిముట్టు మా బాప్ప**

**తెల్లవారు జామున**

**పెరట్లో కుంకుడు చెట్టుమీద కాకులు**

**మా బాప్పను చూసే**

**పొద్దును నిర్ధారించుకునేవి**

**వాకిలి పూడ్చి పూడ్చే**

**చీపురు చేతిని అలా పైకెత్తిందంటే చాలు**

**మబ్బులతో పాటు పాలపుంతలోని చుక్కలన్నీ**

**వొద్దికగా పక్కకు జరిగేవి**

**ఆ వాకిలంత**

**స్వచ్ఛందంగా వుండలేకపోయినందుకు**

**తొలిపొద్దు మరింత**

**తెల్లబోయేది"** [44] (నల్లగేటూ నందివర్ధనం చెట్టు 2005:5)

ప్రతిభతో పాటు, సమాజంలోని అందరిని సమానంగా చూసే మంచి మనస్తత్వం బాప్పలో కలదని వివరించారు. లోకానికి కోడి కూత ద్వారా తెల్లవారినట్లే బాప్ప నిద్ర లేవడంతోనే పని సంస్కృతి ఆరంభమైనట్లు శిఖామణి ఈ కవితలో తెలియజేశారు. ఇంకా పరిశుభ్రతలో బాప్పతో ఎవరు పోటీ పడలేరని కవి సూచన కనిపిస్తుంది.

ఇంకా కవితలో

**“నీ లాటి చెరువుకు వెళ్ళిందంటు చాలు**

**నాలుగు మెట్ల దిగువున వున్న నీళ్లు**

**మొప్ప పిల్లలై ముందుకురికి**

**మా బాప్ప మునివేళ్లను ముద్దాడేవి.**

**వానాకలం వచ్చిందంటే చాలు**

**కురిసీ కురియని మబ్బుతునకలు**

**ఆనందానికీ దుఃఖానికి చెమర్చని**

**మా బాప్ప కనుగవలో**

**రహస్యంగా సంచరించేవి**

**ఊడ్పుల కాలంలో**

**మునివేళ్లతో ఒక్క వరిమొక్క**

**నాటిందంటే చాలు**

**చేను చేనంతా**

**పాలమూరు పిల్లల మఱ్ఱిమానులా**

**విస్తరించేది**

**అయినా మా బాప్పెప్పుడూ**

**పరిగెపరకలానే మిగిలిపోయేది”** [45] (నల్లగేటూ నందివర్ధనం చెట్టు 2005:6)

ఉదయాన్నే మగవారితో సమానంగా చెరువుల దగ్గర నీళ్లు తెచ్చేది. వర్షాకాలంలో కూడా విరామం లేకుండా పనిచేసేది. కష్టసుఖాలను సమానంగా ఆహ్వానించేది. ‘బాప్ప’ శ్రమతోనే వరిపంటలు పండేవి అని అయినా బాప్పకు పొలం లేదని, కూలిగానే మిగిలిపోయిందని కవి ఆవేదన చెందారు. కవి ఇక్కడ అందరి కోసం ‘బాప్ప’ తమ జీవితాన్ని త్యాగం చేసిందని సూచన చేశారు.

ఇంకా కొంచెం 'మాబాప్ప' కవితను పరిశీలిస్తే.

**"ధాన్యం మిల్లులోని క్వింటా బస్తాలు**

**ఒక లెక్కలోనివి కాదు.**

**కొబ్బరికొట్టు పనిలో**

**తొడకు కాయను ఆనించి**

**మూడు  చెక్కల్లో వొలిచిన మా బాప్ప**

**కారంచేడులో ఎందుకు పుట్టలేదా**

**అనుకుంటాను.**

**ఊరుతో వైరం వచ్చినప్పుడు**

**చెంగులో ఇంత కారప్పొడి**

**చేతిలో హరికెన్ లాంతరుతో**

**తెల్లవార్లూ  ఏటిగట్టున కాపలా తిరిగిన**

**మా బాప్ప**

**చుండూరులో ఎందుకు పుట్టలేదా**

**అనుకుంటాను."** [46] (నల్లగేటూ నందివర్ధనం చెట్టు 2005:7)

బరువులను అవలీలగా ఎత్తడంలో ఆరితేరిన మాబాప్ప ప్రతిపనిలో నైపుణ్యంతో చేయగలిగిన మా బాప్ప కారంచేడు, చుండూరు దళితులను ఊచకోత కోసి ప్రాణాలనుతీసిన సంఘటనలకు ఆవేదన పడి మా బాప్ప కారంచేడు, చుండూరులో పుట్టి ఉంటే పెత్తందారులను ఎదుర్కొని వాళ్ళకి బుద్ధి చెప్పేది అని ఆవేదన చెందారు.  ఇంకా దళితులపై జరుగుతున్న ఆగడాలను ఎదుర్కోవడానికి 'మాబాప్ప' అవసరం ఎంతైన ఉందనే సూచన కనిపిస్తుంది.

మరొక కవిత 'మోచీమా' కవితలో దళిత స్త్రీ చైతన్యం కన్పిస్తుంది.

**"నదీ ప్రవాహంలోని కెరటాల్లాంటి**
**అంత నిర్విరామ జన సమ్మర్థంలోనూ**
**అందరూ క్షణాకాలైనా**
**ఒకరి మొహాలు ఒకరు చూసుకుంటూ వెళ్తుంటే**
**ఆమె చూపుల సర్పాలు మాత్రం**
**వచ్చేపోయేవారి పాదాలకు చుట్టుకుంటాయి**
**చివరికి అన్వేషణ ఫలిస్తుంది నిరీక్షణ చేరువౌతుంది.**
**ఎవరైనా గుడిబయలే చెప్పులు విడిచినట్లు**
**ఎంతటివారైనా చెప్పుల జత విడిచి**
**ఆమె ముందు ఉత్తకాళ్లతో నిలబడాల్సిందే!**
**తెగిన బొటనవేలి వుంగటాన్ని**
**ఆరెతో ఒక్కపోటు పొడిచి రెండు పోగుల దారం**
**లేసు అల్లినట్లు పైకీకిందకీ లాగిందంటే చాలు**
**ఎంతటి బాటా చెప్పుకైనా**
**గూబ గుయ్యిమనాల్సిందే!"**

(ఆదివారం ఆంధ్రజ్యోతిలో ముద్రితం, 2013, ఫిబ్రవరి)

ఎవరి జీవిత గమనంలో వారు బిజీగా వుంటే 'మోచీమా' మాత్రం తెగిపోయిన చెప్పులను కుట్టటానికి ఎదురు చూసేదని, ఈమె ముందు ఎంతటి వారైనా ఉత్తకాళ్ళతో నిలబడాల్సిందేనని, ఆరెతో ఒక్క పోటు పొడిచి రెండు పోగుల దారం లేసు అల్లినట్లు పైకీకిందకు లాగితేచాలు బాటా చెప్పుకైనా గూబగుయ్యమనాల్సిందేనని కవి భావించారు.

ఇంకా కవితలో...

"మరెంతటి మందపాటి బిరుసైన తోలు అయినా
రెండు అరిపాదాలమధ్య వుంచి
బొటనవేళ్లతో అదిమిపట్టి
రంపెతో కుశాలగా ఇలా కోసిందంటే చాలు
కొడవలితో కొబ్బరి మొవ్వను కోసినట్టు
అప్పుడే పొయ్యిమీదినుంచి దించిన
జున్నును చాకుతో కోసినట్టు
సన్నసన్నగా మెత్తమెత్తగా తెగాల్సిందే!
ఎంతైనా ఆమె
కామధేనువుని వధించిన
మా ముత్తాత జాంబవంతుని మునిమునిమనవరాలు గదా!
అప్పుడే పెళ్ళయిన కొత్త దంపతులు
నక్షత్రం కోసం పగటి ఆకాశంలో వెతికినట్టు
అవసరం పడ్డ ఆడామగా
ఈ నేలమీది అరుంధతి కోసం
కళ్ళను విచ్చిన పత్తికాయలు చేసుకొని
చౌరస్తా అంతా కలయతిరుగుతారు.
పోతన భాగవతం ఈ మిట్టమీదే రాసాడని
వేమన పద్యాలు ఈ గుట్టమీదే కట్టాడని చెప్పుకున్నట్టు
ఈ దేశపు చౌరస్తాలు
నా కులవృత్తి కళారహస్యనికేతనాలు.

**అందరూ ఆమెని మోచీ మా అని పిలుస్తున్నారు గానీ**

**నాకు మాత్రం ఆమె మోతీ మా**

**నాజాతి మేలిమి ముత్యం.”**

మందపాటి తోలు అయినా జున్నును చాకుతో కోసినట్లు సనసన్నగా మెత్తమెత్తగా తెగాల్సిందేనని, ఇంకా అప్పుడే పెళ్ళయిన కొత్త దంపతులు నక్షత్రం కోసం ఆకాశంలో అరుంధతి కోసం కలియతిరుగుతారని, పోతన, వేమన పద్యాలు ఇక్కడే రాసినారని చెప్పుకున్నట్లు ఈ దేశపు చౌరస్తాలు నా కులవృత్తి కళారహస్యనికేతనాలు అని కవి భావించారు. అందరూ ‘మోచీమా’ అని పిలుస్తారు కానీ నాకు మాత్రం ఆమె నాజాతి మేలిమి ముత్యం అని శిఖామణి భావించారు.

ప్రాచీనకాలంలోనే ఆధునికత దళితస్త్రీ చేతుల్లోనే ప్రారంభమైనదని, ఈ దేశ ప్రజలకు పాదరక్షకాలను నిర్మించిన ఘనత దళిత జాతికే దక్కుతుందని, అయినా ఈనాటికి దళితజాతి గొప్పతనాన్ని సమాజం గుర్తించలేదని కవి ఆవేదన.

## 4.1.9 దళితుల దాడులపై నిరసన

లక్ష్మింపేట మారణకాండపై నిరసనతో “తెగిపడినచోట తెగబడటమే” అన్న కవితా సంపుటిలో శిఖామణి “మణికట్టు మీద పచ్చబొట్టు” కవితలో దళితులపై జరిగిన మారణకాండను ఈవిధంగా నిరసించారు.

**“దండెంమీద ఆరేసిన గుడ్డను లాగినంత సులువుగా**

**నా నుండి నా భూమిని లాక్కున్న ప్రతిసారీ**

**తలుపులులేని వంటింట్లోకి చొరబడి**

**కూటికుండలో కుక్క మూతి పెట్టినంత అదాటుగా**

**నా నోటికాడ కూడును లాక్కున్న ప్రతిసారీ**

**ఊళ్ళో వదిలిన ఆంబోతు పిర్రమీద కర్రుకాల్చి ముద్రవేసినట్టు**

**నాకు తెలియకుండానే**

**నా మణికట్టు మీద**

**పచ్చబొట్టు పొడుస్తున్నారు."** [47]

దండెం మీద ఆరేసిన గుడ్డను లాగినంత సులభంగా నా భూమిని లాక్కున్న ప్రతిసారీ తలుపులేని వంటింట్లోకి చొరబడి కుక్క అన్నంలో మూతిపెట్టినట్టు, నా నోటికాడ కూడును లాక్కున్న ప్రతిసారీ అంబోతు పిర్రమీద కర్రుకాల్చి ముద్రవేసినట్లు, నాకు తెలియకుండానే నా జీవితాన్ని నాశనం చేస్తున్నారని కవి నిరసన తెలియజేశారు.

ఇంకా కవితలో

**"ఎంతోదూరం లేదు**

**నేను ప్రవచించే దళిత సూక్తంలో**

**ప్రభవించే దళిత విరాట్ పురుషుడు**

**ఈ జాతి పెట్టుడు పచ్చబొట్లను**

**సమూలంగా తుడిచివేసే రోజు**

**మరింకెంతో దూరంలో లేదు"**[48]

ఇంకెంతో దూరం లేదు దళితజాతిని రక్షించే దళితసూర్యుడు వస్తున్నాడని కవి భవిష్యత్ సూచన చేశాడు. దళితులు రాజ్యాధికారంవైపు దృష్టి మరల్చవలసిన అవసరాన్ని తెలియజేశారు.

## 4.1.10 దళితుల స్థానం

సమాజంలో దళితులకు ఎలాంటి స్థానం ఉందో శిఖామణి ఈ కవితలు ద్వారా తెలియజేశారు. ముందుగా 'తవ్వకం' కవితను పరిశీలిద్దాం-

**"కొందరు ఆంధ్రోడన్నారు**

**మరికొందరు దళితుడన్నారు**

**ఇంకొందరు మాలోడన్నారు**

**అందరూ**

**వాళ్ళకు తెలిసి వాడి గురించే తప్ప**

**నన్ను తెలిసినవాడి గురించి ఎవరూ మాట్లాడంలేదు"**[49]

(తవ్వకం, 2009: 9)

ఈ సమాజంలో దళితులకు ఎలాంటి స్థానం ఉందంటే కొందరు ఆంధ్రుడంటే, మరికొందరు దళితుడన్నారు. ఇంకొందరు మాలోడన్నారు. పెత్తందారుల గురించి తప్ప దళితుల గురించి ఎవరూ మాట్లాడరని కవి ఆవేదన చెందారు.

'అక్షరం ప్రాణవాయువు' కవితలో ఎండ్లూరి సుధాకర్ గురించి శిఖామణి రాసిన కవిత ఇది.

**"అక్షరాన్ని ఆత్మభిమానం నేర్పి**

**ఆయుధాలుగా అందించిన**

**నీ జాతి జనులు ధన్యులు**

**కవిత్వాన్ని కంచరగాడిదను చేసి**

**దాని వీపు మీద**

**చెప్పులజతను ఊరేగించినవాడా"** [50]

(నల్లగేటూ నందివర్ధనంచెట్టు; 2005: 30)

అక్షరం ద్వారా నీ జాతి జనుల గురించి అనేక ప్రక్రియలు ద్వారా నీ వాదాన్ని వినిపించావు. దళిత కవిగా నీ జాతి జనులకోసం పోరాటం సాగించిన యోధుడుగా కవి ఎండ్లూరి సుధాకర్‌ను తీర్చిదిద్దారు.

## 4.1.11 దళితీకరణం

శిఖామణి సందర్భం వచ్చినప్పుడల్లా కవిత్వాన్ని దళితీకరించారు. "యానాం సరస్వతి' కవితలో దళితీకరించిన విధానం కనిపిస్తుంది.

**"నరసమ్మగారూ!**

**సంజీవి నా పెద్ద కొడుకని**

**ఊరందరితో మీరు ఉత్సాహంగా చెప్తుంటే**

**అంబేద్కర్ విగ్రహాన్ని**

**అగ్రహారంలో ప్రతిష్టించినంతగా**

**సంబరపడిపోయాను”**[51] (నల్లగేటూ నందివర్ధనంచెట్లు; 2005: 137)

శిఖామణి గురువైన నరసమ్మగారు వీరిని తన పెద్దకుమారుడని ఊరందరితో ఉత్సాహంగా చెప్తుంటే నాకు ఆనందం చెప్పలేనంతగా ఉందని చెప్పాడు. ఆ ఆనందం ఎలా ఉందంటే అగ్రహారంలో దళితులకు స్థానం లేదు, అయినా దళితుల ఆశాజ్యోతి డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించినంత ఆనందంగా ఉందని చెప్పాడు. ఇంకా కులనిర్మూలన జరుగుతుందన్న భవిష్యత్ సూచన చేశారు.

ఇంకా మరొక కవిత ‘తహసీ! తహసీ!!’లో దళితీకరణం రాశారు.

**“శారదాకాశంలోని ఒక స్వచ్ఛ మేఘశకలం**

**దారితప్పి మాగుమ్మానికి తోరణమై వేలాడినట్టు**

**ఆకాశగంగ నీటితుంపర అటు చెదరి**

**నేటికి నీటికి అస్పృశ్యులమైన మమ్మల్ని సేదతీర్చడానికొచ్చినట్టు**

**పున్నమిరాత్రి వెన్నెలకిరణం ఒకటి ఎలాగో తప్పించుకుని**

**వెలివాడలోని మా రెల్లుగడ్డి గుడిసె మీద గోముగా జారిపడ్డట్టు**

**రాత్రిపూట రహస్యంగా సంచరించే**

**రాజహంసల తూలిక వొకటి రాలిపడి**

**మా శిరసుల మీద రాజ్యాధికారమై అమరినట్టు”** [52]

(నల్లగేటూ నందివర్ధనంచెట్టు; 2005: 18)

శిఖామణి గారి ఇంటికి ఎదురుగా ఉన్న ఇంటి నుంచి ఒక పాప వీరి ఇంటికి వచ్చినప్పుడు కలిగిన ఆనందాన్ని ఇలా వ్యక్తంచేసారు.

ఆకాశంలోని ఒక స్వచ్ఛమైన దారితప్పి తమ గుమ్మానికి తోరణమై వేలాడినట్టు, ఆకాశగంగ నేటికీ నీటికి అంటరానివారమైన మమ్మల్ని సేదతీర్చడానికి వచ్చినట్టు, పున్నమి రాత్రి వెన్నెల వెలివాడైన మారెల్లుగడ్డి గుడిసె మీద కాంతి చిమ్మినట్లు. రాత్రుల్లో రాజహంసలు తూలిక ఒకటి రాలిపడి మా శిరస్సుల మీద పడితే మా జీవితాలు బాగుపడ్డాయని కవి సూచన చేసారు. సాధారణ కవిత్వాన్నికూడా దళితీకరణ చేయటం ఆయనకు ఆయనే సాటి.

## 4.1.12 పశ్చాత్తాప నివేదన

శిఖామణి కవిత్వంలో కన్పించే మరో సరికొత్త అంశం. పశ్చాత్తాపనివేదన.

'క్షమాపణ' కవితలో శిఖామణి ఒక దళితకవిగా రాయవలసినంతగా 'దళితకవిత్వం' రాయలేదని తెలిపే కవిత. అందరి దళిత కవులతో పాటు తన్ను తాను దోషిగా బోనులో నిలబెట్టుకున్న సందర్భంలోనిదీ కవిత. మొత్తం దళిత జాతిని 'క్షమాపణ' కోరిన నేపథ్యంలోనిది.

**"క్షమించు దళితా! క్షమించు**

**కవిని పూర్వకవిని ఆ మాటకొస్తే అపూర్వ కవిని**

**పేరు ఏదైతేనేం ఊరు ఏదైతేనేం**

**ఆపస్తంబ సూత్రుణ్ణి ఆరువేల నియోగిని**

**నన్ను క్షమించు దళితా!"**[53] (కిర్రుచెప్పుల భాష; 2000: 29)

అంటూ ఆరంభమైన కవిత. ఓ దళితా నన్ను క్షమించమని ఏ భేషజాలు లేకుండా విన్నవిస్తున్నాడు. ఈ కవిత కవి నిజాయితీని తెలియజేస్తున్నది.

**"జీవితం యెడల నిజాయితీ లేనివాడు ఏమి సాధించలేడు. ముఖ్యంగా గొప్ప కవిత్వం రాయలేడు"**[54] అన్న శివసాగర్ మాటలు శిఖామణి విషయంలో అక్షరసత్యం.

**"వీర వియత్నాం గురించీ**

**రెడ్‌స్క్వేర్ సంఘటన గురించీ**

**బెర్లిన్ గోడ గురించీ సోమాలియా ఆకలి గురించీ**

**పద్యాలల్లగలను కానీ**

**చుండూరు రాచపుండు గురించీ**

**కారంచేడు కారం రోకళ్ళ గురించీ**

**నీరు కొండ నిప్పుగురించీ**

**ముమ్మాటికీ కవిత లల్లలేను"**[55] (కిర్రుచెప్పుల భాష; 2000: 81)

ప్రపంచంలో ఏ చిన్న సంఘటన జరిగినా కవి హృదయం స్పందిస్తుంది. చక్కటి పద్యాలను రాయగలను కానీ చుండూరులో జరిగిన సంఘటన మానని రాచపుండుగా, దళిత గుండెల్లో సలుపుతూనే ఉంది. కారంచేడులో జరిగిన దాష్టికంలో దళిత రోకళ్ళు కారంతో కాకదీరి కసికొద్దీ పోరాడినాయి. నీరు కొండ నిప్పు ఇప్పటికీ నివురు దుప్పటి కప్పి ఉంది. అయినా అవేవి నా గుండెను కదిలించలేదు. ఎందుకంటే **"నేను ఆధునిక కవిని. ఒక స్మశానశాలువకీ, ఒక పురష్కారానికీ తలవంచిన వాణ్ణి. పైపెచ్చు నా జీవన భృతికి ఏకైక ఆధారమైన నా ఉద్యోగానికి భయపడిన వాణ్ణి"** శిఖామణి తన జాతి జనులకు సంజాయిషి చెప్పుకుంటున్నాడు. కవిగా ఎంతో ఖ్యాతి గడించాడు కానీ, తన దళిత జాతికి జరుగుతున్న అన్యాయాల గురించి కవిత్వం రాయలేనందుకు పశ్చాత్తాప పడుతున్నాడు.

**"పూల కుర్రాళ్ళ గురించీ**

**గుడ్డి బిచ్చగాళ్ళ గురించీ**

**పుప్పొడి పదాలతో పలవరించిన నేను**

**పదిరికుప్పం పరాభవాల గురించి**

**పన్నెత్తు మాటయినా పలకలేకపోయాను**

**కుల నిర్మూలన జరగకుండానే**

**వర్గపోరాటం సిద్ధిస్తుందని**

**కలలు గంటూ గాలి కత్తులతో యుద్ధం చేస్తున్నవాణ్ణి**

**క్షమించు దళితా! క్షమించు**

**ఈ దేశపు చిత్రపటాన్ని అర్థం చేసుకోడానికి**

**నాకో జీవితకాలం సమయం కావాలి.**[56] (క్రిరుచెప్పుల భాష; 2000: 83)

అంటూ కవిత ముగించాడు.

అందరూ అనుకున్నట్టు నేను సుకుమార హృదయున్ని. పూల కుర్రాళ్ళ గురించి, గుడ్డి బిచ్చగాళ్ళ గురించి పలవరించిపోయి కవిత్వం రాస్తాను. కానీ పదిరికుప్పంలో నా జాతికి జరిగిన పరాభవాలకు స్పందించని కవిని నేను అంటూ తన్ను తాను నిందించుకున్నాడు. కుల నిర్మూలన జరగకుండానే వర్గపోరాటం లభిస్తుందని కలలు కంటున్న సగటుమనిషి నంటాడు. కవిత్వం రాయడం ఒక సామాజిక బాధ్యతగా భావించాడు. కానీ తన జాతి గురించి రాయవలసినంతగా రాయకపోవడాన్ని క్షమించమని కోరుకుంటున్న నిజాయితీగల దళితకవి శిఖామణి. వీరి కవిత్వంలో దళితవాదం నూటికి నూరు శాతం ఉంది. ఆయన పుట్టి పెరిగిన నేపథ్యం ఆయనలో దళిత కవిత్వాన్ని ఇంత చిక్కగా, చక్కగా చెప్పనిచ్చింది.

**"దళిత కవిత్వం దళితుల్లో ఆత్మవిశ్వాసం పెంచుతుంది. దళిత కవిత ఆవేదనలోంచి పుట్టి, ఆవేశంగామారి, ఆత్మగౌరవం కోసం, జరిగే ప్రతిఘటన చైతన్యధార!"**[57] అని డా. ఎస్వీ సత్యనారాయణ అభిప్రాయపడ్డారు.

ఈయన అభిప్రాయం ప్రకారం శిఖామణి కవిత్వంలో దళిత చైతన్యధార మనం చూడవచ్చు.

ఆయన అనుభూతి కవిగా ప్రసిద్ధి. అయినా తన మూలాలను విడిచిపెట్టలేదు. తాను వచ్చిన సామాజిక వర్గ నేపథ్యాన్ని మరువలేదు. అందుకే నేటికీ దళితకవిగా విశిష్టస్థానం పొందగలిగాడు. ఈయనలోని మరో ప్రత్యేకత ఏమిటంటే దళితకవిత్వాన్ని కూడా కవిత్వంగానే రాయటం. అనుభూతి సాంద్రమైన విషయాన్ని చెబుతున్నప్పుడు కూడా ఆయనలో దళిత వేదన తొంగిచూస్తుంది.

**"శ్రీశ్రీ కమ్మరి కొలిమి, కుమ్మరిచక్రం, జాలరి పగ్గం, సాలెల మగ్గం, శరీరకష్టం స్ఫురింపజేసేది గొడ్డలి. రంపం, కొడవలి, నాగలి, సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలు' అని తన కవిత్వంలో ఆవిష్కరిస్తాడు."**[58] శిఖామణి మరొకడుగు ముందుకేసి ఆ వృత్తిజాతుల వెలుగు చీకట్ల మధ్యే మొత్తం దళిత సాహిత్యాన్ని ఆవిష్కృతం చేశాడు. అక్షరాన్ని తోలు వొలిచి, గుప్పెడుతోలు ముక్కల్ని చేసిన కిర్రుచెప్పుల్లో కలిపి కుడుతున్నానంటాడు. ఇక్కడ అక్షరాన్ని దళితీకరించడానికి చేసిన అద్భుత ప్రయోగం.

దిక్కులేని వాళ్ళ రోదనలు, ఎక్కిళ్ళే అతని కవితలన్నీ. అతని ఏకాంతం అతనికొక విలక్షణమయిన దృష్టినిచ్చింది. తన చుట్టూ వున్న పేదల, దీనుల నిట్టూర్పుల్ని నిలువెత్తు చిత్రాలుగా నిర్మించాడు. పెద్ద పెద్ద సామాజిక వర్గాల నుంచి వచ్చిన కవులెవరూ చూడలేనంత ఎత్తు ఎదిగారు.

శిఖామణిది దళిత జీవితం, దళిత అనుభవం. వీరి కవిత్వం దళిత తాత్త్విక చింతనతో కూడుకున్నది. పాఠకులను ఆలోచింపచేసేది, స్పందింపజేసేది, చైతన్యపరిచేది. ఎందుకంటే దళిత సమస్యల్ని కళ్ళకు కట్టినట్లుగా దృశ్యమాలికలుగా చిత్రించగల నేర్పు గలవాడు. ఆ భావోద్వేగం ప్రతి దళితుడి స్వంతం. ఆ చైతన్యమే దళిత జీవితానికి చుక్కాని. ప్రతిఘటన, చైతన్యం లేనిదే దళిత జీవితం కొనసాగదు.

ఈ దృక్పథాన్ని శిఖామణి తానొక దళితుడిగా స్పందించి కవిత్వం రాస్తాడు. అంబేద్కర్ భావజాలం రక్తనాళాల్లో ఇమిడి వుంది. కాబట్టి దళిత కవిత్వం ఇంత ఘాటుగా రాయగలగుతున్నాడు. వీరి కవిత్వం దళితుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి ఉంటుంది.

## 4.2 విమర్శ – దళిత దృక్పథం

**"కవులు విమర్శ రాసినప్పుడు పాఠకులు కొంత ఆసక్తిని కనబరుస్తూ ఉంటారు. విమర్శకులు కవిత్వం రాసినప్పుడు కూడా ఇదేరకం ఆసక్తి కొనసాగే అవకాశం ఉంది. నిన్న మొన్నటిదాకా శిఖామణిని కవిగా మాత్రమే తెలుగు పాఠకలోకం ఎరిగి ఉంది. అప్పుడప్పుడూ పత్రికల్లో జరిగిన సాహిత్య చర్చల్లో పాల్గొన్నప్పటికీ వీరిని అందరూ కవిగానే**

**గుర్తించి గౌరవిస్తూ వచ్చారు. అలాంటిది ఈరోజు శిఖామణి విమర్శకుడిగా పాఠకుల ముందుకు వచ్చినప్పుడు పాఠకులలో ఈయన ఏం రాసుంటాడు? అన్న భావన రాకమానదు."**[59]

శిఖామణి సాహిత్య వస్తువు కంటే రూపానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినట్లు కనబడుతుంది

## 4.2.1 దళిత ఉద్యమ చైతన్యం

### 4.2.1.1 తెలుగులో దళిత దీర్ఘ కవితలు

దీర్ఘ కవితను ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారు నిర్వచించారు. **"దీర్ఘ కవిత దీర్ఘ కావ్యానికి పునాది భూమిక. ఒక ఉద్యమం, ఒక సమస్య, ఒక భావన, ఒక సంఘటన తీసుకుని ఒక తాత్త్విక నేపథ్యంలో దాని పరిణామాన్ని, పర్యవసానాన్ని వివరించి కవి తన తీర్పు నివ్వడమే దీర్ఘ కవితా లక్షణం. ఈ లక్షణం మామూలు దీర్ఘకవితలతో పాటు దళిత దీర్ఘ కవితలకు మరింత సన్నిహితంగా అన్వయిస్తుంది."**[60]

కొన్ని దళిత దీర్ఘ కవితలు గమనిద్దాం-

**"జాషువా 'గబ్బిలం' కావ్యం, అనాథ వంటి ఖండకావ్యాలు, వచన కవిత్వంలో బొజ్జాతారకం 'నది పుట్టిన గొంతుక' సంపుటిలోని 'నేను అస్పృశ్యుణ్ణి' వంటి వాటిలో దీర్ఘకవిత లక్షణాలు ఉన్నాయి. ఇంకా మద్దూరి నగేష్‌బాబు రచ్చబండ, లోయ, పుట్ట, పైడి తెరేష్‌బాబు, 'హిందూ మహాసముద్రం' (క్యాసెట్) జూలూరి గౌరీశంకర్, 'పాదముద్ర', సతీష్‌చందర్ - 'నాన్న సైకిలు', రాణి శివశంకర్ మద్దూరి నగేష్‌బాబుల 'సంకర కవిత'- 'ఊరూ వాడా', ఎండ్లూరి సుధాకర్ - 'కొత్త గబ్బిలం', బన్న ఐలయ్య 'నిప్పు కణిక' దీర్ఘకవితలు.**

**జాషువా గబ్బిలం కావ్యం స్ఫూర్తితో ఎండ్లూరి సుధాకర్ 'కొత్త గబ్బిలం' దీర్ఘకవితను రాశాడు. జాషువా కైలాసంలోని శివుని చెంతకు గబ్బిలాన్ని పంపి సందేశం వినిపిస్తే సుధాకర్ తన గబ్బిలాన్ని మాదిగ దండోరా ముట్టడికి మద్దతుగా పంపి తన సందేశాన్ని**

**వినిపించాడు. సతీష్‌చందర్ రాసిన నాన్న సైకిలు దీర్ఘకవిత తండ్రీకొడుకుల మధ్య సంభాషణాత్మకంగా సాగిన చిక్కని కవిత. దీర్ఘ కవితల్లో నగ్నముని కొయ్యగుర్రం ఎంత సంక్షిప్తతో శిల్ప నైపుణ్యంతో సాగిందో సతీష్‌చందర్ నాన్న సైకిలులో కూడా సంక్షిప్తతతో శిల్ప సమన్వితతో సాగింది. జూలూరు గౌరీశంకర్ 'పాదముద్ర' వర్ణవ్యవస్థ మనుషులను ఎలా విభజించి దోపిడీ చేస్తుందో శక్తిమంతంగా ఆవిష్కరించిన దీర్ఘ కవిత. దళిత బహుజనుల శ్రమను దోచుకోవడమే కాకుండా వారిని కనీసం మనుషులుగా గుర్తించడానికి నిరాకరించిన ధర్మాలను, శాస్త్రాలను కవి దిక్కరించాడు. సుంకర రమేష్ రాసిన 'తల్లికోడి హెచ్చరిక' ప్రతీకాత్మకంగా సాగిన దీర్ఘ కవిత. బన్న అయిలయ్య 'నిప్పుకణిక', సుంకర రమేష్- 'తల్లికోడి హెచ్చరిక', చెరుకు సుధాకర్ - 'అనగనగా మెరిట్', ఆర్. రామకృష్ణ -'గాడిముక్క', జి.వి.రత్నాకర్ - 'అల', తెలంగాణా నేపథ్యం నుండి వచ్చిన ఎం.వెంకట్‌రావు, గ్యారయాదయ్య -ఎర్కోషి మొదలైనవి."** [61]

ఈ దీర్ఘ కవితలన్నింటా దళిత సంవేదన అంతర్లీన సూత్రంగా వుంది. అది కొన్నిసార్లు ఆవేశపూరితంగా ఆగ్రహ ప్రకటనంగా మరికొన్నిసార్లు సంయమనంతోనూ సాగింది. దళిత కవులు దళితుల జీవితాలలో జరిగిన అన్యాయాలను, దోపిడీలను, దుర్మార్గాలను, అవినీతిని దీర్ఘకవితల ద్వారా తమ నిరసనను తెలియజేశారు. ఈ దళిత దీర్ఘ కవితలు దళిత సాహిత్య ఉద్యమానికి ఎంతో ఉపయోగపడ్డాయి.

## 4.2.1.2 దళిత కవిత్వం - భాష

మొదట సాహిత్యంలో భాష పట్ల అభ్యంతరాలు చాలా కనిపిస్తాయి. దళిత సాహిత్యంలో కూడా భాష పట్ల తీవ్ర అభ్యంతరాలు మొదలైనాయి. దళిత కవిత్వం ఎదుర్కొంటున్న ప్రధాన అభియోగాలలో 'భాష' ఒకటి. సాహిత్య సందర్భం, వస్తువు మారినప్పుడల్లా దానికి అనుగుణంగా కవిత్వపు భాష కూడా మారుతుంది. దళిత సాహిత్యోద్యమ నిర్మాణంలో చాలామంది దళిత రచయితలు, కవులు తమ భావాలను వ్యక్తీకరించే దశలో భాషను ఒక ప్రధాన అవరోధంగా గుర్తించారు. తమది కాని భాషలో తాము మాట్లాడుతున్నామన్న

భావనకు వచ్చారు. దీనికోసం కవిత్వ నిర్మాణంలో భాషాపరంగా రెండు విధానాలు అవలంభించారు. దళిత కవిత్వ సృజనలో భాష తనకు ఎలా అవరోధం అయిందో వివరించే ధోరణిలో చెప్పిన కవిత్వం ఒక రకం. దళితయాస, నుడికారంతో దళితత్వాన్ని చెప్పే రచనలు రెండోరకం. దళిత కవుల భాష అనే అంశంలోకి ఎళ్తే....

**"నా భాష అర్థం కావాలంటే నీ జందెం తెంచుకోవాలి ముందు" అంటాడు దెంచనాల శ్రీనివాస్ తన 'గురి తప్పిన పద్యం' సంపుటిలో. బ్రాహ్మణీయ భావజాలంలోంచి పుట్టిన భాషను ఆధారంగా దళిత కవిత్వాన్ని జీవితాన్ని, అర్థం చేసుకోలేరని కవి ఉద్దేశం. జందాన్ని సంస్కృత భాషకూ, భాషా విషయంలోని నియమ, నిబంధనలకు ప్రతీకగా కవి గ్రహించాడు జందెం కేవలం ఒక భౌతిక సంకేతమే కాదు దాని వెనుక వర్ణవ్యవస్థకు చెందిన తరతరాల చరిత్ర ఉంది. దాన్ని తెలుసుకోవాలంటే అవరోధంగా వున్న జంద్యాన్ని తెంపుకోవాలని కవి సూచిస్తున్నాడు."**[62]

దళితుల భాష అర్థం కావాలంటే కులవ్యవస్థ నుంచి బయటకు వస్తేనే ఈ భాష గొప్పతనం తెలుస్తుంది.

"నిశానీ" కవితా సంపుటిలో భాష అశ్లీలంగా, అభ్యంతరకరంగా, స్త్రీలను కించపరిచే విధంగా ఉందని అభ్యంతరం చెబుతూ స్త్రీవాదులు ఆ భాష యాజమానులందరినీ యాజమాని ఆయుధాలతో యాజమాని సౌధాన్ని కూలగొట్టగలమా? అనే వ్యాసం రాశారు. బూతులు భూస్వామ్య వ్యవస్థ సృష్టించినవేననీ, అటువంటి తిట్లను ఉపయోగించడం వలన ప్రయోజనం లేదనీ ఆ వ్యాసంలో స్త్రీవాదులు అభిప్రాయపడ్డారు. ఆ వ్యాసానికి సమాధానంగా ఎండ్లూరి సుధాకర్ "ఇదో వాచకం" కవితను రాసారు.

భూస్వాములు ప్రయోగించిన తిట్లకూ దళితులు కవిత్వంలో ఉపయోగిస్తున్న తిట్లకు వ్యత్యాసాన్ని సుధాకర్ ఆ కవితలో వివరించారు.

**"కండకావరం తిట్లకూ**
**కడుపు మండి రగిలి రాలిన మాటలకు తేడాలేవా తల్లులూ!"**[63]

దళిత కవి ఉపయోగిస్తున్న భాష పీడనల నుండి అవమానాలనుండి పెల్లుబికి వచ్చిందని వివరించాడు.

**"దళిత కవిత్వంమీద వచ్చిన ప్రధాన అభియోగాల్లో దళితకవులు చెవిని పెట్టలేని భాష వాడుతున్నారనీ, తిడుతున్నారనీ దళిత కవిత్వంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా దాడికి దిగిన వాళ్ళకి 'దళితకవుల భాష' ప్రధాన ఆయుధంగా ఉపయోగపడింది. బయటివాళ్ళే కాక సతీష్‌చందర్ వంటి దళిత కవి కూడా నిశానీకవుల భాష గురించి 'మా మూతులకు ముంతలు కట్టవద్దు' అనే వ్యాసం రాసాడు. దళిత కవిత్వంలో శిల్పవాదుల అభిప్రాయాలకు ప్రతిబింబంగా సతీష్‌చందర్ అభిప్రాయాలను పరిగణించవచ్చు. ఎవరెన్ని హితబోధలు చేసినా, కవితను ఎందుకు, ఎలా, ఏమిటి రాయాలనుకున్నాడో అది రాసి తీరతాడని నిన్నటి దిగంబరకవులు, నేటి దళిత కవులు రుజువు చేస్తూనే వున్నారు."**[64]

ప్రజలలాగే భాష కూడా నిరంతరం పరిణామం చెందుతూ వుంటుంది. ఒక కాలంలోని భాషకు ఆ కాలం వ్యాకరణం ఉంటుంది. ఇంకొక కాలంలోని భాషకు మరో వ్యాకరణం రూపొందుతుంది. భాష గ్రాంథికంగా, వ్యవహారికంగా, మాండలికంగా మారుతూ సాహిత్య సృష్టికి దోహదం చేస్తున్నట్లే వృత్తి, కుల, తరగతుల మాండలికం సహాయం చేస్తుంది. మాండలికంలో సాహిత్యం వచ్చినప్పుడు సహజభాష వస్తుంది. సహజభాషలో కొన్ని పదాలు కొందరికి బూతులుగా అనిపిస్తాయి. నీతిమంతులకు బూతు వినిపించదు, కనిపించదు. బూతు ప్రధానంగా మనస్సంబంది, దళితసాహిత్యంలో దాగుడుమూతల భాష ఉండదు. సహజమయిన భాష ఉంటుంది. కోపంలో కవి బూతు వాడినా వాడవచ్చు. అక్కడ హృదయం ముఖ్యం. బూతు బూతుకోసం వాడకపోతే ఇతర సాహిత్య ప్రయోజనం వాంఛిస్తే, దాన్ని బూతులుగా గ్రహింపనక్కరలేదు. బూతు బుద్ధిపూర్వకంగా వాడితే దాని హేతువును చూడాలి.

అన్నీ తీరినవాడికి నోరు మెదిపే అవసరం ఉండదు. ఆకలి అయినవాడు అమ్మా అంటాడు. అమ్మయినా అడగందే పెట్టదు. ఆలస్యం అయితే కేకపెడతాడు. చస్తున్నవాడు

గావుకేక పెడతాడు. వేల సంవత్సరాలు తరబడి ఆకలి ఆత్మహననం అవుతున్న జాతి ఎంత పెడబొబ్బలు పెట్టాలి? అరవద్దు అంటే సాధ్యం కాదు. దళితుడి స్థితి అర్థం చేసుకోకుండా ఎవడైనా మాట్లాడితే అది వాడి ఆత్మహత్యా సదృశ్యం కాక మనిషి జన్మహక్కు ఈ కేకలు దళితుల ఆజన్మహక్కులు. ఈ కేకలు సుందరంగా వినసొంపుగా సంగీతాత్మకంగా ఉండాలంటే కష్టము. అవి క్రమంగా ఉండవు, నెమ్మదిగా ఉండవు, తక్షణంగా ఉంటాయి. పవిత్రతను నుదుట దిద్దుకొని తిరుగుతున్న మనుషులకే ఆ కేకలు బూతులుగా, అశ్లీలంగా వినిపిస్తాయి.

ప్రేమ, ఆప్యాయత, వాత్సల్యం, కరుణ, సానుభూతి పుష్కలంగా ఉన్నవాడు దళితుడు. ఆవేదనకు గురి అయినవాడు. ఇతరుల ఆవేదనను చక్కగా అర్థం చేసుకోగలడన్నది వాస్తవంగా దర్శింపబడితే ప్రపంచ బాధను దళితుడు అర్థంచేసుకొన్నంత బాగా మరెవరూ అర్థం చేసుకోలేడు. విప్లవ సాహిత్యంలో ఉన్న పాటను విమర్శకులు దళిత సాహిత్యంలో చూస్తున్నారు.

కలయినపుడు ఏడ్చిన శిశువు పాలు తాగిన తర్వాత నవ్వినట్లు, పాట స్త్రీవాదంలో పుట్టితీరుతుందని దళితవాదం ఋజువు చేస్తుంది.

దళితసాహిత్యంలో ఒక అపోహకు అవకాశం ఉంది. ఏదో కులం, మతం, వర్గం, వర్ణం పేరు ప్రస్తావించినపుడు వాటిని నిందిస్తున్నట్లో నిరసిస్తున్నట్లో అనిపించవచ్చు. తిట్టినట్టూ అనిపించవచ్చు. దళితుడే తిట్టడం ముఖ్యంకాదు. తిట్టు ఉద్దిష్టప్రయోజనం కాదు. తనకు అస్తిత్వం, అభ్యుదయం, విముక్తి ముఖ్యం. అయినా వ్యవస్థను, వ్యక్తుల్ని సంస్థల్ని, సాహిత్యాన్ని నిరసించటం, నిందించడం, విమర్శించడం ముఖ్యమే

## 4.2.1.3 దళిత కథ

తెలుగు సాహిత్యంలోకి 'దళితవాదం' ప్రవేశించాక ఎవరి అనుభవాలనువారే రాయాలి, రాయగలరు అనేవాదం ప్రచారంలోకి వచ్చింది. సమస్యకు వెలుపల ఉండి రాసే రచనకు, సమస్యలోపల ఉండి రాసే రచనకూ చాలా వ్యత్యాసం ఉంది. వుంటుంది కూడా.

మానవుని ప్రాథమిక అవసరాలైన కూడు, గుడ్డ, నీడను పొందడానికి ఈ దేశంలోని దళితులు వేల సంవత్సరాలుగా పోరాటాలు చేస్తూనే ఉన్నారు. అందులోనూ ప్రాణాధారమైన మంచి నీటిని పొందడానికి ఎన్నో అవమానాలను ఎదుర్కొంటున్నారు. నీటి కోసం పోరాటాలూ త్యాగాలూ చెయ్యవలసి వచ్చింది. పశువైనా స్వేచ్ఛగా చెరువులో దిగి నీళ్లు తాగుతుంది కానీ ఈ దేశంలోని అంటరానివాడికి నీటిని తాకే హక్కులేదు. దళిత విముక్తిలో భాగంగా అంబేద్కర్ మహద్‌చెరువు పోరాటం చేసి నీటి హక్కును సాధించాడు.

అయితే చాలా గ్రామాల్లో ఇప్పటికీ నీటి అంటు వుండటం విచారకరం. ఇలాంటి ఇతివృత్తంతో **"కొలకలూరి ఇనాక్ 'ఊరబావి' అనే గొప్ప కథను రాశారు. తెల్లారేసరికి ఊరిబావిలో ఎద్దుదట్టెం పడివున్న సంగతి ఊరంతా గుప్పుమంది బావినీళ్ళు మాదిగపల్లె వాళ్ళు ముట్టుకోడానికి వీల్లేదు. ఎవరైనాతోడిపోస్తే తీసుకువెళ్ళవలసిందే. అంతకుముందు రోజే బావిదగ్గర కడవ ఎత్తుతూ చిదంబరం భార్య ఒంటిమీద చెయ్యేసి చెంపదెబ్బ తిన్నాడు అగ్రకుల యువకుడు. చిదంబరం భార్య భర్తకు జరిగిన విషయం చెప్పగా ఒంటికాలి మీద లేస్తాడు. పెద్ద కులపోళ్ళతో గొడవపడితే నష్టపోయేది మనమే అని చిదంబరం తండ్రి రాములు వారిస్తాడు. అంతకు ముందు చిదంబరం గుడిలో మొక్కు తీర్చుకునే దగ్గర, రైల్వే స్టేషన్‌లో మనసబును ఎదిరిస్తాడు. ఈ సంఘటనల నేపథ్యంలో మునసబు బావిలో ఎద్దుదట్టం వేసింది చిదంబరమే అని నమ్మి, తండ్రి కొడుకులైన రాముడు, చిదంబరాలను బంధించి చావగొట్టిస్తాడు. ఆ రాత్రి చిదంబరం భార్య సత్యనారాయణ సహాయంతో భర్త మామలను విడిపించి, మనసబును చావగొట్టి, గడ్డివాములకు నిప్పుపెట్టిస్తుంది. అన్యాయంగా తమ వాళ్ళను కొట్టించి నందుకు బావిలోని ఎద్దు దట్టెంను తియ్యడానికి మాదిగలు నిరాకరిస్తారు. ఊరివాళ్ళే దట్టెంను తియ్యడానికి ప్రయత్నించి విఫలమై ఆ ప్రయత్నం మానుకుంటారు. చివరికి ఆ బావిని మాదిగలకే వొదిలేస్తారు. స్థూలంగా ఊరబావి కథ ఇది."** [65]

ఈ కథతో ఇనాక్‌గారికి మంచి పేరు వచ్చింది. దళితుడే రాసిన దళిత కథగా సాహిత్యంలో మంచిపేరు తెచ్చుకుంది. మాదిగపల్లెలోని జీవితాలను, అవమానాలను వాస్తవిక దృష్టితో అద్భుతమైన కథనంతో, శిల్పంతో వీరు ఈ కథను మలిచారు.

అంటరానితనం, కులవృత్తులు, దళిత స్త్రీలపై అత్యాచారాలు మొదలలైన విషయాలతో అనేకమంది దళిత రచయితలు దళితకథలలో తమ ఆవేదనని, ఆర్తిని తెలియజేసి దళిత ఉద్యమ చైతన్యానికి దోహదం చేశారు.

## 4.2.1.4 దళిత సాహిత్యం - పాట :

సాహిత్య ప్రక్రియల్లో పాటకు చాలా ప్రాచీన చరిత్ర వుంది. ఆధునిక సాహిత్య అవసరాలను తీర్చే ప్రక్రియల్లో పాట ప్రముఖస్థానం పొందింది. ఆధునిక సాహిత్యంలో 1910 ప్రాంతం నుండి దళిత గీతాలు వెలువడినట్లు చరిత్ర చెబుతుంది. 1910లో ఆంధ్రభారతి పత్రికలో అచ్చయిన అజ్ఞాతకర్తృత్వపు రచన 'మాలవాండ్రపాట' తొలి దళిత గీతంగా గుర్తింపు పొందింది. ఈ పాటలో అందరం ఒక తల్లి బిడ్డలమే కదా, అందరూ ఒక్కలాగే వుందాం, బ్రాహ్మణులు, ఇతర కులాలవాళ్ళు మాకంటే ఏరకంగా ఎక్కువ? అని ప్రశ్నించటం కనపడుతుంది. గురజాడ అప్పారావు రాసిన 'లవణరాజు'లో వర్ణధర్మంలోని అధర్మాన్ని ప్రశ్నిస్తాడు. మలిన దేహులకంటే మలినచిత్తులే నిజమైన అస్పృశ్యులని కవి భావన. కొండపల్లి జగన్నాధరావు తన 'మేలుకొలుపు' గీతంలో కేవలం భౌతిక, శారీరక, ఆహారపు అలవాట్లే అంటరాని తనానికి ప్రధాన కారణాలుగా పేర్కొంది. అయితే అవేమీ నిజమైన కారణాలు కావని నేటిచరిత్ర చెబుతోంది. ఈ కాలంలో వచ్చిన దళిత గీతాలన్నిటిమీద గాంధీ 'హరిజనోద్ధరణ' పిలుపు ప్రభావం విశేషంగా కనబడుతుంది.

**"తొలితరం దళితగీతాలలో గరిమెళ్ళ సత్యనారాయణ హరిజన సమస్యలపై ఎక్కువ గీతాలు రాశారు. జాలారంగస్వామి అంటరానివారెవరు, మాలశుద్ధి అనే రెండు దీర్ఘ గీతాలలో మాలమాదిగల దుస్థితిని వర్ణించారు. అంటరానివారెవరు? గీతంలో పరాయిపాలన, ప్రస్తుత మాలమాదిగలస్థితి, పూర్వోన్నతి, విచారణ అనే భాగాలు వున్నాయి.**

**దళితులు ఒకప్పటి పాలకులేనని, చరిత్రలో వారు రాజ్యాధికారం కోల్పోయి పతితులైన విధానాన్ని అనార్యులపై ఆర్యుల దోపిడీని చిత్రించారు. కుసుమధర్మన్న కవి హరిజనశతకం, నల్లదొరతనం అనే గేయ సంపుటులు హరిజన సమస్యను తీవ్రస్వరంతో ఖండించటం కనబడుతుంది. హరిజన శతకంలో జంతుజాలానికి దైవత్వమారోపించి పూజించిన ఆర్యజాతి పేదలను తాకడానికి అంటు ఎందుకని ప్రశ్నిస్తాడు. సంపదసృష్టించేది మనం, చేజిక్కించుకునేది వారు ఎన్నాళ్ళు ఇలా? అని ప్రశ్నించటం కనిపిస్తుంది. మాకొద్దీ తెల్లదొరతనం అని గరిమెళ్ళ బ్రిటిషు పాలకులకు వ్యతిరేకంగా గీతం రచించారు. అయితే తెల్లదొరలు పోయి, స్వాతంత్ర్యం సిద్ధించినా, నల్లదొరల పాలనలో దళితుల స్థితిగతుల్లో మార్పేమీ రాలేదు. నల్లపెత్తనాన్ని గర్విస్తూ కుసుమధర్మన్న 'మాకొద్దీ తెల్లదొరతనము' అనే గేయం రాసారు. మమ్మల్ని మనుషులుగా గుర్తించిన ఈ నల్ల దొరతనపు స్వాతంత్ర్యం మాకొద్దంటాడు. మేమూ మీలాంటి మనుషులమే, మమ్మెల్నెందుకు భేదభావంతో చూస్తారని ప్రశ్నించటం కనపడుతుంది. ప్రముఖ ప్రజాకళాకారుడు 'నాజర్' కూలీనాలీ చేసుకున్న పొట్టగడవని అరకొర సంసారాలను 'ఎన్నాళ్ళీ కాపురాలు' గీతంలో కరువుల సంతగా, అతుకుల బొంతగా, పిల్లలు తింటే తల్లులు పస్తుగా ఎన్నాళ్ళీ కాపురాలు అని ఆవేదన చెందటం కనిపిస్తుంది."** [66]

దళితుల్ని పశువుకంటే నీచంగా చూస్తున్న విధానాన్ని ఖండించడం, తెల్లదొరతనానికి, నల్ల దొరతనానికి ఎటువంటి తేడాలేదని దళిత కవులు పాటల ద్వారా ఉద్యమ చైతన్యాన్ని తీసుకొచ్చారు.

### 4.2.1.5 దళిత సాహిత్య వైతాళికుడు కుసుమధర్మన్న కవి

కందుకూరి వీరేశలింగం పంతులు వెలిగించిన పునరుజ్జీవన జ్యోతి యావదాంధ్రానికి తన కాంతులు విరజిమ్మింది. వాటిలో ఒక కాంతిపుంజం కుసుమధర్మన్న కవి. నైజాం రాష్ట్రంలో దళితుల అభ్యున్నతికి మాదిరి భాగ్యరెడ్డివర్మ ఎంత కృషి చేశాడో కోస్తాంధ్రలో కుసుమధర్మన్నకవి అంతటి కృషి చేశాడు. కందుకూరిది ప్రధానంగా సంస్కరణదృష్టి.

దానికి సాహిత్యానికి ఒక పనిముట్టుగా వాడుకున్నాడు. గురజాడది సంస్కరణదృష్టితో పాటు కావ్య కళాదృష్టి. **"కుసుమధర్మన్న కవి తన ఉద్యమానికి ప్రచారసాధనంగా సాహిత్యాన్ని మలుచుకుంటే, జాషువా గురజాడలా సంస్కరణదృష్టితో పాటు కావ్యకళాదృష్టినీ ప్రదర్శించాడు. ఒకరకంగా కందుకూరి కుసుమధర్మన్న కవులది ప్రచారదృష్టి గురజాడ జాషువాలది కళాదృష్టి. దళిత సాహిత్యానికి ధర్మన్న ఆద్యుడైతే జాషువా ఆద్యుడు"**[67]

తెలుగు సాహిత్యంలో కుసుమధర్మన్న కవి ప్రస్తావనలు తూర్పుగోదావరిజిల్లా దళిత వైతాళికులు, తెలుగులో జాతీయోద్యమ కవిత్వం, ఆధునిక సాహిత్యకోశం, తెలుగులో ఉద్యమగీతాలు, దళితగీతాలు, హరిజనాభ్యుదయం ఆధునికాంధ్ర కవిత్వం, దళిత సాహిత్య చరిత్ర, దళిత ఉద్యమ వైతాళికుడు – కుసుమధర్మన్న కవీంద్రుడు, కుసుమధర్మన్న కవి రచనలు –దళిత దృక్పథం, తొలి దళిత కవి – కుసుమధర్మన్న మొదలైనవిగా చెప్పవచ్చును.

**"ధర్మన్నకవి కృషి ప్రధానంగా అయిదు ముఖాలుగా విస్తరించింది. అవి 1.వైద్యం, 2. సాహితీ సృజన, 3. కళారంగం, 4. పత్రికారచన 5. వక్తృత్వం. వైద్యవిధ్వాన్ పరీక్ష పాసైన ధర్మన్నకవి ధనాపేక్ష లేకుండా తను నేర్చిన వైద్యాన్ని గ్రామీణ నిరుపేద దళితులకు అందించిన ప్రజావైద్యుడు. పద్యం, గేయం, కథ, నవల, వ్యాసం వంటి ప్రక్రియల్లో రచనలు చేసిన సృజనాత్మక రచయిత. జిల్లాలోని ప్రతి హరిజనవాడకూ తిరిగి తన గేయాలను హరికథల రూపంలో గొంతెత్తి గానం చేసి అభినయించి జాతిని జాగృతం చేసిన ప్రజా కళాకారుడు. తన నమ్మిన అంబేద్కర్ సిద్ధాంతాలను ప్రచారం చేయడానికి 'జయభేరి' పత్రికను స్థాపించి తను వ్యాసాలతో జాతి జనులను చైతన్యవంతం చేసినా పత్రికా రచయిత అనేక ఆశ్రమాల్లోనూ, 1925 నుండి జరిగిన అనేక హరిజన మహాసభలోనూ, రంగూన్ వంటి చోట్ల ప్రవాహ సదృశమైన వాగ్దాటితో ఉపన్యాసాలు చేసిన మహావక్త."**[68]

వీరి రచనల్లో ముఖ్య విషయం దళిత సమస్య పరిష్కారానికి సామాజిక న్యాయంతో పాటు ఆర్థికన్యాయం కూడా అవసరమన్న ప్రతిపాదనలు ఆధునిక దళిత ఉద్యమాలు

మనువాదాన్నీ బ్రాహ్మణీయ భావజాలాన్ని ముందుకు తెచ్చినంతగా ఆర్థిక కోణాన్ని ముందుకు తీసుకురాలేదు. 1922 లో మాకొద్దీ నల్లదొరతనం గేయం, 1933లో రాసిన హరిజన శతకం గ్రంథాలలో మనువాదంతోపాటు అగ్రవర్ణభూస్వాములు దళిత కూలీలపై సాగిస్తున్న ఆర్థిక దోపిడీని ధర్మన్న కవి గుర్తించడమే కాకుండా నిర్భయంగా ప్రశ్నించాడు. దళిత దృక్పథానికి ఆనాడే ఆర్థికవాదాన్ని జోడించాడు. 1945లోనే 'హరిజనబ్యాంకు' స్థాపించిన తొలి దళిత ఆర్థికవేత్త కుసుమధర్మన్న కవి. దళితుల దైన్యస్థితికి హిందూమతమే మూలకారణం అని, ఇటువంటి మతంలో మేం ఇక సాగలేదని 'దండాలు పాట'లో ప్రకటించాడు. ఎస్‌సిలను ఎ.రెల్లికులం, బి.మాదిగకులం దాని ఉపజాతులు సి.మాల, డి. ఆదియాంధ్ర వర్గీకరించారు. ధర్మన్నకవి రాసిన 'హరిజన శతకం' ప్రారంభంలోనే 'ఆలకింపుమయ్య హరిజనుండ' అనే మకుటానికి ప్రత్యామ్నాయ మకుటాలను సూచిస్తూ పద్యం రాశారు. ఈ పదాలను ప్రయోగించే విధానం గమనిస్తే "హరిజనులు ఆంధ్రదేశంలోని వివిధ ప్రాంతాలలో ఆదిహిందువులు, ఆదియాంధ్రులు, మాలలు మొదలైన పేర్లతో పిలువబడుతున్న కారణంగా, ఆయా ప్రాంతాలవారికి అవసరమని తోచినచో అందుకు అనుగుణంగా మార్చి చదువుకోవడానికి 1933లోనే రాయబడ్డ ఈ పద్యం వలన ఆంధ్రదేశంలో ఒకేజాతి వేరు వేరు పేర్లతో పిలువబడుతున్నారని స్పష్టం అవుతుంది.

**"జయభేరి' పత్రికను ఎందుకు ప్రారంభించాల్సి వచ్చిందన్న విషయం ఆయన మాటలలో "ఇతర జాతులకు పత్రికలు అంతగా అవసరం లేదు. ఆ జాతులన్నియు ఉన్నత దశలోనే యున్నవి. పత్రిక కావలసినను, ప్రబోధము కావలసినను, ప్రచారము కావలసిననూ హరిజన జాతికే."**[69]

హరిజన శతకంలో గాంధీ ప్రభావంతో గాంధీమీద అరడజను పద్యాలు రాసిన ధర్మన్న కవి జయభేరి పత్రిక స్థాపన నాటికి దళితుల విముక్తికి గాంధీ సిద్ధాంతం కంటే అంబేద్కర్ సిద్ధాంతమే అనుగుణమని నమ్మాడు. 1939 జనవరి నాటి జయభేరి పత్రికలో 'లోగోకు' ఇరువైపులా గాంధీ, అంబేద్కర్‌ల ఫోటోలు వేసి ఆసక్తికరమైన వ్యాఖ్యలు రాశాడు.

గాంధీ ఫోటో కింద

మధ్యాహ్నపు మాల

సవతి తల్లి ప్రేమ

స్వరాజ్య వాది

కలవారి అండ

అంబేద్కర్ ఫోటో కింద

మహానాటి మాల

కన్నతల్లి ప్రేమ

స్వతంత్రవాది

లేనివారి అండ

దళితుల అభ్యున్నతికి గాంధీ – అంబేద్కర్‌ల దృక్పథాలను ఈ వాక్యాలును బట్టి తెలుస్తుంది. దళితుల జీవితాలను బాగుపరచాలన్న ఆకాంక్షతోనే తన జీవిత ప్రయాణాన్ని గడిపాడు ధర్మన్న కవి.

దళితుల ఆశాజ్యోతి డా.బి.ఆర్.అంబేద్కర్ భావజాలంతో దళితుల సమస్యల గురించి మొదట హరిజన శతకం రాశారు. ఈ శతకంలో దుర్మార్గమైన అంటరాని తనాన్ని ఎండగట్టారు. దళితులను చైతన్యవంతం చేయడానికి హరిజన బ్యాంకును స్థాపించారు. తన జీవితాన్ని దళిత జాతికే అంకితం చేశారు. అందువలన కుసుమ ధర్మన్న కవి దళిత సాహిత్య వైతాళికుడుగా కీర్తిపొందారు.

### 4.2.1.56 తొలి దళిత స్త్రీవాద కవిత్వం

**"తెలుగు దళిత కవిత్వానికి మొదటిసారిగా దళితస్త్రీదృక్కోణం అందించిన కవయిత్రి చల్లపల్లి స్వరూపరాణి ఆమె కవితా సంపుటి 'మంకెనపూవు'. తెలుగులో తొలి దళిత స్త్రీవాద కవిత్వం 'చిక్కనవుతున్నపాట' సంకలనం వచ్చిన తర్వాత హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ దళిత సాహిత్య వేదిక వెలువరించిన 'గుండెడప్పు' సంకలనంలో స్వరూపరాణి**

**దళితస్త్రీ కోణం నుంచి రాసిన మంకెనపూవు, మట్టి బతుకులు కవితలు తొలిసారిగా అచ్చయ్యాయి. సతీష్‌చందర్, ఎండ్లూరి సుధాకర్, మద్దూరి నగేష్‌బాబు, కత్తి పద్మారావు, శిఖామణి, కోయి కోటేశ్వరరావు వంటి కవులు దళితస్త్రీల ఆర్తిని తమ కవితల్లో బలంగా వ్యక్తీకరించారు. దళితస్త్రీవాదం నుండి కవులు దళిత స్త్రీల ఆర్తిని తమ కవితల్లో బలంగా వ్యక్తీకరించారు. దళితస్త్రీవాదం నుండి పురుషాధిక్య వ్యతిరేక భావజాలాన్ని, దళితవాదం నుండి ప్రశ్నించినంత తీవ్రస్వరంతోనే దళిత పురుషాధిక్యాన్ని ప్రశ్నించగలిగారు. స్త్రీవాదం కేవలం జండర్ సమస్యను ముందుకు తీస్తే దళితస్త్రీవాదం జెండర్‌తోపాటు కులం వలన అదనంగా దళితస్త్రీ ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించింది.”**[70]

స్త్రీవాదం ఆగిపోయిన ఈ చోటనుండే దళితస్త్రీవాదం మొదలయింది. ఈ మంకెనపూవుల కళ్ళు ఈ శతాబ్దపు జాములోయలో నిలబడి నెత్తుటి మరకలంటిని సరికొత్త శకాన్ని ఎలుగెత్తి పిలుస్తున్నాయి. ఈ సంపుటికి శీర్షికై నిలిచిన ‘మంకెనపూవు’ కవిత సగటు దళితస్త్రీ ఆత్మకథనం. ఊరి కులాధిక్యంతో పాటు వాడ పురుషాధిక్యాన్ని గుర్తించడం, ప్రశ్నించడం కనిపిస్తుంది.

‘మంకెనపూవు’ కవితలో ఒక దళితస్త్రీ జీవితంలోని ప్రతిసందర్భంలోనూ సన్నివేశంలోనూ ఎదుర్కొన్న కులపీడనకు శక్తివంతమైన ఆవిష్కరణ కనపడుతుంది. చివరికి తాను చేయగలిగింది కష్టాల మంటల్లో బతుకుని కదుక్కుని మంకెనపూవులా విచ్చుకోవడం. ఈవిచ్చుకోవడంలో నేత్రధ్వని వ్యజింపబడింది. అది శక్తి క్యూట్‌కి ప్రతీక. తిరుగుబాటుకు సూచిక. కవిత్వం నిర్వర్తించే అనేకానేకమైన చర్యల్లో మనసుల్ని శుభ్రపరచడం కూడా ఒకటి. మంకెనపూవు కవిత్వం ఆ పనిని విజయవంతంగా నిర్వహించింది. దళిత సాహిత్యంలో గిరిజన కవులు ప్రాతినిధ్యమేకాదు, కనీసం గిరిజన జీవితాలను ప్రస్తావించిన కవితలు అరుదే! ఈమె గిరిజన జీవితాల్ని వాస్తవిక దృష్టితో సౌందర్యం మేళవించి ఆవిష్కరించగలిగింది.

దళిత కవులే దళిత స్త్రీల గురించి రాశారు. దీనికి కారణం ఉంది. దళిత స్త్రీలలో చదువుకున్నవారు తక్కువ. అందులో సాహిత్యంపట్ల మరీ ముఖ్యంగా కవిత్వంపట్ల ఆసక్తి, పరిచయం ఉన్న స్త్రీలు మరింత తక్కువగా ఉండటమే ప్రధాన కారణం. ఆ పరంపరలో చల్లి స్వరూపరాణి మంకెనపూవు కవితలో సమాజంలో రెండు రకాల వివక్షను ఎండగట్టారు. 1. ఊరి కుల వివక్ష, 2. వాడ పురుషాధిక్యం ఈ విషయాలను తెలియపరిచిన 'మంకెనపూవు' తొలి దళిత స్త్రీవాద కవిత్వంగా చెప్పవచ్చు.

## 4.3 పీఠికలు

బహుజనపల్లి. సీతారామాచార్యులు రచించిన 'శబ్దరత్నాకము' నిఘంటువునందు పీఠిక అనగా **"1. గ్రంథము మొదట వ్రాసెడు దాని పుట్టుపూర్వోత్తరములు 2. ఉత్కృష్టపీటము"**[71] అను అర్థములు చెప్పబడినవి.

శిఖామణి అనేక గ్రంథములకు పీఠికలను రాశారు. వీటిలో దళిత దృక్పథానికి సంబంధించిన పీఠికలు కూడా ఉన్నాయి.

### 4.3.1 దళిత సంస్కృతి

సమాజం దళితులను పశువుకన్నా నీచాతి నీచంగా చూసింది. ఆ పరంపరలో దళితులు విద్యనభ్యసించి కొంత చైతన్యవంతులైనారు. తమ జీవితాలను తమ సంస్కృతిని కవిత్వరూపంలో తీసుకొని వచ్చారు. కవి తను పీఠికలలో దళితుల పండుగారపచ్చడి, గోంగూరపచ్చడి, బెల్లపు కుడుములు, చిట్టుడుకు నీళ్ళతో కొత్తబువ్వ, పిల్లిపెసర్లు, బొబ్బర్లు, బెల్లంబువ్వ, అలసందలు, కందనకాయలు మొ॥నవి తమజీవితంలో భాగమైన వాటిని ఆవిష్కరించారు. తమ జీవన విధానాన్ని కళ్ళకు కట్టినట్టుగా తెలిపారు.

### 4.3.2 సామాజిక నిరసన చైతన్యం

శిఖామణి తన పీఠికల యందు సమాజంలో జరుగుతున్న వివక్షలను ఖండించారు. వర్గ వివక్ష మనుషులకే కాదు జంతువులకి సైతం అంటగట్టిందీ మనువాదం. అందుకే ఆనాడు మహాకవి జాషువా "ముక్కుమొగమున్న చీకటి ముద్దువోలె' నున్న గబ్బిలాన్ని

ఎంచుకుంటే, ఆధునిక దళితకవి పశువుల్లో వర్ణ వివక్షకు గురైన 'బర్రె'ను దళిత ప్రతీకగా ఎంచుకుంటున్నాడు. **"పశువుల్లో వర్ణ వివక్షకు గురైన 'బర్రె'ను దళిత ప్రతీకగా ఎంచుకుంటున్నాడు. పశువుల్లో ఆవును కామధేనువనీ, ఎద్దును నందికేశుడునీ పూజించిన వాళ్ళే పాలిచ్చి బర్రెను దీని రంగు కారణంగానే దూరం పెట్టారంటాడు."**[72]

ఇంకా 'జన్మభూమి', దేవాలయపు ప్రవేశాలు, నిన్నటి బడిపిల్లల మధ్యాహ్న భోజన పథకంలలో కుల వివక్షను నిరసించాడు.

దళితులపై అత్యాచారాల నిర్మూలనకు చట్టాలు ఉన్నప్పటికీ అవన్నీ దొరల చుట్టాలుగానే ఉపయోగపడుతూ వస్తున్నాయని కవి ఆవేదన చెందుతున్నాడు.

## 3.3.3 ప్రతిఘటనా చైతన్యం

ఎంతోమంది దళిత కవులు తన ప్రతిఘటనా చైతన్యంతో రచనలు చేశారు. వారిలో పద్మారావు, మాష్టార్జీ దళిత గీతాలు ద్వారా ప్రజలను చైతన్యవంతం చేశారు. ఈ దళిత గీతాలలో దళితుల చరిత్ర, కులాల పుట్టుకలోని ఔచిత్యాన్ని ప్రశ్నించటం, కులనిర్మూలన, దళితులపై ఊచకోత, దళితస్త్రీ దుస్థితి, దళిత దళారులు, రాజ్యాధికారం కోసం పోరాటం మొ॥నవి కవి ఆవిష్కరించారు.

దళిత ప్రతీకలైన కాకిని **"కాకులు గుంపులు గుంపులుగా సమర సంకేతాలు పలుకుతున్నాయి"** [73] అని దళితోద్యమాన్ని ప్రతీకాత్మకం చేస్తాడు.

అంతేకాదు మళ్ళీ గణనాయకత్వం వహించే రోజులు దగ్గరపడ్డాయని సూచిస్తాడు. 'అంబేద్కర్ చూపుడువేలుకు ద్రోణుడి తల వేలాడుతుంది' అని తరతరాల దళిత వేదనకు మూల్యం చెల్లిస్తాడు అనే కవి భావన కనపడుతుంది.

## 4.3.4 దళిత ఉద్యమ చైతన్యం

20వ శతాబ్దం చివర దశకంలో దళిత సాహిత్యం విస్తృతంగా రావటం, ఒక ప్రత్యేక స్రవంతిగా రూపొందటంతో దళిత సాహిత్యంలో ఉద్యమ చైతన్యం ప్రవేశించింది. దళిత కవిత్వంలో కులపరంగా జరుగుతున్న అణచివేత, కుల వైరుధ్యాలు, కుల నిర్మూలన

వంటి ప్రధాన దళిత సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు చోటు చేసుకున్నాయి. ఆ పరంపరలో వీరు కూడా ఉద్యమ చైతన్యంతో పీఠికలు రాశారు **"కులం పేరున, మతంపేరు, మనిషికీ, మనిషికీ మధ్య నిర్మించిన అడ్డుగోలు కూల్చాలంటే అంబేద్కరిజం రావాలి"**[74] అంటాడు. అంబేద్కరిజం భావజాలతో ఉద్యమం వచ్చినప్పుడే దళితులకు సామాజిక, ఆర్థిక సమానత్వం వస్తుందని భవిష్యత్ సూచన చేశారు.

## 4.3.5 ఉద్ధరణ చైతన్యం

దళితులు తమ స్థితిగతుల్లో మార్పు కోరుతూ విజ్ఞప్తి చేయటం సాహిత్యంలో కనిపిస్తుంది. అగ్రవర్ణ దృక్పథం నుంచే దళిత జీవిత చిత్రణ జరిగిందని దళిత సాహితీవేత్తలు భావించారు. ఆ పరంపరలోనే వీరు దళితులను ఉద్ధరించాలనే ధోరణితో పీఠికలు రాశారు. **"జాతికే వెన్నెముకయినందుకు సంత్య జాతులను సంఘమునకు ధైర్యము చేసి, మనకు కాని వారిగ జేసుకొనుటకన్నా యాత్మహత్య వేరుండలేదు' అని అంటరానితనం పాపం అన్న గాంధీగారి బోధకంటే ముందుగానే అస్పృశ్యత ఆత్మహత్య సదృశ్యమని చాటిన తెలుగు కవి మంగినపూడి వెంకటశర్మగారు, మము విడిచి స్వరాజ్యమందుట సాధ్యమా అని తిరునగరి వెంకటసూరి ప్రశ్నిస్తే, హరిజనుల మాట మనము అయిదు కోట్లమంట హిందూసంఘం యొక్క ఇంపైనా కొమ్మగా గరిమెళ్ళ వర్ణించాడు"** [75] సమాజంలో అందరితో సమానంగా దళితులను చూస్తారన్న ఆశా దృక్పథాన్ని వ్యక్తపరిచారు.

## పాద సూచికలు

1. శిఖామణి కవిత్వం-తాత్విక సౌందర్యం, పుట: 1
2. చిలక్కొయ్య, వాడే అశుద్ధ మానవుడు, పుట: 29
3. శిఖామణి, గిజిగాడు, అంటు, పుట: 95, 96
4. శిఖామణి, గిజిగాడు, తవ్వకం, పుట: 96, 97
5. నల్లగేటు నందివర్ధనం చెట్టు-సవర్ణాంధ్ర, పుట: 114, 115
6. నల్లగేటు నందివర్ధనం చెట్టు-సవర్ణాంధ్ర, పుట: 115, 116
7. నల్లగేటు నందివర్ధనం చెట్టు-సవర్ణాంధ్ర, పుట: 116, 117
8. నల్లగేటు నందివర్ధనం చెట్టు-సవర్ణాంధ్ర, పుట: 117
9. శిఖామణి, కిర్రుచెప్పుల భాష, రంగుల పీడకల, పుట: 43, 44
10. శిఖామణి, కిర్రుచెప్పుల భాష, రంగుల పీడకల, పుట: 44
11. శిఖామణి, కిర్రుచెప్పుల భాష, నాయన-II, పుట: 89
12. శిఖామణి, కిర్రుచెప్పుల భాష, అవర్ణం, పుట: 35, 36
13. శిఖామణి, కిర్రుచెప్పుల భాష, అవర్ణం, పుట: 37
14. శిఖామణి, కిర్రుచెప్పుల భాష, చెలమ, పుట: 45, 46
15. శిఖామణి, కిర్రుచెప్పుల భాష, ఇనుపపాళీలు మొలుచుకొస్తున్నాయ్ పుట:60, 61
16. శిఖామణి, తవ్వకం, ఒక గాయం పది వసంతాలు, పుట: 86
17. శిఖామణి, తవ్వకం, ఒక గాయం పది వసంతాలు, పుట: 87, 88
18. శిఖామణి, కిర్రుచెప్పుల భాష, ఇనుపపాళీలు మొలుచుకొస్తున్నాయ్ పుట:60, 61
19. నల్లగేటూ నందివర్ధనం నదిని దాటాలి, పుట: 144

20. నల్లగేటూ నందివర్ధనం నదిని దాటాలి, పుట: 145

21. నల్లగేటూ నందివర్ధనం నదిని దాటాలి, పుట: 145

22. నల్లగేటూ నందివర్ధనం నదిని దాటాలి, పుట: 147

23. శిఖామణి, కిర్రుచెప్పుల భాష, పుట: 27

24. శిఖామణి, కిర్రుచెప్పుల భాష, పుట: 27

25. శిఖామణి, కిర్రుచెప్పుల భాష, పుట: 22

26. శిఖామణి, కిర్రుచెప్పుల భాష, పుట: 23

27. శిఖామణి, కిర్రుచెప్పుల భాష, పుట: 23

28. శిఖామణి, కిర్రుచెప్పుల భాష, పుట: 24

29. శిఖామణి, కిర్రుచెప్పుల భాష, ఇనుప పాళీలు మొలుచుకొస్తున్నాయ్, పుట: 59, 60

30. శిఖామణి, కిర్రుచెప్పుల భాష, సహస్రాబ్ది దళిత సూర్యుడు, పుట: 99, 100

31. శిఖామణి, కిర్రుచెప్పుల భాష సహస్రాబ్ది దళిత సూర్యుడు, పుట: 100

32. శిఖామణి, నల్లగేటూ నందివర్ధనం చెట్టు, మా బాప్ప, పుట: 6-7

33. శిఖామణి, నల్లగేటూ నందివర్ధనం చెట్టు, నల్లనిదానను, పుట: 21

34. శిఖామణి, నల్లగేటూ నందివర్ధనం చెట్టు, నల్లనిదానను, పుట: 21, 22

35. శిఖామణి, నల్లగేటూ నందివర్ధనం చెట్టు, నల్లనిదానను, పుట: 22

36. శిఖామణి, నల్లగేటూ నందివర్ధనం చెట్టు, నల్లనిదానను, పుట: 22

37. శిఖామణి, నల్లగేటూ నందివర్ధనం చెట్టు, పద్యసమాధి, పుట: 48

38. శిఖామణి, నల్లగేటూ నందివర్ధనం చెట్టు, పద్యసమాధి, పుట: 49

39. శిఖామణి, నల్లగేటూ నందివర్ధనం చెట్టు, సాహసీ! శాంతయ్యా! పుట: 96

40. శిఖామణి, నల్లగేటూ నందివర్ధనం చెట్టు, యోగులు మరణించరు, పుట: 113

41. శిఖామణి, నల్లగేటూ నందివర్ధనం చెట్టు, ఎందుకొస్తావే జ్ఞాపకానికి మీరా, పుట: 128

42. శిఖామణి, నల్లగేటూ నందివర్ధనం చెట్టు, ఎందుకొస్తావే జ్ఞాపకానికి మీరా, పుట: 129

43. శిఖామణి, నల్లగేటూ నందివర్ధనం చెట్టు, మా బాప్ప, పుట: 4

44. శిఖామణి, నల్లగేటూ నందివర్ధనం చెట్టు, మా బాప్ప, పుట: 5

45. శిఖామణి, నల్లగేటూ నందివర్ధనం చెట్టు, మా బాప్ప, పుట: 6

46. శిఖామణి, నల్లగేటూ నందివర్ధనం చెట్టు, మా బాప్ప, పుట: 7

47. తెగపడిన చోట తెగబడటమే, మణికట్టుమీద పచ్చబొట్టు, పుట: 49

48. తెగపడిన చోట తెగబడటమే, మణికట్టుమీద పచ్చబొట్టు, పుట: 50

49. శిఖామణి, నల్లగేటూ నందివర్ధనం చెట్టు, తవ్వకం, పుట: 136

50. శిఖామణి, నల్లగేటూ నందివర్ధనం చెట్టు, అక్షరం ప్రాణవాయువు, పుట: 30

51. శిఖామణి, నల్లగేటూ నందివర్ధనం చెట్టు, యానాం సరస్వతి, పుట: 30

52. శిఖామణి, నల్లగేటూ నందివర్ధనం చెట్టు, తహసీ! తహసీ!! పుట: 18

53. శిఖామణి, కిర్రుచెప్పుల భాష, క్షమాపణ, పుట: 79

34. శిఖామణి, కిర్రుచెప్పుల భాష పీఠిక, శివసాగర్, తుమ్మపువ్వు సౌందర్యం, పుట: 3

55. శిఖామణి, కిర్రుచెప్పుల భాష, క్షమాపణ, పుట: 80

56. శిఖామణి, కిర్రుచెప్పుల భాష, క్షమాపణ, పుట: 81-82

57. డా॥ఎస్వీ సత్యనారాయణ, దళితవాద వివాదాలు, పుట: 7

58. శిఖామణి కవిత్వం, తాత్విక సౌందర్యం, సౌభాగ్య, పుట: 120

59. శిఖామణి, దళిత సాహిత్య తత్వం, పుట: VII

60. శిఖామణి, సమాంతర పుట: 53

61. శిఖామణి, సమాంతర పుట: 54

62. శిఖామణి, దళిత సాహిత్య తత్వం, పుట: 16

63. శిఖామణి, దళిత సాహిత్య తత్వం, పుట: 18

64. శిఖామణి, దళిత సాహిత్య తత్వం, పుట: 20, 21

65. శిఖామణి, దళిత సాహిత్య తత్వం, పుట: 23

66. శిఖామణి, దళిత సాహిత్య తత్వం, పుట: 25

67. శిఖామణి, సమాంతర, పుట: 70

68. శిఖామణి, సమాంతర, పుట: 72

69. శిఖామణి, సమాంతర, పుట: 76

70. శిఖామణి, సమాంతర, పుట: 112

71. సీతారామశాస్త్రి బహుజనపల్లి, శబ్దరత్నాకరం, పుట: 587

72. శిఖామణి, శిఖామణి పీఠికలు, పుట: 20

73. శిఖామణి, శిఖామణి పీఠికలు, పుట: X

74. ప్రతాప్‌కుమార్. నేతల, అన్నంగిన్నె, పుట: 13

75. శిఖామణి, దళిత కవిత్వం-2, పేజీ: xxiv

## 5.1. డా. సి.నారాయణరెడ్డి

**శి**ఖామణీ! గబగబా నీ పుస్తకంలోని పుటలు తిప్పేస్తుంటే అనుక్షణం అక్షరాలు, అద్భుతమైన భావాలు అడ్డు తగిలాయి. 'కొయ్యకాలు' కవిత మొత్తం కొత్త అభివ్యక్తికి కొలమానం... ప్రవహిస్తున్న పాదాలు వంటి కవితలు నువ్వు జీవితాన్ని ఎంత నిశితంగా చూశావో, ఎంత ఆర్ద్రంగా పలికావో పట్టి యిస్తాయి. కొందరు కొత్త కవుల్లోలేని స్పష్టత, నిర్దిష్టత నీ కవిత్వంలో వుంది. గుండెను ఊపేసి ఓక్షణం ఆపేసి మళ్ళీ నడిపించే పంక్తులున్నాయి మువ్వల చేతికర్రనిండా.

## 5.2 ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం

చిలక్కొయ్య నా వర్తమానానికి అస్తిత్వాన్ని కలిగించిన అవిచ్ఛిన్నతను జ్ఞాపకం చేస్తోంది. చిలక్కొయ్య మీద పిచ్చుకల జంట ముచ్చట్లాడుకుంటున్నప్పుడెల్లా నాకు ముండకోపనిషత్తులోని తృతీయ ముండకం తలుపులో నిండుతుంది. చిలక్కొయ్యకు ఇంత గొప్పగా ప్రతీకాత్మక ప్రాణప్రతిష్ట చేసిన తెలుగు కవి మరొకడు లేడు. పచ్చికుండలా పగిలిపోయే కుటుంబవ్యవస్థకు అనురాగ సూక్తం చిలక్కొయ్య.

## 5.3 చేకూరి రామారావు

**"ఈ కవికి తన అనుభవాలను కవిత్వీకరించే నేర్పుంది. ఏదీ Flat గా చెప్పడు. చుట్టూ వున్న ప్రకృతిని భావించిన పద్ధతి మనల్ని ఆకర్షిస్తుంది. అది ఒక్కోసారి సరికొత్త పోలికల ద్వారానూ, ఇంకోసారి దృశ్య చిత్రీకరణ ద్వారానూ జరిగింది. ఏ పద్ధతి అవలంభించినా కొత్తదనపు హాయి (ఇంగ్లీషులో Refreshingly fresh అంటారే అది) అన్నిట్లోనూ మనల్ని తాకుతుంది."**[1]

## 5.4 ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య

**"ఒక మహాకావ్యం చదివి ముగించిన అనుభూతి కలిగించే పాదాలు. కరుణ రస నిష్పత్తికి దోహదపడుతున్న పాదాలివి. తనను చితిమీద పూర్తిగా కాల్చడానికి అది**

**తోడ్పడుతుందన్న వక్రోక్తి మహాకవులకు మాత్రమే సాధ్యపడే సృష్టి. ఈ కవిత మీద (కొయ్యకాలు) శిల్పం, అలంకారం, ధ్వని, వక్రోక్తి, అభివ్యక్తుల గురించి ఇంకా ఎంతైనా రాయవచ్చు (ఈ లఘు గ్రంథం అందుకు అనుమతించడం లేదు). ఈ కవిత కవితగా బ్రతకడానికి పనికి వస్తున్నవి ఇందులోని కవిత్వ విలువలు."**[2]

## 5.5 ఆచార్య కొలకలూరి ఇనాక్

శిఖామణి అనుభూతి తాత్వికుడు. అంతరంగ సుందరాభివ్యక్తికాత్మతాను. వేదన ప్రస్ఫుటించే గొంతు శిఖామణి సొంతం. చిన్న విషయం అందంగా మలచటం అద్భుతంగా తెలిసిన కవి.

## 5.6 డా. కత్తిపద్మారావు

**"జీవితం పొరల్లో దాగున్న దుఃఖనిధుల్ని నీవు మోసుకొచ్చిన తీరు నన్ను సంచలితుణ్ణి చేస్తుంది."**[3]

## 5.7 ఎండ్లూరి సుధాకర్

**"కవి శిఖామణీ! కవన వన ఆమనీ! నల్లగేటూ నందివర్ధనం చెట్టూ అక్షరమక్షరంలో అనుభూతుల తేనెతెట్టు. లోపల ఒక్కో బొట్టు కురిసింది. మనసు మురిసింది. వాక్యాల్లో వరద గుడి విరిసింది. ఇలాగే పది కాలాలపాటు పచ్చగా రాస్తూ ఉండాలని ఆశిస్తున్నాను ఆకాంక్షిస్తున్నాను. అభినందనలతో"...**[4] (ఉత్తరం)

## 5.8 డా. కడియల రామమోహనరాయ్

**"జీవనదృశ్యాలను కవితలుగా రూపొందించడంలో శిఖామణి నేర్పరి.... స్వంత గొంతుక, ఊహాశాలిత్వమూ శిఖామణిని ఉత్తమకవిగా గుర్తించేట్లు చేస్తాయి."**[5]

## 5.9 డా. నాగభైరవ కోటేశ్వరరావు

మైడియర్ శిఖామణీ... గాలిని గంధర్వం చెయ్యగల అభివ్యక్తి నీది. నీవు అనన్వయాలంకారంలాంటి కవివి. కవివే కాదు కవుల నిర్మించే సృజనకారుడివి.

## 5.10 ఆర్.ఎస్. సుదర్శనం

**"గాలిఓడ' కవి అవచేతనలోని కలవరపాటునీ, భావనాలోకాల్లో విహరించే సమాధి భగ్నం కావడాన్నీ అక్షరబద్ధం చేసిన ఉత్తమ రచన. సగం మెలుకువ, సగం నిద్రా కలిసిన ఈ మనస్థితి, అందులోని అజ్ఞాత భయాల్నీ ఆందోళనల్నీ వ్యక్తంచేసిన భావచిత్రాలు ఒక్కొక్కటీ ఒక్క వజ్రం. ఈ రచన శిఖామణిని ఎవరెస్టు శిఖరంమీద నిలబెడుతుంది... మాటల్లో చెప్పలేని అనుభూతిని బొమ్మగీచి చెప్పగలిగిన ఇలాంటి భావచిత్రాలు 'ఇమేజిస్ట్' కవితకు పరాకాష్ట."**[6]

## 5.11 డా. ఆవంత్స సోమసుందర్

మీ కావ్యం – మువ్వల చేతికర్ర – ఇంత అపూర్వమూ ఓజస్వంతమూ అగు ప్రతీకను నేనింతవరకు తెలుగు సాహిత్యంలో చూడలేదు. గోదావరి చనుబాలు మరో మంచి కవిని అందించినందుకు ప్రాంతీయతతో కాదు, పారమ్యతతో ఆనందిస్తూ అతలాకుతలమై పోతున్నాను. మీ కవితా హృదయం అచిరకాలంలోనే కెరటమై లేవాలని ఆశిస్తున్నాను.

## 5.12 డా. అద్దేపల్లి రామమోహనరావు

Thick Poetry (చిక్కని కవిత్వం) మీ కవితల్నిండా పరుచుకుని వుంది. ప్రకృతిలో జీవనరహస్యాల్ని అన్వేషిస్తూ, రూపకాలతో కలిపి కవిత్వంలో నిండుగా రూపొందించి మీ దారి మీదిగా ఒక ముద్ర వేసుకున్నారు. ముఖ్యంగా 'ఆర్ద్రత' మీ కవితల్లో నిండుగా ఉంది.

## 5.13 ఇస్మాయిల్

**"కవికి జీవితమే ముడిసరుకు. అంతరాంతరాల్లోకి తవ్వుకువెళ్ళి భయంకరమైన సత్యాలను కనుక్కోవటం, నువ్వు నువ్వు కానంతగా నీ తాదాత్మ్యాన్ని కోల్పోవటం, నీ పునాదుల్ని వెలికి తీయటానికి నువు పడే బాధా, వేదనా – నీ సర్వస్వమూ, అంటే నీ పంచేంద్రియాల్నీ, నీ మనస్సునీ ఎరువుగా వేస్తేకాని కవిత్వ వృక్షం మొలవదు... కవిత్వం కవికి 'కొయ్యకాలు' లాంటిది. తను కోల్పోయిన దేనికో Substitute. తన్ను తలకిందులుగా పాతుకుంటేనే కాని అది చిగిర్చదు."** [7]

## 5.14 వేగుంట మోహనప్రసాద్

చక్కగా చెప్తే కవిత్వం అనే రోజులు పోయాయి. తిక్కగా చెప్తే కవిత్వం అని నేననేమాటకి Conceit లాంటి మంచి తెలుగుమాట నాకు తెలీదు. ఇది ఒట్టి విలక్షణత కాదు. ఆంగ్ల విమర్శలో unified Sensibility అనే మాటకు ఎవరైనా చక్కని అనువాదం చేయటమే కాదు, ఆ భావానికి అనునాదం చేసిన కవి శిఖామణి.

## 5.15 శివసాగర్

కిర్రుచెప్పుల భాష శిఖామణి కవితా మహాప్రస్థానంలో ఒక చౌరస్తా. ఇది అతని ఆత్మానుభూతి కవిత్వం దళిత కవిత్వం కలుసుకున్న కూడలి. అంతర్ముఖత్వంలో నుండి సమిష్టిలోకి తొంగిచూసే శిఖామణి కవిత్వ పరిణామానికి 'కిర్రుచెప్పులభాష' అద్దం పడుతుంది.

## 5.16 ఆచార్య సి.సుబ్బారావు

ఒకరకంగా శిఖామణి Notes to himself రాసుకున్నాడనిపిస్తోంది. ఈ నోట్సుకు సార్వజనీనత వచ్చింది. అంటే దానికి కావ్యాత్మను కవి యొక్క అంతరాత్మలో ఒకే రకమయిన ఆర్ద్రత ఒకే Wave Length మీద ఉండటమే. The person of the poet and the persona of the poet is one and the same. ఒక రకంగా ఈయన ఎన్నుకున్న పద్ధతి కత్తిమీద సాములాంటిది.

## 5.17 డా. సంజీవ్‌దేవ్

**"శిఖామణి రచించిన కవితా సంపుటి మువ్వలచేతికర్ర గొప్ప రచన. ఆయన కవితలు సామాన్య మానవుడి బాధలను వ్యథలను తప్పించుకు తిరగవు. ఆ బాధాతత్వాన్ని ఈ కవి ప్రశంసించదు. అదే మానవుడి జీవన పరమార్థమని కీర్తించదు. అది అంతరించి అతి సామాన్యుడు కూడా ఆనందజీవనాన్ని జీవించాలని ఆశిస్తాడు."** [8]

## 5.18 ఆచార్య తుమ్మల వేణుగోపాలరావు

గోడమీద సూర్యుడు 'ఉదయం' లో చదవగానే ఎవరీ 'శిఖామణి' అనే మీమాంస వచ్చింది. మువ్వలచేతికర్రలో పరిచయాలతో పరిచయమైన శిఖామణి 'కొయ్యకాలు'లో ఏ

అడవో ఈ చెట్టును పోగొట్టుకుంది. అనేంతవరకూ చదివి కన్నీళ్ళతో ఆగిపోయా! కృష్ణకి చదివి వినిపిస్తే విస్తుపోయి బాగుంది అని తాదాత్మ్యత చూపింది.

## 5.19 చలసాని ప్రసాద్

ప్రియమైన శిఖామణీ!... శాంతయ్య మీద నీ పద్యం చదివాను. చాలా బాగుంది. అంతకుముందు బాలయోగి మీద రాసింది కూడా నన్ను కదిలించింది. ఏనాటికయినా మానవులు మృత్యువుని జయించాలని మహాకవి శ్రీశ్రీ ఊహ. అదే వాస్తవం అనుకుందాం. దాన్ని నిజం చేద్దాం.

## 5.20 బాలబంధు బి.వి.నరసింహారావు

నాది అగ్రహం కాదు, అమ్మప్రేమ, నీ కవిత్వం నాలో (మాలో) వేసినముద్ర బహుఘనమైనది. చెరగనిది.

## 5.21 ఇంద్రగంటి శ్రీకాంతశర్మ

మీ కవిత్వంలో మాటలకు ఒదగనన్ని గొప్ప అనుభవాలు కొన్ని. సాదాసీదా నినాదాలను కాస్త అరచాటుగా పాడినవి కొన్ని. ఒక బాల తుపానుకి అక్షరాల చొక్కా తొడిగి వదిలినట్టుంది చలంగారన్నట్టు 'బాధపడాలి, నలగాలి జీవిత రథ చక్రాల కింద. కలంలోంచి నెత్తురు ఒలకాలంటే అక్షరాలా! పాండిత్యమా! కాదు, సంవత్సరాల మూగవేదన!" అలాంటి నెత్తుటి జీర అంటిన అక్షరాల సంచలనం మీ కవిత్వంలో ఉంది.

## 5.22 అత్తలూరి నరసింహారావు

డియర్ శిఖామణిగారూ! మీ అంజలి అబ్బ! నిజంగా ఎంత బాగుందో! అభినందనలోచ్...! (ఉత్తరం)

## 5.23 ఆచార్య జయధీర్ తిరుమలరావు

**"కొంత Freshness, కొంత original భావన రోటిన్ కన్నా భిన్నంగా ఉంచింది. ఆ రకంగా ఈ మధ్య వచ్చే చాలామంది కవిత్వం కన్నా మీ గొంతు బాగుంది."**[9]

## 5.24 డా. తల్లావఝ్ఘుల పతంజలి శాస్త్రి

ఇప్పుడు కవిత్వం (పేరిట) రాస్తున్న వారిలో మిగిలేది మీలాంటి ఒకరిద్దరే! మీ అభివ్యక్తిలో, ఎన్నుకునే వస్తువులో ప్రత్యేకత, కొత్తదనం చాలా విలక్షణంగా కనిపిస్తున్నాయి. జీవితానుభవం పెరిగే కొద్దీ మీ కవిత్వంలో చింతన శీలత, ఒకరకమైన తాత్త్విక దృక్పథం జీవలక్షణాలై మీకు గొప్ప సంతృప్తిని కలగజేస్తాయి.

## 5.25 డా. సీతారాం

కవిత్వం అంటే సామాజిక వాస్తవంపై కవి ప్రకటించే ధర్మాగ్రహం కాదా!...ఇది తెలుసుకున్న శిఖామణి తెగించి 'దిసమొల' చూపించాడు. పైగా వీరేంద్రనాథ్ చక్రవర్తి బాధ రాజుగారికి గుడ్డలు లేవని సత్యం చెప్పించడం గురించి, శిఖామణి వ్యథ ఒక మామూలు మనిషి మనుషుల మధ్య బట్టల్లేకుండా తిరుగుతున్నాడని. శిఖామణి ముందు వీరేంద్ర కుప్పకూలిపోయాడు.

## 5.26 వడలి మందేశ్వరరావు

**"Sikhamani is perpetually on the look out for new poetic idiom and expression. He has been poet committed to investigating human passions and experience at the emotional Level. In his poetry to come he will perhaps continue to be a pragmatic explorer of the human mind though one wishes he were more philosophic too"** [10]

## 5.27 జి.లక్ష్మీనరసయ్య

ఒక విషయానికీ లేక వస్తువుకీ సంబంధించిన details ని వర్ణిస్తూ శిఖామణి తన భావాన్ని కవిత్వం చేసిన కవితలు వున్నాయి. చిలక్కొయ్య అందుకు మంచి ఉదాహరణ. ఎత్తుకున్న విషయాన్ని వర్ణించుకుంటూ, తగిన సమాచారాన్ని జతచేస్తూ ఎక్కడో ఒకచోట తన భావానికి సంబంధించిన క్లూ ఇస్తూ కవితను నిర్మిస్తాడు శిఖామణి. నిర్మాణపరంగా ఈ తరహా కవిత్వాన్ని SEAMUS HEANEY, TED HUGHS రాస్తున్నారు.

## 5.28 డా. అఫ్సర్

ఇవాళే నీ 'కిర్రుచెప్పుల భాష' ముగించాను. వ్యక్తిత్వం బలంగా వినిపించే 'భాష' చెప్పదల్చుకుంటే ఇందులో చాలా కొత్త విషయాలున్నాయి. ముఖ్యంగా ఈ తరం కవి ఆత్మశోధనని బాగా పట్టుకున్నావు. ఎక్కడా సెన్సిబిలిటీని కోల్పోకుండా, ఎక్కడా అరమరికలు లేకుండా, సంశయాత్ముడి వైన సందర్భాలను కూడా భేషజాల్లేకుండా చెప్పావు. బహుశా ఇది నీ 'భాష'లో Additional element. ఇక రెండోది ఆత్మీయత. ఒక వ్యక్తిగా నువ్వు ప్రతీ కవితలోనూ కనిపిస్తావు. నీ ఆత్మీయతా, అనుబంధం నిజాయితీతో పలికిస్తావు. Human Relations లోపలికి వెళ్ళివస్తావు– నీ కవిత్వంలో నువ్వున్నావు.

## 5.29 డా. ప్రసాదమూర్తి

తనలో ఇన్ని బాధల చెట్లు, ఇన్ని అడుగులేని 'బావులు' ఇన్ని మహారణ్యాలు, ఇన్ని మహాసముద్రాలు వున్ననాడు మనిషెలా అవుతాడు? అయితే గియితే కవి కావాలి. అవును నువ్వు నూటికి నూరుపాళ్ళు కవివి. ఈ ప్రపంచంలో ఎవరికీ ఎన్నటికీ అర్థంకాని పదార్థం కవి. మనుషుల కోసం క్రీస్తు శిలువ మోస్తాడు. మనుషులకోసం కవి తనను తాను తలక్రిందులుగా పాతుకుంటాడు. ఓహ్! నేస్తం! నువ్వెంత అద్భుతం!

## 5.30 డా. పి.వి.రమణ

శిఖామణి సత్యాన్వేషి. కులవర్ణ దుర్మార్గ వివక్షతలో కూడా మానవ అనుబంధాల సమన్వయ సారాన్నే అన్వేషించాడు. శిఖామణిలో జిజ్ఞాసువు కవిని శాసిస్తాడు. కౌటిల్యం అంటని అంతర్మథనం ఒక్కోసారి మనశ్శాంతిని దూరం చేసినా స్వతస్సిద్ధంగా అలవడిన ప్రాక్టికల్ సత్యాసత్య వివేకం పరిపక్వ రూపమెత్తి సుతిమెత్తని శిఖామణిని ఆదుకొంటుంది.

## 5.31 దాట్ల దేవదానం రాజు

శిఖామణి కాలిక స్పృహ గల కవి. నిబద్ధతతో భావావేశాల్ని కవిత్వీకరించగలడు. గొప్ప ఆర్ద్ర చిత్త భావుకుడు. అనుభూతి సాంద్రతతో తళుక్కుమనే మెరుపుల్ని ఆలింగనం చేసుకునేంత పారవశ్యాన్ని కలిగించగలడు. కోల్పోయిన దాంట్లోంచి లోతైన తాత్వికతను

పిండి అందివ్వగలడు. ఎవరికీ వినిపించని వేదనా మయ శబ్దాల్ని తను మాత్రమే వినగలడు.

## 5.32 కలేకూరి ప్రసాద్

**"బుగ్గలమీదికి జారిన నులివెచ్చని కన్నీటి బొట్టును మరచిపోయి అమ్మకొంగు పట్టుకుని పుచ్చపువ్వులు జాలువారినట్లు కేరింతలు కొట్టే పసిపాపల్లా అతని అక్షరాలు మనల్ని వాటేసుకుంటాయి. ఆయన కవిత్వంలోనూ వచనంలోనూ ఒక్కటే బాధాగ్ని అంతస్సూత్రంగా పనిచేయడాన్ని మనం గమనిస్తాం."**[11]

## 5.33 మద్దూరి నగేష్‌బాబు

శిఖామణి నేరుగా పాఠకుణ్ణికాదు పాఠకుడి లోపల ఉన్న మనిషిని ఐడెంటిఫై చేసి, అతనితో మాట్లాడే ప్రతీకాత్మక సంభాషణే కవిత్వమనేసాడు. తుపాకి, అరణ్యము, రక్తము, సూర్యుడు ఇత్యాది అరిగిపోయిన పదాలతో డయేరియా పేషెంటు అయిన తెలుగు కవిత్వపు వాడిని పట్టుకుని మువ్వలచేతికర్ర ప్రిస్క్రిప్షన్ రాసిపారేసాడు. అంతే రోగం కట్టుకుంది.

## 5.34 ఖాజా

శిఖామణి నిశితంగా పరిశీలించందే ఏ కవితా వస్తువు జోలికీ పోడు. అట్లాగే తను తీసుకున్న ఏ వస్తువునీ సారమంతా పిండకుండా వదిలిపెట్టడు. చిలక్కొయ్య సంపుటిలో తీసుకున్న వస్తువులు ఎంత వైవిధ్యభరితమైనవో కవితాభివ్యక్తి అంతకంటే విలక్షణమైనది.

## 5.35 వరవరరావు

శిఖామణి కవితలు (మువ్వల చేతికర్ర) అందాయి. శిఖామణిలో మంచి కవిత్వం వుంది. మంచి Potentiality వుంది. పోతే ఆయన కవిత్వాన్ని direction, economy కావాలి.

## 5.36 పడాల జోగారావు

కవిత్వం కళ్ళవెంబడి నీళ్ళు తెప్పించడం నాకు కొత్తకాదు గానీ, 'అమ్మ' కవిత చదువుతున్నప్పుడు కళ్ళేకాదు, మొత్తం శరీరమే కరిగి అస్తిత్వాన్ని కోల్పోయిన అనుభూతి... మళ్ళా మళ్ళా చదివాను మీ 'అమ్మ'ను.

## 5.37 జి.ఆర్.కుర్మే

'వర్ణాంధ్ర అను ఒక రాజకీయ పద్యం' అచ్చుమైన దళిత కవిత. చాలా బాగుంది. హిందూ సంప్రదాయాల్నీ, అందులోని మౌఢ్యాన్ని విశ్లేషించి అందరికళ్ళూ తెరిపించారు.

## 5.38 డా. ఉదారి నారాయణ

**"మనం మనలాగే జీవిద్దాం' ఆద్యంతం చదివి చాలా సంఘర్షణకు గురి అయ్యాను. ఆధునిక జీవన సంఘర్షణని అద్భుతంగా చిత్రీకరించారు. ఒక కవి కవిత ఎందరో కవులను అతలాకుతలం చేయాలంటారు. ఆ కవిత సృష్టించిన అలజడి మరో కవి మానసికంగా కవితా లోకానికి వెళ్ళి కవిత్వం రాయడానికి ఉన్ముఖుణ్ణి చేయాలంటారు. అది మీ కవిత సాధించిందనుకుంటాను."**[12]

## 5.39 గుర్రం శ్రీరాములు

మీ 'కిర్రుచెప్పులభాష' నన్ను నన్నుగా ఉండనీయటం లేదు. ముఖ్యంగా 'ఇనుపపాళీలు' నన్ను బాగా కదిలించాయి. Powerful Metophers వాడారు. ఒకటికి రెండుసార్లు Poetry చదివాక మీ భాషకు నేను అరెస్ట్ అయిపోయాను... మా ఊరి మధ్య రచ్చబండ దగ్గర ఒక తెల్లకాగితం మీద 'ఇనుపపాళీలు' రాసి అక్కడ పెట్టా, పిల్లలంతా చాలాసేపు దాన్ని డిస్కస్ చేశారన్న విషయం తెలిసిమురిసి పోయా!"

## 5.40 వి.వి.సుబ్బరాజు(రతన్‌బాబు)

మీ కవిత 'వొక వీడ్కోలు పద్యం' వొడుపుగా స్నేహ మాధుర్యాన్ని మాకందించింది. మీలో ఎన్ని అచ్చపు స్నేహ జలధారలు నిక్షిప్తం అయివున్నాయో! అక్షరం, అక్షరం అమృతంలా వుంది.

## 5.41 డా. చప్ప సూర్యనారాయణ

1985 తర్వాత శిఖామణి, అఫ్సర్, సిధారెడ్డి, శివశంకర్, సీతారాం, త్రిపురనేని శ్రీనివాస్, కందుకూరి శ్రీరాములు లాంటి కవులు వెలుగులోకి వచ్చారు. ఈ దశకంలో శిఖామణి 'మువ్వల చేతికర్ర' మంచి కావ్యంగా పేరు తెచ్చుకుంది.

## 5.42 సిహెచ్.రాం

ఎవరు తండ్రీ నీవు! మా పసిపాదాల ముందు తూనీగవై వాలి మమ్మల్ని పరుగులు తీయిస్తున్నది. పిడికెడంత గుండెను కరచాలనంతో విస్తరించి ఓ విషాద చరణాన్ని నా అరచేతిలో వదలి నువ్వు వెతుకుతున్నది. నిన్ను కని నాల్గు మూలలా నల్లని బొట్లై నడిచిపోయిన అమ్మ చిరునామానేనా?

## 5.43 డా. పిల్లి శాంసన్

శిఖామణి దళితాభ్యుదయాన్ని వినిపిస్తున్న పదునైన కవి. నిర్భయంగా నిర్మొహ మాటంగా దళితుల వేదనలను కవిత్వీకరించి దళిత జెండా ఎగురవేస్తున్న అభ్యుదయగామి.

## 5.44 ఆప్త చైతన్య

దారి ప్రక్కన పూచిన గరిక చివర అతడో తుషారబిందువై ఉదయించాడు. ఆ బిందువు హృదయం కడలి అంతరంగమై లోకంలోని శోకాన్ని నిండా నింపుకుంది. అందులో ఎన్నెన్ని బాధాతరంగాలో!... ఆ బిందువులోకి ఒక్కసారి తొంగిచూడండి. హోరుగాలి వినిపిస్తుంది. బాధలచెట్టు మీద మువ్వల చేతికర్ర కనిపిస్తుంది. నీకు నేను నాకు నీవు ఒకరికోసం ఒకరుంటాం. కానీ అతనికి నువ్వు నేనూగాక వేరే లోకముంది. అక్కడికి మనం వెళ్ళటం చాలా కష్టం. అదొక అద్భుత ప్రపంచం.

## 5.45 డా. ఎల్.కె.సుధాకర్

శిఖామణి కవిత్వం శీతాకాలపు తొలి సంజె గోదారి నీటిలా నులివెచ్చగా ఉంటుంది. ఎండాకాలం మిట్ట మధ్యాహ్నం పల్లెటూరి చేలగట్ల మీద తాటి ముంజెలు తిన్నట్టు, వేసవి మధ్యాహ్నం పట్నంలో పుచ్చకాయల విందులా వుంటుంది. కవిత్వాన్ని చంటిపాపను చేసి చంకనేసుకుని బతుకు తిరునాళ్లలో హాయిగా కలియతిరిగే పల్లెటూరి నిరాడంబరుడు ఈ కవి.

## పాదసూచికలు

1. నల్లగేటూ నందివర్ధనం చెట్టు, శిఖామణి, పుట: 148, 149
2. నల్లగేటూ నందివర్ధనం చెట్టు, శిఖామణి, పుట: 150
3. నల్లగేటూ నందివర్ధనం చెట్టు, శిఖామణి, పుట: 154
4. నల్లగేటూ నందివర్ధనం చెట్టు, శిఖామణి, పుట: 155
5. నల్లగేటూ నందివర్ధనం చెట్టు, శిఖామణి, పుట: 151
6. నల్లగేటూ నందివర్ధనం చెట్టు, శిఖామణి, పుట: 149
7. నల్లగేటూ నందివర్ధనం చెట్టు, శిఖామణి, పుట: 152
8. నల్లగేటూ నందివర్ధనం చెట్టు, శిఖామణి, పుట: 152
9. నల్లగేటూ నందివర్ధనం చెట్టు, శిఖామణి, పుట: 149, 150
10. నల్లగేటూ నందివర్ధనం చెట్టు, శిఖామణి, పుట: 151
11. నల్లగేటూ నందివర్ధనం చెట్టు, శిఖామణి, పుట: 153
12. నల్లగేటూ నందివర్ధనం చెట్టు, శిఖామణి, పుట: 154

# ఉపసంహారం

తెలుగు సాహిత్యంలో 1980 దశకం తర్వాత దళిత సాహిత్యం ఉధృత స్థాయిలో వచ్చింది. అనేక ప్రక్రియల్లో సాహిత్యం వెలువడింది. దళిత సాహిత్యం మూడు ప్రధాన స్రవంతిలో కొనసాగింది. సంప్రదాయ సాహిత్యంలో వర్ణించిన వర్ణవ్యవస్థను ఖండించటం, రెండవది దానికి ప్రత్యామ్నాయాన్ని సూచించటం మూడవది అంతర్గత సంఘర్షణలను సమన్వయ పరుచుకోవడం. అనేకమంది దళిత కవులు, రచయితలు దళిత సాహిత్యం కోసం కృషి చేశారు. వారిలో ముఖ్యంగా గుర్రం జాషువా, కుసుమ ధర్మన్న కవి, బోయి భీమన్న, కొలకలూరి ఇనాక్, కత్తి పద్మారావు, శిఖామణి, ఎండ్లూరి సుధాకర్, మద్దూరి నగేష్‌బాబు, కలేకూరి ప్రసాద్, పైడి తెరేష్‌బాబు, కళ్యాణరావు, నాగప్పగారి సుందరరాజు మొదలైనవారు ఉన్నారు. వీరు కవిత్వం ద్వారా, వ్యాసాల ద్వారా, నవలల ద్వారా తమ ఆవేదనలను, ఆర్తిని తెలియజేసారు.

ఆ పరంపరలో దళితుడుగా జన్మించి సమాజంలో అనేక వివక్షలను ఎదుర్కొంటూ జీవించిన శిఖామణి తమ బాధలను తన రచనలలో ప్రదర్శింపజేశారు. వీరి రచనలో ప్రధానంగా ఆత్మాభిమానాన్ని ప్రకటించుకోవడం, వర్ణాధిపత్యాన్ని ప్రశ్నించటం, ఆత్మగౌరవాన్ని కాపాడుకోవటం, సామాజిక అవమానాల్ని నిరసించటం, దళిత కళాతత్త్వం, దళిత సంస్కృతి, దళిత సాంస్కృతిక చిహ్నం, దళిత స్త్రీ చైతన్యం, దళితీకరణం, పశ్చాత్తాప నివేదన. ఇంకా దళిత దీర్ఘ కవితలు, దళితుల భాష, దళిత కథ, దళిత పాట, దళిత సంస్కృతి, ఉద్యమ చైతన్యం, ప్రతిఘటనా చైతన్యం, దళిత సాహిత్య వైతాళికుడిగా కుసుమ ధర్మన్న కవి, తొలి దళిత స్త్రీవాద కవిత్వంగా మంకెన పువ్వు మొదలైన విషయాలు ఉన్నాయి. ఇవన్నీ నా పరిశోధనాంశాలలో తేలిన విషయాలు

శిఖామణి రాసిన కవిత్వం, విమర్శ వ్యాసాలు, పీఠికలను తీసుకొని ఈ పరిశోధన చేయటం జరిగింది.

శిఖామణి సాహిత్యం–దళిత దృక్పథం అధ్యయనం చేసిన తర్వాత చాలా విస్తృతమైన పరిధి కనిపించింది. వీరి సాహిత్యంలోని ఒక్కో రచనను ప్రత్యేకంగా పరిశోధన చేయవలసిన అవసరం ఉంది.

# ఉపయుక్త గ్రంథ సూచి


1. అచ్యుతశర్మ, సి.యస్వీ, 1989, తెలుగులో ప్రతివిమర్శ–పరామర్శ (సిద్ధాంత వ్యాసం), హైదరాబాద్, హైదరాబాద్ విశ్వవిద్యాలయం.
2. అంజయ్య. గూడ, 1999, ఊరు మనదిరా!, హైదరాబాద్: హేమ సాహితీ ప్రచురణలు.
3. ఇనాక్. కొలకలూరి, 1996, ఆధునిక సాహిత్య విమర్శ సూత్రం, గుంటూరు; మారుతీ బుక్‌హౌస్.
4. కృపాచారి. గుజ్జర్లమూరి, 1988, తెలుగు సాహిత్యానికి క్రైస్తవుల సేవ, గుంటూరు.
5. కృష్ణమూర్తి. భద్రిరాజు, 2000, భాష–సమాజం, హైదరాబాద్: నీల్‌కమల్ పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్.
6. కేశవకుమార్, సత్యనారాయణ.కె (సం), 1995, దళిత మేనిఫెస్టో, హైదరాబాద్: విస్ఫోటన, సెంట్రల్ యూనివర్సిటీ.
7. చిన్నారావు. యాగాటి, 2007, దళిత ఉద్యమ చరిత్ర, హైదరాబాద్: హైదరాబాద్ బుక్‌ట్రస్ట్.
8. చంద్రశేఖర్‌రెడ్డి. రాచపాళెం, లక్ష్మీనారాయణ.కె (సంపాదకులు) 2003, అనంతపురం: 1980 తర్వాత తెలుగు దళిత నవల.
9. జాషువా. గుర్రం, 1994, గబ్బిలం, విజయవాడ: జాషువా ఫౌండేషన్.
10. తారకం. బొజ్జా, 1983, నది పుట్టిన గొంతుక, హైదరాబాద్: జనపద ప్రచురణలు.
11. తిరుమలరావు, జయధీర్, అశోక్‌కుమార్, కె.పి.(సం) 1993, దళిత గీతాలు, హైదరాబాద్, సాహితీ సర్కిల్.

12. తెరేష్‌బాబు. పైడి, 1996, అల్పపీడనం, హైదరాబాద్: నవ్య ప్రింటర్స్.

13. దేవపుత్ర. చిలుకూరి, 1998, పంచమం, హైదరాబాద్: లైఫ్‌లైన్ కమ్యూనికేషన్స్.

14. పద్మారావు. కత్తి, 1981, కులం పునాదులు, నెల్లూరు: నెల్లూరు జిల్లా హేతువాద సంఘ ప్రచురణ.

15. పద్మారావు. కత్తి, 1994, దళితుల చరిత్ర (మొదటిభాగం), పొన్నూరు; లోకాయుత ప్రచురణలు.

16. పద్మారావు, కత్తి, 1995, దళిత సాహిత్యవాదం–జాషువా, పొన్నూరు: లోకాయుత ప్రచురణలు.

17. పద్మారావు. కత్తి, 1998, 'నీలికేక' పొన్నూరు లోకాయుత ప్రచురణలు.

18. పద్మారావు. కత్తి, 2002, అంబేడ్కర్–బుద్ధుడు, పొన్నూరు: లోకాయుత ప్రచురణలు.

19. పద్మారావు. కత్తి, 2007, కట్టెలమోపు, పొన్నూరు: లోకాయుత ప్రచురణలు.

20. ప్రసాద్. కలేకూరి, 1999, దళిత ఉద్యమం–దళిత సాహిత్యోద్యమం, హైదరాబాద్.

21. ప్రేమకిషోర్, రావినూతల, గుండెదరువు, 2005, హైదరాబాద్.

22. బాల శ్రీనివాసమూర్తి. గుమ్మన్నగారి, 2002, సమకాలీన వాదాలు–సాహిత్య విమర్శ, సికింద్రాబాద్: జయశ్రీ పబ్లిషర్స్.

23. భీమన్న. బోయి, 1993, గుడిసెలు కాలిపోతున్నై, హైదరాబాద్: సుఖేలానికేతన్.

24. భీమన్న. బోయి, 1984, అంబేద్కర్ సుప్రభాతం, భాగ్యనగరం: సాహితీ నిధి ప్రచురణ.

25. భీమన్న. బోయి, 1992, పాటలలో అంబేద్కరు, హైదరాబాద్: సాహితీ నిధి ప్రచురణ.

26. భీమన్న. బోయి, (అను) : 1994, కుల నిర్మూలన, హైదరాబాద్: హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ ప్రచురణలు.

27. మల్లికార్జున్. పి, 1997, తెలుగులో దళిత కవిత్వం రూపం–వస్తువు (అముద్రిత సిద్ధాంత వ్యాసం), హైదరాబాద్: హైదరాబాద్ విశ్వవిద్యాలయం.

28. మస్తాన్‌రావు. దేవరపల్లి, 1997, దళిత దశాబ్దం, పొన్నూరు: లోకాయుత ప్రచురణలు.

29. మాష్టార్జీ, 1994, మాష్టార్జీ దళిత గీతాలు, ఆంధ్రప్రదేశ్: దరకవే ఐక్యవేదిక.

30. మాధవరావు. గుర్రం, 2007, దళిత సాహిత్యంలో వాద ప్రతివాద విమర్శ (అముద్రిత ఎం.ఫిల్ వ్యాసం), హైదరాబాద్: హైదరాబాద్ విశ్వవిద్యాలయం.

31. నారాయణరెడ్డి.సి (సం) 1994, డా॥బాబా సాహెబ్ అంబేడ్కర్ రచనలు–ప్రసంగాలు, అస్పృశ్యులెవరు? సంపు:7, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.

32. రవికుమార్. పొనుగోటి, 2003, దళిత కవిత్వంలో పురాణ ప్రతీకలు (అముద్రిత ఎం.ఫిల్ వ్యాసం) హైదరాబాద్: హైదరాబాద్ విశ్వవిద్యాలయం.

33. రత్నాకర్. జి.వి. 1999, మట్టిపలక, హైదరాబాద్: గౌతమ ప్రచురణలు.

34. రత్నాజీ. నేలపూరి 2005, ఒకేగొంతు, చాగల్లు: నీమాశ్రీ, సన్నీ అండ్ సనత్ ప్రచురణలు.

35. రవీంద్రబాబు. ఎ. 2009, కొలకలూరి ఇనాక్ రచనలు–వస్తురూప పరిశీలన.

36. రామారావు. ఎస్వీ (తృ.ము) 1999, తెలుగులో సాహిత్య విమర్శ అవతరణ వికాసములు: పసిడి ప్రచురణలు.

37. రంగనాథాచార్యులు. కెకె. 1994, 'తెలుగు సాహిత్యంలో దళిత చైతన్యం' ఆధునిక సాహిత్యం–దళిత స్పృహ, హైదరాబాద్: యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ.

38. లక్ష్మీనరసయ్య, జి.శ్రీనివాస్, త్రిపురనేని (సంపాదకులు) 1995, చిక్కనవుతున్న పాట, విజయవాడ: కవిత్వం ప్రచురణలు.

39. లక్ష్మీనరసయ్య. జి, (సం.) 1996, పదునెక్కిన పాట (దళిత కవిత్వం) విజయవాడ: దళిత ప్రచురణలు.

40. లక్ష్మీనారాయణ.కె, (సంపాదకత్వం), 1998, దళిత కథలు–4 (ఆర్థిక రాజకీయ కథలు) అనంతపురం: రమా పబ్లికేషన్స్.

41. విజయానందరాజు. ఎల్లే, 1998, తెలుగు సాహిత్యం–హరిజన రచయితల సేవ (అముద్రిత పిహెచ్.డి సిద్ధాంత గ్రంథం), హైదరాబాద్: హైదరాబాద్ విశ్వవిద్యాలయం.
42. విల్సన్ సుధాకర్. తుల్లిమల్లి, 2007, దళిత వ్యాకరణం, హైదరాబాద్.
43. వీరభద్రయ్య. ముదిగొండ, 1990, విమర్శ–మౌలిక లక్షణాలు, హైదరాబాద్: తెలుగు అకాడమీ.
44. వెంకటేశ్వరరావు. దార్ల, దళిత తాత్త్వికుడు (కవితా సంపుటి) 2004, వికారాబాద్: తెలుగు సాహిత్య వేదిక ప్రచురణ.
45. వెంకటేశ్వరరావు. దార్ల, 2009, వీచిక (సాహిత్య విమర్శ వ్యాసాల సంపుటి) హైదరాబాద్, స్వీయ ప్రచురణ.
46. వెంకటేశ్వరరావు. దార్ల, 2012, బహుజన సాహిత్య దృక్పథం, హైదరాబాద్, సొసైటీ అండ్ ఎడ్యుకేషన్.
47. శరత్‌జ్యోత్స్నారాణి. ఎస్, 2003, స్వాతంత్ర్యానంతరం తెలుగు కవితా వస్తువు–రూపం, శిల్పం. హైదరాబాద్: జోత్స్న కళాపీఠం.
48. శిఖామణి, 1987, మువ్వల చేతికర్ర.
49. శిఖామణి, 1993, చిలక్కొయ్య.
50. శిఖామణి, 1998, దళిత సాహిత్య తత్వం (విమర్శ), తెనాలి, హైదరాబాద్: లిటరరీ సర్కిల్ ప్రచురణ.
51. శిఖామణి, 1998, వివిధ, హైదరాబాద్ & తెనాలి, లిటరరీ సర్కిల్ ప్రచురణ.
52. శిఖామణి, 2000, కిర్రుచెప్పుల భాష, హైదరాబాద్: నందిని ప్రచురణలు.
53. శిఖామణి, 2005, నల్లగేటూ నందివర్ధనం చెట్టు, హైదరాబాద్ : నందిని ప్రచురణలు.
54. శిఖామణి, 2006, మువ్వల చేతికర్ర, హైదరాబాద్: నందిని ప్రచురణలు
55. శిఖామణి, 2006, సమాంతర, హైదరాబాద్: సాహితీ రజతోత్సవ ప్రచురణలు.
56. శిఖామణి, 2009, తవ్వకం, హైదరాబాద్: నందిని ప్రచురణలు.

57. శిఖామణి, 2012, గిజిగాడు, హైదరాబాద్.

58. శివప్రసాద్. ముదిగొండ, 1990, ఉద్యమ దర్శనము: రసగంగోత్రి ప్రచురణలు.

59. శాంసన్. పిల్లి, 2000, దళిత సాహిత్య చరిత్ర, గుంటూరు, స్వీయ ప్రచురణ.

60. శ్యామసుందరరావు, అంబటి, 2000, దళిత సాహిత్యం–భాషా దృక్పథం (అముద్రిత ఎంఫిల్ సిద్ధాంత వ్యాసం), హైదరాబాద్: హైదరాబాద్ విశ్వవిద్యాలయం.

61. శ్రీరామ్మూర్తి. మండవ, సత్యనారాయణ, పోలు 1991, దళిత జాతుల వైతాళికుడు అంబేడ్కర్, విజయవాడ: జయంతి పబ్లికేషన్స్.

62. సతీష్‌చందర్, 1995, పంచమవేదం, హైదరాబాద్: నవ్యప్రచురణ.

63. సత్యనారాయణ, ఎస్వీ, 1991, తెలుగులో ఉద్యమగీతాలు, హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

64. సత్యనారాయణ. ఎస్వీ (సంపాదకుడు), 2000, దళిత వాద వివాదాలు. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

65. సాంబయ్య, గుండెమెడ, బ్రాహ్మణత్వం మాలత్వమా...? మానవత్వ అంబేద్కరత్వమా? 2006, హైదరాబాద్: రాజ్యం ప్రచురణలు.

66. సవేర. 1993, హరిజన అనే పదాన్ని నిషేధించండి, అమలాపురం దళిత చైతన్య వేదిక.

67. ఆధునిక సాహిత్యంలో ప్రక్రియలు, ధోరణులు, 2005, హైదరాబాద్: తెలుగు అకాడమీ.

68. సుధాకర్. ఎండ్లూరి, 2007, జాషువా సాహిత్యం–దృక్పథం–పరిణామం: రాజమండ్రి శ్రీరత్న ప్రింటర్స్.

69. సుబ్రహ్మణ్యం. జి.వి., 1983, ఆంధ్రసాహిత్య విమర్శ–ఆంగ్ల ప్రభావం, హైదరాబాద్: యువభారతి ప్రచురణ.

70. సుబ్రహ్మణ్యం. జి.వి., 2002: సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు, హైదరాబాద్: తెలుగు అకాడమీ.

71. సౌభాగ్య, 2009, శిఖామణి కవిత్వం–తాత్విక సౌందర్యం, హైదరాబాద్.

72. సంపత్కుమారాచార్య, కోవెల: 1981, ఆధునిక సాహిత్య విమర్శ–సాంప్రదాయక రీతి: వరంగల్, రచయిత ప్రచురణ.

## పత్రికలు

1. First all India Dalit writers conference. A commemorative volume 1987, editor: Bojja Tharkam.

## వ్యాసాలు

1. అయిలయ్య. బన్న, ఆధునిక తెలుగు కవిత–దళిత దృక్పథం, ఆధునిక కవిత్వం–అభినవ దృక్పథం.

2. ఇనాక్. కొలకలూరి, తెలుగులో దళిత సాహిత్యం, సాహిత్య సందర్శనం పరిశోధన పత్ర ప్రసంగాలు.

3. ఉషా. ఎస్.డానీ, దళిత సాహిత్యం–సామాజిక శ్రేణుల ఉమ్మడి వేదిక, ఆంధ్రజ్యోతి జూలై 2, 1995.

4. చంద్రశేఖర్.డి, దళితవాద కవిత్వం, తెలుగులో దేశీయ కవితా ప్రస్థానం: సంపాదకులు: పేర్వారం జగన్నాథం.

5. చంద్రశేఖర్‌రెడ్డి: ఆదునికాంధ్ర కవిత్వం–ఉద్యమాలు–సందర్భాలు, దళిత కవిత్వం–ఒక అవగాహన.

6. రామమోహనరాయ్. కడియాల, దళిత కవిత్వం, తెలుగు వ్యాసాలు.

7. రాములు. బి.ఎస్, దళిత సాహిత్యంలో పీడితవర్గ దృక్పథం అవసరం లేదా, ఆంధ్రజ్యోతి డిశంబర్ 8, 1996.
8. లక్ష్మీనరసయ్య. జి, తెలుగు కవిత్వంలో దళిత కవిత్వం ప్రధాన శక్తి కానుందా? ఆహ్వానం, జనవరి, 1995.
9. లక్ష్మీనరసయ్య. జి, దళిత ప్రతీక గబ్బిలం, ఆంధ్రజ్యోతి సెప్టెంబర్10, 1995.
10. శిఖామణి, ఇది దళిత శతాబ్దం, ప్రవాహిణి, 2000.
11. హరిపురుషోత్తమరావు, ఇకరానున్నది దళిత సాహిత్యం, ఇండియాటుడే జనవరి, 1992.

# అనుబంధం-1

26 మే 2002

## ఆధిపత్య ధోరణుల్ని ప్రశ్నించడమే వర్తమాన సాహిత్య లక్షణం

— శిఖామణి



వర్తమాన కవిత్వంలో వస్తుగతంగా ప్రాంతీయ స్పృహలూ, భాషాగతంగా మాండలిక స్పృహలూ, అభివ్యక్తిలో ఒక నూతనత్వం కనిపిస్తోంది. ఆధునికత లక్షణమైన ఏక కాలంలో అనేక ఉద్యమాలూ, ధోరణులూ సజీవంగా చైతన్యవంతంగా ఉండటం ఈ యుగపు చైతన్యం, అది అభ్యుదయమైనా, విప్లవమైనా, స్త్రీవాద, దళితవాద, మైనారిటీ, బి. సి., తెలంగాణా వాదమైనా ఆధిపత్య ధోరణుల్ని ప్రశ్నించడమే వర్తమాన సాహిత్య లక్షణం. మరో పక్క పెనుముప్పులా ముంచుకొస్తున్న గ్లోబలైజేషన్ ఎదుర్కోవడానికి, లౌకికతత్వాన్ని పరిరక్షించుకోవడానికి వాదాలకు అతీతంగా కవులంతా ఏకం కావలసిన సందర్భమిది.

TRO

THE HINDU, Monday, November 1, 1999

# Portraying people's plight

*His perceptive observation is a revelation in itself. The portraits he draws evoke strong imagery. Reacting sensitively to the life around, he has created his own poetic idiom. However, experimentation for him is a continuous process. If he is dissatisfied with his contribution, it is more so because he continuously probes the sensory parameters of society to correct himself. Dr. K. SANJEEVA RAO (Sikhamani), who has travelled quite far from his capacity of sopping the eyelids of readers through biographical intonations to declaring himself as a Dalit poet, speaks to W. CHANDRAKANTH.*


*"Birth, life and experience are the prerequisites to express the anguish of your community. If you are not a born Dalit, then the authenticity and the punch essential to express angst will be missing."*

## MEET...

### Dr. K. SANJEEVA RAO

"BIRTH, LIFE and experience are the prerequisites to express the anguish of your community. If you are not a born Dalit, then the authenticity and the punch essential to express the angst will go missing", Dr.K.Sanjeeva Rao, whose pen name is Sikhamani, argues.

Initially, it was his uncle Gangishetty who kindled in him the interest in literature during his school days and later Ms.K.Venkatanarasamma, Telugu lecturer in Yanam Junior College, and Mr.A.Narasimha Rao, Reader, Telugu Department, Andhra University, who polished the poet in him which he recalls fondly even to this day.



With his anthology of poems "Horugaali" (howling wind), brought out in 1988, and "Muvvala Chetikarra" (handstick with ornamental bells), which was published a year earlier, Sikhamani had already arrived. The feather touch given to depict the plight of people from various walks of life has drawn much praise. His observation transcends all barriers and the swing from one subject to another is so effortless that his treatment makes up for the gaps that sometimes crop up in his poems. There is a haunting quality to some of the poems like 'Disa mola' (on nakedness), 'Musilaadu' (old man) and 'Jalasarpam' (water snake).

Sikhamani establishes reality with his experience and sometimes the surrealistic imagery suffocates the reader, observers feel. In his treatment he lavishly lends a heaviness to the subject in such a way that an ordinary person or an object accumulates an extraordinary dimension.

But when he switched over to questioning the social dichotomy and the injustices heaped on the Dalits, it led to an angry reaction too. "Well, some poets and critics did not like my latter works. Though some did not question the content or the form, they certainly were bothered at the acidic language.

They do not mind my saying what I said, but not the way I said it", he says referring to the discussion that his "Vaade 'Ashudhdha Maanavudu" (He is the unclean being).

"No doubt, my emotions played key role in the formative stages. The pain in me got clearly reflected. Slowly, I progressed from subjective look to an objective outlook. My transformation as a Dalit poet was slightly delayed. The increasing attacks on Dalits throughout the country and more so in Andhra Pradesh made me react sharply", he adds.

"Presently, the Dalit poetry is in search of some alternatives. It is more to do with the culture rather than language. The dialects differ everywhere. A coastal area Dalit might speak differently from a Telangana area Dalit. Likewise, with the upper caste people. Our target need not be the language", he says.

He agrees there is not as much of prose as required reflecting the realities of Dalit life. "But, you cannot help it. There is power in poetry. Prose does not jolt you as much as poetry does," he says defending the quantitative output of Dalit poets compared to prose writers among them.

Sikhamani does not agree that there is a lull in revolutionary poetry nowadays. "If you can not agree that feminism and dalitism are equally revolutionary, then nothing could be said about it. Revolutionaries must recognise the caste factor. Without eliminating the caste, no class war would be successful. They have not given the right place in the movement to these issues".

Dalit poetry has come of age, he believes, adding that "the anger and the severity have given place to an intensive calmness. Just wait and watch. Many dalits have taken to writing about their pain and tears. Much more qualitative work is ahead".

Sikhamani, who has 12 anthologies to his credit, is presently editing an anthology of Oriya stories being published in Telugu by Telugu University. He is working as a lecturer in Potti Sriramulu Telugu University.

منصف 3

نظمیں، غزلیں، افسانے

# تلگو کے جدید نقاد، شاعر، مترجم، مؤلف ڈاکٹر شکھامنی اسسٹنٹ پروفیسر تلگو یونیورسٹی، حیدرآباد سے ایک مصاحبہ

**قطب سرشار (ایم اے)**
**لکچرر اردو (ریسرچ اسکالر)**


تلگو کے جواں سال نقاد، شاعر ڈاکٹر شکھامنی کی شخصیت میں ادب کے عناصر خمسہ ایک ساتھ نظر آتے ہیں۔ انہوں نے افسانہ نگاری سے اپنے تخلیقی سفر کا آغاز کیا پھر شعر کہنے لگے۔ اس کے بعد ترجمہ نگاری کا کامیاب تجربہ کیا۔ ترجمہ نگاری کے علاوہ نظموں کے انتخاب ترتیب دیئے، تحقیقی مقالے مضامین لکھے، جامعاتی سطح کی نصابی کتابوں کی ترتیب کا کام انجام دیا۔ بیسیوں سیمیناروں میں مختلف جدید مسائل پر مقالے پڑھے۔ اس طرح آپ بیک وقت شاعر، ادیب، تنقید نگار، مترجم، محقق ہیں اور پچھلے بیس برسوں سے ان کا علمی، تحقیقی، تنقیدی اور تخلیقی سفر اس طرح جاری ہے کہ انہوں نے تلگو ادب میں اپنی تخلیقی صلاحیتوں کا لوہا منوا لیا۔ 1987ء میں پہلا شعری مجموعہ "مواہا" چھپ کر (جھنکار) شائع ہوا۔ اس کے فوراً ہی بعد 88ء میں (آدمی) نظموں کا دوسرا مجموعہ آگیا۔ میں شکھامنی نے پی ایچ ڈی کا مقالہ مکمل کیا اس کا موضوع تھا "پٹھابھی رام ریڈی تجربوں کا علم بردار"۔ 92ء میں جب یہ منظر عام پر آیا تو شکھامنی کی تحقیقی صلاحیت بھی مسلمہ ہوگئی۔ 1991ء میں تلگو یونیورسٹی حیدرآباد میں بحیثیت لکچرر تقرر عمل میں آیا۔

تخلیق کا سرچشمہ وجدان ہوتا ہے اور تنقید کا مزاج منطقی۔ جب تخلیق کار تنقید کا منصب سنبھالتا ہے تو اس کی تنقیدی بصیرت میں وجدان اور منطق دونوں رنگ ہوتے ہیں۔ شکھامنی بنیادی طور پر شاعر ہیں اس لئے ان کی تنقید میں تخلیق کی رمز شناسی اور تنقید کی منطقی معقولیت دونوں کا خوبصورت امتزاج پایا جاتا ہے۔ دلت جذبات کا رمز شناس شکھامنی سے بہتر کون ہو سکتا ہے جب کہ شکھامنی خود دلت طبقہ سے تعلق رکھتے ہیں۔ شکھامنی ایک معتبر تبصرہ نگار بھی ہیں انہوں نے پچاسوں کتابوں پر تبصرے کئے۔ تلگو یونیورسٹی میں پروفیسر کے عہدے پر فائز ہونے کے بعد آٹھ برس کے عرصے میں ان کی نگرانی میں پانچ طلباء نے ایم فل کے مقالے تحریر کئے اور پانچ اسکالر پی ایچ ڈی کر رہے ہیں۔ شکھامنی کی ادبی اور علمی مصروفیات سے اندازہ ہوتا ہے کہ یہ ادبی زندگی زیادہ اور سماجی زندگی کم جیتے ہیں۔

ہم نے ان کی بے پناہ مصروفیات سے تھوڑا سا وقت حاصل کر کے تلگو یونیورسٹی کا رخ کیا اور ان سے تلگو شعر و ادب کے موضوع پر ایک گھنٹہ مصاحبہ کیا۔ آیئے آپ بھی اس مصاحبے میں شامل ہو جایئے۔

قطب سرشار: آپ کا پورا نام کے تیجو راؤ ہے لوگ نام شکھامنی۔ یہ نام آپ نے کیوں رکھا اس کا مطلب کیا ہوتا ہے؟

شکھامنی: شکھامنی کا مطلب ہے طرہ جو بادشاہ اپنے تاج میں لگاتے ہیں۔ میری والدہ کے انتقال کے بعد میرے والد کے ایک دوست تھے انہوں نے میری پرورش کی۔ انٹرمیڈیٹ تک تعلیم دلوائی۔ بڑے ہی نیک اور ہمدرد انسان تھے۔ شکھامنی نام انہی کا تھا۔ اس دیوتا صفت شخصیت سے متاثر ہو کر میں نے اپنا ادبی نام شکھامنی رکھ لیا۔ یہی



نہیں بلکہ میرے والد اور ان کی گہری بے لوث دوستی نے مجھے از حد متاثر کیا ہے۔

قطب سرشار: وہ کونسا واقعہ تھا جس نے آپ کو قلم اٹھانے پر مائل کیا؟

شکھامنی: میرے والد کے دوست شکھامنی کی انسانیت اور بے لوث دوستی نے متاثر کیا چنانچہ میں نے اسی شخصیت کے اثر میں سب سے پہلے ایک کہانی لکھی۔ اس کے بعد پہلی بار ایک نظم لکھی تھی عنوان تھا "وورو گالی" (آدمی) نظم پہلے شائع ہوئی اور کہانی بعد میں۔

قطب سرشار: آپ کے تخلیقی محرکات کیا ہیں؟

شکھامنی: انسان کا ازلی کرب اور مظلومیت، قدرت کے بے پناہ حسین مناظر جیسے آسمان پر چاند مجھے کسی شیر خوار بچے کی مانند لگتا ہے۔

قطب سرشار: آپ تخلیق کار بھی ہیں اور تنقید نگار بھی۔ ایسا بہت کم ہوتا ہے۔ تنقید کی جانب میلان کے اسباب کیا ہیں؟

شکھامنی: میں نے ایم اے تلگو ادب میں کیا، پھر پی ایچ ڈی اس دوران تحقیق اور تنقید کے موضوع پر کثرت سے مطالعہ کیا۔ مجھے لگا کہ تنقید کا موضوع میرے مزاج سے ہم آہنگ ہے۔ اس کے علاوہ ادب میں مکاتیب فکری گروہ بندیوں کے سبب تنقید نگاروں کی ذاتی عصبیت نے مجھے لکھنے پر آمادہ کیا۔

قطب سرشار: تلگو کے کن نقادوں سے آپ متاثر ہیں یا انہیں پسند کرتے ہیں؟

شکھامنی: پروفیسر بے کوری رادھا کرشنا، پروفیسر جی وی ایس سبرامنیم، آر ایس سدرشنم، وے کٹیا، موہن پرساد، مدی کنڈا، وی بھدریا، اسماعیل اور مو۔ یہ وہ نقاد ہیں جن سے متاثر ہوں پسند بھی کرتا ہوں۔

قطب سرشار: تلگو کی ترقی پسند شاعری کے بارے میں آپ کی رائے کیا ہے؟

شکھامنی: یہاں کچھ لوگ یہ سمجھتے ہیں کہ تلگو میں ترقی پسند شاعری میں بہت دم ہے اور نئی نسل کو متاثر کر رہی ہے۔ بعض یہ خیال کرتے ہیں کہ ترقی پسند تحریک سکڑ کر محدود ہو گئی ہے۔ میرے خیال میں 1980ء ہی سے ترقی پسند تحریک کے زوال کے آثار نمودار ہونے لگے اور اب تو بس برائے نام رہ گئی ہے۔ اب ترقی پسند چولا بدل کر آفاقیت کا نعرہ لگانے لگے ہیں اور پھر تلگو شاعری جدید رجحانات اور مکاتیب فکر نے ترقی پسند تحریک کی اہمیت کو صفر کے برابر گھٹا دیا ہے۔

قطب سرشار: وہ کونسے مکاتیب فکر اور رجحانات کیا ہیں؟

شکھامنی: دلت تحریک، نسائی تحریک، بین الاقوامی یگانت وغیرہ۔

قطب سرشار: یہ دلت تحریک کیا ہے اس کا آغاز کب اور کیونکر ہوا؟

شکھامنی: یوں تو چھوت چھات کی مخالفت میں اس تحریک کے آثار تلگو مہان سنت شعراء کی شاعری میں نمایاں ہوئے۔ مثلاً پوتولوری ویر برہم، ویمنا، سدھا پالن بزرگوں نے دلتوں کی حمایت میں بہت لکھا تاہم تحریک آزادی کے ساتھ دلت تحریک بھی سماجی اصلاح کے بطور شروع ہوئی جو برہمن تحریک کہلاتی تھی۔ تلگو عظیم شعراء گرم جاشوا اور بوئے بھیمنا نے اس تحریک کو ادب میں رائج کیا۔ دراصل سماجی، سیاسی، ثقافتی اور معاشی سطحوں پر پچھڑے طبقات کو مساوات کے لئے جنگ کرنے کا نام ہی دلت تحریک ہے۔

قطب سرشار: تلگو کے سر فہرست دلت شعراء کون ہیں؟

شکھامنی: شیو ساگر، بی ہی کی پدمارا، ستیش چندر، پنڈلوری سدھاکر، کیشو بابو وغیرہ۔

قطب سرشار: کیا اس میں مسلم تلگو شعراء بھی شامل ہیں؟

شکھامنی: کیوں نہیں۔ خواجہ، اسکائی بابا (یوسف بابا) اسماعیل قدیر بابا دلت تحریک کے بہت نامور علم بردار ہیں۔

قطب سرشار: کیا آپ کو نہیں لگتا کہ اپنے احتجاجی رویے اور نعرہ بازی کے سبب ترقی پسند تحریک کی طرح دلت تحریک بھی بے اثر ہو جائے گی؟

شکھامنی: قطعی نہیں۔ اس لئے کہ دلت شعراء بڑی حد تک نعرہ بازی، احتجاج اور جذباتی شدت سے گریز کرنے لگے ہیں۔ اب تخلیقی اظہار اور ذہنی انقلاب کو اہمیت دی جا رہی ہے۔

قطب سرشار: آپ تلگو یونیورسٹی کے اس شعبے سے متعلق ہیں جس میں غیر تلگو زبانوں کے ادب پاروں کے تقابلی جائزے کے موضوع پر تحقیقی کام ہوتا ہے۔ اس طرح اردو ادب کے ترجمے آپ کی نظر سے گزرے ہوں گے خصوصاً اردو شاعری کے بارے میں آپ کے احساسات کیا ہیں؟

شکھامنی: اردو ایک بڑی زبان ہے اس کا ادبی سرمایہ بڑا وسیع اور عمیق ہے اردو شاعری مجھے انگور کے خوشوں کی طرح بڑی شیریں لگتی ہے۔

قطب سرشار: روزنامہ "منصف" کے قارئین کے لئے آپ کوئی پیام دینا چاہیں گے؟

شکھامنی: ضرور۔ روزنامہ منصف کی جمہوری پالیسی نے مجھے متاثر کیا کہ اس نے ایک اردو اخبار ہوتے ہوئے بھی تلگو ادب اور ادیبوں کے تعارف کا بیڑا اٹھایا۔ اچھا ہے کہ یہ سلسلہ چل رہا ہے۔ اس طرح تلگو اخبارات میں بھی اردو ادب کا تعارف ہونا چاہئے۔

قطب سرشار: شکریہ جناب۔

شکھامنی: شکریہ آپ کا بھی اور روزنامہ منصف کا بھی۔

●●●


مصاحبہ نگار

## అనుబంధం-2

# ఇనప పాళీలు మొలుచుకొస్తున్నాయ్

హైస్కూలు చదివే రోజుల్లో
అన్యం వారింట్లో దాహానికి అడిగితే
చెంబు పైకెత్తి
దోసిట్లో నీళ్లు ధారగా పోసినప్పుడు అనుమానం వచ్చింది

ఆటల మధ్యలో తగాదా వచ్చి
అవతలివాడు
మాల్లంజకొడకా అన్నప్పుడు
మోకాలి చిప్పతో పాటు
గుండెకూ పెచ్చూడినప్పుడే అనుమానం వచ్చింది

ఇంటర్మీడియెట్ ఇంటర్వ్యూలో
చయనలు గారు
రిజర్వేషను గాడికి
ఫారిన్ చొక్కా పైలెట్ పెన్నూ
బాటా చెప్పులా అని ప్రశ్నించినప్పుడే అనుమానం వచ్చింది

సాహిత్య చర్చల్లో తలదూర్చబోతే
అరసికాయ కవిత్వనివేదనమ్

అని నాకు అర్థంకాని భాషలో
నా బ్రాహ్మణ మిత్ర ద్వయం
ఎగతాళిగా ముసిముసి నవ్వులు
నవ్వుకున్నప్పుడే నాకు అనుమానం వచ్చింది
చిన్నప్పుడు సంక్రాంతి పండక్కి
అమ్మమ్మగారి ఊళ్లో
పక్కవాడ నుండి పప్పులు తెచ్చుకుంటే
మాదిగల పప్పులు తిన్నాడనీ యాక్ అనీ
తోటి పిల్లలంతా చుట్టూ చేరి
గేలి చేసినప్పుడే అనుమానం వచ్చింది
ఏదో కుట్ర జరిగిపోయిందని
మిగతా కులాల నుండే కాక
నా కులం నుండి కూడా నేను వేరు చేయబడ్డానని

శిఖామణి ఎస్సీనా?....
కవిత్వపు పలుకు చూసి ఓసి అనుకున్నానని
ఒక పెద్దాయన మెచ్చుకున్నప్పుడే అనుమానం వచ్చింది
అందులోని మెచ్చుకోలు కంటే
ఫలానా కులం వాళ్లే మంచి కవిత్వం రాయగలరన్న
నమ్మకం నన్ను బాధించింది
దొడ్డికూర్చునే బహిర్భూమిలో
శవాలను తగలేసే స్మశానంలో
వుండాల్సిన ఊరి చివరకు
నా యిల్లెలా జరిగిందో
ఆచూకీ కావాలిప్పుడు
నా ఇంటినే కాదు

చివరికి నా స్మశానాన్ని కూడా వేరుచేసిన ఈ దేశం
ఒక హిందువుల శ్మశాన వాటికలా కనిపిస్తోంది
భూమి నోటి లాలాజలం లాంటి
జలాధారకూ నాకూ మధ్య
నీటి దూరాన్ని పెంచిన
ఎడారి రాక్షసుల వైనం కావాలిప్పుడు
పిడచ కట్టుకుపోయిన నాలుకలతో
ఒక్క నీటి చుక్కను అర్థించే పనిలో నిమగ్నమై వున్నాను
గాడిదల తోకలకు కట్టినట్లు
తాటాకులు మా మొలలకు కట్టి
ఈ నేల మీద నీవు చెరిపేసిన
మా కోటానుకోట్ల పాదముద్రలు
ఒక్కొక్కటీ ఒక్కొక్క ఉక్కుపాదమై
సిద్ధంగా వున్నాయి

మా మూతులకు కట్టిన
ముంతల్లో మేము ఉమ్మిన ఉమ్మ
ఇప్పటికీ భద్రంగానే వుంది

దాన్ని పారబోసే రోజు వచ్చింది
ఆ వెల్లువలో పూచిక పుల్లలై
మీరు కొట్టుకుపోక తప్పదు

నేర్పని విద్యకు గురుదక్షిణ కోరిన
మా బొటనవేళ్ల స్థానంలో

ఇనప పాళీలు మొలుచుకొస్తున్నాయి
అవి చరిత్రను తప్పక తిరగరాస్తాయి
అప్పుడు మా చెవుల్లో
సలసల మరిగిన సీసం పోసిన వాళ్లే
ఇప్పుడు మా చెవుల్లో మొలిచిన వెంట్రుకలు పీకడానికి
నిచ్చెనలు వేసుకోవలసిన రోజు వచ్చింది
ఏ అధర్మ శాస్త్రం
మా నాలుకలు కోయమందో
ఆ శాస్త్రమే ఇప్పుడు మా నాలుకల మీద
పాచిని తీసే తాటాకు బద్ద అయింది

శంబూకుని తలను నరికిన కత్తి
శతాబ్దాల నుండి
పదును తగ్గకుండా అలాగా వుంది
అయితే అది ఇప్పుడు చేతులు మారింది
ముమ్మాటికీ మిమ్మల్ని గుర్తుపడుతుంది
ఇక ఇప్పుడు ఏ మనువూ మిమ్మల్ని రక్షించలేదు

# కిర్రు చెప్పుల భాష

ఇన్ని వర్ణనాత్మక భాషల్లో
నా అవర్ణాన్ని వర్ణించగల భాష లేదు
ఇన్ని సౌందర్యాత్మక వర్ణాల్లో
నా అసౌందర్యాన్ని
వొడిసిపట్టుకునే అక్షరం లేదు
ఇన్నాళ్లూ
నేనొక ధ్వన్యనుకరణ శబ్దాన్ని మాత్రమే
అరువు తెచ్చుకున్న అపస్వరాల మధ్య
నా అసలు స్వరాన్ని పోగొట్టుకున్నాను

ఇప్పుడు అక్షరాన్ని
పచ్చితోలుని చేసి లందెలో వూరేస్తున్నాను

ఇప్పుడు అక్షరాన్ని
రాకాసి బొగ్గును చేసి
నా చీకటి కొలిమిని ముట్టించుకున్నాను

ఇప్పుడు అక్షరాన్ని
పారదర్శకపు పటికరాయిని చేసి
నా మంగలిపొదిలో వూరేగిస్తున్నాను

ఇప్పుడు అక్షరాన్ని
కాల్చిన జీడిగింజను చేసి
జాతివస్త్రం మీద
నా చాకలి సంతకాన్ని చేస్తున్నాను

ఇప్పుడు అక్షరాన్ని
తప్పలాంతరును చేసి
నా వలకు కాపలాగా
చీకటి నది మీదకు వొదులుతున్నాను

ఇప్పుడు అక్షరాన్ని
అగ్గిరవ్వను చేసి
నా మట్టికుండల ఆవను రాజేస్తున్నాను

ఇప్పుడు అక్షరాన్ని
కండెనను చేసి
నా నేత మగ్గంలో పరుగులు తీయిస్తున్నాను

ఇప్పుడు అక్షరాన్ని
కంపదడిని చేసి
నా గొర్రెల మంద చుట్టూ నిలబెడుతునానను

ఇప్పుడు అక్షరాన్ని
కాళ్లబందం చేసి
కల్లుతాడి ఎక్కిస్తున్నాను

అక్షరాన్ని తోలు వొలిచి
గుప్పెడు తోలు ముక్కల్ని చేసి
నా కిర్రు చెప్పుల్లో కలిపి కుడుతున్నాను
ఇప్పుడు నేను పలకలేని పరుషాలు
నా చెప్పులకు నాడాలు
నేనెక్కలేని బండిఊాలు
నా మట్టిపాదాల మాతంగి మీగాళ్ల మీద
కులికే వెండి కడియాలు

నాకు నోరు తిరగని వత్రసుడులు
నా ఎడమకాలి బొటనేలి వుంగటాలు

ఇప్పుడు అక్షరాలు పుట్టేవి
శివుని చేతి డమరుక శబ్దం నుంచి కాదు
వీరబాహుని కిర్రుచెప్పుల చప్పుళ్ల నుండి
ఇప్పుడు వర్ణమాల
సవర్ణుని చేతిలో రుద్రాక్షమాల కాదు
గూడెం గుడిసె ముందు పచ్చి వొరుగుల దండెం
ఇప్పుడు మనువు వొంటిమీది జందెం
నా నల్లజాతి చెప్పుకు తెల్లని లేసు అల్లిక

ఇహ ఇప్పుడు సరస్వతి కూడా
పలకా బలపం పట్టుకొని
రాత్రి పాఠశాలకు
నా అరుంధతి ఇంటికి రావాల్సిందే

ఇప్పుడు
మావూరి గొల్ల ఎంకన్న
తుమ్మముల్లుతో
కాళికాదేవి నాలిక మీద
బీజాక్షరాలు రాస్తున్నాడు

చిన్నయసూరి
తన బాల వ్యాకరణాన్ని
దళిత వ్యవహారంబు దృష్టంబు గ్రాహ్యంబుగా
తిరగరాస్తున్నాడు

# నల్లని దానను

నేను నల్లని దానను
నా నల్లని మేని మేఘచ్ఛాయ వెనక
రాయంచ తూలికల్లాంటి
తెల్లటి మెత్తని అంతరంగం కలదానను.

అందమైన అతివ
వొంపు తిరిగిన సన్నని పై పెదవి అంచున
వేంచేసివున్న సౌందర్య రసరాజ్యపు చిహ్నానికి
నాతోనే పోలిక.

వింటే భారతమే వినాలి.
తింటే గారెలే తినాలని
నా స్థానం పంచమవేదం సరసన.

నేను నల్లనిదానను.
నవ ధాన్యాల్లో నాలుగోదానను
నా పేరు మినుము
శక్తికి నేను ఇనుము.

వేద పనసల పదఘట్టనల మధ్య
గొంతు మూగవోయిన జానపద గీతంలా
నవధాన్యాల్లో నేను నల్లని దానను.

తిరగలి మధ్య బియ్యపు గింజల్లా
ఆర్యుల మధ్య అస్తిత్వాన్ని పోగొట్టుకున్న దస్యుల్లా
నవధాన్యాల్లో నేను అతి నల్లనిదానను.

హంసలమధ్య పికిలిపిట్టలా
బాహ్యాకృతికి నేను వికృతంగా వున్నా
కలకూజిత కంఠస్వరం
సొంతం చేసుకున్న కోయిల పిట్టను.

నలుపు సౌందర్యాత్మకమే కాదు
జాత్యహంకారపు అభిజాత్యాలను
నిట్టనిలువునా దగ్ధం చేసే
నీలిమంటల ధిక్కారపు అగ్నిశిఖ.

నా ధాతు శిలాజం
ఆఫ్రికా చీకటి ఖండం నుండి
హరప్పా మొహంజోదారో నాగరికతల
చారిత్రక విభాత సంధ్యల వరకూ నిక్షిప్తమై వుంది.

ఇటు
వీరబాహుడు మాలకన్నమనీడూ
వీరవల్లడూ చండాలికా

అటు
మార్టిన్ లూథర్‌కింగ్ సొజర్నర్ ట్రూత్

నెల్సన్ మండేలా ఓలే సోయంకా
నా నల్లనెత్తుటి అచ్చపు వారసులు
చీకటి చరిత్ర మీద చెరగని వెలుగు పాదముద్రలు.

గుండె కింది తడిలాంటి
ఇంతచెమ్మ నన్ను సోకితే చాలు
వొళ్లంతా కింజల్కపు పులకింతలతో
ఉబ్బితబ్బిబైపోతాను.
ఆ పై నన్ను స్పృశిస్తే
శ్వేత ప్రపంచాన్ని తెల్ల మొగం వేయించి
ఉర్రూతలూగించిన
ఆటపాటల నెలరేడు
మైఖేల్ జాక్సన్‌లా
తెల్లగా మిలమిలా మెరిసిపోతాను.

అయినా నా వొంటి నలుపును
కడిగినంత సులభం కాదు
ఈ జాతి వర్ణ పంకిలాన్ని కడుక్కోవడం.

నేను నల్లనిదానను
చరిత్రగర్భాన్ని చీల్చుకొచ్చిన
వేయి రేకుల బాకుల నల్లకలువను.
వర్తమాన దళిత రణ క్షేత్రంలో
సమతారథం శిఖరాగ్రంపై
రెపరెపలాడే గబ్బిలపు ధ్వజాన్ని.

# మా బాప్ప

వాడతప్ప వూరులేని
కులంతప్ప పేరులేని
శ్రమతప్ప సుఖంలేని
మా బాప్ప కథ వింటారా?
బాప్పంటే మాటలా
పొడుగాటి బొప్పాయి చెట్టులా
వెనక్కి తిరిగి చూడని యేరులా
ఆకాశాన్ని సవాలు చేసే
సన్నని సర్వే చెట్టులా
చేయెత్తు మనిషి
కచ్చా బిగించి
భుజాన కొడవలితో పొలానికి వెళ్తుంటే
తోకమీద నిలబడిన
ఆరడుగుల నల్ల తాచులా
అగుపించేది మా బాప్ప
నలుపంటే నలుపా అది!
గుత్తులుగా విరగకాచిన నేరేడు నలుపు
దుక్కిదున్నిన నల్లరేగడి మడి చెక్క నలుపు
పంటబోదెలో విరబూసిన నల్ల కలువ నలుపు
అప్పుడే కోసి ఆరబోసిన
మిరపకళ్లంలా
ఆ నల్లని నుదుటి మీద ఎర్రని బొట్టు.

రూపుకు నల్లనే కాని
మా బాప్ప మనసు
పుచ్చ పువ్వు తెల్లన
బూరుగుదూది మెత్తన
చలిగెంజి చల్లన.
మా బాప్ప ముందుపుట్టి
ఆ వెనక పని పుట్టింది
మనిషి రూపెత్తిన
ఒక ఆదిమ పనిముట్టు మా బాప్ప.
తెల్లవారుజామున
పెరట్లో కుంకుడుచెట్టుమీద కాకులు
మా బాప్పను చూసే
పొద్దును నిర్ధారించుకునేవి
వాకిలి వూడ్చి వూడ్చీ
చీపురు చేతిని అలా పైకెత్తిందంటే చాలు
మబ్బులతో పాటు
పాలపుంతలోని చుక్కలన్నీ
వొద్దికగా పక్కకు జరిగేవి
ఆ వాకిలంత
స్వచ్ఛంగా వుండలేకపోయినందుకు
తొలిపొద్దు మరింత
తెల్లబోయేది.
నీలాటి చెరువుకు వెళ్లిదంటే చాలు
నాలుగు మెట్ల దిగువున వున్న నీళ్ళు
మొప్ప పిల్లలై ముందుకురికి

మా బాప్ప మునివేళ్లను ముద్దాడేవి.
వానాకాలం వచ్చిందంటే చాలు
కురిసీకురవని మబ్బుతునకలు
ఆనందానికీ దుఃఖానికీ చెమర్చని
మా బాప్ప కనుగవలో
రహస్యంగా సంచరించేవి
ఊడ్పుల కాలంలో
మునివేళ్లతో ఒక్క వరిమొక్క
నాటిందంటేచాలు
చేను చేనంతా
పాలమూరు పిల్లలమర్రిమానులా
విస్తరించేది
అయినా మాబాప్పెప్పుడూ
పరిగెవరకలానే మిగిలిపోయేది

సూర్యుడికైనా
అస్తమయాలు వున్నాయేమోకాని
బాణం బద్దలా వొంచిన మా బాప్పనడుముకు మాత్రం
విశ్రాంతి లేదు.
ఊరిదేవుడి కళ్యాణంలోనో
బడిపిల్లల మధ్యాహ్న భోజన పథకంలోనో
వున్నట్టుండి బయటపడ్డ కులవివక్షలా
అరిగిపోయిన మా బాప్ప వెండికడియాల నుండి
లక్క బిక్కుబిక్కుమని తొంగి చూసేది.
జీవితాంతం బరువులు ఎత్తడమే తెలిసిన

మా బాప్పకు
ధాన్యం మిల్లులోని క్వింటా బస్తాలు
ఒక లెక్కలోనివి కాదు.
కొబ్బరికొట్టు పనిలో
తొడకు కాయను ఆనించి
మూడు చెక్కల్లో వొలిచిన మా బాప్ప
కారంచేడులో ఎందుకు పుట్టలేదా అనుకుంటాను.
ఊరుతో వైరం వచ్చినప్పుడు
చెంగులో ఇంత కారప్పొడి
చేతిలో హరికెన్ లాంతరుతో
తెల్లవార్లూ ఏటిగట్టున కాపలా తిరిగిన
మా బాప్ప
చుండూరులో ఎందుకు పుట్టలేదా
అనుకుంటాను.
గతంలోకంటే
ఇప్పుడు మా బాప్ప అవసరం
ఎంతైనా వుంది.

## అంటు

భాష ఎంత నంగనాచి

పదం ఎంత బహుభంగి

కాకపోతే

ఒకే మాటకు

ఎంత పరార్థం

మరెంత విపరీతార్థం

అంటరానివాణ్ణి

అంటుకు అర్థం

నేను తప్ప

చెప్పగల సమర్థ రామదాసులెవరు

అంటంటే

మనిషి ఎదురుపడితే

అశుద్ధాన్నుండి

పక్కకు జరిగినట్టు

మనిషి నుండి

మనిషి వైదొలగడమే

అంటంటే

మనిషి ఎదురుపడితే

పులో సింహమో ఎదురుపడ్డట్టు

మరొక మనిషి నిలువెల్లా గజగజా వొణికిపోవడమే

అంటంటే

గుంభనంగా ప్రవహిస్తున్న

నది అడుగున సమతలంగా వున్న నేల
ఉన్నన్నట్టుండి ఒకసారిగా
గుండాలు గుండాలుగా లోపలికి లాగేయడమే
ఒకరోజు
సైకిల్ మీద గంపల్లో
పూలమొక్కలు అమ్ముకునే అతను
ఎదురు పడితే
ముచ్చటపడి ఓ గున్నమావి మొక్కను
బేరమాడాను
ఇది అలాంటిలాంటి
మామిడికాదు
అంటుమామిడి మొక్క అన్నాడు
నేను ఉలిక్కిపడి
అంటంటే అన్నాను
కొమ్మకు కొమ్మను అంటు కట్టిన మామిడి
ఆరు నెలల్లో కాపుకొస్తుందన్నాడు
అంటంటే దగ్గరకు తీసుకోవడం
ఆలింగనం చేసుకోవడం
అనే కొత్త అర్థాన్ని ఇచ్చాడతను
బోది వృక్షం క్రింది బుద్ధుడిలా
ఇప్పుడు నేను
మనిషికి మనిషికీ మానవత్వాన్ని
అంటుకట్టే పనిలో
నిమగ్నమై ఉన్నాను.

# సహస్రాబ్ది దళిత సూర్యుడు

అంతటా ఇరుకిరుగ్గా వుంది
అంతటా జీబురు జీబురుగా వుంది
అంతటా ఏ సంధ్యో పోల్చుకోలేని
మసకమసక వెలుతురుగా వుంది
మనిషంటే వున్నతమూ విశాలమూ లోతూ అనుకున్నానే
మనసంటే పిడికెడు దేహంతో అంతరంగ విహంగం
స్వేచ్ఛగా గిరికీలు కొట్టే తుదీ మొదలూ లేని అనంతాకాశం అనుకున్నానే
కనుచూపుమేరా
పచ్చపచ్చని నులివెచ్చని మైదానాలు–
ఎడారిని దున్నినట్టు ఒక అవాంఛిత దుస్స్వప్నం
తలపైకెత్తి చూస్తే
రుతువుల చేతులూపుతూ
ఒక మహావృక్ష సంతతి సతతహరితారణ్యంలా పెరగాల్చిన చోట
మెదడులో కూచున్న చోటనే
ఒక నీటి కప్ప అటూ ఇటూ కదులుతున్నట్టు
జీవన పత్రహరితాలను కత్తిరించుకున్న బోన్సాయ్‌లు.

ఇక్కడ నేనున్నానంటూ
ఎప్పటిదో ఎక్కడిదో

యోజనాలు వినబడే సెలయేటి జలజలల పిలుపులుండాల్సిన చోట
అనంతకాంతి సంవత్సరాల కంటి రెప్పల నుండి
తుంపర తుంపరులుగా రాలుతున్న ఇసుకమేటలు
మానవ జీవనయాత్రా చెక్కిలి పొడవునా
నాచుపట్టిన సన్నటి కన్నీటి చారిక
ఏమైనా అడుగు
ఎన్నైనా అడుగు
చర్మాన్ని తిరగేసుకుని తొడుక్కోగల ఆత్మధైర్యం వుంటేనే
నువ్వెవరని అడుగు
పండి పక్వానికొచ్చిన
జమ్మిగడ్డి కంకుల నుండి చిరుగాలికే
పింజలుపింజలుగా తేలియాడుతున్నట్లు
నవ్వు పెదాలుండాల్సిందిపోయి
రజను రాలుస్తున్న రెండు తప్పు పట్టిన ఇనుపకత్తులు
నాలుగు మాటలు మాట్లాడితే
విత్తనాలు జల్లిన ఆకుమడిలో నల్లనిమట్టి మీద
నవనవలాడుతూ పచ్చని తివాసీ మొలకెత్తినట్లుండాల్సిందిపోయి.

నాలుగు మాటలు మాట్లాడితే
కుప్పనూర్చిన కళ్లంలోకి పిట్టలగుంపు
బిలబిలమంటూ వాలినట్లుండాల్సిందిపోయి.
నాలుగు మాటలు మాట్లాడితే

పూల నుండి పరిమళం వీచినట్లూ
చెట్లమీంచి పక్షులు ఎగిరినట్లూ
హాయిగా వుండాల్సింది పోయి
అలికాలులో కసుక్కున తుమ్మముల్లు దిగినట్టు
తవ్వుతున్న బావిలో అకస్మాత్తుగా బండపడినట్టు
పుత్తమంచినీళ్లు మెడపట్టుకున్నట్టు
వూపిరాడనట్లు
లోలోన వుక్కబోసినట్లు
ఇక్కడ మనిషీ అంటే మాటా అంటే
మనిషి నడిచిన పాదముద్రలు
నాగరికతకు ఆనవాళ్లు కావాల్సిందిపోయి
పులి అడుగులై భయపెడుతున్న
భీతావహ సంధ్యా బీభత్సం
సంకుచిత మానవ మనోవీధుల్ని
విస్తరించేందుకు, వెలిగించేందుకు
నా కవిత్వపు ప్రొక్లైనర్‌తో
సహస్రాబ్ది అంచున దళిత సూర్యుణ్ణై ఉదయిస్తున్నా!

# An Apology

My pologise dalit!
Iam, a poet, a rare poet
Why my name,
Why background?
Iam a brahmin
With a glorious lineage

..... please accept my apologies, dalit!
ever had the time to write
line about you
..... past thousand years,
... engrossed I was in
morous and ascetic literary pursuits.

... your never were
.. our classical texts demanded
our woman never
belonged to the classic descriptions
our ancient aeshetes desired.

Our old poet
calls Sudra's poetry
he sweet pudding
naligned by a crow.
ou are not even a Sudra!
How can I write poetry about you
and bestow poetic honours on you?

My apologies, dalit,
I'm a poet, a modern poet,
I bow my head for
felicitations, shawls and awards
I do not wish to dishonour a job
bringing sweet dividends.

How can I write poetry about you?
I can write about the
great Vietnam
Tiananmen Square,
the fall of berlin wall
and hunger in Somalia
but not
about the wound of Chundur*
the pestles of Karamchedu* and
the flame of Neerukonda*--
I am an international poet,
I certainly cannot write
poetry about dalit hamlets.

I can tell others which way to go
but cannot decide for myself,
at this historically necessary moment
I'm doubtful.

I sang, to my heart's content, the paens of
martyrs of revolution
but the swollen, stuffed corpses of
butchered dalits
didn't move me.
I cried about alienation,
alas, I cannot be
moved by dehumanisation.

I have lamented about curfew
in evocative poetry
but cannot expend a drop of ink
to condemn caste killings.

I can write about
flower-vendors and blind beggars
in words tender like flower petals
but none to describe
the insults of Padirikuppam*

A nostalgic outpour
it was when I recalled separation
from my village--
but, no, I do not question
how one person is separated from the other--

How come I cannot
accept questions about
fellow beings' rights
while fighting for
rights over the neem tree
raised on this gorund?

Mine is such culture
where a statue unveiled by a casteless
deputy prime minister
was cleansed with milk.

I keep faith however, in
economic equality and think
it will bring social equality
I fight with swords of wings
dreaming that
even without removing caste
you can remove class differences

My apologies, dalit--
my sincere apologies.

I need a life's time
to understand the portrait
of this nation.

* Translation of "Kshamaapana" by Kiranmayi

*Chundur, Karamchedu, Neerukonda and Padirikuppam are places where atrocities against dalits were perpetrated.